www.andhrajyothy.com
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHI



విశాఖలో అశుతోష్ ఊచకోత

తుఫాన్ ఇన్నింగ్స్‌తో ఢిల్లీ ఉత్కంఠ విజయం

ఆఖరులో మలుపు తిప్పిన అశుతోష్ శర్మ

31 బంతుల్లోనే 66 పరుగులు

తొలి మ్యాచ్‌లో లఖ్‌నవూకు నిరాశ

10

మంగళవారం | 25-3-2025 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 65 సంచిక (Issue) : 339 | శ్రీ క్రోధి నామ సంవత్సరం, ఉత్తరాయణం, శిశిరఋతువు, ఫాల్గుణమాసం, బహుళపక్షం, తిథి: ఏకాదశి తె.3.46 తదుపరి ద్వాదశి, నక్షత్రం: శ్రవణం తె.3.49 తదుపరి ధనిష్ఠ, వర్జ్యం: ఉ.8.20-9.54, అమృతఘడియలు: సా.5.41-7.14, దుర్ముహూర్తం: ఉ.8.43-9.32, రా.10.17-11.03, రాహుకాలం: మ. 3.00-4.30, సూర్యోదయం: 6.18, సూర్యాస్తమయం: 6.23 | విజయవాడ సిటీ**

Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

స్వర్ణాంధ్ర లక్ష్యంగా కార్యాచరణ

నేడు, రేపు కలెక్టర్ల సదస్సు.. అంతా డిజిటల్‌గానే

ఈసారి కలెక్టర్ల ప్రజంటేషన్లకే ప్రాధాన్యం

శాఖల సుదీర్ఘ ప్రజంటేషన్లకు స్వస్తి

11



ఉగాదికి ప్రారంభించనున్న పీ4 విధానంపై సోమవారం సచివాలయంలో ఉన్నతాధికారులతో సమీక్షిస్తున్న సీఎం చంద్రబాబు

పేదరికంపై పీ4 అస్త్రం

పేదలకు, సంపన్నులకు వారధిగా కార్యక్రమం రూపకల్పన

- అట్టడుగున్నున్న వారికి చేయూత ఇచ్చే వేదిక
- ఎన్నారైలు సహా ఎవరైనా స్వచ్ఛందంగా పాల్గొనవచ్చు
- రాష్ట్రంలో పూర్తిగా పేదరిక నిర్మూలనే కార్యక్రమం లక్ష్యం
- దాతలకు 'మార్గదర్శి'గా, లబ్ధిదారులకు 'బంగారు కుటుంబం'గా నామకరణం
- మొదటి విడతలో 20 లక్షల కుటుంబాలకు లబ్ధి
- సమీక్షలో సీఎం.. ఉగాదికి అమరావతిలో ప్రారంభం

అమరావతి, మార్చి 24(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో పేదరికాన్ని పూర్తిగా నిర్మూలించేందుకు వినూత్నంగా పీ4 కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్నామని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు చెప్పారు. పేదలకు సంపన్నులు సహాయం చేసేందుకు, తద్వారా పేదరికం లేని సమాజం నిర్మించేందుకు వీలుగా ఆ కార్యక్రమం కింద ఓ వేదికను ప్రభుత్వం అందుబాటులోకి తీసుకువస్తోందని వెల్లడించారు. మొదటి విడతలో 20 లక్షల

మిగతా 13వ పేజీలో...

ఉగాది నాడు మూడో కోటా!

- సిద్ధమవుతున్న నామినేటెడ్ పదవుల జాబితా
- కొన్ని వ్యవసాయ కమిటీలకే పరిమితం
- 50-60 ఏఎంసీల జాబితాకు తుది కసరత్తు
- త్వరలోనే 60 కీలక కార్పొరేషన్లు, 21 ఆలయ కమిటీల నియామకాలు
- మహానాడుకల్లా అన్ని పదవులూ భర్తీ!
- టీడీపీ నుంచి భారీగా ఆశావహులు
- అధిష్ఠానానికి 60 వేలకు పైగా దరఖాస్తులు
- మరిన్ని పోస్టులు అడుగుతున్న జనసేన, బీజేపీ
- దీంతో కసరత్తు, భర్తీ ప్రక్రియలో జాప్యం

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

నామినేటెడ్ పదవుల కసరత్తు కొలిక్కి వస్తోంది. ఈ నెల 30న ఉగాది పర్వదినాన మూడో విడత జాబితా విడుదల చేయాలని టీడీపీ అధిష్ఠానం కృత నిశ్చయంతో ఉంది. అయితే ఈ సారికి వ్యవసాయ మార్కెట్ కమిటీ (ఏఎంసీ)ల భర్తీకే పరిమితం కావాలని భావిస్తుండడంతో కీలకమైన కార్పొరేషన్లను ఆశిస్తున్న ఆశావహులకు నిరాశేనని చెప్పవచ్చు. అయితే మహానాడుకల్లా అన్ని నామినేటెడ్ పదవులూ భర్తీ చేయాలని సీఎం చంద్రబాబు నిర్ణయించిన

మిగతా 13వ పేజీలో...



బెట్టింగ్ రాజాలు!

రాష్ట్రంలో జోరుగా పందేల నిర్వహణ

గత ప్రభుత్వంలో ముఖ్యనేత సన్నిహితుడు ఒకరు.. ప్రస్తుతం రాష్ట్రస్థాయి పదవుల్లో ఉన్న ఇద్దరు నాయకులు, గోదావరి జిల్లాలకు చెందిన మరో నేత.. ఈ నలుగురిదీ ప్రత్యేక 'బంధం'! పూర్వాశ్రమంలో ఉన్న పరిచయాలతో పాటు 'బెట్టింగ్' బంధం వీరిని మళ్లీ కలిపింది. ఆ ముఖ్యనేత సన్నిహితుడు నిర్వహిస్తున్న బెట్టింగ్‌కు ఈ ముగ్గురు నేతలు కొమ్ముకాస్తున్నారు.

ఇటీవల జరిగిన చాంపియన్స్ ట్రోఫీ సందర్భంగా ఆ ముఖ్యనేత సన్నిహితుడు కర్ణాటకకు చెందిన ముఠాలను రంగంలోకి దింపారు. తన అనుచరులను ముందు పెట్టి ఉభయ గోదావరి, విశాఖ జిల్లాల్లో కోట్లలో బెట్టింగ్ నిర్వహించారు. పోలీసులు కొందరిని అరెస్ట్ చేయడంతో 'డొంక' కదిలింది. అసలు విషయం ఏంటంటే... కేసులు, కీలక పాత్రధారుల అరెస్టులు లేకుండా ఆ ముగ్గురు నాయకులూ పోలీసులపై ఒత్తిళ్లు తెస్తున్నారు. దీంతో బెట్టింగ్ దందాకు బ్రేక్ పడటం లేదు. తాజాగా ఐపీఎల్ మ్యాచ్‌ల సందర్భంగా రాష్ట్ర వ్యాప్తంగా బెట్టింగ్ నిర్వహించేందుకు ఆ ముఠా రెడీ అయ్యింది.

- అసలు సూత్రధారి గత ప్రభుత్వంలో ముఖ్యనేత సన్నిహితుడు
- కొమ్ముకాస్తున్న ముగ్గురు నాయకులు
- చాంపియన్స్ ట్రోఫీలో కోట్లు కుమ్ముడు
- గోదావరి, విశాఖ జిల్లాల్లో గ్యాంబ్లింగ్
- వారిలో ఇద్దరు రాష్ట్రస్థాయి నేతలు
- కేసులు, అరెస్టులు లేకుండా ఒత్తిళ్లు
- ఐపీఎల్‌లో మరింత జోరుగా బెట్టింగ్‌లు

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

బెట్టింగ్ దందా కోసం పార్టీలకతీతంగా నలుగురు ఏకమయ్యారు. గత ప్రభుత్వంలో ముఖ్యనేత సన్నిహితుడికి, రెండు పార్టీలకు చెందిన ముగ్గురు కీలక నేతలు తోడయ్యారు. ఉభయ గోదావరి, విశాఖ జిల్లాల్లో విశృంఖలంగా సాగిపోతున్న బెట్టింగ్ దందా.. ఇప్పుడు రాష్ట్ర మంతా విస్తరిస్తోంది. పోలీసులు బెట్టింగ్ భూతం ఆనవాళ్లను ఒక వైపు నరుక్కుంటూ వస్తుంటే.. ముగ్గురు నేతలు దీన్ని ప్రోత్సహిస్తూ ఇతర ప్రాంతాలకు విస్తరింపజేస్తున్నారు. బెట్టింగ్ రాయుళ్ల జోలికి

మిగతా 14వ పేజీలో...

బహుళార్థ సాధకంగా బనకచర్ల

- ఆదాయార్జన ప్రాజెక్టుగా రూపుదిద్దాలి: సీఎం చంద్రబాబు
- రాష్ట్రానికి వరదాయిని కావాలి.. జూన్ 12కల్లా టెండర్లు ఖరారు చేయాలి
- 'జలహారతి' పేరుతో ఎస్‌పీవీ ఏర్పాటు.. అధికారులకు చంద్రబాబు ఆదేశం
- ఈ ప్రాజెక్టుతో ఏటా రూ.12,294 కోట్ల రాబడి అంచనా

12

బనకచర్ల.. సీమ గేట్‌వే!

సాయం అందించండి

నిర్మలకు సీఎం లేఖ

కొలువు కష్టాలు

- అమెరికా నుంచి తిరిగొస్తున్నవారికి ఇక్కడ ఉద్యోగాలు రావడం కష్టంగా మారిన వైనం
- ఐటీ సంబంధిత రంగాల్లో కాస్తంత మెరుగు
- మెకానికల్, కెమికల్ ఇంజినీరింగ్‌లో కష్టమే!
- ఉద్యోగం వచ్చినా.. జీతం తక్కువని ఆవేదన
- కొలువులున్నాయి గానీ.. వారే డాలర్ల లెక్కలో జీతాలు ఆశిస్తున్నారు: హెచ్ఆర్ మేనేజర్లు

హైదరాబాద్ సిటీ, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): ఆర్థిక మాంద్యం కారణంగా అమెరికాలో కొలువుల కోతతో రెండేళ్లుగా కుదేలవుతున్న మనోళ్లకు.. ట్రంప్ రాకతో మరింత గడ్డు పరిస్థితులు ఎదురవుతున్నాయి! అక్కడ ఉంటే ఏ క్షణంలో ఉద్యోగం పోతుందో తెలియక.. అలాగని ధైర్యం చేసి భారత్‌కు రాలేక అక్కడే సర్దుకుపోతున్న వారు కొందరు! ధైర్యం చేసి ఇక్కడికి వచ్చి.. ఎన్ని ప్రయత్నాలు చేసినా ఉద్యోగం రావట్లేదని వాపోతున్నవారు

మిగతా 2వ పేజీలో...



2

కలల చదువుకు కత్తెర

- ఎఫ్1 వీసాల్లో అమెరికా భారీ కోత
- 2023-24లో 41% తిరస్కరణలు
- దశాబ్ద కాలంలో ఇదే అత్యధికం
- భారత విద్యార్థుల వీసాల్లోనూ కోతలు
- బైడెన్ హయాంలోనే మొదలైన చర్యలు



2

బెట్టింగ్ యాప్స్ కేసులో.. శ్యామలకు ప్రశ్నలు

- 4 గంటల పాటు విచారించిన పోలీసులు
- విదేశాలకు ఇమ్రాన్‌ఖాన్, హర్ష సాయి!
- యాప్ నిర్వాహకులకూ త్వరలో నోటీసులు
- షారుఖ్, సచిన్, కోహ్లీపైనా కేసు పెట్టాలని హైదరాబాద్ గ్రీన్స్ అధ్యక్షుడి ఫిర్యాదు



బిల్లు, సినిమా టికెట్ ఉంటే పార్కింగ్ ఫీజు లేదు

అర్ధగంటలోపైతే ఎవరికైనా ఉచితమే

12

షాపింగ్ మాల్స్, మల్టీప్లెక్స్‌లపై మున్సిపల్ శాఖ ఉత్తర్వులు

ఉత్తరాంధ్రలో అంతర్జాతీయ విశ్వవిద్యాలయం

12

లోకేశ్ సమక్షంలో జార్జియా నేషనల్ వర్సిటీతో ఒప్పందం

శ్రీవారి ఆస్తుల పరిరక్షణకు ప్రత్యేక కమిటీ

రూ.5,258.68 కోట్ల అంచనాతో టీటీడీ వార్షిక బడ్జెట్

టీటీడీలో ఉద్యోగులంతా హిందువులే అయి ఉండాలి

కొండ అంచు భూమి ఇక దేవస్థానం పరిధిలోకే..

పాత ఆగమ సలహా మండలి రద్దు

టీటీడీ తీర్మానాలు

3

జస్టిస్ వర్మ ఇచ్చిన తీర్పులన్నీ తిరగదోడాల్సిందే

ఈడీ, సీబీఐతో దర్యాప్తు జరిపించాలి

అలహాబాద్ హైకోర్ట్ బార్ అసోసియేషన్ తీర్మానం



- ఆయన్ను ఇంకా న్యాయమూర్తిగా కొనసాగిస్తే ప్రజాస్వామ్యానికే ప్రమాదమంటూ ఆందోళన
- నేటి నుంచి నిరవధిక సమ్మెకు దిగనున్నట్టు ప్రకటన
- జస్టిస్ వర్మపై ఎఫ్ఐఆర్ నమోదుకు ఆదేశించాలని సుప్రీం కోర్టులో సీనియర్ న్యాయవాది వ్యాజ్యం
- జస్టిస్ యశ్వంత్ వర్మను అలహాబాద్ హైకోర్టుకు బదిలీ చేయాలని కేంద్రానికి కొలీజియం సిఫారసు
- ఆయనకు కేటాయించిన న్యాయపరమైన విధుల్ని ఉపసంహరించుకుంటూ ఢిల్లీ హైకోర్టు సర్క్యులర్

న్యూఢిల్లీ, మార్చి 24: స్టోర్‌రూమ్‌లో నోట్ల కట్టల వ్యవహారానికి సంబంధించి తీవ్ర ఆరోపణలు ఎదుర్కొంటున్న ఢిల్లీ హైకోర్టు జడ్జి జస్టిస్ వర్మకు అన్ని వైపుల నుంచీ గడ్డు పరిస్థితులు ఎదురవుతున్నాయి. ఆయన్ను అలహాబాద్ హైకోర్టుకు బదిలీ చేయాలని సుప్రీంకోర్టు కొలీజియం సోమవారం కేంద్రానికి అధికారికంగా సిఫారసు చేయగా.. ఢిల్లీ హైకోర్టు ఆయనకు కేటాయించిన న్యాయపరమైన విధులన్నింటినీ ఉపసంహరించుకుంటూ సర్క్యులర్ జారీ చేసింది. మరోవైపు.. జస్టిస్ వర్మ ఇప్పటిదాకా ఇచ్చిన తీర్పులన్నింటినీ తిరగదోడాలని, ఆయనపై అభిశంసనకు ప్రభుత్వాన్ని ఆదేశించాలని సీజేఐను కోరుతూ అలహాబాద్ హైకోర్ట్ బార్ అసోసియేషన్ సోమవారం ఒక

మిగతా 2వ పేజీలో...

బోరుగడ్డపై కోర్టు ధిక్కరణ కేసు!

- తప్పుడు మెడికల్ సర్టిఫికెట్ సమర్పణ వ్యవహారంలో హైకోర్టు తీవ్ర ఆగ్రహం
- కళ్లు మూసుకుంటే బెయిల్ పొడిగించాలని ఎన్నిసార్లైనా కోరతారు!
- ఈనెల 11న ఎందుకు లొంగిపోలేదు?
- బోరుగడ్డ అనిల్‌పై న్యాయస్థానం మండిపాటు
- ప్రాథమిక దర్యాప్తు వివరాలు కోర్టు ముందు ఉంచాలని పోలీసులకు ఆదేశం



12



కాకాణిపై కేసు

- రూ.250 కోట్ల క్వార్ట్జ్ దోపిడీలో ఆయనతో పాటు ఏడుగురిపై ఎఫ్ఐఆర్
- ఇద్దరు అరెస్టు.. 14 రోజుల రిమాండ్
- ఏ4గా మాజీ మంత్రి.. అరెస్ట్ చేసే చాన్స్

13

మద్యం స్కాంపై దర్యాప్తు చేయించండి

లోక్‌సభలో టీడీపీపీ నేత లావు డిమాండ్

ఢిల్లీ లిక్కర్ స్కామ్ కంటే పెద్దదని వ్యాఖ్య

13

ఎంపీల వేతనాలు 24% పెంపు

- లక్ష నుంచి రూ.1.24 లక్షలకు పెరిగిన నెల జీతం
- రూ.25 వేల నుంచి 31 వేలకు చేరిన పెన్షన్
- నోటిఫికేషన్ ఇచ్చిన కేంద్రం

2

mahindra Rise

తక్కువది ఎందుకు ఎంచుకోవడం, మీకు ఉత్తమమైనది లభిస్తున్నప్పుడు.



AUTOMOTIVE MANUFACTURERS PVT. LTD.
VIJAYAWADA, GUDIVADA, MACHILIPATNAM, NANDIGAMA, NUZIVEEDU, KAIKALURU.
Ph: 76800 99026, 88866 08336

NEON AUTO
VIJAYAWADA
Ph: 90634 94410

జస్టిస్ వర్మ తీర్పులన్నీ తిరగదోడాల్సిందే

(మొదటి పేజీ తరువాయి)

తీర్మానం చేసింది. ఆయనపై ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్, సీబీఐతో దర్యాప్తు జరిపించాలని.. ఎఫ్ఐఆర్ నమోదుకు వెంటనే అనుమతించాలని, అవసరమైతే ఆయన్ను కస్టడీలోకి తీసుకుని ప్రశ్నించడానికి కూడా అనుమతించాలని అందులో కోరింది. ఆయన్ను ఇంకా న్యాయమూర్తిగా కొనసాగించడం ప్రజాస్వామ్యానికే ప్రమాదమని, న్యాయవ్యవస్థకు ఉన్న ఏకైక శక్తి ప్రజా విశ్వాసమేనని.. ఒక్కసారి అది పోతే దేశం కుప్పకూలుతుందని ఆందోళన వెలిబుచ్చింది. ఆయన్ను అలహాబాద్ హైకోర్టుకు బదిలీ చేస్తూ సుప్రీం కొలీజియం తీసుకున్న నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ.. మంగళవారం నుంచి నిరవధిక సమ్మెకు దిగనున్నట్టు బార్ అసోసియేషన్ ప్రకటించింది. "ఒక్క న్యాయమూర్తిని కాపాడడానికి మొత్తం ప్రజాస్వామ్యాన్నీ పణంగా పెడుతున్నారు. ప్రభుత్వం ఈ విషయంలో జోక్యం చేసుకోవాలి. జస్టిస్ వర్మ బదిలీని వ్యతిరేకిస్తూ మాకు 22 సంస్థలు మద్దతు లేఖలు పంపాయి. ఈ విషయంలో మేము తుదికంటా పోరాడుతాం. సుప్రీంకోర్టుకు న్యాయాధికారాలు ఉంటే, మాకు ప్రజా మద్దతు ఉంది" అని అలహాబాద్ హైకోర్ట్ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు అనిల్ తివారీ పేర్కొన్నారు. జస్టిస్ వర్మ బదిలీ విషయంలో సుప్రీం కోర్టు తన నిర్ణయాన్ని ఉపసంహరించుకున్నాకే.. తాము విధుల్లోకి దిగుతామని ఆయన స్పష్టం చేశారు. న్యాయవ్యవస్థ సంరక్షణకు తమ ప్రాణాలు త్యాగం చేయడానికైనా సిద్ధంగా ఉన్నామని తేల్చిచెప్పారు. జస్టిస్ వర్మపై ఎఫ్ఐఆర్ దాఖలు చేయాలంటూ సర్వోన్నత న్యాయస్థానంలో సీనియర్ న్యాయవాది మాథ్యూస్ నెడుంపర ఒక ప్రజాహిత వ్యాజ్యాన్ని దాఖలు చేశారు. అందులో ఆయన ఈ వ్యవహారానికి సంబంధించి పలు కీలక ప్రశ్నలు లేవనెత్తారు. కాలిన నోట్ల కట్టల వీడియో, ఫొటోలతో సహా 25 పేజీల డాక్యుమెంట్‌ను సుప్రీంకోర్టు వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేయడం.. న్యాయవ్యవస్థపై ప్రజల నమ్మకాన్ని పునరుద్ధరించడానికి కొంతమేరకు తోడ్పడినప్పటికీ, జస్టిస్ వర్మపై ఇప్పటికీ ఎఫ్ఐఆర్ ఎందుకు దాఖలు చేయలేదని సామాన్యప్రజలు, మీడియా ప్రశ్నిస్తున్నట్టు ఆయన తన పిటిషన్‌లో పేర్కొన్నారు. "మార్చి 14నే ఆయనపై ఎఫ్ఐఆర్ ఎందుకు దాఖలు చేయలేదు? ఎటువంటి అరెస్టులూ ఆరోజే ఎందుకు జరగలేదు? అక్కడ దొరికిన డబ్బును (సగం కాలిన నోట్లను) ఎందుకు స్వాధీనం చేసుకోలేదు? ఎటువంటి మహజరూ (జప్తు, సోదాలకు సంబంధించిన నివేదిక) ఎందుకు రూపొందించలేదు? క్రిమినల్ లాను ఎందుకు వర్తింపజేయలేదు? అసలు ఈ స్కాండల్ గురించి ప్రజలకు తెలియడానికి దాదాపు వారం రోజులు ఎందుకు ఆలస్యమైంది?" అని ఆయన తన పిటిషన్‌లో పలు ప్రశ్నలు సంధించారు. జస్టిస్ వర్మపై ఎఫ్ఐఆర్ దాఖలు చేయడం ద్వారా క్రిమినల్ ప్రొసీజర్‌ను అనుసరించడానికి బదులుగా.. సుప్రీంకోర్టు త్రిసభ్య కమిటీతో అంతర్గత విచారణకు ఆదేశించడం వల్ల ప్రజా ప్రయోజనాలకు విఘాతం కలిగిందన్నారు. ఈ వ్యవహారంపై ఎఫ్ఐఆర్ దాఖలు చేసి, అర్థవంతమైన దర్యాప్తు చేయాల్సిందిగా ఢిల్లీ పోలీసులకు ఆదేశాలు జారీ చేయాలని మాథ్యూస్ నెడుంపర తన పిటిషన్‌లో అభ్యర్థించారు. మరోవైపు, జస్టిస్ వర్మ వ్యవహారంపై సుప్రీం సీజే జస్టిస్ సంజీవ్ ఖన్నా స్పందించిన తీరును రాజ్యసభ ఛైర్మన్, ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్‌ఖడ్ కొనియాడారు.

శిందేను ద్రోహి అన్న కునాల్.. వేదిక కూల్చివేత

న్యూఢిల్లీ, మార్చి 24: స్టాండప్ కామెడీ ఆర్టిస్ట్ కునాల్ కామ్రా మరోసారి వివాదంలో చిక్కుకున్నారు. ఆదివారం ముంబైలో జరిగిన ఓ కార్యక్రమంలో ప్రస్తుత డిప్యూటీ ముఖ్యమంత్రి ఏక్‌నాథ్ శిందేను ఆయన ద్రోహిగా అభివర్ణించారు. ఈ వ్యాఖ్య శివసేన శిందే వర్గం కార్యకర్తలకు ఆగ్రహం తెప్పించింది. వారంతా యూనికాంటినెంటల్ హోటల్‌లో కునాల్ కామ్రా కామెడీ షో నిర్వహించిన వేదిక హ్యాబిటెట్ స్టూడియో మీద ఆదివారం రాత్రే దాడి చేసి, ధ్వంసం చేశారు. ఈ సంఘటనకు సంబంధించి పోలీసులు 12 మందిని అరెస్టు చేశారు. సోమవారం ఉదయమే బృహన్ ముంబై కార్పొరేషన్‌కు చెందిన సిబ్బంది వచ్చి హ్యాబిటెట్ స్టూడియో అక్రమ నిర్మాణమంటూ కూల్చివేత చేపట్టారు. నిజానికి హోటల్ యజమాని సోమవారం ఉదయమే హ్యాబినెట్ స్టూడియోను కొన్నాళ్లు మూసేస్తున్నట్టు ప్రకటించారు. కళాకారుల అభిప్రాయాలతో తమకు సంబంధం ఉండదని చెప్పారు. కాగా, ఆదిత్య ఠాక్రే కునాల్ కామ్రాకు మద్దతు పలికారు. శిందే ద్రోహి మాత్రమే కాదని, దొంగ కూడా అని చెప్పారు. కునాల్ కామ్రా క్షమాపణలు చెప్పాలని సీఎం దేవేంద్ర ఫడ్నవిస్ డిమాండ్ చేశారు.

కొలువు కష్టాలు

(మొదటి పేజీ తరువాయి)



మరికొందరు!! ఉద్యోగం కోల్పోయి తప్పనిసరి పరిస్థితుల్లో భారత్‌కు వచ్చి ఉద్యోగాల వేట మొదలుపెడుతున్నవారు ఇంకొందరు!! ఉదాహరణకు.. తెలుగు రాష్ట్రాలకు చెందిన రాజ్ (పేరు మార్చు) ఎంఎస్ చేయడానికి ఏడేళ్ల క్రితం అమెరికాకు వెళ్లాడు. మాస్టర్స్ డిగ్రీ పూర్తయిన వెంటనే ఓ కంపెనీలో ఉద్యోగం కూడా చేరాడు. అతడి నెల సంపాదన మన భారతీయ కరెన్సీలో చెప్పాలంటే ఆరు లక్షల రూపాయలకు పై మాటే! కానీ, ఆర్థిక మాంద్యం కారణంగా గత ఏడాది అతడి ఉద్యోగం పోయింది. ఇండియాకు తిరిగి రావాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఇక్కడికి వచ్చాక.. గత ఆరు నెలలుగా అతడు హైదరాబాద్, బెంగళూరు, గుర్‌గావ్ లాంటి ప్రాంతాలలో ఉద్యోగం కోసం దరఖాస్తు చేసుకున్నాడు. కానీ, ఇప్పటిదాకా అతణ్ని ఇంటర్వ్యూకు పిలిచిన వారి సంఖ్య కేవలం ఐదు లోపే. ఆ ఇంటర్వ్యూలకు వెళ్లినా ఉద్యోగం రాలేదు. నెలకు రూ.లక్ష ఇచ్చినా చాలంటున్నా తనకు ఉద్యోగం ఇచ్చేవారే కరవయ్యారని అతడు వాపోతున్నాడు. ఇలాంటి వారు ప్రస్తుతం మన దేశంలో చాలా మందే ఉన్నారు. "యూఎస్‌లో ఎంఎస్ చేశాం. ఫలానా దిగ్గజ సంస్థలో అమెరికాలో ఉద్యోగం చేశాం" అని రెజ్యూమ్‌లో ఉంటే, వారిని అసలు ఇంటర్వ్యూకే పిలవని పరిస్థితి ఉంది. అలాగే.. ఉద్యోగంలో భాగంగా ఇక్కణ్నుంచీ మనోళ్లను అమెరికాకు తీసుకెళ్లిన సంస్థలు.. హెచ్1బీ వీసా గడువు ముగిసిన వారిని అక్కడ కొనసాగించడానికి ఇష్టపడట్లేదు. దీనితో తప్పనిసరి పరిస్థితిల్లో ఇండియాకు వచ్చిన వారు అదే కంపెనీ భారతీయ శాఖలో కొనసాగడం ఇష్టం లేకపోతే ఇతర కంపెనీల వైపు దృష్టి సారిస్తున్నారు. అలాంటి వారందరికీ ఇప్పుడు సమస్యలు ఎదురవుతున్నాయంటున్నారు హెచ్‌ఆర్ మేనేజర్లు. ఈ సమస్యను ఎదుర్కొంటున్న వందలాది మంది.. రెడిట్, లింక్డిన్ లాంటి వెబ్‌సైట్లలో ఏకరువు పెడుతున్న కష్టాలే ఇందుకు నిదర్శనం.

డాలర్లలో అడిగితే ఎలా?


ఇండియాస్ గ్రాడ్యుయేట్ స్కిల్స్ ఇండెక్స్ 2025 నివేదిక ప్రకారం.. మన పట్టభద్రుల్లో కేవలం 42.6శాతం మంది మాత్రమే ఉద్యోగార్హత (అంటే డిగ్రీతోపాటు.. ఆ ఉద్యోగానికి కావాల్సిన అన్ని నైపుణ్యాలూ కలిగి ఉండడం) కలిగి ఉన్నారు. ఏఐ, డేటా ఎనలిటిక్స్ వంటి అంశాల్లో నైపుణ్యం సంపాదించినవారికి ఇప్పుడు డిమాండ్ అధికంగా ఉన్నప్పటికీ, వాటిని కలిగి ఉన్న వారి సంఖ్య తక్కువగానే ఉంది. దీనికి తోడు.. సమస్యలను నేర్పుగా పరిష్కరించే సామర్థ్యం, సృజనాత్మకత వంటి విషయాల్లో కూడా మనవాళ్లు వెనకబడి ఉంటున్నారని హెచ్‌ఆర్ మేనేజర్లు చెబుతున్నారు. విదేశాల నుంచి వస్తున్నవారిలోనూ ఈ నైపుణ్యాల కొరత ఉంటోందని.. వారికి అధిక జీతాలిచ్చే బదులు ఇక్కడి ఔత్సాహికులకు అందులో 50% జీతం ఇచ్చి, తగిన శిక్షణ ఇస్తే వారితో సమర్థంగా పనిచేయించుకోవచ్చని అభిప్రాయపడుతున్నారు. "విదేశాల నుంచి వచ్చేవారు.. భారతీయ కంపెనీలకు ఏం కావాలో అర్థం చేసుకోవాలి. అలాగే తాము పనిచేయాలనుకుంటున్న రంగం గురించి కొంత పరిశోధన చేస్తే తమకు ఉన్న అవకాశాలు, తమ నైపుణ్యం, అనుభవానికి తగిన ఉద్యోగం లభిస్తుంది. దురదృష్టవశాత్తు చాలా మంది ఇవేవీ చేయట్లేదు. అందుకే వారికి ఉద్యోగం లభించడం కాస్త కష్టంగా మారుతోంది" అని మాదాపూర్‌లోని ఓ సాఫ్ట్‌వేర్ సంస్థకు చెందిన హెచ్‌ఆర్ మేనేజర్ దినేష్ సూచించారు. అయితే ఆ వాదనలో వాస్తవం కొంత మేర మాత్రమే ఉందంటున్నారు ఉద్యోగార్థులు. ఉదాహరణకు.. బయోటెక్నాలజీ రంగానికి సంబంధించి యూఎస్, ఆస్ట్రేలియా దేశాల్లో పలు పరిశోధనలు చేసిన తాను ఆ రంగంలో హైదరాబాద్ దూసుకుపోతున్న నేపథ్యంలో అమెరికా నుంచి ఇక్కడికి వచ్చానని, ఇక్కడ పేరొందిన కేంద్ర ప్రభుత్వ పరిశోధన సంస్థల్లో శిక్షణ కూడా పొందానని.. కానీ ఇక్కడ తనకు సరైన అవకాశాలే రాలేదని, జీతం కూడా చాలా తక్కువగా ఆఫర్ చేశారని అను (పేరు మార్చాం) అనే యువతి వివరించారు. అయితే.. ఇలా విదేశాల నుంచి వచ్చేవారు డాలర్ల లెక్కలు వేసి, ఆ స్థాయిలో జీతం కావాలని కోరుకుంటారని.. అందుకే వారికి ఉద్యోగాలు రావడం కష్టమవుతోందని.. ఒక ఫార్మా కంపెనీలో సీనియర్ లెవల్ మేనేజర్‌గా పని చేస్తున్న నారాయణ వివరించారు. ఐటీ, బీటీ (బయోటెక్నాలజీ) పరిస్థితి ఇలా ఉంటే.. మెకానికల్, కెమికల్ ఇంజనీరింగ్ వంటి రంగాల్లో అయితే అసలు అవకాశాలే తక్కువగా ఉన్నాయని మరికొందరు వాపోతున్నారు. ఉదాహరణకు.. మెకానికల్ ఇంజినీరింగ్‌తోపాటు పీహెచ్‌డీ కూడా పూర్తి చేసి అమెరికాలో ఎనిమిదేళ్లు ఉద్యోగం చేసిన ఒక వ్యక్తి.. భారత్‌లో ఐఐటీలు సహా పలు సంస్థలలో ఉద్యోగం కోసం దరఖాస్తు చేసినా ఆయన్ను పట్టించుకున్న వారే లేరు.

నెట్‌వర్క్ పెంచుకోవాలి

ఐటీ సంబంధిత రంగాల్లో ఉద్యోగాల కోసం దరఖాస్తు చేసుకునే అభ్యర్థులు క్లౌడ్ కంప్యూటింగ్, ఏఐ, సైబర్ సెక్యూరిటీ తదితర నైపుణ్యాలు కలిగి ఉండాలని కంపెనీలు కోరుకుంటున్నాయి. కాబట్టి అభ్యర్థులు తమ నైపుణ్యాలకు పదునుపెట్టాలి. డిమాండ్‌లో ఉన్న నైపుణ్యాలను పొందడానికి ప్రయత్నించాలి.

- చాలావరకూ ఉద్యోగాలు మనం పెంచుకునే నెట్‌వర్క్ ద్వారానే వస్తాయి. మరీ ముఖ్యంగా ఐటీ, బయోటెక్నాలజీ వంటి రంగాల్లో పరిచయాలు బాగా పనిచేస్తాయి. కాబట్టి ఆ దిశగా దృష్టి సారించడం మంచిది.
- ప్రత్యేకంగా ఎన్‌ఆర్ఐల కోసమే కొన్ని ఉద్యోగ వెబ్‌సైట్లు అందుబాటులో ఉన్నాయి. వాటి ద్వారా ప్రయత్నించాలి. అలాగే రిక్రూట్‌మెంట్ ఏజెన్సీల ద్వారా ప్రయత్నించవచ్చు.
- ఇండియాలో స్టార్టప్ సంస్కృతి పెరుగుతోంది. ఈ నేపథ్యంలో.. విదేశాల్లో అపార అనుభవం సంపాదించి ఇక్కడికి వచ్చిన వారు ఉద్యోగాలకు ప్రయత్నించేబదులు స్టార్టప్ ఆలోచనలు చేయాలని ఆర్థిక నిపుణులు సూచిస్తున్నారు.

లోకం తీరు



కలల చదువుకు కత్తెర

ఎఫ్1 వీసాల్లో అమెరికా భారీగా కోత

2023-24లో 41% దరఖాస్తులు తిరస్కరణ

న్యూఢిల్లీ, మార్చి 24: అమెరికాలో చదువుకోవాలనే విదేశీ విద్యార్థుల కలలకు కళ్లెం పడుతోంది. విద్యార్థుల కోసం జారీ చేసే ఎఫ్1 వీసాల్లో గత కొంత కాలంగా అగ్రరాజ్యం భారీగా కోత పెడుతోంది. దశాబ్ద కాలంగా అన్ని దేశాల నుంచి వస్తున్న ఎఫ్1 వీసా దరఖాస్తులను పెద్దఎత్తున తిరస్కరిస్తోంది. అలా తిరస్కరణకు గురైన దరఖాస్తులు గత ఆర్థిక సంవత్సరంలో (అక్టోబరు 2023 నుంచి సెప్టెంబరు 2024) 41 శాతానికి చేరాయి. దీంతో దశాబ్ద కాలంలోనే ఎక్కువగా దరఖాస్తులు తిరస్కరణకు గురైన సంవత్సరాల్లో గతేడాది అగ్రస్థానంలో నిలిచింది. 2023-24లో వివిధ దేశాల నుంచి ఎఫ్1 వీసా కోసం మొత్తం 6.79 లక్షల దరఖాస్తులు రాగా, వాటిలో 2.79 (41 శాతం) లక్షలను అమెరికా తిరస్కరించిందని ఆ దేశ విదేశాంగ శాఖ నివేదిక వెల్లడించింది. ఆ నివేదిక ప్రకారం.. 2014లో 77.48 శాతంగా ఉన్న ఆమోదం రేటు, 2023-24 సంవత్సరానికి 58.9 శాతానికి పడిపోయింది. భారతీయ విద్యార్థులకు కూడా అమెరికా వీసాలు తగ్గిపోతున్నాయని ఓపెన్ డోర్స్ నివేదిక- 2023-24 వెల్లడించింది. 2018-23 మధ్య భారతీయ విద్యార్థులకు ఎఫ్1 వీసాల ఆమోదం రేటు.. 65.03 శాతం నుంచి 63.74 శాతానికి పడిపోయిందని ఆ సంస్థ తెలిపింది. ఇక తిరస్కరణ రేటు 34.97 శాతం నుంచి 36.26 శాతానికి పెరిగిందని పేర్కొంది. డొనాల్డ్ ట్రంప్ అధికారం చేపట్టకముందే ఈ కోతలు మొదలయ్యాయి. మాజీ అధ్యక్షుడు బైడెన్ హయాంలోనే ఎఫ్1 వీసాలను భారీగా తగ్గించడం మొదలు పెట్టారు. ఇకపై మరిన్ని కోతలు ఉంటాయని నిపుణులు భావిస్తున్నారు.

చిట్టీల పేరుతో 120 కోట్ల టోకరా పెట్టిన వ్యక్తి అరెస్ట్

▸ బెంగళూరులో పుల్లయ్యను అరెస్ట్ చేసిన సీసీఎస్ పోలీసులు

హైదరాబాద్ సిటీ, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): నమ్మకంగా చిట్టీలు వేస్తూ, రూ. 120 కోట్ల మేర మోసం చేసి పరారైన ఎస్ఆర్‌నగర్‌కు చెందిన మేస్త్రీ పుల్లయ్యను సీసీఎస్ పోలీసులు బెంగళూరులో అరెస్ట్ చేశారు. ఏపీ అనంతపూర్‌కు చెందిన పుల్లయ్య ఎస్ఆర్‌నగర్‌లో గత 20 ఏళ్లుగా ఉంటూ మేస్త్రీగా పనిచేస్తున్నాడు. చిట్టీల వ్యాపారం నిర్వహించే ఇతడు దాదాపు 700 మంది నుంచి రూ. 120 కోట్ల మేర చిట్టీ డబ్బు తీసుకొని ఉడాయించాడు. చిట్టీ పాడుకున్న వారి డబ్బుకు వడ్డీ ఇస్తామని చెప్పడంతో పలువురు చిట్టీ డబ్బు ఇతడి వద్దే ఉంచారు. బెంగళూరులో పుల్లయ్యను అరెస్ట్ చేసిన సీసీఎస్ పోలీసులు రిమాండ్‌కు తరలించారు. కాజేసిన డబ్బులు ఎక్కడ దాచాడు ? ఎలా ఖర్చు చేశాడన్న కోణంలో దర్యాప్తు చేసేందుకు పోలీస్ కస్టడీకి తీసుకునేందుకు సీసీఎస్ పోలీసులు కోర్టులో పిటీషన్ దాఖలు చేశారు.

గోల్డ్ కార్డుల కోసం క్యూ

వాషింగ్టన్, మార్చి 24: అమెరికాలో శాశ్వత నివాసం కోసం అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రవేశపెట్టిన గోల్డ్ కార్డ్ (గోల్డెన్ వీసా)లకు మంచి ఆదరణ లభిస్తోందని వాణిజ్య కార్యదర్శి హోవార్డ్ లట్నిక్ తెలిపారు. ఎవరైనా అయిదు మిలియన్ డాలర్లు (సుమారు రూ.43 కోట్లు) చెల్లించి అమెరికాలో శాశ్వతంగా నివాసం ఉండొచ్చు. శాశ్వత పౌరసత్వం తీసుకున్నా మధ్యలో రద్దు చేసుకునే వెసులుబాటు కూడా ఉంది. ఈ గోల్డెన్ వీసా పొందడానికి చాలా మంది లైనులో ఉన్నారని లట్నిక్ చెప్పారు. కేవలం ఒక్క రోజులోనే 1,000 కార్డులు విక్రయించామని తెలిపారు. కాగా, భారత్‌లో నేటి నుంచి అమెరికా వాణిజ్య ప్రతినిధి బ్రెండన్ లించ్ పర్యటించనున్నారు. ఈ నెల 29 వరకు కొనసాగే పర్యటనలో ఆయన భారత వాణిజ్య మంత్రి పీయుష్ గోయల్‌తో సమావేశమై చర్చలు జరుపుతారు.

మద్యం కేసులో నిందితుడిగా చేర్చలేదు.. విచారణకు నోటీసూ ఇవ్వలేదు!

▸ అపరిపక్వ దశలో మిథున్‌రెడ్డి పిటిషన్: సీఐడీ

▸ హైకోర్టు విచారణ రేపటికి వాయిదా

అమరావతి, మార్చి 24(ఆంధ్రజ్యోతి): మద్యం కుంభకోణం కేసులో వైసీపీ ఎంపీ మిథున్‌రెడ్డిని నిందితుడిగా చేర్చలేదని, విచారణకు రావాలని ఆయనకు నోటీసుఇవ్వలేదని సీఐడీ తరఫున సీనియర్ న్యాయవాది సిద్ధార్థ్ లూథ్రా సోమవారం హైకోర్టుకు తెలిపారు. అపరిపక్వ దశలో ఆయన ముందస్తు బెయిల్ పిటిషన్ వేశారని పేర్కొన్నారు. గత ప్రభుత్వ హయాంలో ప్రత్యేక అధికారిగా పనిచేసిన సత్యప్రసాద్.. మేజిస్ట్రేట్ ముందు ఇచ్చిన 164 స్టేట్‌మెంట్ ఆధారంగా మిథున్‌రెడ్డిని మద్యం స్కాం కేసులో నిందితుడిగా చేర్చబోతున్నారని పత్రికల్లో కథనాలు వచ్చాయని చెబుతూ ముందస్తు బెయిల్ కోరడానికి వీల్లేదన్నారు. సత్యప్రసాద్ స్టేట్‌మెంట్‌కు సంబంధించి తమ వద్ద సమాచారం లేదని, వివరాలు తెలుసుకొని కోర్టు ముందు ఉంచేందుకు సమయం ఇవ్వాలని కోరారు. అందుకు అంగీకరించిన న్యాయమూర్తి జస్టిస్ టి.మల్లికార్జునరావు విచారణను బుధవారానికి వాయిదా వేశారు. అరెస్ట్ నుండి రక్షణ కల్పించాలన్న మిథున్‌రెడ్డి తరఫు న్యాయవాది అభ్యర్థనను తోసిపుచ్చారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో జరిగిన మద్యం కుంభకోణం వ్యవహారంలో గత ఏడాది సెప్టెంబరు 23న సీఐడీ పోలీసులు నమోదు చేసిన కేసులో తనకు ముందస్తు బెయిల్ మంజూరు చేయాలని కోరుతూ మిథున్‌రెడ్డి పిటిషన్ దాఖలు చేశారు. మధ్యంతర ముందస్తు బెయిల్ ఇవ్వాలని కోరుతూ అనుబంధ పిటిషన్ వేశారు. సోమవారం వ్యాజ్యం విచారణకు రాగా.. పిటిషనర్ తరఫున సీనియర్ న్యాయవాది టి.నిరంజన్‌రెడ్డి వాదనలు వినిపించారు.

బెట్టింగ్ యాప్స్ కేసు.. యాంకర్ శ్యామల విచారణ

▸ విదేశాలకు ఇమ్రాన్‌ఖాన్, హర్ష సాయి!



హైదరాబాద్, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): బెట్టింగ్ యాప్స్ ప్రమోషన్ కేసులో పంజాగుట్ట పోలీసులు యాంకర్ శ్యామలను నాలుగు గంటల పాటు విచారించారు. ఇప్పటికే ఆమె హైకోర్టు ద్వారా అరెస్టు నుంచి రక్షణ పొందగా.. పోలీసులు నోటీసులు జారీ చేయడంతో సోమవారం ఉదయం తన న్యాయవాదితో కలిసి విచారణకు హాజరయ్యారు. డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్ శ్రావణ్‌కుమార్ నేతృత్వంలో ఓ మహిళా ఎస్సై ఆమెపై ప్రశ్నలు సంధించారు. విచారణ అనంతరం శ్యామల ఠాణా వద్ద విలేకరులతో మాట్లాడారు. పోలీసులు అడిగిన ప్రశ్నలకు తాను సమాధానాలిచ్చానని, ఎప్పుడు విచారణకు పిలిచినా హాజరవుతానని చెప్పారు. యూట్యూబర్లు ఇమ్రాన్‌ఖాన్, హర్షసాయి విదేశాలకు వెళ్లినట్టు పోలీసులు అనుమానిస్తున్నారు. ఇప్పటి వరకు శ్యామల సహా.. టేస్టీ తేజ, కిరణ్, విష్ణుప్రియ, రీతూచౌదరిని పోలీసులు విచారించి, వారి వాంగ్మూలాన్ని నమోదు చేశారు. విష్ణుప్రియ, రీతూచౌదరిని మంగళవారం మరోమారు విచారించనున్నారు. బెట్టింగ్ యాప్‌లను ప్రమోట్ చేసిన బాలీవుడ్ నటుడు షారుఖ్‌ఖాన్, క్రికెటర్లు సచిన్ టెండుల్కర్, విరాట్ కోహ్లీపై ఎందుకు కేసులు పెట్టరని హైదరాబాద్ గ్రీన్స్ అధ్యక్షుడు అర్జున్‌గౌడ్ పోలీసులను ప్రశ్నించారు. వీరిపైనా కేసులు నమోదు చేయాలని సోమవారం ఆయన ఈ మేరకు పంజాగుట్ట పోలీసులకు ఫిర్యాదు చేశారు.



పార్లమెంట్‌లో ఏర్పాటు చేసిన స్టాల్‌లో అరకు కాఫీని రుచి చూస్తున్న కేంద్ర మంత్రులు పీయూష్ గోయల్, రామ్మోహన్ నాయుడు, ఎంపీలు ఉదయ్ శ్రీనివాస్, భరత్, సీఎం రమేశ్ తదితరులు

పార్లమెంటులో అరకు కాఫీ

▸ స్పీకర్ అనుమతితో రెండు స్టాల్స్ ప్రారంభించిన కేంద్ర మంత్రులు

న్యూఢిల్లీ, మార్చి 24(ఆంధ్రజ్యోతి): గిరిజన సంపద అరకు కాఫీని ప్రమోట్ చేస్తూ ఆంధ్రప్రదేశ్ గిరిజన సహకార సంస్థ పార్లమెంటులో కాఫీ స్టాళ్లను ప్రారంభించడం గర్వంగా ఉందని కేంద్ర వాణిజ్య వ్యవహారాల మంత్రి పీయూష్ గోయల్ అన్నారు. కాఫీ స్టాళ్ల ఏర్పాటు.. బ్రాండ్ భారత్‌కు బిగ్ బూస్ట్ అని ఎక్స్ వేదికగా కితాబిచ్చారు. సోమవారం, పార్లమెంటులో రెండు అరకు కాఫీ స్టాళన్లు ప్రారంభించారు. రాజ్యసభ క్యాంటీన్‌లో ఏర్పాటు చేసిన స్టాల్‌ను కేంద్ర వాణిజ్య వ్యవహారాల మంత్రి పీయూష్ గోయల్ ప్రారంభించారు. లోక్‌సభ క్యాంటీన్‌లో అరకు కాఫీ స్టాల్‌ను కేంద్ర పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరణ్ రిజిజు ప్రారంభించారు. కార్యక్రమంలో కేంద్ర గిరిజన వ్యవహారాల మంత్రి జోయల్ ఓరం, కేంద్ర మంత్రులు రామ్మోహన్‌నాయుడు, పెమ్మసాని చంద్రశేఖర్, టీడీపీ ఎంపీలు కలిశెట్టి అప్పలనాయుడు, శ్రీభరత్, మాగుంట శ్రీనివాసులురెడ్డి, దగ్గుమళ్ల ప్రసాదరావు, బీజేపీ ఎంపీ సీఎం రమేశ్, జనసేన ఎంపీ తంగెళ్ల ఉదయ్, రాష్ట్ర గిరిజన సంక్షేమ మంత్రి గుమ్మిడి సంధ్యారాణి, జీసీసీ కార్పొరేషన్ ఛైర్మన్ కిడారి శ్రావణ్ తదితరులు పాల్గొన్నారు. స్పీకర్ ఓం బిర్లాకు అరకు కాఫీ పొడిని సంధ్యారాణి అందజేశారు.

రాష్ట్రానికే గర్వకారణం: రామ్మోహన్‌నాయుడు

పార్లమెంట్ ప్రాంగణంలో అరకు కాఫీ స్టాల్ ఏర్పాటు రాష్ట్రానికే గర్వకారణమని కేంద్ర మంత్రి రామ్మోహన్‌నాయుడు పేర్కొన్నారు. '1.5 లక్షల గిరిజన రైతుల శ్రమకు దక్కిన ఫలితం. ఎన్నో ఏళ్ల వారసత్వాన్ని కొనసాగిస్తూ వస్తున్న గిరిజన రైతుల కృషి నేడు అరకు కాఫీని జాతీయ వేదికపై నిలిపింది. ప్రధాని మోదీ, సీఎం చంద్రబాబు సహకారంతో అరకు కాఫీ లాంటి జీఐ ఉత్పత్తులు గుర్తింపు పొందుతున్నాయి' అని ఎక్స్ వేదికగా ట్వీట్ చేశారు.

గిరిపుత్రులకు సీఎం చంద్రబాబు అభినందనలు

అమరావతి, మార్చి 24(ఆంధ్రజ్యోతి): కాఫీ ప్రియులు ఇకపై పార్లమెంటులో తాజాగా తయారైన అరకు కాఫీని ఆస్వాదించవచ్చని సీఎం చంద్రబాబు ఎక్స్‌లో పోస్టు చేశారు. పార్లమెంటులో స్టాల్ ఏర్పాటుకు అనుమతిచ్చిన లోక్‌సభ స్పీకర్ ఓంబిర్లాకు, మన్‌కీ బాత్‌లో అరకు కాఫీకి విస్తృత ప్రచారం కల్పించిన ప్రధాని మోదీకి ఈ సందర్భంగా చంద్రబాబు ధన్యవాదాలు తెలిపారు. ఏపీకి చెందిన జియోగ్రాఫికల్ ఇండికేషన్(జీఐ) ట్యాగ్‌తో ఉన్న ఆర్గానిక్ కాఫీ పార్లమెంటులో స్థానం సంపాదించడం గర్వకారణమని లోకేశ్ పేర్కొన్నారు.

లాయర్ల మరణానంతర పరిహారం 6 లక్షలకు పెంపు

అమరావతి, మార్చి 24(ఆంధ్రజ్యోతి): న్యాయవాదుల సంక్షేమాన్ని పరిగణనలోకి తీసుకొని ఏపీ బార్ కౌన్సిల్ పలు కీలక నిర్ణయాలు తీసుకుంది. న్యాయవాదుల మరణానంతరం వారి కుటుంబ సభ్యులు/ నామినీలకు అందజేసే పరిహారాన్ని రూ.5లక్షల నుంచి రూ.6లక్షలకు పెంచింది. వైద్య ఖర్చుల నిమిత్తం న్యాయవాది, భార్య/భర్తకు చెల్లించే సొమ్మును రూ. లక్ష నుంచి రూ 1.5 లక్షలకు పెంచింది. ఏప్రిల్ 1 నుంచి ఇది అమల్లోకి రానుంది. బార్ కౌన్సిల్ రోల్స్‌లో నమోదు చేసుకున్న న్యాయవాదులు మరణిస్తే కుటుంబ సభ్యులకు రూ.5లక్షల మేర ప్రమాద పరిహారాన్ని అందించాలని నిర్ణయించింది. పైన పేర్కొన్న రూ.6 లక్షలకు ఇది అదనం. మే 1 నుంచి అమల్లోకి వస్తుంది. ఛైర్మన్ నల్లారి ద్వారకానాథ్‌రెడ్డి అధ్యక్షతన ఆదివారం ఈ తీర్మానాలు చేశారు. కాగా.. తెలుగు సాహిత్యరంగంలో విశేష కృషి చేసి, 2024 సంవత్సరానికి కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కారం అందుకున్న గుంటూరుకు చెందిన సీనియర్ న్యాయవాది పెనుగొండ లక్ష్మీనారాయణను ద్వారకానాథ్‌రెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు.

ముస్లిం రిజర్వేషన్ల కోసం రాజ్యాంగాన్నే మార్చాలంటారా?

కర్ణాటక ఉప ముఖ్యమంత్రి డీకే వ్యాఖ్యలపై బీజేపీ ఆగ్రహం

▸ చర్యలు తీసుకుంటారో లేదో కాంగ్రెస్ స్పష్టం చేయాలన్న కేంద్ర మంత్రి రిజిజు

▸ పార్లమెంటు ఉభయసభల్లో రచ్చ



న్యూఢిల్లీ/బెంగళూరు, మార్చి 24(ఆంధ్రజ్యోతి): మతపరమైన రిజర్వేషన్లు కల్పించేందుకు రాజ్యాంగాన్ని మార్చాలని కర్ణాటక ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్ వ్యాఖ్యానించారంటూ బీజేపీ సభ్యులు ఆందోళనకు దిగడంతో లోక్‌సభ, రాజ్యసభ అట్టుడికిపోయాయి. పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరణ్ రిజిజు సోమవారం ఉభయసభల్లో ఈ అంశాన్ని లేవనెత్తారు. రాజ్యాంగబద్ధమైన పదవిలో ఉన్న ఓ వ్యక్తి ముస్లింలకు రిజర్వేషన్లు కల్పించడం కోసం రాజ్యాంగాన్ని మారుస్తామని ప్రకటన చేశారని, అది ఏ మాత్రం ఆమోదయోగ్యం కాదని స్పష్టం చేశారు. కర్ణాటకలో కాంట్రాక్టుల్లో ముస్లింలకు 4% రిజర్వేషన్ కల్పిస్తూ సిద్దరామయ్య సర్కారు చట్టం చేసిన సంగతి తెలిసిందే. ఇదే క్రమంలో మతపరమైన రిజర్వేషన్ల కోసం రాజ్యాంగ సవరణ చేయాలని కర్ణాటక డిప్యూటీ సీఎం డీకే శివకుమార్ వ్యాఖ్యానించారంటూ బీజేపీ ఆందోళనకు దిగింది. అంబేడ్కర్ ఫొటో పట్టుకొని తిరగడంతో పాటు రాజ్యాంగ ప్రతిని జేబులో పెట్టుకొని తిరిగే కాంగ్రెస్ నేతలు ముస్లింలకు రిజర్వేషన్ల కోసం రాజ్యాంగాన్ని మార్చాలంటారా? దీనిపై ఆ పార్టీ వివరణ ఇవ్వాల్సిందేనని, అతనిపై చర్యలు తీసుకుంటారో లేదో స్పష్టం చేయాలని డిమాండ్ చేశారు. దీనిపై కాంగ్రెస్ సభ్యులు నిరసన తెలిపారు. అదే సమయంలో రాజ్యసభాపక్ష నేత జేపీ నడ్డా మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ రాజ్యాంగాన్ని ముక్కలు చేయాలని చూస్తోందని ఆరోపించారు. కర్ణాటకలో ముస్లింల రిజర్వేషన్ కోసం చేసిన చట్టాలను, నిబంధనలను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. మరోవైపు, భారత్‌ను ముక్కలు చేయాలని చూస్తున్నదే బీజేపీ అని కాంగ్రెస్ అధ్యక్షుడు ఖర్గే ఆరోపించారు. రాజ్యాంగాన్ని మార్చాలని డీకే అనలేదన్నారు. జడ్జి ఇంట్లో నోట్ల కట్టల కేసును మరుగునపడేసేందుకే బీజేపీ ఈ అంశాన్ని తెరపైకి తెచ్చిందని ధ్వజమెత్తారు. ఈ వ్యాఖ్యలపై స్పందించిన నడ్డా.. ముస్లింలకు రిజర్వేషన్ల కోసం కాంగ్రెస్ కేవలం కర్ణాటకలోనే కాదని, తెలంగాణలోనూ చట్టం చేసిందని ఆరోపించారు. ముస్లింలను ఓబీసీలుగా పేర్కొంటూ దొడ్డిదారిన వారికి రిజర్వేషన్లు కల్పిస్తోందని విమర్శించారు. ఇక రాజ్యసభలో కాంగ్రెస్ చీఫ్ విప్ జైరాం రమేశ్ కేంద్ర మంత్రి రిజిజుపై సభా హక్కుల ఉల్లంఘన నోటీసు ఇచ్చారు.

తన వ్యాఖ్యలు వక్రీకరించారన్న డీకే: డీకే శివకుమార్‌పై ఆరోపణలతో కాంగ్రెస్ అధిష్ఠానం అప్రమత్తమైంది. ఈ విషయమై వివరాలు తెలుసుకోవాలని పార్టీ అగ్రనేత చిదంబరాన్ని ఆదేశించింది. ఆయన డీకే శివకుమార్‌కు ఫోన్ చేశారు. తన వ్యాఖ్యలను వక్రీకరించారని డీకే వివరణ ఇచ్చినట్లు తెలిసింది. బీజేపీ నాయకుల కుట్ర అని చెప్పినట్లు సమాచారం. కోర్టు తీర్పులకు అనుగుణంగా సవరణలు చేసే వీలుందనే చెప్పానని, రాజ్యాంగాన్ని మార్చాలని అనలేదని చెప్పినట్లు తెలిసింది.

ఎంపీల వేతనాలు 24% పెంపు

న్యూఢిల్లీ, మార్చి 24: పార్లమెంటు సభ్యుల వేతనాలను 24% మేర పెంచుతూ కేంద్ర పార్లమెంటరీ వ్యవహారాల శాఖ సోమవారం నోటిఫికేషన్ జారీ చేసింది. భత్యాలు, పెన్షన్లను కూడా పెంచింది. ఈ నిర్ణయం 2023 ఏప్రిల్ ఒకటో తేదీ నుంచి వర్తిస్తుందని పేర్కొంది. దీని ప్రకారం ఎంపీల నెలవారీ వేతనం రూ.లక్ష నుంచి రూ.1.24 లక్షలకు, దినసరి భత్యం రూ.2,000 నుంచి రూ.2,500లకు పెరిగింది. మాజీ ఎంపీలకు ప్రస్తుతం నెలకు రూ.25,000 పెన్షన్ వస్తుండగా దాన్ని రూ.31వేలకు పెంచింది. అయిదేళ్ల కన్నా ఎక్కువ కాలం పాటు ఎంపీగా పనిచేస్తే ప్రతి అదనపు సంవత్సరానికీ అధిక పెన్షన్ లభిస్తుంది. దానిని కూడా ప్రస్తుతం కేంద్ర ప్రభుత్వం పెంచింది. అలాంటి వారికి ప్రస్తుతం నెలకు అదనంగా రూ.2,000 ఇస్తుండగా, ఇకపై రూ.2,500 ఇవ్వనుంది.

విద్యార్థుల ఆత్మహత్యల నివారణకు టాస్క్‌ఫోర్స్

▸ జస్టిస్ భట్ ఛైర్మన్‌గా ఏర్పాటు చేసిన సుప్రీం





రవీంద్ర భట్

న్యూఢిల్లీ, మార్చి 24: ఉన్నత విద్యాసంస్థల్లో తరచుగా విద్యార్థులు ఆత్మహత్యకు పాల్పడుతుండటంపై సుప్రీంకోర్టు ఆందోళన వ్యక్తం చేసింది. విద్యార్థుల మానసిక ఆరోగ్య సమస్యల పరిష్కారానికి, ఆత్మహత్యల నివారణకు జాతీయ స్థాయి టాస్క్‌ఫోర్స్(ఎన్‌టీఎఫ్)ను ఏర్పాటు చేసింది. సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ ఎస్.రవీంద్ర భట్‌ను ఎన్‌టీఎఫ్‌కు ఛైర్మన్‌గా నియమించింది. ఉన్నత విద్య, సామాజిక న్యాయం-సాధికారిత, మహిళా శిశు అభివృద్ధి, న్యాయ శాఖల కార్యదర్శులు ఎన్‌టీఎఫ్‌లో ఎక్స్ అఫిషియో సభ్యులుగా ఉంటారని తెలిపింది. విద్యార్థుల ఆత్మహత్యకు కారణాలు గుర్తించడం, ప్రస్తుతం ఉన్న నిబంధనలను విశ్లేషించడం, వారి రక్షణను బలోపేతం చేసేందుకు సిఫారసులు సహా సమగ్ర నివేదికను ఎన్‌టీఎఫ్ రూపొందిస్తుందని ధర్మాసనం తెలిపింది. దీనికోసం ఏ ఉన్నతవిద్యా సంస్థనైనా ఆకస్మికంగా తనిఖీ చేసే అధికారం ఎన్‌టీఎఫ్‌కు ఉందని తెలిపింది. నాలుగు నెలల వ్యవధిలో మధ్యంతర నివేదికను, ఎనిమిది నెలల వ్యవధిలో తుది నివేదికను ఎన్‌టీఎఫ్ అందజేయాలని నిర్దేశించింది. 2023 జూలై 8న ఆయుష్ అశ్న, సెప్టెంబరు 1న అనిల్ కుమార్ అనే దళిత విద్యార్థులు ఐఐటీ-ఢిల్లీలోని హాస్టల్ గదుల్లో ఆత్మహత్యకు పాల్పడ్డారు. అయితే, అవి హత్యలేనని వారి తల్లిదండ్రులు ఆరోపించారు. కుల వివక్ష పట్ల తమ పిల్లలు ఆందోళన చెందారని తెలిపారు. ఘటనలపై ఎఫ్ఐఆర్ నమోదు చేయాలని పోలీసులను ఆదేశించాలని కోరుతూ చేసిన అభ్యర్థనలను ఢిల్లీ హైకోర్టు తోసిపుచ్చిన నేపథ్యంలో వారి తల్లిదండ్రులు సుప్రీంకోర్టును ఆశ్రయించారు. వారి అభ్యర్థనను సుప్రీంకోర్టు మన్నించింది.

ర్యాగింగ్‌తో మూడేళ్లలో 51 మంది మృతి

విద్యా సంస్థల్లో ర్యాగింగ్ కారణంగా మూడేళ్ల వ్యవధిలో 51 మంది ప్రాణాలు కోల్పోయారు. అదే సమయంలో పరీక్షల ఒత్తిడి కారణంగా కోచింగ్ సెంటర్ల కేంద్రమైన రాజస్థాన్‌లోని కోటాలో 57 మంది ఆత్మహత్య చేసుకున్నారు. సొసైటీ ఎగనెస్ట్ వయలెన్స్ ఇన్ ఎడ్యుకేషన్ (సేవ్) సంస్థ 2022-24సంవత్సరాల మధ్య కాలానికి జరిపిన అధ్యయనంలో ఈ విషయం వెల్లడైంది. అధ్యయనంలో భాగంగా సేవ్ సంస్థ ర్యాగింగ్ హెల్ప్‌లైన్‌కు వచ్చిన 3,156ఫిర్యాదులను విశ్లేషించింది. ర్యాగింగ్ సమస్య వైద్య కళాశాలల్లో ఎక్కువున్నట్లు తేలింది.



కుప్పంలో పీఈఎస్ వైద్య కళాశాల పట్టభద్రుల దినోత్సవాన్ని జ్యోతి వెలిగించి ప్రారంభిస్తున్న జస్టిస్ ఎన్వీ.రమణ తదితరులు

నమ్మకం, విశ్వాసం.. | వైద్యులు, న్యాయవాదులకు ఇవే కీలకం

- వీటిని కోల్పోనంత వరకు ఎవరూ వేలెత్తి చూపరు
- నిర్వహణలో పొరపాట్లు చేస్తే సమాజానికి చేటు
- ఈ వృత్తుల్లో వారు బాధ్యత ఎరిగి వ్యవహరించాలి
- మాజీ సీజేఐ జస్టిస్ ఎన్వీ.రమణ

కుప్పం, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): నమ్మకం, విశ్వాసం ఆధారంగా వైద్య, న్యాయ వృత్తులు రాణిస్తాయని సుప్రీంకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఎన్వీ రమణ అన్నారు. ఇవి కోల్పోనంత వరకూ ఆయా వృత్తులను ఎవరూ వేలెత్తి చూపే అవకాశం ఉండదన్నారు. ఈ రెండు వృత్తుల నిర్వహణలో ఏమాత్రం పొరపాటు చోటుచేసుకున్నా సమాజానికి చేటు జరుగుతుందని హెచ్చరించారు. చిత్తూరు జిల్లా కుప్పంలోని పీఈఎస్ వైద్య కళాశాలలో 17వ పట్టభద్రుల దినోత్సవాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న జస్టిస్ ఎన్వీ రమణ మాట్లాడుతూ వైద్య, న్యాయ వృత్తుల్లోని వ్యక్తులు నిరంతరం అప్రమత్తంగా ఉంటూ బాధ్యత ఎరిగి వ్యవహరించాలని సూచించారు. వైద్య వృత్తి సేవాధర్మంతో కూడుకున్నదని, మనుషుల జీవన గమ్యాన్ని మార్చగల శక్తి ఈ వృత్తిలో ఉందన్నారు. న్యాయవృత్తిలాగే వైద్య వృత్తి కూడా ఎంతో బాధ్యతతో కూడినదని, ఈ రెండు వృత్తులూ గతి తప్పకుండా చూడడం ఆయా వృత్తుల్లోని వారికి ఎంతో ముఖ్యమని సూచించారు. ప్రజా స్వామ్య ఆరోగ్య విధానాల రూపకల్పనలో యువ వైద్యులు భాగస్వాములు కావాలని జస్టిస్ ఎన్వీ రమణ పిలుపునిచ్చారు. సమావేశానికి మెడికల్ డైరెక్టర్ డాక్టర్ సురేశ్ కృష్ణమూర్తి అధ్యక్షత వహించారు. ఉత్తమ విద్యార్థిగా (ఎంబీబీఎస్ 2019-20 బ్యాచ్) ఎంపికైన డాక్టర్ ఎ.విజయకుమార్‌ను స్వర్ణ పతకంతో సత్కరించారు. అలాగే 145మంది ఎంబీబీఎస్ (యూజీ), 84మంది పీజీ విద్యార్థులకు డిగ్రీలు ప్రదానం చేశారు. గౌరవ అతిథిగా పీఈఎస్ మాజీ మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ ఎల్.కృష్ణ, ఇన్‌చార్జి డీన్, ప్రిన్సిపాల్ డాక్టర్ సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

గూడూరు ఏసీటీవో ఆత్మహత్యాయత్నం

గూడూరు అర్బన్, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): తిరుపతి జిల్లా గూడూరు కమర్షియల్ ట్యాక్స్ ఆఫీసులో ఏసీటీవోగా విధులు నిర్వహిస్తున్న ఏసు రత్నం సోమవారం ఆత్మహత్యకు యత్నించారు. సోమవారం కార్యాలయానికి వచ్చిన ఆయన తన చాంబర్‌లోకి వెళ్లి నిద్రమాత్రలు మింగారు. గమనించిన తోటి ఉద్యోగులు చికిత్స నిమిత్తం ఏరియా ఆస్పత్రికి.. అనంతరం మెరుగైన వైద్యం కోసం తిరుపతికి తరలించారు. పని ఒత్తిడిని తట్టుకోలేక ఆత్మహత్యకు యత్నించినట్టు ఉద్యోగ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. దీనిపై పోలీసులకు ఎటువంటి సమాచారం అందలేదు.

దక్షిణ మధ్య రైల్వే
ఫాలో అవ్వండి X @ SCRailwayindia
ద.మ.రైల్వేలోని టెండరు ప్రకటన వివరాలను మా వెబ్‌సైట్ www.scr.indianrailways.gov.in పై చూడగలరు

సవరణ
తేది:21.03.2025

దిగువ సంతకందారు టెండరు తేది తెరుట కొరకు టెండరు ప్రకటన నం.44-CWMLGDS-ET-2024-25 తేది:03.03.2025కు దిగువ సవరణ చేయబడినది.

టెండరు నం.44-CWMLGDS-ET-2024-25 తేది:03.03.2025, వివరణ: కోచ్‌లలో ప్రెజరైజ్ ఫ్లషింగ్ సిస్టమ్ ఏర్పాటు. మొదట ఇలా ప్రచురించబడినది : టెండరు తెరుచుట: 25.03.2025న 11.00 గం.లకు తెరువబడును. ఇలా సవరించబడినది: టెండరు తెరుచుట : 02.04.2025న 11.00గం.లకు తెరువబడును.

ఒరిజినల్ టెండరు డాక్యుమెంట్లో అన్ని ఇతర నియమ నిబంధనలలో ఎటువంటి మార్పు లేదు. టెండరు డాక్యుమెంట్‌కు సవరణ వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేయబడినది.

వెబ్‌సైట్ వివరాలు : www.ireps.gov.in

టెండరు పూర్తి వివరాలు చూచుటకు నోటీసు బోర్డు ఉంచిన ప్రదేశం:చీఫ్ వర్క్ షాప్ మేనేజర్ కార్యాలయం, క్యారేజ్ వర్క్ షాప్, లాలాగూడ, సికింద్రాబాద్- 500017

చీఫ్ వర్క్‌షాప్ మేనేజర్, క్యారేజ్ వర్క్‌షాప్, లాలాగూడ, సికింద్రాబాద్

ఇ-టెండరు కోరుతూ ప్రకటన
(http://ieps.gov.in ద్వారా)

భారత రాష్ట్రపతి తరఫున చీఫ్ ఎలక్ట్రికల్ ఇంజనీర్, నిర్మాణం, దక్షిణ మధ్య రైల్వే, సికింద్రాబాద్ వారు దిగువ పనుల కొరకు రెండు ప్యాకెట్ల విధానం ద్వారా ఇ-టెండరు కోరుచున్నారు.

క్ర.సం.:01 NIT నం.& టెండర్ నం.: E29CTrDSC_43-2024-25, తేదీ: 25.03.2025 పని పేరు: "దక్షిణ మధ్య రైల్వే యొక్క మహబూబ్‌నగర్-డోన్ సెక్షన్ భాగంలో మహబూబ్‌నగర్-మన్యం కొండ సెక్షన్ మధ్యన డబ్లింగ్ దృష్ట్యా ప్రస్తుత ఓహెచ్‌ఇ కు సవరణలు కలుపుకొని 65 చ.మీమీ క్యాటనరీ వైర్ మరియు 107 చ.మీమీ కాంటాక్ట్ వైర్, ఎల్‌టి సప్లై ట్రాన్స్‌ఫార్మర్ల స్టేషన్లతో 2x25 kV 50Hz సింగిల్ ఫేజ్ A.C ట్రాక్షన్ ఓవర్ హెడ్ ఎక్విప్ మెంట్ యొక్క డిజైన్, సరఫరా, స్థాపన , పరీక్షించుట & పని చేయించుట అంచనా వ్యయం రూ: 18,25,91,632.53 /-, బయానా/ బిడ్ సెక్యూరిటీ రూ:10,63,000.00/-, డాక్యుమెంట్ ధర: ఆన్‌లైన్ టెండరు డాక్యుమెంట్ ఉచితంగా డౌన్‌లోడ్ చేసుకొనవచ్చును. పూర్తి చేయు కాలం: 15 నెలలు. ముగింపు తేది: 17.04.2025న 15.00 గం.లకు.

1. బిడ్ డాక్యుమెంట్ మరియు ఇతర వివరాల కొరకు వెబ్‌సైట్ http://ireps.gov.inకు లాగిన్ కాగలరు.
2. బిడ్డరు ireps.gov.in ద్వారా బిడ్ సెక్యూరిటీ అందించాలి. లేదా భారతదేశంలోని షెడ్యూల్డ్ కమర్షియల్ బ్యాంక్ నుండి బ్యాంకు గ్యారంటీ బాండ్‌గా దాఖలు చేయాలి. అనుబంధం–VII ప్రకారంగా బ్యాంక్ గ్యారంటీ బాండ్ ఉండవలెను మరియు బిడ్ చెల్లుబాటు వ్యవధి దాటి 90 రోజుల కాలం వరకు చెల్లుబాటు కావలెను. డిమాండ్ డ్రాఫ్టు, బ్యాంకర్స్ చెక్, డిపాజిట్ రశీదులు, FDR వగైరా ద్వారా మాన్యువల్ చెల్లింపులు అనుమతించబడవు.
3. టెండరుదారు టెండరు ముగింపు కాలం అయినట్టి సదరు పదిహేను రోజుల కాలం లోగా మాత్రమే వారి ఆఫర్లను ఆన్‌లైన్‌లో దాఖలు చేయవలెను.
4. టెండరుదారులు టెండరు దాఖలు కాలం ప్రారంభ తేది వరకు ఏదేని సవరణను (ఆన్‌లైన్‌లో మాత్రమే జారీ చేయబడుతుంది) గమనించగలరు.

డిప్యూటీ చీఫ్ ఎలక్ట్రికల్ ఇంజనీర్-I/Const/ సికింద్రాబాద్

టెండరు ప్రకటన నం.Safety - Mech-STC-TPTY-24-25

భారత రాష్ట్రపతి తరఫున Dy. CME/CRS/TPTY వారు పేర్కొన్న ముగింపు తేదిన 11.00 గం.ల వరకు పేర్కొన్న టెండరు నం.లకు ఎదురుగా ఇ-టెండర్లు కోరుచున్నారు. బిడ్డర్లు తమ ఒరిజినల్/రివైజ్డ్ బిడ్లను ముగింపు తేది & సమయం వరకు మాత్రమే దాఖలు చేయవలసి ఉంటుంది. ఈ టెండరుకు మాన్యువల్ ఆఫర్లు అనుమతించబడవు. అట్టి మాన్యువల్ ఆఫర్లు స్వీకరించినవెంటనే తిరస్కరించబడును.

క్ర.సం. 1.టెండరు నం. Safety-Mech-STC-TPTY-24-25 పని వివరణ: "ద.మ. రైల్వే, తిరుపతి, క్యారేజ్ రిపేర్ షాపు వద్ద మెటీరియల్ హ్యాండిలింగ్ ఎక్విప్‌మెంట్లు, (మెజర్ వెబిల్స్ ఐఓటి క్రేన్లు పిల్లర్ క్రేన్లు, గ్యాంట్రీ హాయిస్ట్‌లు, చైన్స్ స్లింగ్స్ వగైరా యొక్క ఇన్‌స్పెక్షన్, ఎగ్జామినేషన్, టెస్టింగ్ & సర్టిఫికేషన్. సుమారు వ్యయం : రూ. 19,11,392.73/- బిడ్ సెక్యూరిటీ: రూ. 38,200/- పూర్తి చేయు కాలం : 36 నెలలు. ముగింపు తేది : 12.04.2025న 11.00 గం.లకు.

వెబ్‌సైట్ వివరాలు : www.ireps.gov.in

టెండరు పూర్తి వివరాలు చూచుటకు నోటీసు బోర్డు ఉంచిన ప్రదేశం: చీఫ్ వర్క్‌షాప్ మేనేజర్ కార్యాలయం, క్యారేజ్ రిపేర్ షాప్, తిరుపతి

A0377 డిప్యూటీ చీఫ్ మెకానికల్ ఇంజనీర్/ క్యారేజ్ రిపేర్ షాప్/తిరుపతి

తదుపరి టెండరు నిబంధనలు/ వివరాల కొరకు మరియు టెండరు డాక్యుమెంట్ల డౌన్‌లోడింగ్ కొరకు దర్శించండి వెబ్‌సైట్: www.ireps.gov.in లేదా https://www.scr.indianrailways.gov.in

శ్రీవారి ఆస్తుల పరిరక్షణకు ప్రత్యేక కమిటీ

రూ.5,258.68 కోట్ల అంచనాతో టీటీడీ వార్షిక బడ్జెట్

- టీటీడీలో ఉద్యోగులంతా హిందువులే అయి ఉండాలి
- వెంకన్నకు హుండీ ద్వారానే అత్యధిక ఆదాయం
- పాత ఆగమ సలహా మండలి రద్దు.. త్వరలో నూతన సలహా మండలి
- దేశ, విదేశాల్లో శ్రీవారి ఆలయాల నిర్మాణం కోసం కొత్తగా ట్రస్టు
- టీటీడీ తీర్మానాలు.. వెల్లడించిన చైర్మన్ బీఆర్ నాయుడు



టీటీడీ బోర్డు నిర్ణయాలను సభ్యులు, అధికారులతో కలిసి మీడియాకు వెల్లడిస్తున్న చైర్మన్ బీఆర్ నాయుడు

తిరుమల, మార్చి 24(ఆంధ్రజ్యోతి): శ్రీవారికి దేశవ్యాప్తంగా ఉన్న ఆస్తులు పరిరక్షించడం, సద్వినియోగపరచడం లక్ష్యంగా ఓ కమిటీని ఏర్పాటు చేస్తున్నామని తిరుమల తిరుపతి దేవస్థానం(టీటీడీ) చైర్మన్ బీఆర్ నాయుడు చెప్పారు. శ్రీవారి పవిత్రమైన భూమిలో ఒక్క అంగుళం కూడా అన్యాక్రాంతం కాకూడదని నిర్ణయం తీసుకున్నట్లు వివరించారు. న్యాయస్థానాల్లో ఉన్న స్వామి ఆస్తుల వివాదాల విచారణ ప్రక్రియ వేగవంతం చేసేందుకు కృషి చేస్తామని తెలిపారు. 2025-26 ఆర్థిక సంవత్సరానికి టీటీడీ వార్షిక బడ్జెట్ రూ.5,258.68 కోట్ల అంచనాలతో ఆమోదించినట్లు వెల్లడించారు. తిరుమలలోని అన్నమయ్య భవనంలో సోమవారం టీటీడీ ధర్మకర్తల మండలి సమావేశం జరిగింది. అనంతరం ఈవో శ్యామలరావు, అదనపు ఈవో వెంకయ్య చౌదరి, మరికొంతమంది సభ్యులతో కలిసి బీఆర్ నాయుడు మీడియాకు వివరాలు వెల్లడించారు. టీటీడీ ఆదాయాల్లో అత్యధికం హుండీ ద్వారానే సమకూరుతోందని తెలిపారు. 2025-26లో హుండీ ద్వారా రూ.1,729 కోట్లు రావచ్చని బడ్జెట్‌లో అంచనా వేశామన్నారు. అలాగే పెట్టుబడులపై వడ్డీ ద్వారా రూ.1,310 కోట్లు రావచ్చని పేర్కొన్నారు. ప్రసాదాల అమ్మకాలపై రూ.600కోట్లు, దర్శన టికెట్ల విక్రయం ద్వారా రూ.310 కోట్లు, తలనీలాల విక్రయం ద్వారా రూ.176.50కోట్లు, ఆర్జితసేవల నుంచి రూ.130కోట్లు, అద్దె గదులు, కల్యాణ మండపాలు ద్వారా రూ.157 కోట్ల ఆదాయం వస్తుందని అంచనా వేసినట్టు చైర్మన్ వివరించారు. ఇక ఖర్చుల్లో ప్రధానంగా.. ఇంజనీరింగ్ పనులకు రూ. 350 కోట్లు, మెటీరియల్ కొనుగోళ్లకు రూ.768.50 కోట్లు, కార్పస్ అండ్ ఇన్వెస్ట్‌మెంట్స్‌కు రూ.800 కోట్ల అంచనా వేశామని చైర్మన్ వివరించారు.

టీటీడీ తీసుకునే భూముల్లో ఆధ్యాత్మిక కార్యక్రమాలు మాత్రమే!

ఇటీవల శ్రీవారి దర్శనం కోసం వచ్చిన సీఎం చంద్రబాబు సూచనల మేరకు బోర్డులో కొన్ని నిర్ణయాలు తీసుకున్నామని చైర్మన్ బీఆర్ నాయుడు వెల్లడించారు. ముంతాజ్ హోటల్‌కు భూ కేటాయింపుల అంశం వివాదమైన నేపథ్యంలో ఏడు కొండలకు ఆనుకుని ఉన్న ప్రాంతంలో భవిష్యత్తులో ఎటువంటి వ్యాపార కార్యకలాపాలు జరగరాదనే కోణంలో చర్యలకు ఉపక్రమించామని చెప్పారు. ఇందులో భాగంగా కొండ అంచున ఉన్న 35.25 ఎకరాల ప్రభుత్వ భూమితో పాటు ఏపీ టూరిజం పరిధిలో ఉన్న మరో 15 ఎకరాల భూమిని టీటీడీ స్వాధీన పరుచుకుని, బదులుగా టీటీడీకి చెందిన 50 ఎకరాల స్థలాన్ని అందజేస్తామన్నారు. టీటీడీ తీసుకునే భూముల్లో ఆధ్యాత్మిక కార్యక్రమాలు మాత్రమే జరిగేలా ధార్మిక చట్టాల్లో సవరణలు తీసుకొస్తామని చెప్పారు. టీటీడీలో పనిచేస్తున్నవారందరూ హిందువులే అయిుండాలని మరోసారి తీర్మానం చేశామన్నారు. దేశంలోని అన్ని రాజధానుల్లో శ్రీవారి ఆలయాల నిర్మాణం కోసం ఇప్పటికే ఆయా రాష్ట్రాల సీఎంలకు లేఖలు రాశామని, చాలా మంది సానుకూలంగా స్పందించారని తెలిపారు. స్పందించని వారితో స్వయంగా మాట్లాడతానని సీఎం చంద్రబాబు చెప్పారన్నారు. దేశ, విదేశాల్లో శ్రీవారి ఆలయాల నిర్మాణం కోసం నూతన ట్రస్టు ఏర్పాటు చేస్తామని బీఆర్ నాయుడు తెలిపారు.

మరికొన్ని నిర్ణయాలు..

- కొడంగల్, కరీంనగర్, ఉపమాక, అనకాపల్లి, కర్నూల్, ధర్మవరం, తలకోన, తిరుపతి గంగమ్మ ఆలయాల పునఃనిర్మాణానికి ఆర్థిక సాయం అందించేందుకు ఆమోదం.
- తిరుపతిలో సైన్స్ సిటీ, మ్యూజియంలకు గతంలో కేటాయించిన 20 ఎకరాల భూమి అనుమతులు రద్దు.
- వృద్ధులు, దివ్యాంగులకు ఆఫ్‌లైన్‌లోనూ శ్రీవారి దర్శనం కల్పించేలా సాధాసాధ్యాలను పరిశీలించాలని నిర్ణయం.
- ప్రస్తుతం 10 గంటలకు మొదలవుతున్న వీఐపీ బ్రేక్ దర్శనాన్ని ఉదయం 5.30 గంటలకు మార్చే అంశం పరిశీలనకు నిర్ణయం.
- రాష్ట్రంలోని చిన్న పట్టణాలు, గ్రామాలు, దళితవాడల్లో ఆర్థిక సమస్యలతో ఆగిపోయిన దేవాలయాలనూ, శిథిలావస్థకు చేరిన దేవాలయాల జీర్ణోద్ధరణకు నిర్ణయం. నూతన ఆలయాల నిర్మాణానికి శ్రీవాణి ట్రస్టు ద్వారా ఆర్థిక సాయం.
- టీటీడీ శాశ్వత ఉద్యోగుల సిఫారసు లేఖలపై మూడునెలలకోసారి సుపథం ద్వారా ప్రత్యేక ప్రవేశ దర్శనం.

టీటీడీకి గూగుల్ ఏఐ సేవలు

శ్రీవారి దర్శన సమయాన్ని తగ్గించే అంశంపై ఏఐ సేవలు అందించేందుకు గూగుల్ సంస్థ ముందుకు వచ్చిందని బీఆర్ నాయుడు తెలిపారు. వారి సహకారంతో ఫిజికల్ క్యూలైన్‌ను తగ్గించడం, వివిధ విభాగాల్లో ముఖ ఆధారిత గుర్తింపు వ్యవస్థను అమలు చేయడం వంటివి చేయాలని బోర్డు నిర్ణయించిందని చెప్పారు.

బ్లాక్ లిస్టు.. రద్దు!

అన్నప్రసాదాలకు ఆర్గానిక్ ఉత్పత్తులకు సరఫరా చేస్తామని ముందుకు వచ్చిన శ్రీనివాస సేవా సమితి నాసిరకం పదార్థాలను పంపినందున ఆ సంస్థను బ్లాక్‌లిస్ట్‌లో పెట్టామని చైర్మన్ బీఆర్ నాయుడు తెలిపారు. వారికి గతంలో ఇచ్చిన 25,500 టికెట్లకు సంబంధించిన కూపన్లను రద్దు చేస్తూ తీర్మానం చేసినట్లు తెలిపారు. గతంలో ఏర్పడిన ఆగమ సలహా మండలి కొన్ని తప్పుడు నిర్ణయాలు తీసుకున్నట్టు తమ దృష్టికి వచ్చినందున దానిని రద్దు చేసి, నూతన ఆగమ సలహామండలిని ఏర్పాటు చేయాలని నిర్ణయించినట్లు చైర్మన్ వెల్లడించారు.

దాడి నుంచి కాపాడింది తిరుమలేశుడే

- చిలుకూరు బాలాజీ ఆలయ అర్చకుడు రంగరాజన్



తిరుమల, మార్చి24(ఆంధ్రజ్యోతి): తనపై ఫిబ్రవరి7న జరిగిన భయంకరమైన దాడి నుంచి శ్రీవారే తనను కాపాడారని చిలుకూరు బాలాజీ ఆలయ అర్చకుడు రంగరాజన్ అన్నారు. తిరుమల శ్రీవారిని సోమవారం దర్శించుకున్న ఆయన ఆలయం ముందు మీడియాతో మాట్లాడుతూ, దాడి తర్వాత కలియుగ వైకుంఠం తిరుమలను సందర్శించాలని తన మనసులో కోరిక కలిగిందన్నారు. ఈ క్రమంలో స్వామి పాదపద్మాలకు నమస్కరించుకోవాలని తిరుమలకు వచ్చానని చెప్పారు. కాగా, స్వామికి భక్తులు సమర్పించే కానుకలను రోడ్ల నిర్మాణాలు వంటి వాటికి కాకుండా ఆధ్యాత్మిక కార్యక్రమాలు, ధర్మపరిరక్షణ, వేదధర్మ ప్రతిష్ఠకు వినియోగించేలా టీటీడీ బోర్డు చైర్మన్, సభ్యులు జాగ్రత్తలు పాటించాలని రంగరాజన్ అభిప్రాయపడ్డారు. అక్కడక్కడా ఉండే దేవాలయాల్లో నిత్య కైంకర్యాలకు అవసరమైన నిధులను సమకూర్చే బాధ్యతను టీటీడీ స్వీకరించాలని కోరారు. తిరుమలలో బ్రహ్మాండమైన ఏర్పాట్లు కనిపిస్తున్నాయని, ఇవి ఇలానే కొనసాగాలన్నారు.

టీటీడీ అన్నప్రసాదం ట్రస్టుకు రూ.37.67 లక్షల విరాళం



టీటీడీ చైర్మన్‌కు విరాళాన్ని అందజేస్తున్న దాత రామ్‌ప్రసాద్

తిరుమల, మార్చి24(ఆంధ్రజ్యోతి): తిరుమల తిరుపతి దేవస్థానం అన్నప్రసాదం ట్రస్టుకు రూ.37.67 లక్షలు విరాళంగా అందాయి. విజయవాడకు చెందిన రామ్‌ప్రసాద్ రూ.10.01 లక్షలు, కాకినాడకు చెందిన ఎలైట్ ఇన్‌స్ట్రుమెంట్స్ మేనేజింగ్ డైరెక్టర్ సూర్యనారాయణ రెడ్డి రూ.6.66 లక్షలు అందజేశారు. ఈమేరకు విరాళాలను సోమవారం సాయంత్రం టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడుకు తిరుమలలో అందజేశారు. అలాగే హరియాణాలోని కురుక్షేత్రకు చెందిన ఇషాంత్ రూ. 10 లక్షలు, ఢిల్లీకి చెందిన కపిలక్రిష్ ఉద్యోగ్ లిమిటెడ్ సంస్థ మరో రూ.11 లక్షలు విరాళంగా అందించారు. ఈ విరాళాలను ఆ సంస్థల ప్రతినిధి టీటీడీ బోర్డు సభ్యుడు ఆనంద్‌సాయి చేతులమీదుగా డోనార్ సెల్ అధికారులకు అందజేశారు.

రూ.143 కోట్లతో 76 ఆలయాల పునర్నిర్మాణం

- మంత్రి ఆనం రామనారాయణరెడ్డి

నెల్లూరు (సాంస్కృతికం) మార్చి 24 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో 76 ఆలయాలను రూ.143 కోట్లతో పునర్నిర్మిస్తున్నట్టు రాష్ట్ర దేవదాయ ధర్మాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి తెలిపారు. నెల్లూరు మూలాపేటలోని రుక్మిణీ సత్యభామ సమేత వేణుగోపాల స్వామి ఆలయంలో సోమవారం జరిగిన పాలక మండలి సమావేశానికి ఆయన అధ్యక్షత వహించారు. అనంతరం మంత్రి విలేకరులతో మాట్లాడుతూ నగరాలు, పట్టణాల్లో ఉన్న ఆలయాలకు సంబంధించి త్వరలోనే ముఖ్యమంత్రి చంద్రబాబుతో సమావేశం ఉందని తెలిపారు. ఈ సమావేశంలోనే ఆలయాలకు సంబంధించి కొత్తపాలసీ తీసుకువస్తామని మంత్రి తెలిపారు. సీఎం ఆదేశాల మేరకు టీటీడీ వినహా అన్ని ఆలయాల్లో ఆస్తుల పరిరక్షణ, భవనాలు, లీజులు, ఉత్సవాల నిర్వహణ తదితర అంశాలపై నిర్ణయం తీసుకుంటామన్నారు.


Sri Kodanda Rama Swamy Temple
Rallabuduguru(V), Santhipuram (M), Chittoor District
e-Procurement Tender
NIT No.P/COE/1399/2024-1, Dt: 06/01/2025
E-Tenders are invited through the e-Procurement portal for the Reconstruction of Temple, Construction of 16 Pillars Mandapam, Rehabilitation and Restoration of 5 Storied Rajagopuram. Interested bidders may visit the official website www.apeprocurement.gov.in for detailed information, eligibility criteria, and submission guidelines.
Trustee

Sri Betraya Swamy Temple
Maripalli, Paramasamudram (V), Kuppam (M), Chittoor District
e-Procurement Tender
NIT No.P/COE/1399/2024-3, Dt: 06/01/2025
E-Tenders are invited through the e-Procurement portal for the Reconstruction of a Temple. Interested bidders may visit the official website www.apeprocurement.gov.in for detailed information, eligibility criteria, and submission guidelines.
Trustee

జగన్‌కు ఝలక్

ఇన్‌పుట్ సబ్సిడీ పెంచాలా అని రైతులను అడిగిన జగన్

- ప్రస్తుత ప్రభుత్వం రూ.35 వేలకు పెంచిందన్న ఉద్యాన అధికారిణి
- సొంత నియోజకవర్గంలో మాజీ సీఎం పర్యటన



కోమన్నూతలలో దెబ్బతిన్న అరటిపంటను పరిశీలిస్తున్న మాజీ సీఎం జగన్

పులివెందుల, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): మాజీ ముఖ్యమంత్రి, పులివెందుల ఎమ్మెల్యే వైఎస్ జగన్‌కు చేదు అనుభవం ఎదురైంది. సోమవారం ఆయన తన నియోజకవర్గ పరిధిలోని లింగాల మండలంలో పర్యటించారు. శనివారం రాత్రి వీచిన ఈదురుగాలులకు దెబ్బతిన్న అరటి తోటలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన రైతులతో మాట్లాడుతూ.. మీకు ఇన్‌పుట్ సబ్సిడీ పెంచాలా.. లేక బీమా ఇవ్వాలా అని అడుగుతుండగా.. అక్కడే ఉన్న ఉద్యాన అధికారిణి సుభాషిణి స్పందించారు. 'సార్.. గతంలో రూ.25 వేలు ఉన్న ఇన్‌పుట్ సబ్సిడీ ఈ ప్రభుత్వం రూ.35,000కు పెంచింది' అని చెప్పడంతో ఆయన కంగుతిన్నారు. అనంతరం లింగాల మండలంలోని తాతిరెడ్డిపల్లె, కోమన్నూతల గ్రామాల్లో అరటి తోటలను పరిశీలించారు. విలేకరులతో మాట్లాడుతూ.. ఈ ప్రభుత్వానికి రైతుల బాగోగులు పట్టడం లేదని, వారిని పూర్తిగా విస్మరించిందని ఆరోపించారు. బీమా ప్రీమియం చెల్లించకపోవడంతో రైతులు నష్టపోయారన్నారు. ఈ ప్రభుత్వం వచ్చి ఏడాది కావస్తోంది.. మరో మూడేళ్లలో మన ప్రభుత్వం వస్తుంది. ప్రతి రైతుకూ న్యాయం చేస్తాం' అని జగన్ తెలిపారు. అనంతరం మధ్యాహ్నం 3.30 గంటల ప్రాంతంలో ఇడుపులపాయ నుంచి ప్రత్యేక హెలికాప్టర్‌లో తాడేపల్లి బయల్దేరి వెళ్లారు. పర్యటనలో ఎంపీ అవినాశ్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ సతీశ్‌రెడ్డి పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లోకెళ్లేందుకు జగన్ సన్నాహాలు: మంత్రి సవిత

పెనుకొండ టౌన్: 'వైసీపీ పూర్తిగా నిర్వీర్యం అయింది. కాంగ్రెస్ పార్టీలోకి చేరేందుకు జగన్ సన్నాహాలు చేసుకుంటున్నారు. కాంగ్రెస్ గేట్లు తీస్తే వెళ్లేందుకు ఆయన సిద్ధంగా ఉన్నారు' అని మంత్రి సవిత అన్నారు. శ్రీసత్యసాయి జిల్లా పెనుకొండ మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో వ్యాయామశాల నిర్మాణానికి సోమవారం ఆమె భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడారు. ఉమ్మడి అనంతపురం జిల్లాలో అక్రమార్కులపై త్వరలోనే చర్యలు ఉంటాయని అన్నారు.

జగన్ రైతు ద్రోహి

- సీఎంగా అన్నమయ్య డ్యాం బాధితులను పట్టించుకోలేదు
- అకాల వర్షాలతో నష్టపోయిన రైతులకు అండగా ఉంటాం: మంత్రి సవిత
- 'అనంత'లో ఉద్యాన పంటల నష్టాన్ని పరిశీలించిన మంత్రి, ఎమ్మెల్యే శ్రావణి



అనంతపురం జిల్లా యల్లనూరు మండలం నీర్జాంపల్లిలో దెబ్బతిన్న అరటి పంటను పరిశీలిస్తున్న మంత్రి సవిత, ఎమ్మెల్యే బండారు శ్రావణి తదితరులు

తాడిపత్రి/యల్లనూరు, మార్చి 24(ఆంధ్రజ్యోతి): 'ప్రకృతి వైపరీత్యాలతో పంటలకు తీవ్ర నష్టం జరిగినా మాజీ సీఎం జగన్ రైతులను పరామర్శించేందుకు రాలేదు. ఆయనకు రైతులపై ఏమాత్రం అభిమానం లేదు' అని మంత్రి సవిత అన్నారు. అనంతపురం జిల్లా, యల్లనూరు మండలం నీర్జాంపల్లి, గొడ్డుమర్రి గ్రామాల పరిధిలో వడగండ్ల వానకు దెబ్బతిన్న పండ్ల తోటలను ఆమె సోమవారం పరిశీలించారు. నీర్జాంపల్లి పొలాల్లో మీడియాతో మాట్లాడారు. 'జగన్ అధికారంలో ఉన్నప్పుడు అన్నమయ్య డ్యాం కొట్టుకుపోయినా బాధితులను పరామర్శించలేదు. తన బంధువు చనిపోవడంతో ఆయన పులివెందుల వెళ్లారు. కానీ దెబ్బతిన్న పంటలు పరిశీలించడానికి కాదు. రైతుల పట్ల ఆయనకు ప్రేమాభిమానాలు లేవు. జగన్ రైతు ద్రోహి. అకాల వర్షాలతో కడప, అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లాల్లో 1,547 హెక్టార్లలో పంట నష్టం జరిగింది. మొత్తం 1,240 మంది రైతులు రూ.60 కోట్ల వరకు నష్టపోయారు. హార్టికల్చర్, అగ్రికల్చర్ అధికారులు నివేదికను తయారు చేస్తున్నారు. హెక్టారుకు రూ.35 వేలు ఇన్‌పుట్ సబ్సిడీని ప్రభుత్వం ఇస్తుంది. గత ప్రభుత్వంలో రూ.25 వేలు మాత్రమే ఉండేది. నష్టపోయిన ప్రతి రైతు కుటుంబాన్నీ ఆదుకుంటాం. రైతులకు జరిగిన నష్టంపై ఇప్పటికే సీఎం చంద్రబాబు, మంత్రి అచ్చెన్నాయుడు తెలుసుకున్నారు. రైతులు ఆత్మహత్యల జోలికి వెళ్లవద్దు. ఇప్పటికే అనంతపురం, కడప కలెక్టర్లు ప్రభుత్వానికి జరిగిన నష్టం గురించి తెలియజేశారు' అని మంత్రి సవిత తెలిపారు. ఆమె వెంట ఎమ్మెల్యే బండారు శ్రావణి, టీడీపీ జిల్లా అధ్యక్షుడు వెంకట శివుడుయాదవ్, జాయింట్ కలెక్టర్ శివనారాయణ, ఆర్డీఓ కేశవనాయుడు, ఉద్యాన, రెవెన్యూ శాఖ అధికారులు ఉన్నారు.

జగన్‌కు అరటి రైతులు ఇప్పుడు గుర్తొచ్చారా..!

- నష్టపోయిన ప్రతి రైతునూ ఆదుకుంటాం
- ఉద్యాన పంటలకు 1.10 లక్షల వరకూ సాయం... బీమా అదనం: మంత్రి అచ్చెన్న

అమరావతి, మార్చి 24(ఆంధ్రజ్యోతి): 'పులివెందులలో అరటి రైతులు ఉన్నారని జగన్‌రెడ్డికి ఇప్పుడు గుర్తొచ్చిందా? గిట్టుబాటు ధర లేక గత ఐదేళ్లలో వాళ్లు నష్టపోయినా జగన్‌రెడ్డి పట్టించుకున్న పాపాన పోలేదు' అని మంత్రి అచ్చెన్నాయుడు మండిపడ్డారు. ఈ మేరకు సోమవారం ఆయన ఓ ప్రకటన చేశారు. 'గతంలో ఎన్నడూ లేని విధంగా పరిహారం అందించి, రైతులకు అండగా నిలబడేందుకు మా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుంది. రైతులు ఎవ్వరూ అధైర్యపడవద్దు. అరటి, మొక్కజొన్న, బొప్పాయి, వరి పంటలకు కొన్ని చోట్ల వర్షాలతో నష్టం జరిగింది. అనంతపురం, శ్రీసత్యసాయి, కడప, ప్రకాశం జిల్లాల్లో నష్టం వివరాలు అధికారులు సేకరిస్తున్నారు. మిగిలిన ప్రాంతాల్లోనూ ఎన్యూమరేషన్ ప్రారంభమౌతుంది. హెక్టారుకు రూ.35,000 మేర సబ్సిడీతో పాటు సమీకృత ఉద్యాన పంటల ప్రోత్సాహం కింద మొక్కలు తిరిగి నాటుకునేందుకు హెక్టారుకు రూ.75 వేలు అందజేస్తాం. మొత్తం రూ.1.10 లక్షల వరకూ రైతులకు సాయం అందనున్నది. బీమా ఉంటే చెల్లింపులు అదనం' అని అచ్చెన్న వివరించారు.

ఉద్యాన పంటలు నష్టపోయిన రైతులకు పరిహారం అందించండి

- సీఎం చంద్రబాబుకు రామకృష్ణ లేఖ

అమరావతి, మార్చి 24(ఆంధ్రజ్యోతి): అకాల వర్షాలు, ఈదురుగాలుల వల్ల అనంతపురం, కడప జిల్లాల్లో ఉద్యాన పంటలు నష్టపోయిన రైతులకు పరిహారం అందించి ఆదుకోవాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు ముఖ్యమంత్రి చంద్రబాబుకి సోమవారం ఆయన లేఖ రాశారు. కడప జిల్లా పులివెందుల, అనంతపురం జిల్లా శింగనమల నియోజకవర్గాల్లో అప్పులు తెచ్చి పంటలు సాగు చేసిన రైతులు... దిగుబడులు చేతికొచ్చే సమయంలో అకాల వర్షాలతో సర్వం కోల్పోయి విలపిస్తున్నారు. నష్టం అంచనా వేయించి వెంటనే పరిహారం అందించడం ద్వారా రైతులకు భరోసా కల్పించాలి. ఆత్మహత్యాయత్నాలకు పాల్పడిన రైతులకు మెరుగైన వైద్య సాయం అందించేందుకు చర్యలు తీసుకోవాలి' అని రామకృష్ణ విజ్ఞప్తి చేశారు.

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం
జలవనరుల శాఖ
నెం.16. SE/& 17 SE/2024-25, ఇ-ప్రొక్యూర్‌మెంట్ టెండరు నోటీసు తేది: 22.03.2025
పర్యవేక్షక ఇంజనీరు వారి కార్యాలయము, ఇరిగేషన్ సర్కిల్, విజయవాడ వారి పరిధిలో గల అంచనా విలువ: రూ.225.75 లక్షలతో మంజూరైన 2 పనులకు ఆన్‌లైన్ టెండర్లు కోరబడుచున్నవి. టెండర్ షెడ్యూల్ లభించు తేది: 25.03.2025, సా.5గం.ల నుండి 09.04.2025, సా.4గం.ల వరకు. తదుపరి వివరాలను www.apeprocurement.gov.inలో పొందగలరు. ఫోన్. 08662575276.
సం/- పర్యవేక్షక ఇంజనీరు, ఇరిగేషన్ సర్కిల్, విజయవాడ
DIPR RO No.15646/CL/ADVT/1/1/2021-22, Dt 24.03.2025

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం
పంచాయతీ రాజ్ ఇంజినీరింగ్ శాఖ
ఇ-ప్రొక్యూర్‌మెంట్ టెండరు ప్రకటన
NIT No.50 to 52/TO/2024-25 తేది:21.03.2025
కృష్ణా జిల్లాలో వివిధ గ్రాంట్ల క్రింద రూ.290.00 లక్షల అంచనావ్యయంతో 2 నం.ల భవనాల పనులు & 1 వంతెన పని కొరకు ఆన్‌లైన్ టెండర్లు కోరబడుతున్నవి. బిడ్ డౌన్‌లోడ్ ప్రారంభ తేది: 25.03.2025 నుండి. తదుపరి వివరాలు ఇ-మార్కెట్ ప్లేస్ www.tender.apeprocurement.gov.inను చూడగలరు. ఫోన్ నం: 6305693265.
సం/- సూపరింటెండింగ్ ఇంజనీర్, పంచాయతీ రాజ్, మచిలీపట్నం, కృష్ణా జిల్లా.
DIPR RO.No.15640/CL/ADVT/1/1/2021-22, Dt: 24.03.2025

భారతీయ రిజర్వు బ్యాంక్
RESERVE BANK OF INDIA
www.rbi.org.in
08, 10, 11 మరియు 12 సంవత్సరాల రాష్ట్ర ప్రభుత్వ సెక్యూరిటీస్ వేలం
ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం ₹ 4,548 కోట్ల (ముఖ విలువ) మొత్తాన్ని వేలం ద్వారా విక్రయించడానికి ప్రతిపాదించింది.
మల్టిపుల్ ప్రైస్ ఫార్మాట్ క్రింద రాబడి ఆధారిత వేలం, భారతీయ రిజర్వ్ బ్యాంకు కోర్ బ్యాంకింగ్ సొల్యూషన్స్ (E-Kuber) మీద మార్చి 25, 2025 (మంగళవారం)న నిర్వహించబడుతుంది. పోటీ లేని స్కీమ్ ప్రకారం రిటైల్ డైరెక్ట్ పోర్టల్ (https://rbiretaildirect.org.in) ద్వారా కూడా వ్యక్తిగత ఇన్వెస్టర్లు బిడ్‌లు దాఖలు చేయవచ్చు.
మరింత సమాచారం కొరకు మార్చి 24, 2025 (సోమవారం) తేదీ నాటి భారతీయ రిజర్వ్ బ్యాంకు వారి పత్రికా ప్రకటనను RBI వెబ్ సైట్ (www.rbi.org.in)ను చూడండి.
"మీకు డబ్బు ఆశ చూపుతూ వచ్చే ఇ-మెయిల్స్/ఎస్ఎంఎస్‌లకు/కాల్స్ వల్ల మీరు మోసపోవద్దు"

ఆంధ్రప్రదేశ్ పారిశ్రామిక మౌలిక సదుపాయాల సంస్థ లిమిటెడ్
(ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వరంగ సంస్థ)
ఇంజనీర్-ఇన్-చీఫ్ కార్యాలయం, APIIC Ltd., 9వ అంతస్తు, APIIC టవర్-1, ఆటోనగర్, IT పార్క్, మంగళగిరి, గుంటూరు జిల్లా - 522503. వెబ్: www.apiic.in
ఇ-ప్రొక్యూర్‌మెంట్ ప్రకటన
టెండరు ప్రకటన నం.33/CE(C)/APIIC/2024-25 తేది:21.03.2025
టెండరు ప్రకటన నం.33: MSC CDP క్రింద అన్నమయ్య జిల్లా, వాల్మీకిపురం (మం), తాటిగుంట పల్లి (గ్రా) లోని ఇండస్ట్రియల్ పార్క్ వద్ద 9.0 మీ. పొడవు ఆక్టాగోనల్ సింగిల్ ఆర్మ్ పోల్స్‌పై 150నం.ల 90W LED వీధిలైట్లు ఏర్పాటు చేయుట మరియు ప్రస్తుత HT లైన్ల తరలింపుతో పాటు కావలసిన డిస్ట్రిబ్యూషన్ ట్రాన్స్‌ఫార్మర్స్‌తో ప్రతిపాదిత అంతర్గత రోడ్లతో పాటు 11kV/LT లైన్ వేయడం ద్వారా పవర్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఏర్పాటు చేయుట. ECV: రూ. 1,60,38,539/-
బిడ్ డౌన్‌లోడ్ ప్రారంభ తేది: 21.03.2025న రా.8.00 గం.లకు, బిడ్ల దాఖలుకు ఆఖరి తేది: 07.04.2025న మ.3.00 గం.ల వరకు. టెండరు ప్రకటన వివరాలు మరియు బిడ్ డాక్యుమెంట్లను వెబ్‌సైట్ www.apeprocurement.gov.in లేదా http://tender.apeprocurement.gov.in నుండి డౌన్‌లోడ్ చేసుకోవచ్చును.
సం/- చీఫ్ ఇంజనీర్ (C), APIIC Ltd., మంగళగిరి
DIPR RO No.3634PP/CL/ADVT/1/1/2021-22, Dt: 24.03.2025

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

కొలీజియంకు కొత్తపరీక్ష

ఢిల్లీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ యశ్వంత్ వర్మను అలహాబాద్ హైకోర్టుకు పంపేయాలని సుప్రీంకోర్టు కొలీజియం నిర్ణయించడం ఆశ్చర్యం. వెనక్కుపంపేయాలని నాలుగు రోజుల క్రితం సుప్రీంకోర్టు అనుకున్నప్పుడే అక్కడి బార్ అసోసియేషన్ తీవ్రంగా తప్పుబట్టి, ఇదేమీ చెత్తకుండీ కాదు, అవినీతి ఆరోపణలు వచ్చిన వ్యక్తిని మా నెత్తినరుద్దవద్దంటూ అభ్యంతరం చెప్పింది. అవినీతి ఆరోపణలకు, ఈ బదిలీకి సంబంధం లేదని సుప్రీంకోర్టు అన్నంతమాత్రాన ఏ పరిణామాల నేపథ్యంలో ఈ నిర్ణయం జరిగిందో తెలియనిదేమీ కాదు. మిగతా సందర్భాల్లో న్యాయమూర్తుల బదిలీల్లో ఆయా రాష్ట్రాల బార్ అసోసియేషన్ల అభ్యంతరాలనో, ఆక్షేపణలనో పట్టించుకోకపోవడం వేరు, ఇప్పటి నేపథ్యం వేరు. యశ్వంత్ వర్మను వెనక్కుపంపవద్దని న్యాయవాదుల అసోసియేషన్ శుక్రవారం తొలిగా అభ్యంతరపెట్టినప్పటినుంచి సోమవారం తిరిగి అదే నిర్ణయం తీసుకొనే వరకూ చాలా పరిణామాలు జరిగాయి. ఈ స్వల్పకాలంలో సుప్రీంకోర్టు చూపిన చొరవ, త్వరితగతిన తీసుకున్న నిర్ణయాలు ప్రశంసనీయమైనవి. అవన్నీ కూడా వర్మమీద వచ్చిన ఆరోపణలను మరింత లోతుగా దర్యాప్తు చేయాల్సిన, నిజాన్ని నిగ్గుతేల్చాల్సిన అవసరాన్ని చాటిచెబుతున్నాయి. కానీ, ఇంతలోనే మళ్ళీ ఆయనను అలహాబాద్ పంపాలన్న నిర్ణయానికే సుప్రీంకోర్టు వచ్చిన కారణంగా అక్కడకు సదరు బార్ అసోసియేషన్ అవినీతికి వ్యతిరేకంగా పోరాడుతున్నట్టు, సర్వోన్నత న్యాయస్థానం ఈ కేసులో ఏదో రాజీపడిపోయినట్టు సామాన్యజనానికి అనిపించే ప్రమాదం లేకపోలేదు.

తృణమూల్ ఎంపీ మొహువా మొయిత్రా సోమవారం పార్లమెంట్‌లో యశ్వంత్ వర్మ అంశాన్ని ప్రస్తావిస్తూ, ఒక న్యాయమూర్తిమీద అవినీతి ఆరోపణలు వచ్చిన ఈ ఉదంతాన్ని అస్త్రంగా చేసుకొని, కొలీజియం వ్యవస్థను కుప్పకూల్చే దిశగా ప్రభుత్వం కుట్రకు తెరదీస్తోందని ఓ ఆరోపణచేశారు. రాసిపెట్టుకోండి, ప్రభుత్వమూ, గోదీ మీడియా కలసి కొలీజియం వ్యవస్థను అప్రదిష్టపాల్జేసి, తాము ఎంతోకాలంగా అనుకుంటున్న విధానాన్ని తేవడానికి వీలుగా పరిస్థితులను, వాతావరణాన్ని, కార్యక్షేత్రాన్ని సిద్ధం చేస్తున్నాయి అని వ్యాఖ్యానించారామె. నరేంద్రమోదీ తొలివిడత పాలన తొలి ఏడాది తొలిమాసాలలోనే నేషనల్ జుడీషియల్ అపాయింట్‌మెంట్స్ కమిషన్ (ఎన్‌జెఎసి) ఏర్పాటుకోసం ఓ ప్రయత్నం చేయడం, సుప్రీంకోర్టు మరుసటి ఏడాది దానిని కొట్టివేసి, కొలీజియంను నిలబెట్టుకోవడం తెలిసిందే. సర్వోన్నతన్యాయస్థానంమీద ఆగ్రహమో, అక్కసో వచ్చినప్పుడల్లా బీజేపీ పెద్దలు, న్యాయశాఖమంత్రులు తాము నిలబెట్టుకోలేని ఈ చట్టాన్ని ప్రస్తావిస్తూనే ఉన్నారు. రాజ్యసభ ఉపాధ్యక్షుడు జగ్‌దీప్ ధన్‌ఖడ్ గతంలో దీనిని ఏకంగా ఎంపీల చేతకానితనానికి ప్రతీకగా అభివర్ణించిన సందర్భమూ ఉంది. యశ్వంత్ వర్మ ఉదంతం సందర్భంగా ఆయన దీనిని మళ్ళీ ముందుకు తేవడం, న్యాయవ్యవస్థలో అవినీతిని రూపుమాపే వజ్రాయుధంగా బీజేపీ నాయకులు, కొన్ని మీడియా సంస్థలు చర్చిస్తూండటం గమనార్హం. న్యాయమూర్తుల నియామకాలమీద ప్రభుత్వం నియంత్రణే ఉండే ఈ వ్యవస్థను తెచ్చుకోవడానికి తక్షణమే పాలకులు రంగంలోకి దిగకపోయినప్పటికీ, ఈ వివాదం ఎంతకాలం కొనసాగితే వారికి అంత ఉపకారం జరుగుతుంది. యశ్వంత్ వర్మ అవినీతిని చూపి, తమ ప్రత్యామ్నాయ వ్యవస్థ పరిశుద్ధమైనదన్న వాదనకు ప్రభుత్వం మరింత విలువ సమకూర్చుకోగలదు. సీజేఐ నియమించిన త్రిసభ్యకమిటీ నివేదిక వచ్చేదాకా వేచివుండాలని నిర్ణయించామని అంటూనే, సోమవారం స్వపక్ష, విపక్ష అధినేతలతో ధన్‌ఖడ్ న్యాయవ్యవస్థ మంచిచెడుల గురించి చర్చలు జరపడం గమనార్హం. ఎన్‌జెఎసిని సమర్థించనిపక్షంలో న్యాయస్థానాల్లో అవినీతిని బలపరచిన అప్రదిష్ఠ తమకు వస్తుందేమోనని ప్రతిపక్షాలు సైతం భయపడే పరిస్థితులు ఏర్పడవచ్చు.

వర్మ వ్యవహారంలో చీఫ్ జస్టిస్ సంజీవ్ ఖన్నా స్పందించిన తీరు ప్రశంసనీయమైంది. ఢిల్లీ హైకోర్టు చీఫ్‌జస్టిస్ నివేదిక, డబ్బుకట్టల చిత్రాలు, వీడియోలతో సహా అందుబాటులో ఉన్న సమస్త సమాచారాన్ని ఆయన ప్రజాక్షేత్రంలో ఉంచారు. ఢిల్లీ హైకోర్టు యశ్వంత్ వర్మకు కేటాయించిన విధులన్నింటినీ రద్దుచేసింది. నామమాత్రంగా జడ్జిగా మిగిలిన ఆయనను కదల్చకుండా వదిలివేసి ఉంటే సరిపోయేది. అలహాబాద్‌కు తిరిగి పంపేయాలన్న కొలీజియం నిర్ణయం ఈ ఉదంతాన్ని మరికొంతకాలం వివాదాస్పదంగా కొనసాగించడానికి ఊతమిస్తున్నది. న్యాయవ్యవస్థను అతివేగంగా తలెత్తుకొనేట్టుగా చేయాల్సిన బాధ్యత ఖన్నా మీద ఉంది.

అభివృద్ధే దక్షిణాదికి శాపమైందనుకోవాలా?

ఏ దేశానికైనా రాష్ట్రాల సాధికారత చాలా ముఖ్యం. కేంద్రం కింద నలిగిపోకుండా, రాష్ట్రాల మధ్య సమానతను తెచ్చే వ్యవస్థనే సమాఖ్య అంటాము. సమాఖ్య వ్యవస్థలో కేంద్ర ప్రభుత్వం రాష్ట్రాలకు తగినంత అధికారాలు, నిధులు సమకూర్చాల్సిన బాధ్యతను కలిగి ఉంటుంది. భారతదేశం కేంద్రీకృత సమాఖ్య రూపంతో పుట్టింది. దేశ సమైక్యతను, సమగ్రతను కాపాడడానికి రాష్ట్రాలన్నిటికీ కేంద్రం చేసిన చట్టాలకు లోబడి పనిచేయాల్సిన అవసరం కల్పించారు. కాలక్రమేణా 1980ల తర్వాత జాతీయ పార్టీల మీద అసంతృప్తితో ప్రాంతీయ పార్టీలు అధికారంలోకి వచ్చాయి. అవి వేగవంతమైన అభివృద్ధి కోసం తమదైన నమూనాలు తెచ్చాయి. దరిమిలా, ముఖ్యంగా దక్షిణాది రాష్ట్రాల్లో అభివృద్ధి వేగవంతమైంది. అభివృద్ధి పెరిగిన కొద్దీ ప్రభుత్వాల మీద ఇంకా బాధ్యత పెరుగుతుందని జర్మన్ ఆర్థికవేత్త అడాల్ఫ్ వాగ్నర్ చెప్పినట్టు, ప్రభుత్వాల బడ్జెట్లు కూడా పెరిగాయి. ఈ పరిస్థితిలో రాష్ట్రాలకు నిధుల కొరత సమస్యగా మారింది. ప్రధానంగా, సమాఖ్య నిబంధనల ప్రకారం, దక్షిణాది రాష్ట్రాల నుంచి వచ్చిన పన్ను ఆదాయం దేశంలో ఉన్న వెనుకబడిన రాష్ట్రాలకు తరలిపోవడం వివాదాలకు కారణం అయింది. డిలిమిటేషన్ ప్రమాదం కూడా ముందుకు రావడంతో సమాఖ్య వివాదాలు ఇప్పుడు ప్రముఖంగా ముందుకొచ్చాయి.

మొదటి యాభై ఏళ్ళు దేశంలోని మొత్తం రాబడిలో కేంద్రానికి 70శాతం, అన్ని రాష్ట్రాలకూ కలిపి కేవలం 30 శాతం నిధులు వెళ్ళే లాగా మొదటి 10 ఆర్థిక సంఘాలు నిర్ణయించాయి. అయితే, రాష్ట్రాలకు వినోదం, ఎక్సయిజ్, ప్రాపర్టీ, రిజిస్ట్రేషన్ పన్నులు లాంటి కొన్ని సొంత పన్నులు విధించుకునే అధికారం ఉండేది. ఇవి కాక కేంద్రానికి వెళ్లిన 70శాతం ఆదాయంలో, ఆర్థిక సంఘం నిర్ణయంతో కొన్ని నిధులూ, కేంద్రం తన ప్లానింగ్ కమిషన్ సూచనల ఆధారంగా కొన్ని నిధులు వెనక్కి వచ్చేవి. 1990ల్లో రాష్ట్రాలు ఈ 30 శాతం చాలట్లేదని పోట్లాడాయి. 25 ఏళ్ళ పోరాటం తర్వాత 14వ ఆర్థిక సంఘం దీన్ని 40 శాతానికి పెంచాలని సిఫార్సు చేసింది. 2014లో అధికారంలోకి వచ్చిన బీజేపీ ఇదిగో చేస్తున్నామని చెప్పింది. తీరా చూస్తే, ఆదాయ పన్నుల మీద, పెట్రోలు మీద 10శాతం సెస్సు, సర్‌చార్జి వాసులు చేసి, దాని వాటా మళ్ళీ 70 శాతానికి తెచ్చుకుంది. జీఎస్టీ విధానం వల్ల రాష్ట్రాలు సొంతంగా పన్నులు నిర్ణయించుకునే అధికారాన్ని కోల్పోయాయి. కేంద్రం ఉచ్చులో బిగుసుకున్నాయి. ఇది సమాఖ్య స్ఫూర్తికి పూర్తిగా విరుద్ధం. దీని మీద 15వ సంఘం చేసిన సిఫార్సులు దక్షిణాది రాష్ట్రాలకు శరాఘాతం అయ్యాయి. ఈ సిఫార్సులు రాష్ట్రాల మధ్య నిధులను పంచే ప్రాతిపదికను మార్చాయి. జనాభా, విస్తీర్ణం, వెనుక



akbar

24 ఉత్తరాది రాష్ట్రాలన్నీ కలిపి 64 శాతం పన్నుల రాబడిని చూపిస్తే, కేవలం 5 దక్షిణాది రాష్ట్రాలు 36 శాతం పన్నులను సేకరిస్తున్నాయి. కానీ 18.6 శాతాన్ని మాత్రమే దక్షిణాది రాష్ట్రాలకు తిరిగి ఇస్తున్నారు. యూపీ, బిహార్, రాజస్థాన్, మధ్య ప్రదేశ్ వంటి రాష్ట్రాలు తాము ఇచ్చేదానికి సుమారుగా రెట్టింపు మొత్తాన్ని వెనక్కు పొందుతున్నాయి.

బాటుతనం, పన్నుల రాబడి పెంచినందుకు ఇన్సెంటివ్, అటవీ భూమి శాతం దామాషాగా రాబడిని రాష్ట్రాలకు పంచుతారు. ఇందులో జనాభా లెక్కకు ప్రాతిపదికగా ఇదివరలో 1991 జనాభా లెక్కలు ఉండగా, దాన్ని 2021 జనాభా లెక్కలకి మార్చారు. దీనితో జనాభాని కంట్రోల్ చేసుకున్న దక్షిణాది రాష్ట్రాలకు భారీ కోత, జనాభా నియంత్రణని గాలి కొదిలేసిన రాజస్థాన్, యూపీ, బీహార్, మధ్యప్రదేశ్‌లకు విపరీతంగా నిధుల కేటాయింపు పెరిగింది. ఆయా రాష్ట్రాల్లో బీజేపీ ప్రభుత్వం ఉండడం వల్ల ఆశ్రిత రాష్ట్రాలకు లాభం చేకూరేలా ఇది చేస్తున్నారని దక్షిణాది రాష్ట్రాల ఆరోపణ. 24 ఉత్తరాది రాష్ట్రాలన్నీ కలిపి 64 శాతం పన్నుల రాబడిని జెనెరేట్ చేస్తే, కేవలం 5 దక్షిణాది రాష్ట్రాలు 36 శాతం పన్నులను సేకరిస్తున్నాయి. కానీ కేవలం 18.6 శాతాన్ని మాత్రమే దక్షిణాది రాష్ట్రాలకు తిరిగి ఇస్తున్నారు. యూపీ, బిహార్, రాజస్థాన్, మధ్యప్రదేశ్ వంటి రాష్ట్రాలు తాము ఇచ్చేదానికి సుమారుగా రెట్టింపు మొత్తాన్ని వెనక్కు పొందుతున్నాయి.

ఇక్కడ పలు ప్రశ్నలు వస్తాయి: బలహీనమైన రాష్ట్రాలకు సహాయం చెయ్యడం బాగానే ఉన్నా, వాళ్ళు ఎన్నటికీ ఇదే బలహీనతను ప్రదర్శిస్తారా? ఈ సహాయం వల్ల వారిలో అలసత్వం పెరిగి అభివృద్ధి మీద దృష్టి పెట్టకుండా ఉంటున్నారా? ఈ సహాయానికి ఒక కాలపరిమితి అంటూ లేకపోతే, దక్షిణాది రాష్ట్రాల వాటా మీద ఆధారపడి బతకడం మనకు ఒక అలవాటు ఐపోదా? దక్షిణాది రాష్ట్రాలు అభివృద్ధి ద్వారా పెంచుకున్న పన్నుల రాబడిని ఉత్తరాది రాష్ట్రాలు తన్నుకుపోతే, ఇక్కడి ఆర్థిక ప్రగతి కుంటుపడదా? సమాఖ్య స్ఫూర్తి కోసం దక్షిణాది రాష్ట్రాలు ఎంత కాలమని ఎంత వరకూ త్యాగం చేయాలి?

ఇదిగాక, గ్రాంట్ల కేటాయింపులో కూడా అన్యాయం జరుగుతోందని దక్షిణాది రాష్ట్రాల ఆరోపణ. ఇందులో వాస్తవం లేకపోలేదు. ఉదాహరణకు, ఆయుష్మాన్ భారత్ అనే కేంద్రం నిశ్చయించిన ఆరోగ్య బీమా పథకం కంటే ముందే ఆంధ్రప్రదేశ్, తెలంగాణలో ఉన్న బీమా పథకాలు ఎక్కువ కవరేజ్ కలిగి ఉన్నవి. కానీ, మా పాలసీ తీసుకుంటేనే ఈ గ్రాంటు ఇస్తామని కేంద్రం షరతుపెట్టింది. అది చెయ్యని పక్షాన తెలంగాణకి రూ.2 వేల కోట్లు తిరస్కరించారు. అలాగే జాతీయ విద్యా విధానం అమలు చెయ్యని కారణంగా తమిళనాడుకి సర్వశిక్ష అభియాన్ స్కీము కింద రూ.2.6 వేల కోట్లు నిరాకరించారు. షరతులతో కూడిన గ్రాంట్లు ఇవ్వడం, తిరస్కరించడం ద్వారా కేంద్రం సమాఖ్య స్ఫూర్తిని ప్రదర్శించకుండా పెద్దన్నలా అధికారాన్ని రుద్దుతున్నది. అసలు ఈ సెంట్రల్ గ్రాంటులంటూ ఎందుకు, ఈ డబ్బంతా నేరుగా ఇచ్చేయమని రాష్ట్రాలు అడుగుతున్నాయి. ఆ విధంగా రాష్ట్రాల వాటా 50 శాతానికి పైగా పెంచవచ్చు. కానీ కేంద్ర ప్రభుత్వం అధిక రాబడిని చేతిలో పెట్టుకుని రాష్ట్రాల మీద పెత్తనం చెలాయిస్తోంది.

సరే, ఇక పెరిగే ఖర్చులకు, రాబడి ఎపుడూ వెనుకబడే ఉండడం భారతదేశంలో రాజ్యానికి తప్పని పరిస్థితి. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల ద్రవ్య లోటుని, అప్పులని నియంత్రించే FRBM చట్టాన్ని 2003లో తెచ్చారు. ఇందులో కేంద్రం తన సాలీనా ద్రవ్య లోటు 3 శాతంగా, రాష్ట్రాల లోటు 3 శాతంగా, బ్యాంకుల నుంచి తెచ్చుకునే అప్పు మీద పరిమితులను విధించారు. రాష్ట్రాలు రెవెన్యూ లోటును (అంటే, సొంత ఖర్చులకు సొంత ఆదాయానికి మధ్య లోటును) జీరోగా మెయింటైన్ చెయ్యాలని, మిగతా 3శాతం తన రాష్ట్ర ఆదాయంలో 3శాతం మించకుండా రిజర్వు బ్యాంకు అప్పు ఇచ్చే పద్ధతిని మొదలు పెట్టారు. రాష్ట్రాలు, ఈ పరిమితులని పాటించాయి కానీ కేంద్ర ప్రభుత్వం ఇబ్బడి ముబ్బడిగా ఉల్లంఘించింది. తను ఉల్లంఘిస్తూనే రాష్ట్రాలను మాత్రం కట్టడి చేస్తోంది. కేరళ, పంజాబ్, యూపీ, తమిళనాడు, బిహార్ లాంటి రాష్ట్రాలు రెవెన్యూ అప్పులు చేయకుండా ఉండలేకపోయాయి. తెలంగాణలోని బీఆర్ఎస్, ఆంధ్రప్రదేశ్‌లోని వైసీపీ ప్రభుత్వాలు రెవెన్యూ లోటు జీరోగా చూపించి, ఏకంగా బడ్జెట్లో చూపని రహస్య అప్పులు విపరీతంగా చేశాయి. కేంద్రమైతే, పెట్రోల్ పన్నులోంచి ఈ ద్రవ్య లోటును తగ్గించుకుంది. మరి రాష్ట్రాలకు అలాంటి ఆధారం లేదు. కాబట్టి FRBM పరిమితిని 4 శాతానికి పెంచమని అడుగుతున్నారు. ఇది సాధ్యమే అయినా, రెండు సమస్యలు ఉన్నాయి. అప్పుతెచ్చిన నిధులను సద్వినియోగం చేసుకున్నప్పుడే అది సమర్థనీయం. సంక్షేమ పథకాలకోసం తాహతుకి మించి అప్పు తెచ్చి ఇస్తే, కిస్తీలు కట్టలేని పరిస్థితి వస్తుంది. రీపేమెంట్ ఖర్చు ఇప్పటికే బడ్జెట్లో 35 శాతానికి చేరుకుంది. కాబట్టి, అప్పు పరిమితి పెంచితే రాష్ట్రాలు ఉద్యోగుల జీతాలు కూడా ఇవ్వలేని పరిస్థితి వస్తుందని ఒక వాదన. అప్పు తెచ్చుకోకపోతే అభివృద్ధి సాధించలేని పరిస్థితి మరొక వైపు. ఈ విష వలయాన్ని ఛేదించాల్సిన అవసరం ఉంది.

ఈ సమస్యలకి కొన్ని పరిష్కారాలు కనుక్కోటం అవసరం. మొదటిగా, ఈ కేంద్ర ప్రాయోజిత నిధులను (CSS) కన్సాలిడేటెడ్ ఫండ్‌లో కలిపేసి రాష్ట్రాల భాగాన్ని పెంచాలి. రెండవది, రాష్ట్రాల మధ్య ఉన్న దామాషాలో జనాభా వెయిటేజీని తగ్గించి, రాష్ట్రాల పన్నుల రాబడి వెయిటేజీని పెంచాలి. ఈ రెంటిని మనం 16 ఆర్థిక సంఘాన్ని డిమాండ్ చెయాలి. మూడవది, ప్రస్తుతం దేశంలో 20 శాతంగా ఉన్న పన్ను – జీడీపీ నిష్పత్తిని 30 శాతానికి దశాబ్ద కాలంలో పెంచాలి. దీనికి కేంద్ర ప్రభుత్వం కార్పొరేట్ టాక్స్, ఆస్తి పన్ను, వారసత్వ పన్నులు వసూలు చెయ్యాలి. అలాగే రాష్ట్ర ప్రభుత్వాలు గృహ పన్నులను పెంచుకుని సొంత రాబడిపై దృష్టి పెట్టాలి. ప్రభుత్వ మొత్తం రాబడిని పెంచితేనే ఈ కష్టాలు, కొట్లాటలూ తేలే అవకాశం ఉంది. కనీసం ఒక దశాబ్దం టార్గెట్‌గా పెట్టుకుని దీన్ని అమలు చేయాలి.

■ ప్రొ. ఆర్.వి. రమణమూర్తి
సెంట్రల్ యూనివర్సిటీ

'పెట్టుబడి సేవ'లో సైన్స్!

'కృత్రిమ మేధ' గురించి నేను రాసిన దానిమీద, మామిడి నారాయణ గారి విమర్శ 'సిద్ధాంతం వేరూ, సైన్స్ వేరూ!' (మార్చి 1, ఆంధ్ర జ్యోతి) చూశాను. దానికి క్లుప్తంగా నా జవాబు.

(1) నా వ్యాసంలో నేను 'తడబడ్డా'నని నారాయణ అనుకున్నట్టు నేను ఎక్కడా 'తడబడ'లేదు. నా వ్యాసంలో, నేను అన్నది ఏమిటీ? "మంచి టెక్నాలజీని వద్దనడం లేదు. అది సమాజంలో మానవులందరికీ మంచిదై వుండాలి! దానిని పెట్టుబడిదారీ పద్ధతుల్లో వాడడం వల్ల, శ్రమ దోపిడీ విపరీతంగా జరుగుతున్న విషయాన్ని గుర్తించాలి" అని నేను స్పష్టంగా చెపితే, దానిలో తడబాటేముంది?

(2) 'రంగనాయకమ్మ కోణంలో చూద్దాం' అంటూ, నేను ప్రస్తావించని, చర్చించని, ఇద్దరు పెట్టుబడిదారీ ఆర్థికవేత్తల పేర్లు తీసుకొచ్చి, వాళ్ళ అభిప్రాయాల్ని అసందర్భంగా చెప్పుకొచ్చారు నారాయణ. ఉదాహరణకి, నారాయణ ప్రస్తావించిన వారిలో ఒకరైన 'సే' అనే ఫ్రాన్స్ దేశపు ఆర్థికవేత్త అవగాహన ఎంత అర్థరహితమో 'కాపిటల్'లో మార్క్సు ఏనాడో వివరించాడు. అలాంటి ఆర్థికవేత్తని, ఈ చర్చలోకి తీసుకురావడం, అతనితోనూ, ఇంకొక పెట్టుబడిదారీ ఆర్థికవేత్తతోనూ మార్క్సుని కలిపి, వారి సిద్ధాంతాలే కాకుండా, మార్క్సు సిద్ధాంతం కూడా "విఫలం" అయిందనడం, పరమ అసందర్భ వ్యాఖ్యానం!



(3) 'మార్క్సు చెప్పినట్టు, ఎక్కడా కార్మికులు తిరుగుబాటు చెయ్యలేదు'- కాబట్టి మార్క్సు సిద్ధాంతం 'విఫలం' అయిందని నారాయణ తీర్పు చెప్పేశారు! ఈ రకం వాదననే ఇంకో ఆయన కిందటి సంవత్సరం, ఇదే పత్రికలో (ఆంధ్రజ్యోతి, 3–2–24) చేస్తే, దానికి నేను ఇచ్చిన జవాబునే తిరిగి ఇక్కడ చెప్పక తప్పదు. "అవి (వర్గపోరాటాలు) జరగలేదంటే, అది మార్క్సిజంలో లోపం కాదు. వర్గ పోరాటాలు అనేవి, పగలూ–రాత్రీలా, అమావాస్యా–పౌర్ణమీలా, ప్రకృతి సహజంగా జరగవు! వర్గ పోరాటాలకోసం, శ్రామికవర్గ పార్టీలైన కమ్యూనిస్టు పార్టీలకు, మార్క్సిస్టు సిద్ధాంత గ్నానంతో, నడిచే సామర్థ్యాలు బలహీన పడి ఉండవచ్చు! అందుకే, అలా జరగలేదు."

(4) నేను నా వ్యాసంలో, ముఖ్యంగా చెప్పింది, టెక్నాలజీని లాభాల కోసం పెట్టుబడిదారీ పద్ధతుల్లో ఉపయోగించడం వల్ల, ఉద్యోగాలు పోతాయని! అంతే చెప్పాను. కానీ, నారాయణ ప్రస్తావించిన 'ఆర్థిక మాంద్యం' గురించి, నా వ్యాసంలో ఎక్కడా నేను మాట్లాడనే లేదు. కానీ, నారాయణ మాత్రం, 'కీన్స్' అనే పెట్టుబడిదారీ ఆర్థికవేత్త, ఆర్థిక మాంద్యం విషయమై చెప్పిన చిట్కాలని ప్రస్తావించారు. ఆ చిట్కాలనే, ఒక 'ప్రత్యామ్నాయ సిద్ధాంతం'గా, ప్రశంసించారు కూడా! పెట్టుబడిదారీ ఆర్థికవేత్తలు చెప్పే చిట్కాలు, ఆర్థిక మాంద్యానికి అసలు కారణమైన "అమితోత్పత్తి అనే అంటురోగాన్ని" ఎలా నయం చెయ్యలేవో, 'కాపిటల్'లో, మార్క్సు వివరంగానే రాశాడు. అవేవీ పట్టించుకోకుండా, చిట్కాలనే గొప్ప సిద్ధాంతంగా కీర్తిస్తున్నారు నారాయణ!

'కృత్రిమ మేధ వల్ల పెట్టుబడిదారులకు విపరీత లాభాలు వస్తాయనేది ఒక భ్రమ' అని మందలిస్తున్నారు నారాయణ. అదే భ్రమ అయితే, కృత్రిమ మేధ కంపెనీలు అన్నేసి లక్షల కోట్లు పెట్టుబడులు ఎందుకు పెడుతున్నాయి? ఒక పక్క విపరీత లాభాలు రావడం 'భ్రమ' అంటూనే, ఇంకో పక్క 'పెట్టుబడి పెట్టేవారు లాభం తప్పక ఆశిస్తారు' అనడం ఎందుకు? 'ఆశే లేకపోతే ప్రగతికి ఆస్కారం వుండద'ని, ఇంకో ఉవాచ! దేనిలో 'ప్రగతి'? లాభాల్లోనా ప్రగతి?

(5) 'ట్రాక్టర్ లాంటి యంత్రాల వినియోగం లేకపోతే, సగం జనాభా ఆకలితో చచ్చిపోయేవారే'- అని ఒక విచిత్ర వాదన చేశారు నారాయణ. దేశం మొత్తం మీద అన్ని రాష్ట్రాలలోనూ కలిపి, 2022 నాటికి, దాదాపు కోటి ట్రాక్టర్లున్నాయని ఒక లెక్క! పైగా ప్రతీ సంవత్సరమూ, వాటి అమ్మకాలు పెరుగుతున్నాయి కూడానట! మరి, 'ఐక్యరాజ్యసమితికి చెందిన ఆహార, వ్యవసాయ సంస్థ' గానీ, 'ప్రపంచ ఆకలి సూచిక' గానీ, ప్రపంచవ్యాప్తంగా ఆకలి చావుల గురించి ఏమి చెబుతున్నాయి? ఆకలి చావుల్లో, భారతదేశం పరిస్థితి, "సీరియస్"గా వుందని, తాజా వార్త! 'ఆకలి' సమస్యని చూడవలసింది, ఆహార ఉత్పత్తి ట్రాక్టర్లతో జరుగుతోందా, ఇంకో రకంగానా అని కాదు. ఉత్పత్తి అయిన ఆహార సరుకులు జనాభాలో ఏ వర్గాలకు, ఎంతెంత అందుతున్నాయి? ఎంతమంది కొనగలుగుతున్నారు?– అన్నవి అసలు ప్రశ్నలు!

(6) 'యాంత్రీకరణను వ్యతిరేకిస్తూ, శ్రామికులకు పనిలేదని వాపోయేవారు', ఒక విషయం చూడాలట! 'తెలంగాణా పల్లెలకు ఇతర రాష్ట్రాలనించీ వచ్చే వ్యవసాయ కూలీల్ని చూడమని' ఒక హాస్యాస్పదమైన వాదన చేశారు నారాయణ! అసలు, వ్యవసాయ కూలీలు, తమ ప్రాంతాలనించీ దూర ప్రాంతాలకు ఎందుకు వలస పోతారు? తామున్న చోట పనులు దొరకకే కదా? పైగా నారాయణ చెప్పిన రాష్ట్రాలలో, ఆయన ముచ్చటపడే ట్రాక్టర్లకు కొదవ లేదు. ఉదాహరణకి, 2022లో, జనవరికీ–జులైకీ మధ్య, ఉత్తరప్రదేశ్‌లో అమ్ముడైన ట్రాక్టర్లు 75,817. అసలు దేశం మొత్తంలోనే, ఉత్తరప్రదేశ్‌లో వున్నన్ని ట్రాక్టర్లు ఎక్కడా లేవని వ్యవసాయరంగ సమాచారం!

(7) మహారాష్ట్రలో, బారామతిలో జరుగుతున్న కృత్రిమ మేధ పరిశోధనల గురించి, చాలా పొంగిపోతూ వర్ణించారు నారాయణ. కానీ, ఆ మహారాష్ట్రలోనే 2022లో, 4,248 మంది రైతులు ఆత్మహత్యలు చేసుకున్నారు. మరి, మహారాష్ట్రలో కూడా, అనేక రకాల వ్యవసాయం పనులకు ఉపయోగించే ట్రాక్టర్లు వేల సంఖ్యలో ప్రతీ యేటా కొత్తగా అమ్ముడవుతున్నాయని లెక్కలున్నాయి.

(8) 'కృత్రిమ మేధ వల్ల పెట్టుబడిదారులకు విపరీత లాభాలు వస్తాయనేది ఒక భ్రమ' అని మందలిస్తున్నారు నారాయణ! అదే భ్రమ అయితే, కృత్రిమ మేధ కంపెనీలు, అన్నేసి లక్షల కోట్లు పెట్టుబడులు ఎందుకు పెడుతున్నాయి? ఒక పక్క విపరీత లాభాలు రావడం 'భ్రమ' అంటూనే, ఇంకో పక్క 'పెట్టుబడి పెట్టేవారు లాభం తప్పక ఆశిస్తారు' అనడం ఎందుకు? 'ఆశే లేకపోతే ప్రగతికి ఆస్కారం వుండద'ని, ఇంకో ఉవాచ! దేనిలో 'ప్రగతి'? లాభాల్లోనా ప్రగతి?

(9) 'సైన్సు ఏదో ఒక వర్గ ప్రయోజనాలకు ఉపయోగపడుతుందని భావించడం అర్థరహితం'- అంటున్నారు నారాయణ. సైన్స్ "ప్రస్తుత సమాజంలో", ఏ వర్గం చేతిలో ఆస్తిగా వుంది? సైంటిస్టులూ, ఇంజినీర్లూ వంటి మేధా శ్రామికుల్ని, పనిలో పెడుతున్నది ఏ వర్గం? ప్రస్తుత సమాజంలో, సైన్సు పెట్టుబడికి సేవచేస్తోంది. ఏ రంగంలోనైనా, పెట్టుబడి లక్ష్యం ఏమిటి? లాభార్జనే! దానికోసం ఎంతటి విధ్వంసానికైనా పాల్పడుతుంది. ఉదాహరణకి, వ్యవసాయ రంగంలో అదేమి చేస్తుందో, మార్క్సు మాటల్లో చూడండి: "పెట్టుబడిదారీ విధానం, సమస్త సంపదలకూ మూలాలైన భూమినీ, కార్మికుల్నీ సర్వనాశనం చెయ్యడం ద్వారా మాత్రమే, తన సాంకేతిక పరిగ్నానాన్నీ (టెక్నాలజీనీ) సామాజిక ఉత్పత్తిక్రమాల సమ్మేళనాన్నీ అభివృద్ధిపరుస్తుంది." ('కాపిటల్'లో, 'ఆధునిక పరిశ్రమలూ, వ్యవసాయమూ' అనే చోట).

(10) చివరిగా, ప్రస్తుత సమాజంలో, సైన్సు ఏ వర్గానికి ఉపయోగపడుతోంది– అనే విషయంలో నా అవగాహనను "అర్థరహితం"గా కొట్టిపారేసిన, నారాయణగారికి ఒక అర్థవంతమైన సలహా! మీ పేరుకింద వున్న మీ సంస్థ పేరుని, "సెంటర్ ఫర్ బెటర్ కాపిటలిస్టిక్ ఇండియా రీసెర్చ్ ఫౌండేషన్" అని మార్చుకుంటే, మీ అవగాహనకు తగ్గట్టు వుంటుంది!

• రంగనాయకమ్మ

గోర్–బోలికి రాజ్యాంగ హోదా ఏదీ?

శాస్త్ర, సాంకేతిక రంగాల్లో శరవేగంగా అభివృద్ధి చెందుతున్న మన దేశంలో మాతృభాషల మనుగడ ప్రశ్నార్థకంగా మారుతోంది. ప్రపంచీకరణ, సరళీకృత ఆర్థిక విధానాలు కూడా తోడై మాతృభాషలు కనుమరుగవక తప్పని పరిస్థితి దాపురించింది. ఆంగ్లభాష అంతర్జాతీయ భాషగా రూపాంతరం చెందడంతో ప్రపంచవ్యాప్తంగా వేల సంఖ్యలో మాతృభాషలు అంతరించిపోతున్నాయి. అంతరించిపోతున్న భాషల్లో బంజారాలు మాట్లాడే గోర్–బోలి ఒకటి. ఆంధ్ర, తెలంగాణ రాష్ట్రాల్లో తెలుగు భాషను ఆంగ్ల భాష అధిగమించినట్లు, గిరిజన భాషలను తెలుగు అధిగమిస్తోంది. లంబాడీ(బంజారా) గిరిజన భాషకు గుర్తింపు లేదు, లిపి లేదు. గిరిజనుల భాషలు మౌఖికమైనవి కావడం మూలాన నిరాదరణకు గురవుతున్నాయి.

భారత రాజ్యాంగంలోని 5, 6 షెడ్యూళ్లలో పేర్కొన్న గిరిజన రాష్ట్రాల్లో 698 తెగలకు చెందిన 10 కోట్ల మంది జనాభా ఉంది. మన దేశంలో మొత్తం 1652 భాషలుండగా, గిరిజనులు మాట్లాడే భాషలే సుమారుగా 600 దాకా ఉన్నాయి. భారత రాజ్యాంగంలో 8వ షెడ్యూల్‌లో ఇప్పటికి 22 భాషలు అధికారికంగా గుర్తింపు పొందగా, అందులో గిరిజనులు మాట్లాడే మణిపురి, డోంగ్రీ, బోడో, కొంకిణి, సంథాలీ భాషలకు మాత్రమే చోటు దక్కింది. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, మహారాష్ట్ర, కర్ణాటక, రాజస్థాన్, మధ్యప్రదేశ్ వంటి రాష్ట్రాలలోనే కాకుండా, దేశవ్యాప్తంగా దాదాపుగా 20 రాష్ట్రాలలో నివసిస్తున్న బంజారాలు, హిందీ తరువాత అత్యధికంగా తమ సంప్రదాయ భాష గోర్–బోలిను మాట్లాడుతున్నారు. కానీ అతి పెద్ద సమూహం కలిగిన లంబాడీ భాషకు రాజ్యాంగబద్ధ గుర్తింపు విషయంలో ప్రభుత్వాలు నిర్లక్ష్యాన్ని ప్రదర్శిస్తున్నాయి. బంజారాలు మాట్లాడే భాష అంతరించే దశలో ఉంది. భాష ద్వారానే బంజారాలు తమ సంస్కృతీ సాంప్రదాయాలు, ఆచారాలను కాపాడుకుంటున్నారు. కాని బంజారాలతో పాటు కొన్ని రకాల తెగల భాషలకు లిపి లేదన్న సాకుతో ఇతర భాషలను పాలకులు వారిపై రుద్దుతున్నారు.

1956లో హైదరాబాద్ రాష్ట్రం ఆంధ్రప్రదేశ్‌లో విలీనమై భాషాప్రయుక్త రాష్ట్రంగా అవతరించిన తరువాత ఆదివాసీ, గిరిజన విద్యార్థుల మీద తెలుగు రుద్దారు. ఉమ్మడి రాష్ట్ర ప్రభుత్వం పదేళ్ల క్రితం రాజీవ్ విద్యామిషన్ (ఆర్.వి.ఎం)ద్వారా బంజారా భాషలో తెలుగు లిపితో ఒకటవ తరగతి నుంచి ఐదవ తరగతి వరకు వాచకాలను ముద్రించి ప్రత్యేక పాఠశాలను నెలకొల్పి, ఆయా భాషా సంబంధ బోధకులను కూడా నియమించింది ఇలా కొంత ప్రయత్నం చేసినా, కొన్ని సాంకేతిక లోపాల వల్ల నేడు పాఠశాలలు పని చేయడం లేదు. భారత రాజ్యాంగంలోని 8వ షెడ్యూల్‌లో గోర్–బోలి భాషను చేర్చాలన్న డిమాండ్‌తో స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుంచి వివిధ రూపాల్లో పోరాడుతున్నా, సమస్య పరిష్కారం కాలేదు. బంజారా తెగ అస్తిత్వానికి గోర్–బోలి భాష కీలకమైనది. బంజారాల భాషకు రాజ్యాంగ హోదా కల్పించి, తగిన ప్రోత్సాహం అందించాలి.


– జటావత్ హనుము, రిసెర్చ్ స్కాలర్, ఉస్మానియా యూనివర్సిటీ

వ్యాసాలు, ఉత్తరాలు పంపవలసిన చిరునామా
ఎడిట్‌పేజీ, ఆంధ్రజ్యోతి, ప్లాట్–76, అశ్వినీ లే ఔట్, హుడా హైట్స్,
రోడ్ నంబరు–70, జూబ్లీహిల్స్, హైదరాబాద్–500033.
మెయిల్: editpage@andhrajyothy.com

మన కాకతీయ కొదమ సింహం!

శివాజీ పుత్రుడైన శంభాజీ చరిత్ర 'ఛావా' అనే పేరుతో సినిమా రూపంలో వచ్చింది కనుక మనకు ఆయన గొప్పతనం, త్యాగం, మరాఠీల గొప్పతనం తెలిసింది (ప్రధానంగా నేటి యువతకు). కానీ అంతకు కొన్ని వందల ఏళ్ళ ముందే గొప్ప త్యాగం చేసిన మన కాకతీయ ప్రతాపరుద్రుడి చరిత్ర అజ్ఞాతంగా పుస్తకాల్లో ఉండిపోయింది. ప్రభుత్వాలు కూడా మరిచిపోయాయి. ఇవాళ ఆ చక్రవర్తి పుట్టిన రోజు సందర్భంగానైనా ఆయన్ని తలచుకుందాం!

1303లో ప్రారంభమైన ఢిల్లీ సుల్తానుల దండయాత్రలని 1323 వరకు మొక్కవోని దీక్షతో ఎదుర్కొని వారిని దక్షిణభారతం దేశం వైపు విస్తరించనివ్వకుండా అడ్డుకున్న మహా సాహసి ప్రతాపరుద్రుడు. నాటి కాకతీయ సామ్రాజ్యం చిన్నదేమీ కాదు. దక్షిణ భారతదేశం మొత్తం వ్యాపించి ఉండేది. ఢిల్లీ సింహాసనాన్ని అధిష్ఠించి ఉన్న అల్లావుద్దీన్ ఖిల్జీ తన వట్టిపోయిన ఖజానాను నింపుకోవడం కోసం సుసంపన్న దక్షిణ భారతదేశంపై దృష్టి నిలిపాడు. అతనికి దేవగిరి రాజధానిగా కలిగిన యాదవ రాజ్యం, కాకతీయుల పరిపాలనలో ఉన్న ఓరుగల్లు కనిపించాయి. మొట్టమొదట 1295లో ఖిల్జీ దేవగిరిపై దాడి చేశాడు. ఓటమిపాలైన యాదవ రాజు రామచంద్ర దేవుడు సంధి చేసుకొని అపార ధనరాశులని ఖిల్జీకి కానుకగా సమర్పించుకున్నాడు. సామంతుడిగా మారిపోయాడు.



శివాజీ పుత్రుడైన శంభాజీ చరిత్ర 'ఛావా' అనే పేరుతో సినిమా రూపంలో వచ్చింది కనుక ఆయన గొప్పతనం, త్యాగం అందరికీ తెలిశాయి. కానీ అంతకు కొన్ని వందల ఏళ్ళ ముందే గొప్ప త్యాగం చేసిన మన కాకతీయ ప్రతాపరుద్రుడి చరిత్ర పుస్తకాల్లోనే ఉండిపోయింది. మన మట్టిలో పుట్టి, ఒకానొక మహా సామ్రాజ్యానికి చక్రవర్తిగా పట్టాభిషిక్తుడై, భారతావనిని శాసించి, మన పూర్వీకుల ఆత్మగౌరవాన్ని నిలపడానికి ప్రాణత్యాగం చేసిన మనిషిని ఏటేటా స్మరించుకోవద్దూ?

1303లో ఖిల్జీ అపార సైన్యాన్ని ఓరుగల్లు పైకి దండయాత్రకు పంపించాడు. ఖిల్జీ సైన్యం కదలికలను ప్రతాపరుద్రుడు పసిగట్టాడు. తన సైన్యంతో నేటి కరీంనగర్ జిల్లాలోని హుజురాబాద్ దగ్గర గల ఉప్పరపల్లి వద్ద ఎదురేగి మరీ ఢిల్లీ సైన్యాన్ని ఎదుర్కొన్నాడు. దేవగిరి లాగే ఎంతో సునాయాసంగా కాకతీయులను ఓడించవచ్చునన్న వెర్రి భ్రమలతో కాకతీయులపై యుద్ధానికి దిగిన ఖిల్జీకి ఉప్పరపల్లి వద్ద చేదు అనుభవం ఎదురైంది. ఉప్పరపల్లి యుద్ధభూమిలో ఖిల్జీ సైన్యం చావుదెబ్బ తిన్నది. చచ్చినవాళ్ళు చావగా మిగిలిన వాళ్ళు ఢిల్లీ వైపు పారిపోయారు. భారతదేశాన్ని పాదాక్రాంతం చేసుకున్న ఖిల్జీకి ఓటమి రుచి చూపించాడు ప్రతాపరుద్రుడు.

అల్లావుద్దీన్ ఖిల్జీకి ఎదురైన ఈ గర్వభంగాన్ని వెలుగోటి వారి వంశావళిలోను, ఆ యుద్ధంలో పాల్గొన్న పోతుగంటి మైలి, వెన్నడు, నాగదేవుని శాసనాల్లోనూ నేటికీ చూడవచ్చు. ఇలా ఒక్కసారే కాదు, ఆయన పరిపాలించిన 22 సంవత్సరాల్లో తొమ్మిదిసార్లకు పైగా ఢిల్లీ సుల్తానులు ఓరుగల్లుపై దండయాత్రలు చేశారు. అందులో సింహభాగం ప్రతాపరుద్రుడే గెలిచాడు. ఆ తొమ్మిది యుద్ధాలలో రెండు యుద్ధాల్లో మాత్రమే ఓడిపోయాడు. అవి 1309 నాటి యుద్ధం, 1323 నాటి చివరి యుద్ధం. ఈ ఓటమి కూడా శత్రువు కుయుక్తుల ఫలితమే. 1309లో సుల్తాన్ సైన్యం ఆరు నెలల పాటు పోరాడినప్పటికీ ఓరుగల్లు కోట లొంగకపోయేసరికి ఆ చుట్టుపక్కల ప్రాంతాల ప్రజల్ని పీడించి, హింసించారు. తద్వారా ప్రతాపరుద్రుడిపై మానసిక ఒత్తిడి పెంచి సంధికి అంగీకరించేలా చేశారు!

అటు తర్వాత జరిగిన అధికార మార్పిడిలో ఖిల్జీ తర్వాత ఘియాజుద్దీన్ తుగ్లక్ 1320లో ఢిల్లీ సింహాసనాన్ని అధిష్ఠించాడు. ఆ వెంటనే ఒట్టిపోయిన ఖజానాను నింపుకోవడం కోసం 1323లో ఎంతకు లొంగని ఓరుగల్లు పైకి దండెత్తాడు. ఈ యుద్ధాల గురించిన సమాచారం మనకు ఫెరిస్తా ఇసామీ, బారౌని, ఇమాన్ భతూత లాంటి ముస్లిం చరిత్రకారులు రాసిన పుస్తకాల ద్వారా తెలుసుకోవాల్సి రావడం దురదృష్టకరం. ఎందుకంటే నిజాలు రాసి సుల్తాన్లకు కోపం తెప్పించలేక వారు కాకతీయుల ఘనవిజయాల్ని మసిపూసి మారేడు కాయ చేశారు. ప్రతాపరుద్రుడి చేతిలో పలుమార్లు ఓటమిపాలైనప్పుడల్లా మాకై మేమే వెనుదిరిగామంటూ కాకమ్మ కథలు రాశారు.


చివరి యుద్ధానికి ముందు జరిగిన యుద్ధంలో తుగ్లక్ సైన్యాలు ఓటమిపాలై కాకతీయ సైన్యాలు వెంటపడి తరుముతుంటే పారిపోయి దేవగిరి చేరుకున్నాయి. అక్కడ రామచంద్ర దేవుడి దేవగిరి సైన్యాలను జత చేసుకుని కొన్ని రోజుల వ్యవధిలోనే ఓరుగల్లుపై మళ్ళీ దాడి చేశాయి. ఢిల్లీ సుల్తానులతో ప్రతి యుద్ధం మధ్యా ఎన్నో సంవత్సరాల తేడా ఉండడంతో ఢిల్లీ సైన్యాలు మళ్ళీ ఇప్పుడప్పుడే తమ మీదికి దాడికి రావని భావించిన ప్రతాపరుద్రుడు రైతులుగా ఉన్న తన సైన్యాన్ని వ్యవసాయ పనులకు, వారి సొంత ఇళ్ళకు పంపేశాడు. అతికొద్ది సైన్యం మాత్రమే ఓరుగల్లు కోటలో ఉంది. అంత తక్కువ వ్యవధిలో సుల్తాన్ మళ్ళీ దాడికి దిగుతాడని ఊహించని ప్రతాపరుద్రుడు నిరుత్తరుడయ్యాడు. వెంటనే తేరుకొని అందుబాటులో ఉన్న సైన్యాన్ని పోగేసి శత్రువుపై దాడి మొదలుపెట్టాడు. త్వరలోనే కోటలో ఆహార ధాన్యాలు పూర్తిగా అయిపోయాయి. ఆకలి బాధకు తట్టుకోలేక లెక్కకు మించి పరివారం, సైనికులు పిట్టల్లా రాలిపోసాగారు. మరోపక్క కోట ఎంతకూ లొంగకపోయేసరికి ఢిల్లీ సుల్తాన్ సైన్యాలు అసహనానికి లోనై కోట బయట గల పరిసర ప్రాంత ప్రజల ధన ధాన్యాలు దోచుకుంటూ, ఇండ్లను తగలబెడుతూ, స్త్రీలను చెరబట్టడం మొదలుపెట్టారు. ఎటు చూసినా అసహాయ ఆర్తనాదాలు, ఆకాశాన్నంటే మంటలతో తగలబడుతున్న గ్రామాలు, కూలిపోతున్న గుళ్లు, యుద్ధంతో సంబంధంలేని నిర్దోషులైన ప్రజలు సైతం శత్రువుల చేతుల్లో హతమారిపోతున్నారు! వేగుల ద్వారా ఈ విషయాల్ని విన్న ప్రతాపరుద్రుడు తట్టుకోలేకపోయాడు. మరిన్ని నెలలు పోరాడే సత్తువ ఉన్నప్పటికీ తన ప్రజల దయనీయ స్థితికి చలించి తన పరివారంతో వెళ్ళి తుగ్లక్ సైన్యాధిపతి ఉలుగ్ ఖాన్ ముందు లొంగిపోయాడు.

తనను పలుమార్లు ఓడించిన ఆ ధిక్కార కణం తన ముందు తలవంచితే చూడాలని అక్కడ ఢిల్లీ సుల్తాన్ ఎదురుచూస్తున్నాడు. కానీ తన ప్రజల మానాభిమానాలకు ప్రతీక అయిన ప్రతాపరుద్రుడు ఢిల్లీకి వెళ్లే మార్గ మధ్యంలో నర్మదా నది తీరం వద్ద ఆత్మార్పణ గావించుకొని సుల్తాన్ కలల్ని కల్లలు చేశాడు. తన ఆత్మార్పణ తన ప్రజల్లో ఆగ్రహావేశాలను రగిలిస్తుందని, వారందరినీ ఏకం చేసి శత్రువును మట్టికరిపిస్తుందని, అత్యంత ఉన్నత స్థాయి నిరసన ఐన ఆత్మత్యాగాన్ని ఎంచుకున్నాడు. ఇచ్ఛా మరణాన్ని ఆహ్వానించాడు. ఆయన ఆశించినట్లుగానే అటు తర్వాత ఆయన సేనా నాయకులైన కొలని రుద్రదేవుడు, రేచర్ల సింగమనేడు, బెండపూడి అన్నయ మంత్రి వీరు ముగ్గురు, కాకతీయుల 72 మంది సామంతులలో ఒకరైన రేఖపల్లి సంస్థానాధీశుడైన ముసునూరి ప్రోలయ నాయకుడి నాయకత్వంలో ప్రజలతో కలిసి తిరుగుబాటు చేశారు. 1336లో ఢిల్లీ సుల్తాన్ల సైన్యాన్ని ఓడించి వారిని తరిమికొట్టి తిరిగి ఓరుగల్లు కోటపై స్వరాజ్య పతాకాన్ని ఎగరవేశారు.

వీర శివాజీకి మహారాష్ట్ర ప్రజల్లోను, మహారాణా ప్రతాప్‌కు రాజస్థాన్ ప్రజల్లోను ఒక పదిలమైన స్థానం ఉంది. కానీ మన ప్రతాపరుద్రుడి విషయంలో ఆ స్థానాన్ని కల్పించడంలో మన ప్రభుత్వాలు విఫలమైనాయి! ఆయన 1254వ సంవత్సరం మార్చి 25న జన్మించాడు ఆ రోజును ప్రతి ఏటా ఒక ఉత్సవంలాగా జరుపుకుంటే ఆ మహనీయుడి త్యాగాన్ని గౌరవించినట్లు అవుతుంది. మన మట్టిలో పుట్టి, ఒకానొక మహా సామ్రాజ్యానికి చక్రవర్తిగా పట్టాభిషిక్తుడై, భారతావనిని శాసించి, మన పూర్వీకుల ఆత్మగౌరవాన్ని నిలపడానికి ప్రాణత్యాగం చేసిన మనిషిని ఏటేటా స్మరించుకోవద్దూ!

◆ డా. అంబటి శ్రీనివాస్‌రాజు

(నేడు ప్రతాపరుద్రుడి జయంతి)



'ఆంధ్రజ్యోతి' 22వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని ముద్రితమైన కూపన్లను డ్రా తీసే కార్యక్రమం సోమవారం జరిగింది. గన్నవరం మండలం వెదురుపావులూరులోని విజయవాడ యూనిట్ కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎన్టీఆర్ జిల్లా పోలీస్ కమిషనర్ ఎస్వీ రాజశేఖరబాబు విచ్చేసి కూపన్ల డ్రా తీశారు. మొదటి ముగ్గురు విజేతలకు ఆయనే స్వయంగా ఫోన్‌చేసి అభినందనలు తెలిపారు. ఆంధ్రజ్యోతి విజయవాడ యూనిట్ మేనేజర్ వేమూరి మురళీకృష్ణ, ఏపీ సెంట్రల్ డెస్క్ ఇన్‌చార్జి టి.సురేష్, ఏజీఎం (యాడ్స్) తోటకూర రామకృష్ణ, ఏజీఎం (సర్క్యులేషన్) శ్రీనివాసులు, పలువురు ఏజెంట్లు పాల్గొన్నారు.



వివరాలు 6లో..





క్షయ నివారణకు కలిసికట్టుగా..

ప్రపంచ క్షయవ్యాధి నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకుని క్షయవ్యాధి నివారణ సంస్థ ఆధ్వర్యంలో నగరంలోని పాత ప్రభుత్వాసుపత్రి వద్ద సోమవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. జిల్లా క్షయవ్యాధి నివారణాధికారి డాక్టర్ జె.ఉషారాణి, డీఎంహెచ్‌వో డాక్టర్ ఎం.సుహాసిని, ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఏ.వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

జూన్ నాటికి.. జలజల


ఏ.కొండూరు దాహం కేకలు త్వరలో తీరనున్నాయి. కిడ్నీ మరణాలకు చెక్‌పెట్టే కీలకమైన కృష్ణాజలాలు జూన్ నాటికి ఏ.కొండూరు మండల ప్రజలకు అందనున్నాయి. జలజీవన్ మిషన్ పథకంలో భాగంగా రక్షిత మంచినీటి సరఫరా పనులు చకచకా జరుగుతుండటంతో దశాబ్దకాలంగా మంచినీరు కోసం ఎదురుచూస్తున్న వారి కళ్లల్లో ఆనందం కనిపిస్తోంది.

వేగంగా ఏ.కొండూరు రక్షిత మంచినీటి సరఫరా పనులు

చాలావరకు పూర్తయిన ఓవర్ హెడ్ ట్యాంక్ నిర్మాణాలు

- కలెక్టర్ లక్ష్మీశ ప్రత్యేక చొరవతో పనుల్లో కదలిక
- 103 కిలోమీటర్లకు గానూ 101 కిలోమీటర్లు పూర్తి
- తాగునీటి స్వచ్ఛతకు ఎన్టీటీపీఎస్ బూడిద విఘాతం
- ఇబ్రహీంపట్నం వద్ద ఫిల్టర్ బెడ్స్‌లోకి చేరుతున్న బూడిద
- ఏ.కొండూరు తండాల్లో వెల్లువెత్తుతున్న ఆనందం

(ఆంధ్రజ్యోతి, ఇబ్రహీంపట్నం) : ఏ.కొండూరు మండల ప్రజలకు ఎప్పటినుంచో బోర్ల నీరే దిక్కు. దాహం తీరుతుందని అనుకుని తాగేవారే కానీ, ఆ నీరే తమ కిడ్నీలను నాశనం చేస్తుందని గుర్తించలేకపోయారు. మృత్యువుకు దగ్గరవుతున్నామని గ్రహించలేకపోయారు. ఒక్కొక్కరుగా కిడ్నీ వ్యాధి బారినపడటం, మంచం పట్టి మరణించడంతో వారు తాగుతున్నది నీరు కాదు.. విషమని తెలుసుకున్నారు. ఆ తర్వాత వరుస మరణాలు, ప్రజా సంఘాల పోరాటాల ఫలితంగా ప్రభుత్వంలో చలనం వచ్చింది. కిడ్నీ ప్రభావిత ప్రాంతాల్లో ట్యాంకర్ల ద్వారా కృష్ణాజలాలను సరఫరా చేయడం ప్రారంభించారు. ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపేందుకు కిడ్నీ ప్రభావిత గ్రామాలకు స్వచ్ఛమైన కృష్ణాజలాల సరఫరాకు నడుం బిగించారు. తిరువూరు నియోజకవర్గం, ఏ.కొండూరు మండలంలోని కిడ్నీ ప్రభావిత గ్రామాలకు స్వచ్ఛమైన తాగునీటిని జలజీవన్ మిషన్ పథకం కింద అందించేందుకు చర్యలు చేపట్టారు. జూన్ నాటికి ప్రతి ఇంటికీ ఈ జలాలను అందించేలా పనులు చురుగ్గా సాగుతున్నాయి.



కుదప వద్ద పూర్తయిన ఓవర్ హెడ్ ట్యాంక్, నిర్మాణంలో సంప్



జి.కొండూరులో పైపులైన్ సామర్థ్యం పెంపు పనులు

చకచకా..

ఈ ప్రాజెక్టుపై కలెక్టర్ లక్ష్మీశ ప్రత్యేక దృష్టి పెట్టారు. జలజీవన్ మిషన్ కింద రూ.50 కోట్ల నిధులతో ఏ.కొండూరు మండలంలోని మొత్తం 38 గ్రామాలకు కృష్ణా జలాలను అందించనున్నారు. ఇబ్రహీంపట్నం ఫిల్టర్ బెడ్ నుంచి శుద్ధిచేసిన కృష్ణా జలాలు రెడ్డిగూడెం మండలం కుదప వద్ద ఉన్న సంప్ వరకు వెళ్తున్నాయి. అక్కడి నుంచి సుమారు 103 కిలో మీటర్ల మేర పైపులైన్ పనులు ప్రారంభించారు. ఇప్పటి వరకు 101 కిలోమీటర్ల వరకు పనులు పూర్తయ్యాయి. కుదప-కృష్ణారావుపాలెం మధ్య ఉన్న ఫారెస్టులో కిలోమీటర్ వరకూ పైపులైన్ పనులు చేపట్టాల్సి ఉంది. ఫారెస్టు నుంచి అనుమతి రాగానే, ఆ పనులు ప్రారంభిస్తామని ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు చెప్పారు. కుదప వద్ద కొండపై ఓవర్ హెడ్ ట్యాంక్ నిర్మాణం పూర్తయ్యింది. అక్కడ ప్రస్తుతం పంప్‌హౌస్ కోసం ఒక క్వార్టర్ పనులు పూర్తి చేస్తున్నారు. ఏ.కొండూరు మిగతా 6లో..

అమెరికాలో గుడివాడవాసి ఆత్మహత్య

పదేళ్ల కిందట అమెరికాకు..

- కష్టపడి చదివి.. ఉద్యోగంలో స్థిరపడి..
- అకస్మాత్తుగా బలవన్మరణం



కొల్లి అభిషేక్ (ఫైల్)

గుడివాడ, మార్చి 24 (ఆంధ్రజ్యోతి) : జిల్లాకు చెందిన యువకుడు సోమవారం అమెరికాలో ఆత్మహత్య చేసుకున్నాడు. గుడివాడ మండలం దొండపాడు గ్రామానికి చెందిన కొల్లి శ్రీనివాసరావు, లక్ష్మీశేషుకుమారికి కవల పిల్లలు. శ్రీనివాసరావు గుడివాడలో ఓ ప్రైవేట్ ఉద్యోగం చేస్తున్నారు. కుమారులు కొల్లి అరవింద్, అభిషేక్ చిన్నప్పటి నుంచి కష్టపడి చదివేవారు. దీంతో మధ్యతరగతి కుటుంబమైనా శ్రీనివాసరావు పిల్లలిద్దరినీ చదివించారు. అప్పులుచేసి మరీ చిన్న కుమారుడు అభిషేక్‌ను పదేళ్ల కిందట ఎంఎస్ చదివేందుకు అమెరికా పంపారు. మాస్టర్స్ డిగ్రీ పూర్తిచేసి అమెరికాలోనే మంచి ఉద్యోగం సంపాదించాడు. అమెరికాలో స్థిరపడిన భారత సంతతి అమ్మాయితో ఏడాది క్రితం కులాంతర వివాహమైంది. వారి కష్టానికి ఫలితంగా ఇద్దరూ ఉద్యోగాలు సాధించారు. తల్లిదండ్రులకు చేదోడుగా నిలిచారు. వివాహాలు కూడా కావడంతో కుటుంబమంతా ఆనందంగా ఉన్నారు. ఈ నేపథ్యంలో పెద్ద కుమారుడు అరవింద్‌కు భార్యతో మనస్పర్థలు ఏర్పడ్డాయి. ఈ సమయంలో అన్నకు తమ్ముడు అభిషేక్ అండగా నిలిచాడు. తనతో పాటు అమెరికా తీసుకెళ్లి మంచి ఉద్యోగం కల్పించాడు. ఎంతో బాధ్యతగా, కలివిడిగా ఉండే అభిషేక్ ఒక్కసారిగా ఆత్మహత్య చేసుకోవడం అందరినీ విస్మయానికి గురిచేసింది. అయితే, అభిషేక్ ఆత్మహత్యకు కారణాలు తెలియరాలేదు. అమెరికా నుంచి దర్జాగా వస్తాడనుకున్న కొడుకు శవమై వస్తుండటంతో ఆ తల్లిదండ్రులు కన్నీరుమున్నీరవుతున్నారు.

మందుల మాయ

ఉమ్మడి కృష్ణాలో విచ్చలవిడిగా నకిలీ మందుల మాఫియా

ఉత్తరాదిలో తయారు.. నగరానికి సరఫరా

- ఓ మాజీమంత్రి అనుచరుడి ఆధ్వర్యంలో వ్యాపారం
- మందుల షాపుల్లో లెక్కకుమించిన సరుకు
- నిషా కలిగించే మందులు యువతకు విక్రయం
- తెలియక బానిసలవుతున్న అమాయకులు
- అమ్మిన మందులకు కనిపించని బిల్లులు



నిత్యం అనేక రకాల రోగాలకు, రుగ్మతలకు మనం వాడుతున్న మందులు మంచివేనా? 'ఆపరేషన్ గరుడ'లో భాగంగా మందుల షాపుల్లో సోదాలు నిర్వహించిన ఔషధ నియంత్రణ మండలి అధికారులు అనేక రకాల నకిలీ మందులను గుర్తించారు. ఉత్తరాదిలో గుట్టుచప్పుడు కాకుండా తయారవుతున్న నకిలీ మందులను ఓ మాజీమంత్రి అనుచరుడి కనుసన్నల్లో బెజవాడకు తెప్పించి విక్రయాలు జరుపుతూ ప్రజల ఆరోగ్యంతో ఆటలాడుతున్నారు.

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : ఉమ్మడి కృష్ణా, గుంటూరు జిల్లాలకు మందులను సరఫరా చేసే ఏజెన్సీలు విజయవాడలో కేంద్రీకృతమై ఉన్నాయి. రెండు జిల్లాల్లో మందుల షాపులను నిర్వహిస్తున్న యజమానులు ఇక్కడి నుంచి సరుకును తీసుకెళ్తుంటారు. ఇలా మందులను సరఫరా చేస్తున్న కొంతమంది బ్రాండెడ్ కంపెనీల పేర్లను పోలి ఉన్న నకిలీ మందులను రప్పించుకుంటున్నారు. ఉత్తరాది రాష్ట్రాల్లో ఇబ్బడిముబ్బడిగా తయారవుతున్న నకిలీ మందులను విజయవాడకు రప్పించుకుని షాపులకు సరఫరా చేస్తున్నారు. ఈ నకిలీ మందుల్లో నార్కోటిక్ సైకోట్రోఫిక్ మందులు ఉంటున్నాయని ఆరోపణలు బలంగా ఉన్నాయి. ఎన్ఆర్ఎక్స్ మందుల్లో మొత్తం 41 రకాలు ఉన్నాయని ఔషధ నియంత్రణ మండలి అధికారులు చెబుతున్నారు. వాటిలో సగం వరకు నకిలీ మందులు మార్కెట్‌లో చెలామణి అవుతున్నాయని ప్రచారం జరుగుతోంది. ఇలా ఉత్తరాది రాష్ట్రాల నుంచి వచ్చిన నకిలీ మందుల గుట్టును ఇంతకుముందు ఔషధ నియంత్రణ మండలి అధికారులు, విజయవాడ పోలీసులు సంయుక్తంగా ఛేదించారు. అల్ప్రాసెట్ మందు బిళ్లల అమ్మకాలు తగ్గిపోతుండటంతో జాన్సన్ అండ్ జాన్సన్ కంపెనీ పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ పేరుతో నకిలీ మందుల అమ్మకాలు మిగతా 6లో..

కొండపల్లి బుజ్జి అరెస్టుకు రంగంసిద్ధం?

నిషేధిత మందుల విక్రయాల్లో కీలక పాత్రధారి

- కరోనా సమయంలో మందుల అక్రమ వ్యాపారం
- తాజాగా అవనిగడ్డలో నిషేధిత మందుల కేసులోనూ హస్తం
- మాజీమంత్రి వెలంపల్లి శ్రీనివాస్‌కు ముఖ్య అనుచరుడు
- కేసు నుంచి తప్పించుకునేందుకు విఫల యత్నాలు



6లో

27న ముస్లింలకు ఇఫ్తార్ విందు

- నగరంలోని ఏ కన్వెన్షన్‌లో ఏర్పాట్లు
- హాజరుకానున్న ముఖ్యమంత్రి చంద్రబాబు

8లో

రంజాన్ వేళలు

ఇఫ్తార్ : 06-19 (మంగళవారం సాయంత్రం)
సహర్ : 04-56 (బుధవారం ఉదయం)

నిర్యాణం



26-12-1944 — 24-03-2025

శ్రీ ఆలపాటి సత్యనారాయణ మూర్తి గారు
ఛైర్మన్ & మేనేజింగ్ డైరెక్టర్
ది విజయవాడ బాట్లింగ్ కంపెనీ లిమిటెడ్

ది. 24-03-2025, సోమవారం స్వర్గస్తులైనారని తెలియచేయుటకు చింతిస్తున్నాము.
వారి అంతిమయాత్ర ది. 25-03-2025, మంగళవారం మ. 3.00 గం.లకు విజయవాడ, సూర్యారావుపేట, నరసింహారావు నాయుడు వీధి, స్వర్ణ టవర్స్ నందలి వారి స్వగృహము నుండి బయలుదేరును.
కావున తెలియపరచడమైనది.

భార్య : ఆలపాటి శోభాకుమారి

కుమార్తెలు - అల్లుళ్ళు
చక్కా పుష్పలత - సి డి వి సుబ్బారావు
ఛైర్మన్ & మేనేజింగ్ డైరెక్టర్ - ప్రకాష్‌ఆర్ట్స్
బూరగడ్డ మంజులత - బి. వెంకటేశ్వర కుమార్

✆ 9246477890

గన్నవరం రైతులకు రాజధానిలో 227 ప్లాట్లు

- విమానాశ్రయం అభివృద్ధికి భూములిచ్చిన 99 మంది రైతుల హాజరు
- సీఆర్‌డీఏ కార్యాలయంలో ఈ-లాటరీ

8లో

అయ్యో పాపం


- భర్తతో గొడవపడి నాలుగేళ్ల చిన్నారితో ఓ తల్లి ఆత్మహత్యాయత్నం

పాప మృతి.. క్షేమంగా బయటపడిన తల్లి



శ్రావణి (ఫైల్)

వత్సవాయి, మార్చి 24 (ఆంధ్రజ్యోతి) : భార్యాభర్తల మధ్య గొడవ ఓ పసిప్రాణాన్ని చిదిమేసింది. భర్తతో గొడవపడిన భార్య తన నాలుగేళ్ల చిన్నారితో బావిలో దూకగా, చిన్నారి మిగతా 6లో..



శ్రీ వేంకటేశ్వర స్వామి వారి దేవస్థానము

ద్వారకా తిరుమల (చిన్న తిరుపతి), ఏలూరు జిల్లా-534426, ఫోన్: 08829 - 271427
Website: www.dwarakatirumala.org, e-mail: endow-eodtiru-ap

ఆర్.సి.నెం. సి2/69/2024, ది:23-03-2025 బహిరంగ వేలం ప్రకటన

శ్రీ వెంకటేశ్వర స్వామి వారి దేవస్థానము, ద్వారకాతిరుమల, ఏలూరు జిల్లా శ్రీ స్వామి వారి దేవస్థానము మరియు శ్రీ స్వామి వారి దత్తత దేవాలయమైన శ్రీ కోదండ రామాలయము, కొత్త నాగులూరు, శ్రీ వెంకటేశ్వర స్వామి వారి దేవస్థానం, మైలవరం నకు చెందిన ఈ క్రింది పట్టిక నందు పేర్కొన్న భూములకు అప్పగించిన తేది నుండి 3 సంవత్సర కాలపరిమితికి కౌలు ప్రాతిపదికన సాగు చేసుకొను హక్కునకు ది:03-04-2025 న & 04-04-2025 న బహిరంగ వేలము నిర్వహించబడును.

వ. నెం.	భూమి ఉన్న గ్రామం, మండలం	సర్వే నెం. / విస్తీర్ణం	కాలపరిమితి	ప్రథమ ధరావత్తు	బహిరంగ వేలం నిర్వహించు ప్రదేశం, తేది
1	రామన్నగూడెం గ్రామం, ద్వారకాతిరుమల మండలం, ఏలూరు జిల్లా	సర్వే నెం.109, 0.73 సెంట్లు	అప్పగించిన తేది నుండి 3 సం॥లు	రూ.5,000/-	శ్రీ వేంకటేశ్వర స్వామి వారి దేవస్థానం, ద్వారకాతిరుమల ది:3-4-2025 ఉ॥ గం॥ 10:30 నిII లకు
2	కొత్త నాగులూరు గ్రామం, మైలవరం మండలం, యన్‌టిఆర్ జిల్లా	సర్వే నెం.232, 202, 199/1, యం॥ 0.07 సెంట్లు	అప్పగించిన తేది నుండి 3 సం॥లు	రూ.20,000/-	శ్రీ వేంకటేశ్వర స్వామి వారి దేవస్థానం, మైలవరం ది:4-4-2025 ఉ॥ గం॥ 10:30 ని॥లకు
3	పొందుగల గ్రామం, మైలవరం మండలం, యన్‌టిఆర్ జిల్లా	సర్వే నెం.472-2, 12.82 సెంట్లు	అప్పగించిన తేది నుండి 3 సం॥లు	రూ.25,000/-	
		సర్వే నెం.317-1 4.00 సెంట్లు		రూ.10,000/-	

గమనిక: ఇతర వివరముల కొరకు ఈ కార్యాలయం పనివేళల వేళలో ఫోన్: 08829-271427 ను సంప్రదించగలరు.

శ్రీ యస్.వి. సుధాకరరావు
అధ్యక్షులు మరియు వ్యవస్థాపక ధర్మకర్త

సం/- యన్.వి.యస్.యన్. మూర్తి
కార్యనిర్వహణాధికారి



బడ్జెట్ ప్రతులను ఎమ్మెల్యే తాతయ్య, చైర్మన్ రాఘవేంద్రకు అందజేస్తున్న కమిషనర్ రామ్మోహన్

దస్త్రాలపై సంతకాలకు కమీషన్లా..!

- అధికారుల తీరుపై కౌన్సిలర్ల ఆగ్రహం
- వాడి వేడిగా జగ్గయ్యపేట కౌన్సిల్ సమావేశం

జగ్గయ్యపేట, మార్చి 24 (ఆంధ్రజ్యోతి) : అధికారుల తీరుపై కౌన్సిల్ సమావేశంలో పాలక, ప్రతిపక్ష సభ్యులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. సోమవారం జగ్గయ్యపేట కౌన్సిల్ సాధారణ సమావేశం మునిసిపల్ చైర్మన్ రంగాపురం రాఘవేంద్ర అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా వైస్‌చైర్మన్ తుమ్మల ప్రభాకర్ మాట్లాడుతూ, 2022 నుంచి పురపాలకసంఘంలో చేసిన పనులకు బిల్లులు రాక కాంట్రాక్టర్లు ప్రదక్షిణలు చేస్తున్నారని, గత ఇంజనీరింగ్ విభాగం డీఈ, ఏఈల వైఖరి వల్ల పనులు చేయాలంటే కాంట్రాక్టర్లు భయపడిపోతున్నారని దుయ్యబట్టారు. ఈ సందర్భంగా చైర్మన్ రాఘవేంద్ర మాట్లాడుతూ, గతంలో పనిచేసి రిటైరైన తాజా మాజీ కమిషనర్ దస్త్రాలపై సంతకాలు చేయాలంటే 5శాతం కమీషన్ చెల్లించాల్సిందేనని బెదిరిస్తున్న విషయం తన దృష్టికి వచ్చిందని చెప్పారు. గత ఏఈ, డీఈలకు ఆఖరి పేస్లిప్ ఇవ్వకుండా ఆపేశామని, ఇక్కడ నుంచి బదిలీపై వెళ్లినా వారికి జీతాలు రావని చెప్పారు. తాజా మాజీ కమిషనర్‌కు పదవీ విరమణ సదుపాయాలకు క్లియరెన్స్ ఇవ్వలేదని చైర్మన్ చెప్పారు. అనంతరం 2024-2025 సంవత్సరం రూ.2,59,94,249 లోటుతో సవరించిన బడ్జెట్‌కు కౌన్సిల్ ఆమోదం తెలిపింది.

నేడు బెజవాడ కౌన్సిల్ సమావేశం

కార్పొరేషన్, మార్చి 24(ఆంధ్రజ్యోతి) : విజయవాడ నగరపాలక సంస్థ సాధారణ సర్వసభ్య సమావేశం మంగళవారం జరగనుంది. సమావేశంలో ఎజెండాలో పొందుపరచిన 225 అంశాలపై చర్చించనున్నారు. ముఖ్యంగా ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియం ఆధునీకరణ బాధ్యతలు శాప్‌కు అప్పగించాలని, సెంట్రల్ నియోజకవర్గంలో పలు అభివృద్ధి పనులు, ఇటీవల తీసుకున్న సుమారు 55 మంది కార్మికుల జీతాలు, 11 ప్రత్యేక కమిటీలు తదితర అంశాలపై వాడివేడిగా సమావేశం జరగనుంది.

గురుకుల ప్రవేశ పరీక్ష వాయిదా

జి.కొండూరు, మార్చి 24 (ఆంధ్రజ్యోతి) : డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో 5, ఫస్ట్ ఇంటర్‌లో ప్రవేశానికి పరీక్ష ఏప్రిల్ 6న నిర్వహించాల్సి ఉండగా అనివార్య కారణాల వల్ల తేదీని ఏప్రిల్ 13కు మార్పు చేసినట్టు ప్రిన్సిపల్ కనపర్తి విజయలక్ష్మి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యార్థులు ఈ మార్పును గమనించాలని ఆమె కోరారు. ఏప్రిల్ 13న ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ఐదో తరగతి, మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు ఇంటర్ ఫస్ట్ ఇయర్ వారికి ప్రవేశ పరీక్ష ఉంటుందన్నారు.

కేజీబీవీ పాఠశాలలో..

రెడ్డిగూడెం : కేజీబీవీ రంగాపురం బాలికా విద్యాలయంలో 6వ తరగతి, ఇంటర్ ప్రథమ ఏడాది ప్రవేశాలకు, 7, 8, 9 తరగతుల్లో మిగిలిన సీట్ల భర్తీకి దరఖాస్తు చేసుకోవాలని ఎం.శ్యామల సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఏప్రిల్ 11లోగా దరఖాస్తు చేసుకోవాలని ఆమె కోరారు. వివరాలకు 7416676311, 9701028748 నెంబర్లలో సంప్రదించాలన్నారు.

చైర్‌పర్సన్ ఎన్నిక గందరగోళం!

తిరువూరు, మార్చి 24 (ఆంధ్రజ్యోతి) : తిరువూరు మున్సిపాలిటీలో అవిశ్వాసం అంశాన్ని వైసీపీ పెద్దలు ఒక కొలిక్కి తీసుకువచ్చినా.. చైర్‌పర్సన్ ఎన్నికలో సాంకేతికపరమైన అంశాలు, సభ్యుల్ని ఆందోళనకు గురిచేస్తున్నాయి. సోమవారం పార్టీ పెద్దల సూచనతో ప్రస్తుత చైర్‌పర్సన్ గత్తం కస్తూరిబాయి తన రాజీనామా పత్రాన్ని నియోజకవర్గ ఇన్‌చార్జి నల్లగట్ల స్వామిదాసుకు సభ్యుల ద్వారా పంపించారు. ముందుగా పార్టీకి తెలియజెసేందుకే రాజీనామా పత్రాన్ని ఇన్‌చార్జికి అందజేసినట్టు కౌన్సిలర్లు తెలిపారు. చైర్‌పర్సన్ ఎన్నిక నిబంధనలు కొందరు కౌన్సిలర్లను గందరగోళానికి గురిచేస్తున్నాయి. నిబంధనల ప్రకారం చైర్‌పర్సన్ రాజీనామా పత్రాన్ని మున్సిపల్ కమిషనర్‌కు స్వయంగా అందజేయాలి. దానిని ఎన్నికల కమిషన్‌కు పంపిస్తారు. తదుపరి అధికారులు విచారణ చేసి నోటీఫికేషన్ జారీచేస్తారు, అప్పటివరకు వైస్‌చైర్‌పర్సన్ ఇన్‌చార్జిగా వ్యవహరిస్తారు.

అయ్యో పాపం

(5వ పేజీ తరువాయి)

మృతిచెందగా, తల్లి ప్రాణాలతో బయటపడింది. వివరాల్లోకి వెళితే.. వత్సవాయి మండలం కన్నెవీడు గ్రామానికి చెందిన కొత్తపల్లి లక్ష్మీనారాయణకు నందిగామ మండలం మున్నాళ్ల గ్రామానికి చెందిన లక్ష్మితో పదేళ్ల కిందట వివాహమైంది. వీరికి నాలుగేళ్ల పాప ఉంది. లక్ష్మీనారాయణ పశ్చిమ గోదావరి జిల్లా చింతలపూడి గ్రామంలో ఓ ప్రైవేట్ ఉద్యోగం చేస్తున్నాడు. స్వగ్రామం కన్నెవీడులో ఉన్న తన తల్లిదండ్రులను చూసేందుకు భార్య, కూతురుతో కలిసి శనివారం వచ్చాడు. భార్యాభర్తల మధ్య స్వల్ప విషయంపై ఆదివారం రాత్రి వివాదం చోటు చేసుకుంది. మనస్తాపానికి గురైన లక్ష్మి పాపతో కలిసి ఊరి బయట ఉన్న బావిలో దూకేసింది. కొందరు యువకులు వారిని రక్షించే ప్రయత్నం చేశారు. అప్పటికే చిన్నారి మృతిచెందగా, లక్ష్మి ప్రాణాలతో బయటపడింది.

పాఠకులకు 'ఆంధ్రజ్యోతి' సేవలు భేష్

- విజయవాడ నగర పోలీసు కమిషనర్ రాజశేఖరబాబు

విజయవాడ యూనిట్ లక్కీడ్రాలో విజేతల ఎంపిక

గుణదల, మార్చి 24 (ఆంధ్రజ్యోతి) : సమాజంలో మారుతున్న రాజకీయ, సాంస్కృతిక పరిణామాలను ఎప్పటికప్పుడు ప్రజలకు చేరువ చేయడంతో పాటు ప్రభుత్వానికి, ప్రజలకు వారధిగా నిలుస్తున్న 'ఆంధ్రజ్యోతి' యాజమాన్యం పాఠకులకు మరింత చేరువయ్యేలా చేస్తున్న సేవలు అభినందనీయమని ఎన్టీఆర్ జిల్లా పోలీస్ కమిషనర్ ఎస్వీ రాజశేఖరబాబు అన్నారు. 'ఆంధ్రజ్యోతి' 23వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని పాఠకులకు లక్కీడ్రా కార్యక్రమం విజయవాడ యూనిట్ ఆఫీసులో సోమవారం జరిగింది. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా రాజశేఖరబాబు హాజరయ్యారు. లక్కీడ్రాలో పెనమలూరు మండలం గోసాల గ్రామానికి చెందిన పోలవరపు రామ కోటేశ్వరమ్మ ప్రథమ బహుమతిని గెలుచుకుంది. రెండవ బహుమతి విజేత గుడివాడకు చెందిన జంధ్యవరపు కృష్ణమూర్తి, మూడో బహుమతి విజేతగా విజయవాడ సీతారామపురానికి చెందిన వీవీ చంద్రశేఖర్ ఎంపికయ్యారు. విజేతలకు నేరుగా పోలీస్ కమిషనర్ ఫోన్‌చేసి వారికి అభినందనలు తెలియజేశారు. ప్రతిఏటా వార్షికోత్సవాన్ని నిర్వహించి రాష్ట్ర వ్యాప్తంగా బహుమతులు అందజేయడం గర్వించదగిన విషయమన్నారు. కార్యక్రమంలో 'ఆంధ్రజ్యోతి' ఏపీ సెంట్రల్ డెస్క్ ఇన్‌చార్జి సురేష్, బ్రాంచి మేనేజర్ వేమూరి మురళీకృష్ణ, సర్క్యులేషన్ ఏజీఎం వాసు, యాడ్స్ మేనేజర్ తోటకూర రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

మొదటి బహుమతి విజేత
పోలవరపు రామ కోటేశ్వరమ్మ
గోసాల, పెనమలూరు మండలం

రెండో బహుమతి
జంధ్యవరపు కృష్ణమూర్తి
గుడివాడటౌన్, కృష్ణాజిల్లా

మూడో బహుమతి
వీవీ చంద్రశేఖర్
సీతారాంపురం, విజయవాడ



లక్కీ డ్రా కూపన్లు కలుపుతున్న సీపీ రాజశేఖరబాబు, తదితరులు

కన్సోలేషన్ బహుమతులు

1. పువ్వాడ వెంకట సుబ్రహ్మణ్య సత్యనారాయణ	కూచిపూడి, మొవ్వ మండలం
2. మండవల్లి వనజ	పరాసపేట, మచిలీపట్నం
3. మండపాక సుబ్బారావు	పామర్రు, పామర్రు మండలం
4. ఘంటా గణేష్‌బాబు	ప్రసాదంపాడు, విజయవాడ రూరల్
5. ఉప్పలపు సాయి శరత్	విద్యాధరపురం, విజయవాడ
6. కె.కమల కుమారి	సత్యనారాయణపురం, విజయవాడ
7. అబ్దుల్ ఆరిఫ్ ఉన్నీసా	అజిత్ సింగ్‌నగర్, విజయవాడ
8. కేశిరెడ్డి కృష్ణారావు	సుందరయ్యనగర్, తాడేపల్లి
9. సుంకేత మల్లారెడ్డి	భవానీపురం, విజయవాడ
10. చిరుమామిళ్ల అనూరాధ	నందిగామ మండలం
11. కె.వెంకట నాగేశ్వరరావు	గంపలగూడెం మండలం
12. చిన్ని మస్తాన్ శివశ్రీనివాసరావు	కబేళా, విజయవాడ
13. గురిజాల మౌనిక	కూరపరాజుపర్వ, రెడ్డిగూడెం
14. వసంత మురళి	నందిగామ మండలం
15. మామిళ్లపల్లి సాంబమూర్తి	పెనమలూరు
16. కొంపెల్ల చిన సత్యన్నారాయణ	పాయకాపురం, విజయవాడ
17. ఎ.వాణిశ్రీ	రామచంద్రానగర్, విజయవాడ
18. కోడూరి రత్న కార్తాయని	కేదారేశ్వరపేట, విజయవాడ
19. కుడితపూడి రాజ్యలక్ష్మి	పెనమలూరు మండలం
20. చాగంటి దేవికారాణి	పోలవరం, చాట్రాయి మండలం
21. అడిసిమిల్లి విజయ	ఎన్టీఆర్ కాలనీ, విజయవాడ
22. పబ్బతి వెంకట సుబ్బారావు	గన్నవరం
23. మద్దినేని సుబ్బారావు	తులసీనగర్, పెనమలూరు మండలం
24. జాజుల నారాయణరావు	జగ్గయ్యపేట
25. వేములపల్లి అన్నపూర్ణ	విజయవాడ
26. కొల్లి నాగేశ్వరరావు	గూడవల్లి, విజయవాడ రూరల్
27. వేదర్ల శివరామ కృష్ణ	మొగల్రాజపురం, విజయవాడ
28. ఎల్ రాఘవకృష్ణారావు	కైకలూరు మండలం
29. వలసపల్లి సతీష్‌రామ్	గుళ్లపూడి, ముసునూరు మండలం
30. కంభం కోటేశ్వరరావు	పెనుగంచిప్రోలు
31. సిరిపురపు రమేష్‌బాబు	యలమర్రు, పెదపారుపూడి మండలం
32. సుంకర రవికుమార్	నున్న, గన్నవరం మండలం
33. రేపల్లె వెంకటేశ్వరరావు	ఇంగ్లీష్‌పాలెం, మచిలీపట్నం
34. గుండు సాయిప్రసాద్	ఈడేపల్లి, మచిలీపట్నం
35. గవిర్నేని కాశీ విశ్వేశ్వరరావు	చోడవరం, పెనమలూరు
36. బొమ్మిడి బసవయ్య	నూజివీడు
37. సయ్యద్ అఫ్సర్‌నసీర్ జెహర బేగం	గుణదల, విజయవాడ
38. పాశం జోహ వల్లూరుపాలెం	తోట్లవల్లూరుపాలెం
39. మద్దంశెట్టి గ్రీష్మసాయి	ప్రకాష్ నగర్, విజయవాడ
40. సీహెచ్ సత్యనారాయణ ప్రసాద్	ఫలీం కాలనీ, విజయవాడ
41. అంబటి వెంకటేశ్వరరావు	చల్లపల్లి మండలం
42. ఊటుకూరి అశోక్ కుమార్	తిరువూరు మండలం
43. పులి హర్షిత	రైతుపేటడౌన్, నందిగామ
44. కె.ప్రణవ్‌రామ్	విజయవాడ
45. అల్లూరి సీతారామయ్య	కొండపల్లి, ఇబ్రహీంపట్నం మండలం
46. జె.ఇందు	ప్రసాదంపాడు, విజయవాడ
47. ఎ.జ్యోతి	మచిలీపట్నం
48. పిఎస్.బద్రీనారాయణ	రామకృష్ణాపురం, విజయవాడ
49. ఎం.జయేంద్రమాధవ్	నిడమానూరు, విజయవాడరూరల్
50. బి.ప్రసాదరావు	గన్నవరం మండలం
51. కెబీజీ తిలక్	గన్నవరం మండలం
52. పసుమర్తి పవన్ కుమార్	జగ్గయ్యపేట
53. ఎస్.సత్యవతి	విస్సన్నపేట
54. డి.కమలాదేవి	పటమటలంక, విజయవాడ
55. తూమాటి యోగానందచార్యులు	పెనుగొలను, గంపలగూడెం మండలం
56. కర్రి సోమేశ్వరరావు	నూజివీడు
57. కొల్లి వెంకటేశ్వరరావు	సీతన్నపల్లి, కైకలూరు
58. చింతలపూడి పల్లవి	కంచికచర్ల
59. తోటపల్లి సురేష్ కుమార్	శనగపాడు, పెనుగంచిప్రోలు
60. గొర్రెపాటి సత్య వర్ధనరావు	ఘంటసాల మండలం
61. పాలడుగు రామకృష్ణ	ఉయ్యూరు
62. గుడ విజయలక్ష్మి,	సింగ్‌నగర్, విజయవాడ
63. అంగటి తిరుమలేశ్వరి,	ముస్తాబాద, గన్నవరం
64. కోలా జశ్విక, కోటిపల్లి,	విస్సన్నపేట
65. నీలపాల నాగరాజు	గోపవరం, ముసునూరు
66. వి.దుర్గామల్లేశ్వరరావు	చిట్టిపాలెం, మచిలీపట్నం
67. దిరిశాల నాగేశ్వరరావు	పెదకొమిర, గంపలగూడెం
68. మేడా చంద్రశేఖర్ ప్రసాద్	కొణతమాత్మకూరు, నందిగామ
69. కొమ్మారెడ్డి అరుణ్‌రెడ్డి	గణపవరం, మైలవరం
70. గరికపాటి కోటేశ్వరరావు	చిన ఓగిరాల, ఉయ్యూరు
71. సయ్యద్ రజాక్ అలీ	ఓల్డ్ ఆర్ఆర్‌పేట, విజయవాడ
72. వి.రవీంద్ర, ఈడుపుగల్లు	పెనమలూరు
73. ఎ.కోటేశ్వరరావు	మధురానగర్, విజయవాడ
74. కె.శేఖర్‌బాబు	ప్రసాదంపాడు, విజయవాడ రూరల్
75. ఆకుల సత్యప్రసాద్	భవానీపురం, విజయవాడ
76. పిచ్చుకల భాస్కరరావు	గొల్లపూడి, విజయవాడ రూరల్
77. రావుల మధుసారిక	రుద్రవరం, రెడ్డిగూడెం
78. ఎం.రాఘవయ్య	కవులూరు, జి.కొండూరు
79. సూరపనేని పూర్ణమోహనరావు	సీతాపురంకాలనీ, పెనమలూరు
80. కొండపల్లి లోకేశ్వరరావు	సోమవరం, చాట్రాయి
81. జాజుల నాగేశ్వరరావు	వెంట్రప్రగడ, పెదపారుపూడి
82. ముక్కు ఉమా ప్రవీణ్	పెడన
83. పాతూరి సీతారామస్వామి	చలసాని నగర్, పెనమలూరు
84. ఆళ్ల నాగేశ్వరరావు	ప్రసాదంపాడు, విజయవాడ రూరల్
85. కుర్రా నాగార్జున	నందమూరినగర్, విజయవాడ
86. ఆర్‌జీకేవీ ప్రసాద్	ఆర్టీసీ కాలనీ, విజయవాడ
87. షేక్ హుస్సేన్	అంబాపురం, గన్నవరం
88. గ్రంధి సుబ్రహ్మణ్యేశ్వరరావు	కంకిపాడు
89. గార్లపాటి శ్రీను	నర్సాపురం, విస్సన్నపేట
90. మహ్మద్ అబ్దుల్లా	చీమలపాడు, ఎ కొండూరు
91. జవ్వాజి రమేశ్‌బాబు	పోలవరం, గూడూరు
92. కోడే సాంబశివరావు	అయ్యప్పనగర్, విజయవాడ
93. జి.శైలజ	నెహ్రూ స్ట్రీట్, విజయవాడ
94. వి.శివరామకృష్ణ	పాగోలు, చల్లపల్లి
95. బాలిబోయిన పావని	శాంతినగర్, విజయవాడ
96. గన్నెల భాగ్యలక్ష్మి	పెనమకూరు, తోట్లవల్లూరు
97. చొక్కా బుచ్చిబాబు	బోడపాడు, విజయవాడ రూరల్
98. చిట్టి రోజాపుష్ప	బోడపాడు, విజయవాడ రూరల్
99. పి.నాగేశ్వరరావు	దేవినగర్, విజయవాడ
100. టీవీ శివన్నారాయణ	ఉయ్యూరు, ఉయ్యూరు
101. మాదంశెట్టి సైదులు	ప్రకాశ్‌నగర్, విజయవాడ
102. సూరపనేని రత్నమాణిక్యం	పసుమర్రు, పామర్రు
103. మాదంశెట్టి శ్యామల	ప్రశాంతినగర్, విజయవాడ
104. శీలంనేని సదాశివరావు	ఐతవరం, నందిగామ
105. దద్దనాల సాంబశివరావు	మైలవరం, మైలవరం
106. రావి రమేశ్‌బాబు	వెంకటాపురం, మోపిదేవి
107. జె.శ్రీభావన	జగ్గయ్యపేట, జగ్గయ్యపేట
108. కాకొల్లు రాజేశ్	మండవల్లి
109. తోట పుల్లయ్య	సీతారామపురం, జగ్గయ్యపేట
110. కూనిశెట్టి లక్ష్మీపద్మ	మొగల్రాజపురం, విజయవాడ
111. చిన్నోజు లక్ష్మణాచారి	అశోక్‌నగర్, తిరువూరు
112. కోడూరు కోటేశ్వరమ్మ	యనమలకుదురు, పెనమలూరు
113. దారం బసవయ్య	గుడివాడ
114. యలమంచిలి ఝాన్సీరాణి	వెంకటేశ్వరనగర్, విజయవాడ
115. కోవెలమూడి వెంకట సుబ్బారావు	కామయ్యతోపు, విజయవాడ
116. టి.నిష్మ	కళానగర్, విజయవాడ
117. వీరపనేని మణికుమారి	మాచవరం, విజయవాడ
118. పెనర్లంక ప్రసాదరావు	ప్రసాదంపాడు, విజయవాడ రూరల్
119. ఎస్‌కే హిమావలి	శోభనాపురం, ఆగిరిపల్లి
120. డి.జయంతి	నూజివీడు
121. ఐ.మల్లేశ్వరరావు	విద్యాధరపురం, విజయవాడ
122. తాడపనేని జనార్దనరావు	కానూరు, పెనమలూరు
123. ఎస్.హిమబిందు	చింతలపాడు, చందర్లపాడు
124. పోకా పద్మావతి	నున్న, విజయవాడ రూరల్
125. బెజవాడ ఉమా సుజాత	జయంతి, వీరులపాడు

కొండపల్లి బుజ్జి అరెస్టుకు రంగం సిద్ధం?

- నిషేధిత మందుల విక్రయాల్లో కీలక పాత్రధారి
- కరోనా సమయంలో మందుల అక్రమ వ్యాపారం
- తాజాగా అవనిగడ్డలో నిషేధిత మందుల కేసులోనూ హస్తం
- మాజీమంత్రి వెలంపల్లి శ్రీనివాస్‌కు ముఖ్య అనుచరుడు
- కేసు నుంచి తప్పించుకునేందుకు విఫల యత్నాలు

వన్‌టౌన్, మార్చి 24 (ఆంధ్రజ్యోతి) : కరోనా సమయంలో బాధితులకు అడ్డగోలుగా నిషేధిత మందులు విక్రయించిన దేవదాయ శాఖ మాజీమంత్రి వెలంపల్లి శ్రీనివాసరావు ముఖ్య అనుచరుడు పల్లపోతు మురళీకృష్ణ అలియాస్ కొండపల్లి బుజ్జి అరెస్టుకు రంగం సిద్ధమైనట్టు సమాచారం. అయితే, అరెస్టు కాకుండా ఉండేందుకు, తనకు అనుకూలంగా ఆంధ్రప్రదేశ్ డ్రగ్స్ డీలర్ అసోసియేషన్ సెక్రటరీ కరుణ్ కుమార్ గుప్తా వద్ద నుంచి లేఖ తీసుకురావడానికి బుజ్జి ప్రయత్నించగా, ఆయన లేఖ ఇవ్వడానికి నిరాకరించినట్టు సమాచారం.

కరోనా సమయంలో అక్రమ వ్యాపారం

కరోనా సమయంలో నాటి మంత్రి వెలంపల్లి శ్రీనివాసరావు అండతో ఆయన అనుచరుడు, కృష్ణాజిల్లా హోల్‌సేల్ డ్రగ్స్ అసోసియేషన్ అధ్యక్షుడు కొండపల్లి బుజ్జి ఉమ్మడి కృష్ణాజిల్లాతో పాటు పలు జిల్లాల్లో అడ్డగోలుగా కొందరు హోల్‌సేల్, రిటైల్ మెడికల్ వ్యాపారుల ద్వారా నిషేధిత ట్రెమడాల్, ఇంకా పలు కంపెనీల మందులు, ఇంజక్షన్లు విక్రయించాడు. ఈ వ్యవహారంపై సంబంధిత అధికారులకు పలు మెడికల్ వ్యాపారులు ఫిర్యాదులు చేశారు. అయితే, ఆయనపై ఎటువంటి చర్యలు తీసుకోకుండా వెలంపల్లి అడ్డుకున్నారు. ఈ అడ్డగోలు వ్యాపారం ద్వారా రూ.కోట్లు సంపాదించినట్టు అప్పట్లో విమర్శలు వచ్చాయి.



పల్లపోతు మురళీకృష్ణ అలియాస్ కొండపల్లి బుజ్జి

అవనిగడ్డ ఘటనతో వెలుగులోకి..

కొండపల్లి బుజ్జి సహకారంతో వెలంపల్లి మరో ముఖ్య అనుచరుడు కొనకళ్ల విద్యాధరరావు సోదరుడు రామ్మోహన్‌రావు అవనిగడ్డలో నిషేధిత మందులు పెద్ద ఎత్తున విక్రయించాడు. గతంలో వచ్చిన ఫిర్యాదుల మేరకు ఇటీవల రాష్ట్రవ్యాప్తంగా విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో నిషేధిత వైద్యులు, అధికారుల అనుమతి లేకుండా పెద్ద ఎత్తున మందులు, ఇంజక్షన్లు విక్రయించినట్లు గుర్తించారు. ఈ వ్యవహారానికి కొండపల్లి బుజ్జి సూత్రధారుడని అధికారులకు సమాచారం తెలిసింది. అయితే, ఈ విషయం తెలుసుకున్నప్పటి నుంచి కొండపల్లి బుజ్జి ఈ కేసు నుంచి బయటపడటానికి శతవిధాలా ప్రయత్నిస్తున్నాడు. ఇందులో భాగంగా రెండు రోజుల క్రితం శ్రీకాకుళంలో నివాసం ఉంటున్న ఆంధ్రప్రదేశ్ డ్రగ్స్ డీలర్స్ అసోసియేషన్ సెక్రటరీ కరుణ్‌కుమార్ గుప్తా వద్దకు వెళ్లి తనకు అనుకూలంగా లెటర్ ఇవ్వమని ఒత్తిడి చేశాడు. అందుకు పెద్ద ఎత్తున డబ్బు ఇస్తానని చెప్పటంతో అందుకు ఆయన నిరాకరించారని తెలిసింది. దీంతో పోలీసులు తనను అరెస్టు చేయటం ఖాయమని తెలుసుకున్న ఆయన తప్పించుకుని తిరుగుతున్నట్టు సమాచారం.

బ్రెయిన్‌డెడ్ యువకుడి అవయవాలు దానం

ఇబ్రహీంపట్నం, మార్చి 24 (ఆంధ్రజ్యోతి) : కుమారుడు బ్రెయిన్‌డెడ్ అయిన బాధలోనూ అతడి తల్లిదండ్రులు మానవత్వం చాటుకున్నారు. జీవన్‌దాన్ ట్రస్టుకు అవయవ దానం చేయడానికి ముందుకు వచ్చారు. నందిగామకు చెందిన టి.ప్రమీలరాణి, శివశంకర్ ప్రభుత్వ ఉపాధ్యాయులు. వారికి కుమారుడు అసిలేష్(20), కుమార్తె కుదాల్ ఉన్నారు. అసిలేష్ రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నంలోని గురునానక్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నికల్ క్యాంపస్‌లో కంప్యూటర్ సైన్స్ చివరి సంవత్సరం చదువుతూ ఎల్బీ నగర్‌లోని ఓ ప్రైవేట్ హాస్టల్‌లో ఉంటున్నాడు. కాగా శనివారం అనారోగ్యంతో ఉన్న అతడిని తోటి హాస్టల్ విద్యార్థులు దగ్గరలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకెళ్లారు. పరీక్షించిన అక్కడి వైద్యులు పెద్దాసుపత్రికి తీసుకెళ్లాల్సిందిగా సూచించారు. దీంతో అసిలేష్ తల్లిదండ్రుల సూచన మేరకు అతడిని కిమ్స్ హాస్పిటల్‌లో చేర్పించారు. వైద్యుల పర్యవేక్షణలో చికిత్స ప్రారంభించారు. అయితే అదే రోజు రాత్రి బ్రెయిన్‌డెడ్‌గా నిర్ధారించారు. దీంతో తల్లిదండ్రులు, స్నేహితులు శోకసంద్రంలో మునిగిపోయారు. అనంతరం తల్లిదండ్రులు ప్రమీలారాణి, శివశంకర్ వైద్యుల సలహా మేరకు అవయవ దానానికి ముందుకు వచ్చారు. జీవన్‌దాన్ ట్రస్టుకు అవయవాలు ఇవ్వాలని నిర్ణయించడంతో ప్రక్రియ పూర్తిచేసి అసిలేష్ మృతదేహాన్ని ఆదివారం తల్లిదండ్రులకు అప్పగించారు.

టేబుల్ టెన్నిస్ పతకాలు సాధించిన ఉద్యోగులకు సీఎస్ అభినందనలు

అమరావతి, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): ఇటీవల ఢిల్లీలో జరిగిన ఆల్ ఇండియా సివిల్ సర్వీసెస్ టేబుల్ టెన్నిస్ టోర్నమెంట్లో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నుంచి పాల్గొన్న అమరావతి సచివాలయ ఉద్యోగులు కాంస్య పతకాలు సాధించడం పట్ల ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజయానంద్ అభినందనలు తెలిపారు. ఈ మేరకు కాంస్య పతకాలు సాధించిన మైనార్టీ సంక్షేమశాఖలో సహాయ కార్యదర్శిగా పని చేస్తున్న ఎం బేబి సరోజిని, జీఏడీలో సెక్షన్ అధికారిగా విధులు నిర్వహిస్తున్న సహదేవ సత్యవతిలు తాము సాధించిన పతకాలను సోమవారం అమరావతి సచివాలయంలో సీఎస్ విజయానంద్ ముందుంచారు. ఈ సందర్భంగా ఇద్దరు క్రీడాకారులను సీఎస్ అభినందించారు. ఈ కార్యక్రమంలో సచివాలయ ఉద్యోగుల సంఘం మాజీ కార్యదర్శి రామకృష్ణ తదితరులు ఉన్నారు.

జూన్ నాటికి.. జలజలా

(5వ పేజీ తరువాయి)

మండలంలోని పలు ప్రాంతాల్లో మొత్తం 12 ఓవర్ హెడ్ ట్యాంక్‌ల నిర్మాణం చేపట్టాల్సి ఉంది. ఇప్పటి వరకు 9 ట్యాంక్‌లు.. కోడూరు, పోలిశెట్టిపాడు, పెద్ద తండా, కంభంపాడు, లక్ష్మీపురం, రేపూడి, తూర్పుమాధవరం, జీళ్లకుంట, జానలగడ్డ వద్ద పనులు ప్రారంభించారు. ఇవన్నీ వివిధ దశల్లో ఉన్నాయి. దీప్లానగర్, మాన్‌సింగ్ తండా, వల్లంపట్ల గ్రామాల్లో ట్యాంక్ పనులు ప్రారంభం కావాల్సింది.

అడ్డు తగులుతున్న బూడిద


ఇబ్రహీంపట్నం కూలింగ్ కెనాల్ నుంచి వస్తున్న ఫిల్టర్ బెడ్‌కు చెందిన తాగునీటి పైపులైన్ ఎగువ భాగంలో ఎన్టీటీపీఎస్ ప్లాంట్ డ్రెయినేజీ ద్వారా వచ్చే బూడిద కలుస్తోంది. దీంతో తాగునీరు పూర్తిస్థాయిలో శుద్ధి కావట్లేదు. ఈ విషయాన్ని అనేకమార్లు ఎన్టీటీపీఎస్ అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోలేదు. కూలింగ్ కెనాల్ నుంచి ఎన్టీటీపీఎస్ డ్రెయినేజీ ఎగువ భాగంలోకి ఫిల్టర్ బెడ్‌కు నీరు తీసుకునే పైపులైన్‌ను మార్చాలంటే సుమారు రూ.1.50 కోట్లు ఖర్చయ్యే అవకాశం ఉంది. ఇందుకు ఎన్టీటీపీఎస్ కూడా కొంత భరించాలి. లేకుంటే బూడిద కూలింగ్ కెనాల్‌లోకి వదలకుండా ఉండాలి. ఈ మొత్తాన్ని ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు భరించే పరిస్థితి లేదు. ఇప్పుడు ఇబ్రహీంపట్నం నుంచి మైలవరం నియోజకవర్గంలోని 104 గ్రామాలకు ఇచ్చే జలాలతో పాటు జూన్ నుంచి ఏ.కొండూరులోని మరో 38 ప్రాంతాలకు వెళ్లే కృష్ణాజలాలనైనా పూర్తిస్థాయిలో శుద్ధి చేయాల్సిన అవసరం ఉంది. అది ఇక్కడి ఫిల్టర్ బెడ్‌లోనే కలవాల్సి ఉంది. అలా చేయకుండా తాగునీరు ఇచ్చినా ప్రయోజనం నామమాత్రమే అని పలువురు అభిప్రాయపడుతున్నారు.

జూన్ నాటికి తాగునీరు ఇచ్చేందుకు చర్యలు

ఏ.కొండూరు మండలంలోని 38 ప్రాంతాలకు జూన్ నాటికి ఎట్టి పరిస్థితుల్లో స్వచ్ఛమైన తాగునీరు అందిస్తాం. ప్రస్తుతం రెడ్డిగూడెం మండలంలోని కుదప సంప్‌కు 3 లక్షల లీటర్ల తాగునీరు సరఫరా అవుతోంది. కుదపతో పాటు మరో నాలుగు గ్రామాలతో కలిపి ఏ.కొండూరు మండలంలోని 38 ప్రాంతాలకు తాగునీరు ఇవ్వాలంటే 30 లక్షల లీటర్లు అవసరం ఉంటుంది. మైలవరం నియోజకవర్గంలోని ప్రాంతాలకు పూర్తి స్థాయిలో తాగునీరు అందించేందుకు చర్యలు చేపట్టాం. వేసవిలో ఎలాంటి ఇబ్బంది లేకుండా 104 గ్రామాలకు అందిస్తాం.

\- దయానంద్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ

త్వరగా ఇస్తే మంచిదే..



కృష్ణాజలాలు ఇవ్వడం మంచి పరిణామం. ట్యాంకర్ల ద్వారా సరఫరా చేసిన జలాలు తాగడం వల్ల కొన్ని శారీరక ఇబ్బందులు తొలగిపోయాయి. త్వరగా పనులు పూర్తిచేసి కృష్ణాజలాలు ఇస్తే మరికొన్ని ప్రాణాలను కాపాడిన వారవుతారు.

\- బీమ్లా నాయక్, చీమలపాడు

పనుల వేగం పెంచాలి



ఉన్నతాధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలి. పనులు త్వరితగతిన పూర్తి చేయాల్సిన అవసరం ఉంది. పైపులు నాణ్యమైనవి వేయాలి. కృష్ణాజలాలు ఇవ్వడం శుభపరిణామం.

\- పాసెం ఆనందరావు, సీపీఎం నేత

మందుల మాయ

(5వ పేజీ తరువాయి)

జరుగుతున్నాయని ఆ సంస్థ ప్రతినిధులు ఫిర్యాదులో పేర్కొన్నారు. టాస్క్‌ఫోర్స్ పోలీసులు, ఔషధ నియంత్రణ మండలి అధికారులు వివిధ దుకాణాల్లో సోదాలు నిర్వహించి నకిలీ అల్ట్రాసెట్ మందులను గుర్తించారు. ఆతర్వాత ఒక్కో లింక్‌ను ఛేదించుకుంటూ వెళ్లినపోలీసులకు అసలు మూలాలు ఉత్తరాఖండ్‌లో ఉన్నట్టు ఆధారాలు లభించాయి.

మాజీమంత్రి అనుచరుడి కనుసన్నల్లో

వైసీపీ హయాంలో ఐదేళ్లపాటు ఎలాంటి పర్యవేక్షణ, నిఘా లేకపోవడంతో నగరంలో మందుల మాఫియా చాపకింద నీరులా విస్తరించింది. ఈ మాఫియా చేస్తున్న చేష్టలకు అసలు మందుల అమ్మకాలు తగ్గిపోయిన దాఖలాలు కూడా ఉన్నాయి. ఓ మాజీమంత్రి అనుచరుడి కనుసన్నల్లో ఈ మాఫియా నడుస్తోంది. ముఖ్యంగా నార్కోటిక్ సైకోట్రోపిక్ (ఎన్‌ఆర్‌ఎక్స్) మందులు పక్కదారి పడుతున్నట్టు తనిఖీల్లో వెల్లడైంది.

హద్దులు దాటుతున్న హ్యాబిట్యువల్

రోగాలు ఎన్ని ఉన్నాయో అదే స్థాయిలో మందులు కూడా ఉన్నాయి. ఇందులో ముఖ్యంగా డొమాస్టిక్, హ్యాబిట్యువల్ డ్రగ్స్ ఉంటాయి. జ్వరం, తలనొప్పి, ఒంటినొప్పులకు ఉపయోగించే మందులు డొమాస్టిక్ కేటగిరీలో ఉంటాయి. మానసిక రుగ్మతలు ఉన్న రోగులకు వైద్యులు రాసే మందులను హ్యాబిట్యువల్ కేటగిరీగా పరిగణిస్తారు. ట్రమడాల్, ఆల్‌ప్రాజోలం, నైట్రోజిఫాం, ఆల్ట్రాసెట్ వంటి మందులు.. నొప్పులు, మానసిక ప్రశాంతత కోసం వైద్యులు రాస్తుంటారు. ఈ మందులను వైద్యుల చీటీలతో సంబంధం లేకుండా విక్రయించేస్తున్నారని అధికారులు గుర్తించారు. ఈ బ్రాండ్లతో నకిలీ మందులు చెలామణీ జరుగుతున్నట్టు విశ్వసనీయంగా తెలిసింది. గొల్లపూడి కూడలిలో ఉన్న గోపీకృష్ణ మెడికల్స్ అండ్ ఫ్యాన్సీ స్టోర్స్‌లో 2.03 కిలోల ఎన్‌ఆర్‌ఎక్స్ మందుల దుర్వినియోగం జరిగినట్టు అధికారులు నిర్ధారించారు. దీనిపై షాపు యజమానికి ఔషధ నియంత్రణ మండలి అధికారులు షోకాజ్ నోటీసు జారీ చేశారు. యజమాని ఇంట్లోనూ సోదాలు చేశారు. ఈ మందులను వైద్యుల చీటీ లేకుండా విక్రయించినట్టు తేలింది. మందుల షాపుల యజమానులు సాధారణ పరిస్థితులను తమకు అనుకూలంగా మార్చుకుంటున్నారని సమాచారం. జ్వరం, తలనొప్పి, జలుబు, ఒంటినొప్పులకు బాధితులు చీటీ లేకుండా షాపులకు వెళ్లి అడిగితే మందులు ఇస్తారు. దాని ముసుగులోనే ఎన్‌ఆర్‌ఎక్స్ మందులను యువతకు విక్రయిస్తున్నారని అధికారులు నివేదిక రూపొందించారు. ఈ ఎన్‌ఆర్‌ఎక్స్ మందులు వేసుకోగానే నిషా ఎక్కిన అనుభూతి కలుగుతుందని వైద్యులు చెబుతున్నారు. అందుకోసమే యువత ఈ మందులను రహస్యంగా కొనుగోలు చేస్తోందని అభిప్రాయపడుతున్నారు.

విజయవాడ తూర్పు

బ్రాయిలర్ ధరలు



అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	105,114, 125
చికెన్ విత్ స్కిన్	200
చికెన్ స్కిన్‌లెస్	210

నెక్ కోడిగుడ్ల ధర (100)
విజయవాడ జోన్ రైతు ధర రూ. 435

ఆర్ఎఫ్‌వో వెంకటేశ్వరరావుకు ఉత్తమ సేవా పతకం



కార్పొరేషన్, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): నగరపాలక సంస్థలో రీజనల్ ఫైర్ ఆఫీసర్‌గా పని చేస్తున్న ఎన్.వెంకటేశ్వరరావుకు రాష్ట్ర ప్రభుత్వం ఉత్తమ సేవా పతకం ప్రకటించింది. వెంకటేశ్వరరావు వీఎంసీలో ఫైర్ ప్రివెన్షన్ వింగ్‌లో ఆర్ఎఫ్‌వోగా విశిష్ట సేవలు అందించారు. తెలుగు సంవత్సరాది ఉగాది సందర్భంగా ఈ అవార్డు అందుకోనున్న వెంకటేశ్వరరావును నగర కమిషనర్ ధ్యానచంద్ర, పలు విభాగాలకు చెందిన అధికారులు అభినందించారు.

ప్రజా ఫిర్యాదులను త్వరితగతిన పరిష్కరించండి

కమిషనర్ ధ్యానచంద్ర



అర్జీలు పరిశీలిస్తున్న కమిషనర్ ధ్యానచంద్ర

కార్పొరేషన్, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): ప్రజల నుంచి వచ్చే సమస్యల అర్జీలను త్వరితగతిన పరిష్కరించాలని నగర కమిషనర్ హెచ్ఎం ధ్యానచంద్ర అధికారులను ఆదేశించారు. సోమవారం నగర పాలక సంస్థ కమాండ్ కంట్రోల్ రూమ్‌లో ప్రజా ఫిర్యాదుల పరిష్కార కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో వివిధ విభాగాలకు చెందిన అధికారులు పాల్గొన్నారు. నగరంలో వివిధ ప్రాంతాలకు చెందిన ప్రజలు తమ సమస్యలను అర్జీలుగా కమిషనర్‌కు అందజేశారు. మొత్తం 24 ఫిర్యాదులు వచ్చాయి. ఈ కార్యక్రమం చీఫ్ ఇంజనీర్ ఆర్.శ్రీనాథ్‌రెడ్డి, చీఫ్ సిటీ ప్లానర్ జీవీజీఎస్‌వీ ప్రసాద్, డిప్యూటీ కమిషనర్ రెవెన్యూ జీ. సృజన తదితరులు పాల్గొన్నారు.

నిర్మాణ కార్మికుల వేసవి రక్షణకు చర్యలు తీసుకోండి

ఉప కార్మిక కమిషనర్ సీహెచ్ ఆశారాణి

బెంజిసర్కిల్, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): వాతావరణ శాఖ సూచనల మేరకు నిర్మాణ రంగ కార్మికుల వేసవి రక్షణకు చర్యలు తీసుకోవాలని విజయవాడ ఉప కార్మిక కమిషనర్ సీహెచ్ ఆశారాణి ఒక ప్రకటనలో విజ్ఞప్తి చేశారు. నిర్మాణ రంగంలోని కాంట్రాక్టర్‌లు, మేనేజ్‌మెంట్లు కార్మికులకు తాగునీరు, మజ్జిగ అందించాలని, అన్ని ప్రదేశాల్లో చలివేంద్రాలు ఏర్పాటుచేయాలని కోరారు. ఉదయం మధ్యాహ్నం 12నుంచి 3గంటల వరకు కార్మికులకు విశ్రాంతి సమయం ఇవ్వాలని, వడదెబ్బ వంటి సమస్యలు ఎదురుకాకుండా తగిన వైద్య వసతులు కల్పించాలని సూచించారు.

గుమ్మా ఎంపికపై గోళ్ల అభినందనలు

విజయవాడ కల్చరల్, మార్చి 24 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర గ్రంథాలయాల సంస్థ ఉమ్మడి కృష్ణాజిల్లా నూతన అధ్యక్షుడిగా డాక్టర్ గుమ్మా సాంబశివరావు ఎంపిక కావడం పట్ల పోలవరపు కోటేశ్వరరావు సాంస్కృతిక సమితి సంస్థ అధ్యక్షుడు గోళ్ల నారాయణరావు అభినందనలు తెలిపారు. ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్ గ్రంథాలయాల పునర్వికాస ఉద్యమం మొదలైందని ఈ తరుణంలో డాక్టర్ గుమ్మా సాంబశివరావు ఉమ్మడి కృష్ణాజిల్లా గ్రంథాలయాల సంస్థకు అధ్యక్షులు కావడం అభివృద్ధికి సరికొత్త శ్రీకారం కానుందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా డాక్టర్ వెన్నా వల్లభరావు, సమతా సేవా సమితి అధ్యక్షుడు చింతా వెంకటేశ్వర్లు, సుంకర నాగభూషణం, సంగీత కళాకారులు దర్భ ఫణీంద్ర, విజయవాడ బుక్ ఫెస్టివల్ అధ్యక్షుడు కె.లక్ష్మయ్య, ప్రధాన కార్యదర్శి మనోహరనాయుడు, మీసాల రాజేశ్వరరావు, టీటీడీ ప్రోగ్రాం అసిస్టెంట్ సీవీకే ప్రసాద్ అభినందనలు తెలిపారు.

ఎన్ఎస్ఎం రోడ్డు విస్తరణ లబ్ధిదారులతో సమావేశం



సమావేశంలో టౌన్‌ప్లానింగ్ అధికారులు

పటమట, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): చీఫ్ సిటీ ప్లానర్ (సీసీపీ) సూచనల మేరకు ఎన్ఎస్ఎం స్కూల్ రోడ్డు విస్తరణ మాస్టర్ ప్లాన్ ప్రకారం స్థల యజమానులతో సోమవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా లబ్ధిదారుల సలహాలను సూచనలు స్వీకరించారు. లబ్ధిదారులతో కలిసి పర్యటించి వారి సందేహాలను నివృత్తి చేశారు. లబ్ధిదారులు అంగీకారం తెలిపినందుకు అధికారులు హర్షం వ్యక్తం చేశారు. 45 రోజుల్లో లబ్ధిదారులకు టీడీఆర్ బాండ్స్ ఇచ్చే ప్రక్రియను ప్రారంభించారు.

నేడు కరెంట్ ఉండని ప్రాంతాలు

లబ్బీపేట, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ లైన్ల మెయింటెనెన్స్, మరమ్మతుల నిమిత్తం మంగళవారం ఉదయం 8గంటల నుంచి 10.30 వరకు స్క్యూ బ్రిడ్జి సెక్షన్, స్క్యూబ్రిడ్జి విద్యుత్ ఉపకేంద్రం, 11కేవీ టెలిఫోన్ ఎక్స్ఛేంజ్ ఫీడర్ పరిధిలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏపీసీపీడీసీఎల్ కార్యనిర్వాహక ఇంజనీర్ వి.రవీంద్రబాబు తెలిపారు. బెంజిసర్కిల్ ప్రాంతం, పకీరుగూడెం, ప్రగతినగర్, శ్రీరాం నగర్, చంద్రమౌళిపురం, ఎంజీ రోడ్, మైత్రీయవీధి, బిఎస్ఎన్ఎల్ హెచ్‌టీ పాయింట్ తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని ఆయన తెలిపారు.

పెన్షనర్స్ అసోసియేషన్ కార్యాలయంలో 30న ఉగాది వేడుకలు

విద్యాధరపురం, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): ఉగాది పండుగ సందర్భంగా ఈనెల 30న భవానీపురం హెచ్‌బీ కాలనీలోని ఆల్ ఎంప్లాయిస్ పెన్షనర్స్ అసోసియేషన్ కార్యాలయంలో ఉగాది వేడుకలు ఘనంగా నిర్వహిస్తున్నట్లు అసోసియేషన్ ఇన్‌ఛార్జి అధ్యక్షుడు, ఉపాధ్యక్షుడు ఏమినేని వెంకటేశ్వర్లు తెలిపారు. సోమవారం హెచ్‌బీ కాలనీలోని అసోసియేషన్ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈనెల 30న ఉదయం 10.30 గంటలకు చిట్టాల సదాశివశర్మచే పంచాంగ పఠనం, విశ్రాంత సంస్కృత అధ్యాపకులు పమిడిపాటి పట్టాభి రామారావుచే కవితా కార్యక్రమం నిర్వహించనున్నట్లు చెప్పారు. అనంతరం వేడుకల ఆహ్వాన పత్రికలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో అసోసియేషన్ కార్యదర్శి సందక కృష్ణ, అసోసియేషన్ గౌరవ అధ్యక్షుడు డాక్టర్ దేవరకొండ శేషగిరిరావు, ట్రెజరర్ వెనిగళ్ల సుబ్బారావు, జాయింట్ సెక్రటరీ షేక్ హిదయతుల్లా, ఉపాధ్యక్షుడు పట్టాభి రామారావు, ఎగ్జిక్యూటివ్ మెంబర్ మండల రత్నాకర్ పాల్గొన్నారు.

బకాయిదారులపై వీఎంసీ కొరడా

● అధిక బకాయి ఉన్న షాపులకు తాళాలు

(కార్పొరేషన్, ఆంధ్రజ్యోతి)

ఆదాయం పెంచుకోవడంపై దృష్టి పెట్టిన వీఎంసీ అధికారులు పన్ను బకాయిదారులపై కొరడా ఝళిపిస్తున్నారు. ముఖ్యంగా వాణిజ్య సముదాయాలను లక్ష్యంగా చేసుకుని చర్యలు తీసుకుంటున్నారు. పన్నులను ఎక్కువ మొత్తంలో బకాయి ఉన్న షాపులకు ఝలక్ ఇచ్చారు.

వీఎంసీ అధికారులు సత్యనారాయణపురం, గవర్నరుపేట, సీతన్నపేట ప్రాంతాల్లో భారీ మొత్తంలో బకాయిలు ఉన్న షాపులకు తాళం వేశారు. బకాయి మొత్తం తిరిగి చెల్లించిన తర్వాతే తాళాలు తీస్తామని వీఎంసీ రెవెన్యూ అధికారులు వ్యాపారులకు స్పష్టం చేశారు. ప్రజలు, వ్యాపారులు ఈనెల 31లోగా మొత్తం పన్నులను చెల్లించాలని అధికారులు స్పష్టం చేశారు. బకాయి మొత్తం చెల్లించిన వారికి శ్లాబ్‌ల వారీగా వడ్డీ రాయితీ ఇచ్చింది.

రెస్టారెంట్లలో అధికారుల తనిఖీలు

సరైన అగ్నినిరోధక పరికరాలు లేకపోవడంపై ఆగ్రహం



రెస్టారెంట్‌లో ఫైర్ సేఫ్టీపై సిబ్బంది నుంచి వివరాలు సేకరిస్తున్న అధికారులు

బెంజిసర్కిల్, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): బెంజిసర్కిల్ పరిధిలోని పలు రెస్టారెంట్లలో సోమవారం వీఎంసీ అగ్నిమాపక నిరోధక అధికారులు, సిబ్బంది ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించారు. ఆర్ఆర్ దర్బార్, రాజాదర్బార్, సదరన్ స్పైస్, కడియపట్టణం రెస్టారెంట్‌లు, హోటల్స్‌లో తనిఖీలు చేశారు. పలు రెస్టారెంట్లలో సరైన అగ్నినిరోధక పరికరాలు లేకపోడంపై అధికారులు రెస్టారెంట్ నిర్వాహకులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. అగ్నిప్రమాదాలు జరగకుండా తీసుకోవాల్సిన చర్యలు, ఉపయోగించే విధానం, మంటలను ఎలా ఆర్పాలి, ఎటువంటి పరికరాలు వినియోగించాలి, ఫైర్ స్ప్రింక్లర్స్, స్మోక్ డిటెక్టర్స్ ఎక్కడెక్కడ అమర్చాలి అన్న విషయాలపై అవగాహన కల్పించారు. ఈ తనిఖీల్లో జిల్లా ఫైర్ ఆఫీసర్ మాల్యాద్రి, రీజినల్ ఫైర్ ఆఫీసర్ వెంకటేశ్వరరావు, స్టేషన్ ఫైర్ ఆఫీసర్ రాజా పాల్గొన్నారు.



మహానాడు రోడ్డు జంక్షన్ వద్ద ర్యాలీలో పాల్గొన్న బాల బాలికలతో 4వ ట్రాఫిక్ సీఐ రమేష్

చిన్ననాటి నుంచి ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన అవసరం

నాల్గో ట్రాఫిక్ సీఐ రమేష్ కుమార్

గుణదల, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): బాల బాలికలు చిన్న నాటి నుంచే ట్రాఫిక్ ఆంక్షలు, నిబంధనలపై అవగాహన కలిగి ఉండాలని నాల్గో ట్రాఫిక్ సీఐ రమేష్ కుమార్ అన్నారు. ట్రాఫిక్‌పై అవగాహన కార్యక్రమంలో భాగంగా కరెన్సీనగర్లోని మాస్టర్ మైండ్ పాఠశాల చిన్నారులు కరెన్సీనగర్ నుంచి మహానాడు రోడ్డు జంక్షన్ వరకు ర్యాలీగా వెళ్లారు. ఈ సందర్భంగా నాల్గో ట్రాఫిక్ సీఐ రమేష్ కుమార్ మాట్లాడుతూ పాదచారులు ఫుట్‌పాత్‌లపై నడవాలని, జీబ్రా గుర్తులు ఉన్నచోట మాత్రమే రోడ్డు దాటాలన్నారు. ద్విచక్ర వాహనదారులు విధిగా హెల్మెట్ ధరించాలని కోరారు. ఫోన్లు మాట్లాడుతూ వాహనాలు నడపడం నేరమని చెప్పారు. కారు నడిపేవారు సీటు బెల్టు పెట్టుకోవాలని తెలిపారు. లైసెన్స్ లేకుండా వాహనాలు నడపరాదన్నారు. లైసెన్స్ లేని వారికి వాహనాలు ఇవ్వడం కూడా నేరమేనని చెప్పారు. ఈ కార్యక్రమంలో నాల్గో ట్రాఫిక్ ఎస్ఐలు ఆదినారాయణ, రాజేష్ పాల్గొన్నారు.

బెజవాడ బార్ సీనియర్ ఈసీ సభ్యుడిగా పడవల ఏడుకొండలు ఏకగ్రీవం



విజయవాడ లీగల్, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): బెజవాడ బార్ సీనియర్ ఈసీ సభ్యునిగా పడవల ఏడుకొండలు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. బెజవాడ బార్ అసోసియేషన్‌కు ఈనెల 28న జరుగుతున్న ఎన్నికలకు సంబంధించి పలువురు న్యాయవాదులు వివిధ పోస్టులకు నామినేషన్లు దాఖలు చేశారు. వీరిలో 30 ఏళ్ల సీనియర్ న్యాయవాదుల జాబితాలో బార్ ఈసీ సభ్యునిగా సీనియర్ న్యాయవాది పడవల ఏడుకొండలు ఒక్కరే నామినేషన్ దాఖలు చేయడంతో ఆయన ఎన్నిక ఏకగ్రీవమైనట్లుగా బార్‌ఎన్నికల అధికారి డీపీ రామకృష్ణ ప్రకటించారు. ఈ సందర్భంగా ఏడుకొండలు మాట్లాడుతూ న్యాయవాదులు తనపై నమ్మకముంచి తనకు పోటీగా నామినేషన్ వేయకుండా ఏకగ్రీవం చేసినందుకు కృతజ్ఞతలు తెలిపారు. బార్ కౌన్సిల్ సభ్యులు సూరాబత్తుల మల్లేశ్వరరావు, బెజవాడ బార్ మాజీ అధ్యక్షుడు వి.గురునాథం నేతృత్వంలో న్యాయవాదుల సమస్యలను ఈసీలో చర్చించి వారి సమస్యల పరిష్కారానికి పోరాడతానని ఏడుకొండలు తెలిపారు.

పడవల ఏడుకొండలుకు సన్మానం

బెజవాడ బార్ అసోసియేషన్ సీనియర్ న్యాయవాది, దుర్గాపురం వాకర్స్ సభ్యులైన పడవల ఏడుకొండలును సోమవారం దుర్గాపురం వాకర్స్ సభ్యులు ఘనంగా సత్కరించారు. వాకర్స్ సభ్యులు, మాజీ బార్ అధ్యక్షుడు వి.గురునాథం, దుర్గాపురం వాకర్స్ క్లబ్ అధ్యక్షుడు షేక్ బాబు, వాకర్స్ సభ్యులు బొప్పన గాంధీ, వేముల శ్రీనివాస్, చుంచు శ్రీధరరావు, పగిడిపల్లి రాము తదితరులు పాల్గొన్నారు.

అన్ని రహదారులను అభివృద్ధి చేస్తాం: ఎమ్మెల్యే గద్దె

భారతీనగర్, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): నగరంలోకి వచ్చే అన్ని రహదారులను అభివృద్ధి చేస్తామని తూర్పు ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ తెలిపారు. సోమవారం 4వ డివిజన్‌లోని శ్రీనివాసనగర్ బ్యాంక్ కాలనీలో ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ పర్యటించారు. అనంతరం కాలనీలోని మూడు, నాలుగు రోడ్ల నిర్మాణ పనులకు, దొడ్డపనేని వెంకటేశ్వరరావు పిల్లల పార్కు అభివృద్ధి పనులకు, అంబేద్కర్ కాలనీ మెయిన్ రోడ్డు నిర్మాణ పనులకు మొత్తం రూ.87లక్షల విలువ చేసే వివిధ అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నగరంలోని అన్ని ప్రధాన రహదారులతోపాటుగా, నగరానికి చుట్టూ ఉన్న రోడ్లను కూడా పూర్తిస్థాయిలో అభివృద్ధి చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు సీఆర్‌డీఏ అధికారులతో చెప్పారన్నారు. పెండింగ్‌లో ఉన్న పనులను పూర్తిచేయడానికి ఎల్‌అండ్ టీ కంపెనీ ప్రతినిధులు ముందుకు వచ్చారని తెలిపారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ జాస్తి సాంబశివరావు, నాగేశ్వరరావు, వడ్లపట్ల గోపాలకృష్ణ, చలసాని రోజా, చావ మల్లిఖార్జునరావు, రాజమణి, వినోద్, శరత్, సౌజన్య పాల్గొన్నారు.

ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల వార్షికోత్సవం

ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో వార్షికోత్సవం, ఉద్యోగ విజయోత్సవ కార్యక్రమం ప్రిన్సిపాల్ ఎం. విజయసారథి ఆధ్వర్యంలో సోమవారం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్, ఎమ్మెల్సీ పరుచూరి అశోక్ బాబు, సాంకేతిక విద్యా శాఖ ట్రైనింగ్ అండ్ ప్లేస్‌మెంట్ అధికారి ఎంవీ రామకృష్ణ, కార్పొరేటర్ ఉషారాణిలు ముఖ్యఅతిథులుగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ మాట్లాడుతూ ప్రభుత్వ ప్రాధాన్యతలను అనుసరించి పాలిటెక్నిక్ చదివిన ప్రతి ఒక్క విద్యార్థికి ఉద్యోగావకాశం కల్పించేలా ఏర్పాటు చేస్తామన్నారు. ప్రిన్సిపాల్ విజయసారథి మాట్లాడుతూ కళాశాలలో చివరి సంవత్సరం చదువుతున్న 340 విద్యార్థులకు గాను 315 మందికి ఉద్యోగ నియామక పత్రాలను అందజేశారు. అనంతరం నిర్వహించిన కల్చరల్ కార్యక్రమంలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులను అందజేశారు. వివిధ విభాగాధిపతులు, అధ్యాపకు లు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.



సర్టిఫికెట్లు ప్రదానం చేస్తున్న గద్దె రామ్మోహన్

సీఎంఏ కోర్సుతో ఉజ్వల భవిష్యత్

● ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్

పటమట, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): సీఎంఏ కోర్సుతో ఉజ్వల భవిష్యత్ ఉందని, కమ్యూనికేషన్ స్కిల్స్ పెంచుకునేందుకు విద్యార్థులు శ్రద్ధ పెట్టాలని తూర్పు ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ అన్నారు. ది ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ కాస్ట్ అకౌంటెంట్ ఆఫ్ ఇండియా విజయవాడ చాప్టర్ ఆధ్వర్యంలో సీఎంఏ కాన్వొకేషన్, సీఎంఏ ఫైనల్ కోర్సులో ఆల్ ఇండియా ర్యాంకర్లకు సర్టిఫికెట్ ప్రధాన కార్యక్రమం పటమట రఘురామ వేదికలో నిర్వహించారు. ఆయన విద్యార్థులకు సర్టిఫికెట్లను ప్రదానం చేశారు. సెంట్రల్ కౌన్సిల్ సభ్యుడు వినయ్‌రంజన్ మాట్లాడుతూ కాస్ట్ అండ్ మేనేజ్‌మెంట్ అకౌంటెంట్‌కు దేశ విదేశాల్లో అపారమైన అవకాశాలు ఉన్నాయన్నారు. మాజీ సెంట్రల్ కౌన్సిల్ సభ్యుడు సుంకర పాపారావు, సదరన్ ఇండియా రీజినల్ కౌన్సిల్ ఛైర్మన్ విశ్వనాథ్ బట్, సభ్యుడు పాండురంగారావు, విజయవాడ చాప్టర్ ఛైర్మన్ పి.సీతారామస్వామి, కార్యదర్శి సుంకర నాగపూర్ణిమ పాల్గొన్నారు.

భారీ వాహనాలను నియంత్రించండి

డిప్యూటీ మేయర్ బెల్లం దుర్గ వినతి



అధికారులకు సమస్యను వివరిస్తున్న డిప్యూటీ మేయర్ బెల్లం దుర్గ

రామలింగేశ్వరనగర్, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): రామలింగేశ్వరనగర్ పడవల రేవు సెంటర్, రామలింగేశ్వర నగర్ ప్రధాన రహదారిపై భారీ వాహనాలు స్థానిక ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నాయని, వాటిని వెంటనే నియంత్రించాలని డిప్యూటీ మేయర్ బెల్లం దుర్గ అధికారులను కోరారు. ఓవర్ లోడ్, ఇసుక క్వారీ లారీలతో ఈ ప్రాంత ప్రజలు పడుతున్న ఇబ్బందులను ట్రాఫిక్ ఏసీపీ వంశీధర్ గౌడ్ , సీఈ శ్రీనాథ్ రెడ్డి, ఈఈ సామ్రాజ్యం, ట్రాఫిక్ సీఐ రామారావులు సోమవారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా డిప్యూటీ మేయర్ బెల్లం దుర్గ మాట్లాడుతూ భారీ వాహనాలతో ప్రజలు ప్రమాదాలకు గురవుతున్నారని, ముఖ్యంగా విద్యార్థులు చాలా ఇబ్బందులు పడుతున్నారని అధికారులకు వివరించారు. అనంతరం వారికి వినతి పత్రం అందజేశారు. దీనిపై స్పందించిన అధికారులు సమస్యను కమిషనర్ దృష్టికి తీసుకువెళ్ళి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ ఆళ్ల చెల్లారావు తదితరులు పాల్గొన్నారు.

మహాధర్నాను జయప్రదం చేయండి

● సీఐటీయూ ఆధ్వర్యంలో నక్కలరోడ్డులో ప్రదర్శన



సూర్యారావుపేట నక్కలరోడ్డులో నిరసన నిర్వహిస్తున్న హాకర్లు, సీఐటీయూ నేతలు

గవర్నర్‌పేట, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): చిరువ్యాపారులపై టీడీపీ నాయకులు, ప్రజాప్రతినిధుల వేధింపులు నిలుపు చేయాలని కోరుతూ ఈనెల 29న నగరంలోని ధర్నా చౌక్‌లో జరిగే మహాధర్నాను జయప్రదం చేయాలని సీఐటీయూ సెంట్రల్ సిటీ అధ్యక్షుడు కె. దుర్గారావు కోరారు. హాకర్లు, చిరువ్యాపారుల పొట్టలు కొట్టొద్దని, వారి వ్యాపారాలు యథావిధిగా కొనసాగించుకునేందుకు సహకరించాలని డిమాండ్ చేస్తూ సీఐటీయూ ఆధ్వర్యంలో హాకర్లు, చిరువ్యాపారులు సోమవారం సూర్యారావుపేటలోని నక్కలరోడ్డులో ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా దుర్గారావు మాట్లాడుతూ తమ పాత వ్యాపారాలు యధావిధిగా కొనసాగించే విధంగా సంబంధిత అధికారులు చర్యలు చేపట్టాలని కోరారు. ప్రదర్శనలో సీఐటీయూ సెంట్రల్ సిటీ కోశాధికారి వై. సుబ్బారావు, విజయవాడ హాకర్స్ తోపుడుబండ్ల యూనియన్ ప్రధాన కార్యదర్శి సీహెచ్ మురళీ, నగర నాయకులు బాలబొమ్మ లక్ష్మణ్, అబ్దుల్లా తదితరులు పాల్గొన్నారు.

నేడు, రేపు తాగునీటి సరఫరాలో అంతరాయం

గుణదల, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): తాగునీటి సరఫరాకు సంబంధించిన 400 ఎంఎం డయా పంపింగ్ మెయిన్ మరమ్మతులు జరుగుతున్న కారణంగా ఈనెల 25, 26 తేదీల్లో నగరంలోని పలు ప్రాంతాల్లో తాగునీటి సరఫరాలో అంతరాయం కల్గనుందని నగర కమిషనర్ ధ్యానచంద్ర తెలిపారు. ప్రధాన పైపులైన్ మరమ్మతుల నేపథ్యంలో సీతారాపురం, మాచవరం డౌన్, నేతాజీ రోడ్, అరండల్‌పేట, గవర్నర్‌పేట, గులాముద్దీన్ నగర్ కొండ, కడియాల వారి వీధి, బ్రహ్మానంద రెడ్డి నగర్ 8వ రోడ్డు వరకు, నిమ్మతోట కొండ, విశాలాంధ్ర రోడ్డు, శ్రీనివాసరావు వీధి, బారెస్ట్ వారి వీధి, బంక పల్లివారి వీధి, బోయపాటి వారివీధి, టి.వెంకటేశ్వరరావు వీధి వరకు తాగునీటి సరఫరాలో అంతరాయం కలగనుందని చెప్పారు. 27 ఉదయం నుంచి యదావిధిగా నీటి సరఫరా కొనసాగుతుందని తెలిపారు.

9,13, 14 డివిజన్లలో ...

పటమట: విజయవాడ నగరపాలక సంస్థ సర్కిల్ త్రీ పరిధిలోని ఎన్ఎస్ఎం స్కూల్ రోడ్డు, జీడీఈటీ స్కూల్ వద్ద పంపింగ్ లైన్ లీక్ మరమ్మతుల నిమిత్తం ఈనెల 26 (బుధవారం)తేదీ సాయంత్రం నుంచి 27 (గురువారం) ఉదయం వరకు తాగు నీటి సరఫరా నిలిపివేయనున్నట్లు కార్పొరేషన్ అధికారులు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. 9, 13, 14 డివిజన్లకు సంబంధించి పటమట, రాఘవనగర్, పటమటలంక చేపల మార్కెట్, కృష్ణవేణిస్కూల్ రోడ్డు, ఎన్ఎస్ఎం స్కూల్ ఏరియా, సర్కిల్ త్రీ ఆఫీసు రోడ్డు, అంబేడ్కర్ నగర్, నల్లూరు సత్యనారాయణ నగర్, శాంతినగర్, దర్శిపేట, శివాలయం కొండ, లంబాడీ పేట, తోటవారి వీధి, లక్ష్మి హాస్పటల్ రోడ్డు, యలమంచిలి రామాలయం వీధి, ఠాగూర్ టైప్ ఇన్‌స్టిట్యూట్ తదితర ప్రాంతాల్లో నీటి సరఫరా నిలిపివేస్తామన్నారు. 27 సాయంత్రం నుంచి యథావిధిగా నీటి సరఫరా చేస్తామని తెలిపారు.

మెయిన్స్ పరీక్షల్లో ఐచ్ఛిక మార్పులకు అవకాశం ఇవ్వడంపై హర్షం

బెంజిసర్కిల్, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): ఏపీపీఎస్సీ గ్రూప్-1 మెయిన్స్ పరీక్షలకు మరోసారి ఐచ్ఛిక మార్పులకు అవకాశం ఇవ్వడం హర్షణీయమని ఏపీ నిరుద్యోగ జేఏసీ అధ్యక్షుడు సమయం హేమంత్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర మంత్రి లోకేష్‌కు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. దీనివల్ల అభ్యర్థులు ఈనెల 26నుంచి ఏప్రిల్ 2 వరకు పరీక్ష రాసే మాధ్యమం, పోస్టులు, జోనల్ ప్రాధాన్యం, పరీక్ష కేంద్రాల మార్పు, చేర్పులు చేసుకునే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు.





ఆంధ్రజ్యోతి డైలీ క్లాసిఫైడ్స్ DAILY CLASSIFIEDS

WANTED

▸ విజయవాడ మెట్రోపాలిటన్ హోటల్ వారికి స్టాఫ్ కావలెను. ఎలక్ట్రీషియన్, ప్లంబర్, ఫీల్డ్ ఆఫీసర్ (సెక్యూరిటీ), సౌత్ ఇండియన్ చెఫ్, హౌస్ కీపింగ్ బాయ్స్, సెక్యూరిటీ గార్డ్, ఆకర్షణీయమైన జీతం. సంప్ర: **72888 85598**

AJB- 1473

స్థలం అమ్మకము

2 **Tirupati toll gate near off NH 205,** 2.5 Acres High Rise Land Suitable for School, College any Commercial Activities. Cont: **9445253860.**

AJG-210519

పాఠకులకు ముఖ్య గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ఇతరత్రా నమ్మించబడిన /క్లెయిమ్స్‌కు, చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటనదారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు.

మేనేజర్ - ఏడీవీటీ

ఆంధ్రజ్యోతి క్లాసిఫైడ్స్

ప్రతి అవసరానికి - వేగవంతమైన ఫలితం

REAL ESTATE | SITUATION VACANT | TO LET | AUTOMOTIVE | COMPUTERS | HEALTH CARE | EDUCATION | ENTERTAINMENT

1 టౌన్: 99854 09286, పటమట: 99854 11868,

మీ కుటుంబసభ్యులు, బంధుమిత్రులు, శ్రేయోభిలాషులకు ఆంధ్రజ్యోతిలో ప్రకటనల ద్వారా తెలియజేయండి.



పూర్తి వివరములకు సంప్రదించండి: ఆంధ్రజ్యోతి ప్రాంతీయ కార్యాలయం
సర్వే నెం. 70/1 & 2, వెదురుపావులూరు, ముస్తాబాద, గన్నవరం మండలం, కృష్ణాజిల్లా. సెల్ : 99854 11609

పటమట : 99854 11868, ఎం.జి.రోడ్, గొల్లపూడి : 99854 85777, వన్‌టౌన్, భవానిపురం : 99854 09286, పెనమలూరు : 99854 09240, మధురానగర్, ఎస్.ఎన్.పురం, గాంధీనగర్ : 99854 11733 గన్నవరం, కంకిపాడు : 99854 11733, 99854 09240

ఆంధ్రజ్యోతి దినపత్రికలో ప్రకటనల (అడ్వర్టైజ్‌మెంట్) కోసం సంప్రదించాల్సిన నెంబర్లు
☏ 99854 11868, 99854 85777

ఆంధ్రజ్యోతి దినపత్రిక కావాల్సిన వారు ఈ కింది నెంబర్లను సంప్రదించగలరు
☏ సర్క్యులేషన్ మేనేజర్ 9985411604,
డీజీఎం : 9885821929, బీఎం : 99854 11234

మల్లవల్లికి మళ్లీ వెలుగులు

● మోడల్ పారిశ్రామిక పార్కుకు పరిశ్రమల కళ ● ప్రభుత్వ కృషితో త్వరలోనే మరిన్ని ● ప్లాట్లు పొందిన పారిశ్రామికవేత్తతో ఏపీఐఐసీ భేటీ ● 247 పరిశ్రమల స్థాపనకు పాత ధరలకే ప్లాట్ల కేటాయింపు ● వచ్చే ఆర్థిక సంవత్సరానికల్లా యూనిట్ల స్థాపనకు సన్నాహాలు ● పార్కులో యుద్ధ ప్రాతిపదికన మౌలిక వసతులు ● పరిశ్రమల స్థాపనకు పారిశ్రామికవేత్తల సన్నాహాలు

అమరావతి, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): గత వైసీపీ హయాంలో తీవ్ర నిరాదరణకు గురైన కృష్ణా జిల్లా మల్లవల్లిలోని మోడల్ ఇండస్ట్రియల్ పార్కుకు ఇప్పుడు మంచి రోజులు వచ్చాయి. ఇప్పటికే అశోక్ లేల్యాండ్ బస్ బాడీ బిల్డింగ్ ప్లాంట్ ప్రారంభంతో నవశకానికి నాంది పలకగా.. త్వరలోనే వివిధ రంగాలకు చెందిన పరిశ్రమలతో ఈ పారిశ్రామిక పార్కు కళకళలాడనుంది. రసాయన, ప్లాస్టిక్, లోహ, ఆహార, రక్షణ, ఏరోస్పేస్.. ఇలా వివిధ రంగాలకు చెందిన పరిశ్రమలను ఇక్కడ నెలకొల్పనున్నారు. వచ్చే ఆర్థిక సంవత్సరానికల్లా వందల సంఖ్యలో చిన్న, మధ్యతరహా పరిశ్రమలను నెలకొల్పి ఉత్పత్తిని ప్రారంభించాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం చకచకా చర్యలు చేపడుతోంది. ఇందులో భాగంగానే మల్లవల్లి పారిశ్రామిక పార్కులో ప్లాట్లు పొందిన పారిశ్రామికవేత్తలతో ఏపీఐఐసీ జోనల్ అధికారులు సోమవారం విజయవాడలో సమావేశం నిర్వహించారు. మల్లవల్లి పారిశ్రామిక పార్క్ రివైజ్డ్ లే-అవుట్‌లోని ఫేజ్-1, ఫేజ్-2లలో 247 మంది పారిశ్రామికవేత్తలకు వివిధ కేటగిరీల కింద పాత ధరలకే లాటరీ పద్ధతిలో మళ్లీ ప్లాట్లు కేటాయించారు. వీరిలో గతంలోనే పాట్లు పొందిన 136 మందికి 'సేమ్ పర్సన్ సేమ్ ప్లాట్' విభాగం కింద అవే పాట్లు దక్కాయి. తాజాగా ప్లాట్లు పొందిన పారిశ్రామికవేత్తలందరూ వచ్చే ఆర్థిక సంవత్సరానికల్లా పరిశ్రమలను నెలకొల్పి ఉత్పత్తులను ప్రారంభించాలని ఏపీఐఐసీ అధికారులు కోరారు.

వైసీపీ హయాంలో కక్షగట్టి వేధింపులు

సుమారు 150 ఎకరాల విస్తీర్ణంలో అభివృద్ధి చేసిన మల్లవల్లి పార్కులో 2019లో అప్పటి గత తెలుగుదేశం ప్రభుత్వం మొత్తం 378 మంది పారిశ్రామికవేత్తలకు ప్లాట్లు కేటాయించింది. అప్పట్లో ఎకరం రూ. 16.5 లక్షల చొప్పున రేటు నిర్ణయించింది. ప్రభుత్వ ధర ప్రకారం పూర్తిగా సొమ్ము చెల్లించి ప్లాట్లు పొందిన పారిశ్రామికవేత్తలు పరిశ్రమలను నెలకొల్పేందుకు ఉత్సాహంగా సన్నాహాలు చేసుకుంటున్న దశలో ప్రభుత్వం మారిపోయి వైసీపీ అధికారంలోకి వచ్చింది. ఆ వెంటనే కక్షాపూరితంగా పారిశ్రామికవేత్తలపై టీడీపీ ముద్ర వేసి వారిని రకరకాలుగా వేధించింది. పారిశ్రామిక పార్కులో కనీసం రోడ్డు కూడా వేయనీయలేదు. పైగా పైగా టీడీపీ ప్రభుత్వం ఎకరాకు రూ. 16.5 లక్షల చొప్పున రేటు నిర్ణయిస్తే.. దానిని ఒకేసారి నాలుగు రెట్లు పెంచేసి ఎకరాకు రూ. 65 లక్షల చొప్పున చెల్లించాలని ఏపీఐఐసీ ద్వారా నోటీసులు జారీ చేయించింది. వైసీపీ సర్కారు వేధింపులు భరించలేక మల్లవల్లి పార్కులో పాట్లు పొందిన పారిశ్రామికవేత్తలంతా యూనిట్లు నెలకొల్పకుండా స్థలాలను ఖాళీగా వదిలేశారు. కొంత మంది తమకు జరిగిన అన్యాయంపై కోర్టులను ఆశ్రయించారు. దాంతో గత ఐదేళ్లు వివాదాలతో మల్లవల్లి పారిశ్రామికపార్కు కళతప్పింది. టీడీపీ నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో మళ్లీ ఈ పారిశ్రామిక పార్కు పరిశ్రమలతో, వేలాది ఉద్యోగులతో కళకళలాడనుంది.

క్యాబినెట్ ఆమోదంతో చకచకా పనులు

ఐదు ఏళ్ల పాటు అతీగతీ లేకుండా పడి ఉన్న ఈ పారిశ్రామిక పార్కులో సమస్యలను పరిష్కరించాలని అధికారంలోకి వచ్చిన వెంటనే సీఎం చంద్రబాబు నిర్ణయించారు. ఇక్కడ వీలైనంత త్వరగా పరిశ్రమలను నెలకొల్పేందుకు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఆ తర్వాత 378 మంది పారిశ్రామికవేత్తలకు పాత ధరల ప్రకారం.. అంటే ఎకరం రూ.16.5 లక్షలకే కేటాయించేందుకు రాష్ట్ర క్యాబినెట్ ఆమోదం తెలిపింది. ఆ మేరకు గత ఏడాది అక్టోబరులోనే పరిశ్రమలశాఖ ఉత్తర్వులు విడుదల చేసింది. అంతేకాకుండా స్పెషల్ అసిస్టెన్స్ టు స్టేట్స్ ఫర్ క్యాపిటల్ ఇన్వెస్ట్‌మెంట్ పథకం కింద ఈ పారిశ్రామికవాడలో మౌలిక సదుపాయాల కల్పనకు రూ. 1,000 కోట్ల రుణానికి ప్రభుత్వం హ్యాండ్ హోల్డింగ్ ఇచ్చింది. దాంతో ఏపీఐఐసీ అధికారులు మల్లవల్లి పారిశ్రామిక పార్కులో అవసరమైన మౌలిక సదుపాయాల కల్పన పనులను యుద్ధప్రాతిపదికన ప్రారంభించారు. ఇప్పటికే రోడ్లు, విద్యుత్తు లైన్ల పనులు దాదాపు పూర్తికావచ్చాయి. దాంతో వీలైనంత త్వరగా ఇక్కడ పరిశ్రమలను నెలకొల్పేందుకు రంగం సిద్ధం చేస్తున్నారు. పల్లం ప్రాంతలో ఉన్న భూములు, కోర్టు వివాదాల్లో ఉన్న ప్లాట్లను మినహాయించి వేసిన రివైజ్డ్ లే-అవుట్‌లో 247 ప్లాట్లను లాటరీ పద్ధతిలో పారిశ్రామికవేత్తలకు పాత ధరల ప్రకారమే కేటాయించడంతో.. ఇక్కడ పరిశ్రమలు నెలకొల్పేందుకు పాట్లు పొందిన పారిశ్రామికవేత్తలు సన్నాహాలు చేసుకుంటున్నారు.

భూమి పూజకు సిద్ధంగా ఉన్నాం

● జీఎన్‌బీ చౌదరి, మల్లవల్లి ఇండస్ట్రీస్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి

ప్రభుత్వం లాటరీ పద్ధతిలో మాకు కేటాయించిన ప్లాట్లకు సంబంధించిన ఎలాట్‌మెంట్ లెటర్స్ ఇచ్చిన వెంటనే పరిశ్రమల స్థాపనకు భూమి పూజ చేసేందుకు సిద్ధంగా ఉన్నాం. ఏడాదిలోగానే అన్ని యూనిట్లను నెలకొల్పి ఉత్పత్తి ప్రారంభించేలా చర్యలు తీసుకుంటాం. 2016లోనే 'మల్లవల్లి ఇండస్ట్రీస్ అసోసియేషన్'ను స్థాపించాం. ఏపీఐఐసీ అధికారులు సోమవారం లాటరీ పద్ధతిలో కేటాయించిన 247 ప్లాట్లలో 168 ప్లాట్లు హైదరాబాద్‌కు చెందిన పారిశ్రామికవేత్తలకు లభించాయి. సేమ్ పర్సన్ సేమ్ ప్లాట్ విభాగం కింద ప్లాట్లు లభించిన 136 మంది పారిశ్రామికవేత్తల్లో 100 మంది హైదరాబాద్‌కు చెందినవారే. మల్లవల్లి పార్కులో దాదాపు రూ. 1000 కోట్లకు పైగా పెట్టుబడులు పెట్టనున్నారు. 8 వేల మందికి ఉద్యోగాలు లభించనున్నాయి. అనుబంధ పరిశ్రమలతోపాటు టెస్టింగ్ లేబొరేటరీలు కూడా ఇక్కడ ఏర్పాటు కానున్నాయి.



మంగళగిరి జనసేన కార్యాలయం వద్ద ఇంజనీరింగ్ అసిస్టెంట్‌లు

సమస్యలు పరిష్కరించాలంటూ వినతి

● డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ఓఎస్‌డీకి వినతి పత్రం

బెంజిసర్కిల్, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ గ్రామ సచివాలయ ఇంజనీరింగ్ అసిస్టెంట్లు సోమవారం మంగళగిరిలోని జనసేన కార్యాలయం వద్దకు వెళ్లి డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ఓఎస్‌డీకి వినతి పత్రం అందజేశారు. గ్రామ సచివాలయ వ్యవస్థ ద్వారా నియమితులైన ఇంజనీరింగ్ అసిస్టెంట్‌లైన తమను నాన్ ఇంజనీరింగ్ పనులకు వినియోగించుకుంటున్నారన్నారు. డిప్లొమా, బీటెక్ అర్హతతో నియామకం చేసి టెన్త్ విద్యార్హత ఉన్న కేడర్‌లో ఉంచి అన్యాయం చేశారన్నారు. తమకు ఇప్పటి వరకు పదోన్నతి విధానం లేదన్నారు. డిప్యూటీ సీఎం దృష్టికి తమ సమస్యలను తీసుకువెళతామని ఓఎస్‌డీ హామీ ఇచ్చారన్నారు.

కూటమి పార్టీల వైఖరి రాష్ట్రానికి హానికరం: సీపీఎం

గవర్నర్‌పేట, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): పార్లమెంటు నియోజకవర్గాల పునర్విభజన విషయంలో కూటమి పార్టీలు అనుసరిస్తున్న వైఖరి రాష్ట్రానికి హానికరమని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు అన్నారు. సోమవారం ఎంజీ రోడ్డులోని బాలోత్సవ్ భవన్‌లో మీడియా సమావేశంలో మాట్లాడుతూ నియోజవర్గాల పునర్విభజన విషయంలో టీడీపీ, జనసేన పార్టీలు తమ వైఖరి చెప్పాలని డిమాండ్ చేశారు. డీలిమిటేష్‌పై డీఎంకె చెన్నైలో ఏర్పాటు చేసిన సమావేశానికి మన రాష్ట్రం నుంచి కాకుండా దక్షిణ భారతదేశంలోని అన్ని రాష్ట్రాల నుంచి అన్ని పార్టీల ప్రతినిధులు ఒకే తాటిపైకి వచ్చి హాజరయ్యారని, ఇది రాష్ట్ర ప్రయోజనాలను దెబ్బతీస్తుందన్నారు. మోదీతో దోస్తీ కోసం రాష్ట్ర ప్రయోజనాలను దెబ్బతీస్తున్నారని, టీడీపీ, జనసేన గోడపై పిల్లివాటంగా వ్యవహరిస్తున్నారన్నారు. సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు వై.వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

నగర క్రీడాకారిణికి సిల్వర్ మెడల్



విజయవాడ స్పోర్ట్స్, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): ఉత్తరప్రదేశ్‌లోని గ్రేటర్ నోయిడా ఈ నెల 16 నుంచి 22 వరకు జరిగిన 2వ ఇండియన్ ఇంటర్నేషనల్ సాఫ్ట్ టెన్నిస్ చాంపియన్‌షిప్ మహిళా టీమ్ విభాగంలో భారత జట్టు సిల్వర్ మెడల్ సాధించింది. విజయవాడకు చెందిన క్రీడాకారిణి ఎన్.అనూష భారత జట్టుకు ఆంధ్రప్రదేశ్ తరఫున ప్రాతినిధ్యం వహించిందని ఆంధ్రప్రదేశ్ సాఫ్ట్ టెన్నిస్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి డి.దిలీప్ కుమార్ తెలిపారు. అలాగే ఈ నెల 23 నుంచి 26 వరకు అక్కడే జరుగుతున్న సౌత్ ఏషియన్ సాఫ్ట్ టెన్నిస్ చాంపియన్‌షిప్‌లో భారత జట్టుకు ప్రాతినిధ్యం వహిస్తుందన్నారు. ఈ సందర్భంగా అనూషకు శాప్ చైర్మన్ అనిమిని రవినాయుడు, సాఫ్ట్ టెన్నిస్ అసోసియేషన్ చైర్మన్ దారం నవీన్ కుమార్ అభినందనలు తెలిపారు.

ఏపీ మెడికల్ కౌన్సిల్ సభ్యుడిగా డాక్టర్ సూర్యదేవర



గవర్నర్‌పేట, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): వైద్య రంగంలో విశేష సేవలందించిన డాక్టర్ సూర్యదేవర కేశవరావుబాబు ఆంధ్రప్రదేశ్ మెడికల్ కౌన్సిల్ సభ్యుడిగా నియమితులయ్యారు. ఈ మేరకు సోమవారం రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఆంధ్ర వైద్య విశ్వవిద్యాలయం నుంచి ఎంబీబీఎస్ పూర్తి చేసిన డాక్టర్ కేశవరావుబాబు మధుమేహ చికిత్స నిపుణుడిగా పేరు గడించారు. వీఎంసీలో ఓడీపీ ప్రాజెక్టు వైద్యాధికారిగా, వీఎంసీ అర్బన్ హెల్త్ సెంటర్ మెడికల్ ఆఫీసర్‌గా, వీఎంసీ స్కూల్ హెల్త్ ప్రాజెక్టు హెల్త్ ఆఫీసర్‌గా సేవలందించారు. ఇండియన్ మెడికల్ అసోసియేషన్ (ఐఎంఏ) నగరాధ్యక్షుడిగా కూడా పనిచేశారు. ప్రస్తుతం ఐఎంఏ రాష్ట్ర వర్కింగ్ కౌన్సిల్ సభ్యుడిగా ఉన్నారు. మెడికల్ కౌన్సిల్ సభ్యుడిగా నియమితులైన కేశవరావు బాబును వైద్యనిపుణులు, నగర ప్రముఖులు అభినందించారు.



క్షయ నివారణ ర్యాలీలో పాల్గొన్న నర్సింగ్ కళాశాల విద్యార్థినులు

క్షయ రహిత జిల్లాగా తీర్చిదిద్దడమే లక్ష్యం

● జిల్లా క్షయ వ్యాధి నివారణ అధికారి డాక్టర్ ఉషారాణి

కలెక్టరేట్, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): క్షయవ్యాధి రోగులను గుర్తించి చికిత్సతో పాటు పౌష్టికాహారాన్ని అందిస్తున్నామని వ్యాధి నివారణపై ప్రజల్లో అవగాహన కల్పించి వ్యాధిని నివారణ ద్వారా క్షయ రహిత జిల్లాగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నట్టు జిల్లా క్షయ వ్యాధి నివారణ అధికారి డాక్టర్ జె.ఉషారాణి తెలిపారు. ప్రపంచ క్షయవ్యాధి నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకొని పాత ప్రభుత్వాసుపత్రి వద్ద జిల్లా క్షయవ్యాధి నివారణ సంస్థ ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన అవగాహన ర్యాలీని జిల్లా క్షయ వ్యాధి నివారణ అధికారి డాక్టర్ జె.ఉషారాణి, డీఎంహెచ్‌వో డాక్టర్ ఎం.సుహాసిని, ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఎ.వెంకటేశ్వరరావు ప్రారంభించారు. డాక్టర్ జె.ఉషారాణి మాట్లాడుతూ జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో 48 నిక్షయ్ మిత్రలను ఏర్పాటు చేసి 2,411 మంది రోగులకు ప్రతి నెల పౌష్టికాహార కిట్లను పంపిణీ చేస్తున్నట్టు తెలిపారు. జిల్లా వైద్య ఆరోగ్య అధికారిణి డాక్టర్ ఎం.సుహాసిని మాట్లాడుతూ వైద్యాధికారులు, సిబ్బంది ప్రతి గ్రామంలోనూ పర్యటించి క్షయ వ్యాధిగ్రస్థులను గుర్తించి మెరుగైన చికిత్సను అందించేలా చర్యలు తీసుకొంటున్నామన్నారు. ఈ సందర్భంగా ప్రభుత్వ నర్సింగ్ కళాశాల, డాక్టర్ రమేష్ నర్సింగ్ కళాశాల విద్యార్థినులు క్షయ వ్యాధి నివారణపై ప్రజలకు అవగాహన కల్పించేలా ప్రదర్శించిన కళారూపాలు, రంగవల్లులు ఆహూతులను ఆకట్టుకున్నాయి. ఈ ర్యాలీలో జిల్లా మలేరియా అధికారి డాక్టర్ మోతిబాబు, జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి డాక్టర్ శరత్, ప్రభుత్వాసుపత్రి పల్మనాలజీ డిపార్ట్‌మెంట్ హెచ్‌వోడీ డాక్టర్ సుధీనా, డాక్టర్ శిరీష, డిప్యూటీ ఆర్ఎంవో డాక్టర్ శోభారాణి, క్షయ వ్యాధి నివారణ అధికారులు, సిబ్బంది, నర్సింగ్ కళాశాల విద్యార్థులు, పాత ప్రభుత్వాసుపత్రి వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

అర్జీలకు నాణ్యమైన పరిష్కారం

● ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశ



కలెక్టర్‌కు సమస్యను వివరిస్తున్న సభ్యులు

కలెక్టరేట్, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కార వేదికలో అందిన అర్జీలకు త్వరగా నాణ్యమైన పరిష్కారం చూపాలని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశ అధికారులను ఆదేశించారు. ప్రజా సమస్యల పరిష్కార వేదికలో భాగంగా సోమవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో కలెక్టర్ లక్ష్మీశ ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పీజీఆర్ఎస్‌లో నమోదవుతున్న అర్జీలకు నిర్ణీత గడువులోగా పరిష్కారం చూపాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. అర్జీలు ఏ స్థాయిలోనూ పెండింగ్ ఉండరాదన్నారు. డీఆర్వో ఎం. లక్ష్మీ నరసింహం, గ్రామ, వార్డు సచివాలయ ప్రత్యేక అధికారి జి.జ్యోతి, ఏసీపీ కె.వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

ప్రభుత్వ కాంట్రాక్టు ఉద్యోగులుగా గుర్తించండి

ఎన్టీఆర్ వైద్య సేవ పథకంలో పనిచేస్తున్న ఫీల్డ్ సిబ్బంది జిల్లా మేనేజర్, టీం లీడర్, ఆఫీస్ అసోసియేట్, ఆరోగ్య మిత్ర సీసీ డీఈవో, సిబ్బంది 17 ఏళ్ల సర్వీసుని పరిగణలోకి తీసుకొని ఫీల్డ్ సిబ్బంది అందరినీ ప్రభుత్వ పరిధిలో ప్రభుత్వ కాంట్రాక్టు ఉద్యోగులుగా గుర్తించాలని కలెక్టర్ లక్ష్మీశకు విన్నవించారు. సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదికలో సిబ్బంది తమను ప్రభుత్వ కాంట్రాక్టు ఉద్యోగులుగా గుర్తించి జీఓ నెం.7లో కేటగిరి 1 డీపీవో క్యాడర్ అమలు, కనీస వేతనం అమలు చేయాలన్నారు.

రబీ ధాన్యం కొనుగోలుపై శిక్షణ

ఈ ఏడాది రబీ సీజన్‌కు సంబంధించి ధాన్యం కొనుగోళ్లపై ఈనెల 25 నుంచి 27 వరకు డివిజన్, మండల స్థాయిలో సిబ్బందికి శిక్షణ తరగతులు నిర్వహించాలని కలెక్టర్ లక్ష్మీశ అధికారులను ఆదేశించారు. ఇందులో భాగంగా 25న మంగళవారం తిరువూరు, 26న నందిగామ, 27 విజయవాడ డివిజన్ పరిధిలో శిక్షణ తరగతులు నిర్వహించడం జరుగుతుందన్నారు. క్లస్టర్ల రైతు సేవా కేంద్రాల టెక్నికల్ అసిస్టెంట్లు, డేటా ఎంట్రీ ఆపరేటర్లు, హెల్పర్లు, వ్యవసాయ సహాయకులు, ఇన్‌చార్జిలు పాల్గొనాలన్నారు.

క్షయ వ్యాధి రహిత జిల్లాగా తీర్చిదిద్దుతాం...

క్షయ వ్యాధి నివారణపై ప్రజల్లో పూర్తి అవగాహన కల్పించి వ్యాధిగ్రస్థులను గుర్తించి చికిత్సతో పాటు పౌష్టికాహారాన్ని అందించి జిల్లాను క్షయ రహిత జిల్లాగా తీర్చిదిద్దడంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని కలెక్టర్ లక్ష్మీశ కోరారు. ప్రపంచ క్షయ వ్యాధి నివారణ దినోత్సవం సందర్భంగా జిల్లా క్షయ వ్యాధి నివారణ సంస్థ ఆధ్వర్యంలో క్షయ వ్యాధి నివారణ అవగాహనపై రూపొందించిన వాల్‌పోస్టర్లను సోమవారం ఆయన కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో ఆవిష్కరించారు. జిల్లాలో టీబీ ముక్త్ పథకం ద్వారా గుర్తించిన పంచాయతీలకు ప్రశంసాపత్రాలను అందజేశారు. అనంతరం మాట్లాడుతూ వైద్యాధికారులు, సిబ్బంది ప్రతి గ్రామంలోను పర్యటించి క్షయ వ్యాధిగ్రస్థులను గుర్తించి వారికి మెరుగైన చికిత్సను అందించడంతో పాటు క్రమం తప్పకుండా పౌష్టికాహారాన్ని పంపిణీ చేయాలన్నారు. డీఆర్వో ఎం.లక్ష్మీ నరసింహం, జిల్లా క్షయ నివారణ అధికారి డాక్టర్ జె.ఉషారాణి, డీఎంహెచ్‌వో డాక్టర్ ఎం.సుహాసిని, డీఎంవో డాక్టర్ మోతి బాబు, డిప్యూటీ ఆర్ఎంవో డాక్టర్ శోభారాణి పాల్గొన్నారు.



సీఆర్‌డీఏ కార్యాలయంలో ప్లాట్ల కేటాయింపునకు హాజరైన రైతులు

గన్నవరం రైతులకు రాజధానిలో ప్లాట్లు

వన్‌టౌన్, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): గవర్నర్‌పేట, లెనిన్ సెంటర్‌లోని ఆంధ్రప్రదేశ్ రాజధాని ప్రాంత అభివృద్ధి ప్రాధికార సంస్థ (సీఆర్‌డీఏ) కార్యాలయంలో సోమవారం ఈ-లాటరీ విధానం ద్వారా గన్నవరం రైతులకు 227 రిటర్నబుల్ ప్లాట్లు కేటాయించారు. గన్నవరం విమానాశ్రయం అభివృద్ధికి భూములిచ్చిన 99 మంది రైతులకు 227 రిటర్నబుల్ ప్లాట్లు కేటాయించారు. వీటిలో 147 నివాస ప్లాట్లు కాగా, 80 వాణిజ్య ప్లాట్లున్నాయి. ఈ-లాటరీకి హాజరైన రైతులకు ఆన్‌లైన్ ర్యాండమ్ సిస్టమ్ ద్వారా నివాస, వాణిజ్య ప్లాట్లకు ముందుగా ట్రయల్‌రన్ వేసి తరువాత ప్రత్యక్ష లాటరీ ప్రక్రియను నిర్వహించారు. రిటర్నబుల్ ప్లాట్లు పొందిన రైతులకు గుడివాడ రెవెన్యూ డివిజన్ అధికారి (ఆర్‌డీవో) బాలసుబ్రహ్మణ్యంతో కలిసి సీఆర్‌డీఏ అధికారులు ప్రొవిజనల్ సర్టిఫికెట్లు అందజేశారు. ఈ సందర్భంగా స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ (భూ సేకరణ) ఎన్.ఎస్.వి.బి వసంత నాయుడు మాట్లాడుతూ ప్లాట్లు పొందిన రైతులకు భౌగోళికంగా వారి ప్లాట్లు ఎక్కడ కేటాయించబడ్డాయో వివరించటానికి ప్రత్యేకంగా జీఐఎస్ సిబ్బంది, గ్రామ సర్వేయర్లను నియమించామన్నారు. రిటర్నబుల్ ప్లాట్లు పొందిన రైతులు రిజిస్ట్రేషన్ ప్రక్రియను త్వరగా పూర్తి చేసుకోవాలని కోరారు. రిజిస్ట్రేషన్‌కు ఎలాంటి రుసుము వసూలు చేయబడదన్నారు. సీఆర్‌డీఏ సిబ్బంది పాల్గొన్నారు.

డాక్టర్ శ్రీహరిరావు పేరు ఎత్తగానే మాజీ ఎమ్మెల్యేకు ఎందుకంత ఉలుకు..?

● ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్

అవనిగడ్డ, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): గ్రామంలో హత్యకు గురైన డాక్టర్ కోట శ్రీహరిరావు పేరెత్తగానే మాజీ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు ఎందుకు ఉలికిపాటుకు గురవుతున్నారని ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ ప్రశ్నించారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ డాక్టర్ కోట శ్రీహరిరావు హత్య విషయమై సీబీసీఐడీకి అప్పగించాలని తాను అసెంబ్లీలో ప్రస్తావిస్తే తనకు, హత్యకు ఎలాంటి సంబంధం లేదంటూ గుమ్మడికాయ దొంగలా మాజీ ఎమ్మెల్యే భుజాలు తడుముకుంటున్నారన్నారు. అవనిగడ్డ - కోడూరు ప్రధాన రహదారి నిర్మాణానికి ఉన్న అడ్డంకులు తొలగించేందుకు కృషి చేస్తున్నానన్నారు. అటవీ అధికారుల పనితీరుతో సీఎం చంద్రబాబు ఆశయాలు ముందుకు సాగటం లేదని, వీరిపై తాను సీఎం చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ దృష్టికి తీసుకెళ్లానన్నారు. పీసీ చైర్మన్ దేవనబోయిన వెంకటేశ్వరరావు, డీసీ చైర్మన్లు అయినపూడి భాను ప్రకాష్, బండ్రెడ్డి నాగమల్లిఖార్జునరావు పాల్గొన్నారు.

ఉపాధి హామీ పథకం సిబ్బంది చేతివాటం

● బినామీ పేర్లతో మల్లె రైతుల రాయితీలను నొక్కేసిన ఇంటి దొంగలు
● రైతుల ఫిర్యాదుతో వెలుగులోకి
● ఇద్దరు ఫీల్డ్ అసిస్టెంట్లు, 22 మంది మేట్ల పాత్ర ఉన్నట్టు గుర్తింపు
● వేటుకు సిద్ధమవుతున్న ఉన్నతాధికారులు



చంద్రగూడెంలోని మల్లె తోట

మైలవరం రూరల్, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం (ఎన్ఆర్ఈజీఎస్) అవినీతి కంపు కొడుతోంది. మైలవరం రూరల్ పరిధిలో రైతులకు చెల్లించాల్సిన డబ్బులను ఉపాధి హామీ మేట్‌లు దిగమింగేశారు. ఫీల్డ్ అసిస్టెంట్ల పర్యవేక్షణ లేమితో రైతుల ప్రయోజనాలను ఉపాధి హామీ మేట్లు నొక్కేశారు. రైతుల నుంచి పెద్ద ఎత్తున ఫిర్యాదులు రావటంలో అధికారులు విచారణ జరిపారు. బాధ్యులైన ఇద్దరు ఫీల్డ్ అసిస్టెంట్లను 22 మంది ఉపాధి హామీ మేట్లపై వేటు వేసేందుకు రంగం సిద్ధం చేశారు. మండలంలోని చంద్రగూడెంలో ఉద్యాన పంటల పథకంలో చోటు చేసుకున్న మోసం సోమవారం బయటపడింది. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద ఉద్యాన పంటల సాగుకు ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తుండటంతో రైతులు మల్లె సాగుకు మొగ్గుచూపుతున్నారు. పలు రకాల ఉద్యాన మొక్కలను రాయితీపై అందిస్తుండగా మొక్కలు నాటేందుకు గోతులు తీయడం, పెంపకం, ఎరువులు అందించే వరకు రాయితీలను ప్రభుత్వం అందిస్తోంది. దీనికి జాబ్‌కార్డు తప్పనిసరి. సన్న, చిన్న కారు రైతులు ఉద్యాన పంటల సాగుకు ముందుకొస్తున్నారు. తోటల పెంపకానికి అయ్యే కూలీల ఖర్చును రైతులకు, జాబ్‌కార్డుదారులకు నగదు జమ చేస్తారు. చంద్రగూడెంలో పలువురు రైతులకు మల్లె మొక్కలను అందజేయగా రైతులు నాటడం పూర్తయింది. నగదు అకౌంట్లలో జమ చేసే సమయానికి పథకంలో గ్రామంలో పనిచేస్తున్న సిబ్బంది చేతివాటం ప్రదర్శించడంతో రైతులు కంగుతిన్నారు. రైతులతో పాటు, మేట్‌లు, సిబ్బందికి నమ్మకస్తుల పేర్లు ఎక్కించి వేలాది రూపాయలను వారి ఖాతాల్లో జమ చేయించారు. నగదు ఎవరి ఎవరి అకౌంట్లలో వేశారో ఆరా తీసిన నలుగురు రైతులు తాము మోసపోయినట్టు గుర్తించారు. అధికారులకు మస్తర్ల మోసం గురించి ఫిర్యాదు చేయడంతో విషయం బయటకొచ్చింది. ఏపీవో వెంకటేశ్వరరావును వివరణ కోరగా మస్తర్లలో జరిగిన మోసంపై ముగ్గురు రైతులు ఫిర్యాదు చేశారని, రూ.21వేలు వేరే వారి అకౌంట్లలో జమ అయినట్లు గుర్తించామని, సిబ్బందితో నగదును రికవరీ చేస్తున్నామని, ఇద్దరు ఫీల్డ్ అసిస్టెంట్లును, 22 మంది మేట్‌లను తొలగిస్తామన్నారు. గ్రామంలోని మిగిలిన రైతుల విషయంలోనూ మస్తర్లలో మోసం జరిగిందా, లేదా అని విచారణ చేస్తున్నామన్నారు.

వినియోగదారుల హక్కులకు భరోసా

● మంత్రి నాదెండ్ల మనోహర్



అదనపు కన్స్యూమర్ ఫోరంను ప్రారంభిస్తున్న మంత్రి

విజయవాడ లీగల్, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): వినియోగదారుల హక్కులకు రక్షణ, భరోసా కల్పించేందుకు కృషి చేస్తామని మంత్రి నాదెండ్ల మనోహర్ తెలిపారు. విజయవాడ సిటీ సివిల్ కోర్టులో వినియోగదారుల కమిషన్ రెండో అదనపు బెంచ్‌ను సోమవారం నూతన కోర్టుల బిల్డింగ్ రెండో అంతస్తులో మంత్రి మనోహర్, పౌరసరఫరాల శాఖ కమిషనర్ సౌరవ్ గౌర్, ఫోరం చైర్మన్, బెజవాడ బార్ కార్యవర్గసభ్యులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాణ్యతలేని సరుకులు, కాలం చెల్లిన వస్తువులు అమ్ముతూ వినియోగదారులను మోసం చేసే వారిపై చట్టపరంగా తగిన చర్యలు తీసుకుంటామన్నారు. విజయవాడలో వినియోగదారుల హక్కులకు వేదికగా ఈ అదనపు బెంచ్ పనిచేస్తుందన్నారు. అంతేకాకుండా వినియోగదారులకు తగిన సమాచారంతో పాటు రాష్ట్రవ్యాప్తంగా వినియోగదారుల హక్కులపై అవగాహన కల్పిస్తామన్నారు. రాష్ట్రంలో 1,33,736 కేసులు వినియోగదారుల ఫోరంలో నమోదు చేస్తే చాలా వరకు పరిష్కరించడం జరిగిందన్నారు. వినియోగదారుల జిల్లా ఫోరంలో రూ.50లక్షల విలువ వరకు, రాష్ట్ర ఫోరంలో రూ.2కోట్ల విలువ వరకు కేసులు నమోదు చేయవచ్చన్నారు. వినియోగదారుడే రాజు అని, ప్రజలు ఎవర్నీ చూసి భయపడాల్సిన అవసరం లేదన్నారు. దేశంలో మొదటిసారి రాష్ట్రంలో డిజిటల్ క్యాంపెయిన్‌ను స్కూల్స్, కాలేజీల్లో ప్రచారం చేస్తామన్నారు. మచిలీపట్నం వెళ్లాలంటే వినియోగదారులకు గతంలో ఇబ్బందిగా ఉండేదన్నారు. ఇప్పుడు విజయవాడలో వినియోగదారుల హక్కుల కోసం అదనపు బెంచ్‌ను ప్రారంభించడం సంతోషంగా ఉందన్నారు. పౌరసరఫరాల శాఖ కమిషనర్ సౌరవ్‌గౌర్, విజయవాడ వినియోగదారుల అదనపు బెంచ్ ఫోరం చైర్మన్ సీహెచ్.కిషోర్, సభ్యులు కె.శశికళ, బెజవాడ బార్ అధ్యక్ష, కార్యదర్శులు కె.చంద్రమౌళి, అరిగెల శివరాం ప్రసాద్ (రాజా), ఏపీ బార్ కౌన్సిల్ సభ్యులు సుంకర రాజేంద్రప్రసాద్, సూరాబత్తుల మల్లేశ్వరరావు, చలసాని అజయ్‌కుమార్, బార్ మాజీ అధ్యక్షులు సోము కృష్ణ మూర్తి, వి.గురునాథం, సంపర శ్రీనివాస్ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ లక్ష్మీశ

27న విజయవాడలో ముస్లిం సోదరులకు ఇఫ్తార్ విందు

ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశ

కలెక్టరేట్, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): పవిత్ర రంజాన్ మాసాన్ని పురస్కరించుకొని రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో ఈనెల 27న ముస్లిం సోదరులకు విజయవాడలోని ఏ ప్లస్ కన్వెన్షన్ హాల్‌లో నిర్వహించే ఇఫ్తార్ విందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు హాజరవుతారని, వివిధ శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి విజయవంతం చేయాలని కలెక్టర్ లక్ష్మీశ అధికారులను ఆదేశించారు. దీనిపై చర్చించేందుకు కలెక్టర్ లక్ష్మీశ అధ్యక్షతన సోమవారం కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో సమన్వయ సమావేశం జరిగింది. ఈ ఆయన మాట్లాడుతూ ఆధ్యాత్మిక వాతావరణంలో కార్యక్రమం సజావుగా జరిగేందుకు అధికారులు ప్రణాళిక ప్రకారం ఏర్పాట్లు చేయాలన్నారు. విజయవాడ ఆర్డీవో కావూరి చైతన్య, వక్ఫ్‌బోర్డు సీఈవో షేక్ మహ్మద్ ఆలీ, మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ ఎండీ యాకూబ్ బాషా, జిల్లా మైనార్టీ సంక్షేమ అధికారి అబ్దుల్ రబ్బాని, వక్ఫ్ ఇన్‌స్పెక్టర్ ఖాజా మస్తాన్, మైనార్టీల ప్రతినిధులు నాగుల్‌మీరా, ఎంఎస్ బేగ్, ఫతావుల్లా, ఫిరోజ్, రఫీ, ఖాజా, సత్తార్, ఫైజాన్, షమీ, షకీల్‌తో పాటు రెవెన్యూ, పోలీస్, వీఎంసీ, వైద్య ఆరోగ్యం తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.

మీకు తెలుసా?



పచ్చిమిరప... 'రెండంచుల కత్తి'

పచ్చిమిరప లేనిదే తెలుగు భోజనం పూర్తి కాదు. కొందరికి నాలుకకు కారం చురుకు తగలనిదే భోజనం ఏమాత్రం రుచించదు. అలాగని ప్రతి కూరలో పచ్చిమిరపకాయలను దట్టిస్తే మాత్రం ఆరోగ్యానికి చేటే! ఎందుకో తెలుసుకుందాం!

సమతులాహారంలో ప్రతి కూరగాయకూ ప్రత్యేక పాత్ర ఉంటుంది. అయితే పచ్చిమిరపకు ఈ సూత్రం వర్తించదు. ఒక భోజనంలో ఒక పచ్చిమిరపకాయకు పరిమితమైతే, చర్మం నునుపుగా మారుతుంది. శరీరం శక్తిని ఖర్చు చేసుకునే వేగం పెరుగుతుంది. ఒక భోజనంలో ఒక పచ్చిమిరప, బరువు తగ్గడానికి కూడా కొంతమేరకు సహాయపడుతుంది. విటమిన్లు, యాంటీఆక్సిడెంట్లను కలిగి ఉండే పచ్చిమిరపకాయలను తినడం ఆరోగ్యకరమే అయినప్పటికీ వాటిలోని క్యాప్సైసిన్ పరిమాణం ప్రభావం జీర్ణాశయం లోపలి పొరను దెబ్బతీయకుండా ఉండాలంటే, వాటిని పరిమితంగానే తీసుకోవాలంటున్నారు ముంబయిలోని అపోలో స్పెక్ట్రా సీనియర్ డైటీషియన్, ఫౌజియా అన్సారి. పచ్చిమిరపకాయలను అతిగా తినడం వల్ల ఛాతీలో మంట, అసిడిటీలు వేధిస్తాయని హెచ్చరిస్తున్నారామె. మరీ ముఖ్యంగా పొట్టలో అల్సర్లు ఉన్నవాళ్లు, పచ్చిమిరపకాయలను వీలైనంత తగ్గించాలనీ, లేదంటే పరిస్థితి మరింత దిగజారుతుందనీ అంటున్నారామె. ఒకవేళ పచ్చిమిరపకాయలను తినడాన్ని ఇష్టపడేవాళ్లైతే, ముదురు ఆకుపచ్చ, లేదా పండు మిరపకాయలకు బదులుగా లేత ఆకుపచ్చ రంగు మిరపకాయలు తినడం మేలని కూడా సూచిస్తున్నారామె.

డయాగ్నొసిస్

కాలేయం కథ చెప్పే... 'ఫైబ్రోస్కాన్'

కాలేయ ఆరోగ్యాన్ని కచ్చితంగా నిర్ధారించడం కోసం, వైద్యులు ఫైబ్రోస్కాన్ పరీక్ష మీదే ఆధారపడుతూ ఉంటారు. కోతతో పనిలేని ఈ అల్ట్రాసౌండ్ పరీక్ష ఎవరికి? ఈ పరీక్షతో కాలేయ స్థితిని ఏ మేరకు అంచనా వేయొచ్చు?

ఫైబ్రోస్కాన్ ఎందుకు?: కాలేయ డ్యామేజి, కాలేయంలోని ఇన్‌ఫ్లమేషన్‌ను తెలుసుకోవచ్చు

- కాలేయ జబ్బు చికిత్సను అంచనా వేయొచ్చు
- కాలేయం మీద ఏర్పడిన మచ్చలు లేదా ఫైబ్రోసిస్‌ను కనిపెట్టవచ్చు
- కాలేయంలోని కొవ్వుల్లో మార్పులను పసిగట్టవచ్చు

ఎవరికి?: ఐదేళ్లకు మించి క్రమం తప్పకుండా మద్యం తీసుకునేవారు

- ఊబకాయులు
- ఐదేళ్లకు మించి మధుమేహంతో బాధపడుతున్నవారు
- హెపటైటిస్ బి లేదా హెపటైటిస్ సి బారిన పడినవాళ్లు



పొట్టలో గడబిడ ఎందుకు?

మానసిక ఒత్తిడి, ఆందోళన, కుంగుబాటు లాంటి భావోద్వేగాలు కొందర్లో జీర్ణ వ్యవస్థను ప్రభావితం చేస్తాయి. ఈ సమస్య విరోచనాల రూపంలో ఉండవచ్చు, మలబద్ధకం వేధించవచ్చు. లేదా రెండూ కలిసి ఉండొచ్చు. ఇర్రిటబుల్ బోవెల్ సిండ్రోమ్ (ఐబిఎస్)గా పేర్కొనే ఈ సమస్యతో ఎలా వ్యవహరించాలో, ఈ అసౌకర్యం నుంచి ఎలా విముక్తి పొందాలో వైద్యులు వివరిస్తున్నారు.



'కొలనోస్కోపీ' ద్వారా పెద్దపేగులో పాలిప్స్, క్యాన్సర్లు కూడా లేవని నిర్ధారించుకుని, ఆ తర్వాతే ఐబిఎస్ ఉన్నట్టు నిర్ధారించాల్సి ఉంటుంది.

కొందరు పరీక్షకు లేదా ఇంటర్వ్యూకు ముందు పొట్టలో అసౌకర్యానికి లోనవుతారు. ఇంకొందరు వృత్తి జీవితంలో ఎదుర్కొనే పని ఒత్తిడి వల్ల విరోచనాలతో బాధపడుతూ ఉంటారు. ఇంకొందరు మానసిక కుంగుబాటుకు గురైనప్పుడు డయేరియాతో ఇబ్బంది పడుతూ ఉంటారు. అలాగని ఈ సమస్యలున్న వాళ్లందరికీ ఐబిఎస్ ఉండాలనే నియమమేమీ లేదు. కానీ మానసిక భావోద్వేగాలకూ ఐబిఎస్‌కూ సంబంధం ఉండే వీలుంది. మరీ ముఖ్యంగా కుంగుబాటు, యాంగ్జయిటీ న్యూరోసిస్‌తో బాధపడేవారిలో ఐబిఎస్ తలెత్తే అవకాశాలు ఎక్కువ. అయితే మెదడులో ఆలోచనలు జీర్ణ వ్యవస్థను ప్రభావితం చేయడమన్నది కాస్త విచిత్రంగానే అనిపించవచ్చు. కానీ మెదడుకూ, పేగులకూ దగ్గరి సంబంధం ఉంటుంది. మెదడులో ఒత్తిడి పెరిగినప్పుడు నాడీ వ్యవస్థ, పేగుల్లోని కదలికలను ప్రేరేపిస్తుంది. లేదా పేగుల్లో కదలికలను తగ్గించేస్తుంది. ఫలితంగా విరోచనాలు లేదా మలబద్ధకం వేధిస్తాయి. కొందర్లో పేగుల కదలికలే నొప్పి రూపంలో బయల్పడే అవకాశం కూడా ఉంటుంది. ఇలా ఐబిఎస్... విరోచనాలు, మలబద్ధకం, నొప్పి రూపాల్లో బయటపడుతూ ఉంటుంది. కొందరికి విరోచనాలు, మలబద్ధకం కలిసి ఉండే అవకాశాలు కూడా ఉంటాయి. వీళ్లలో కొన్ని రోజులు వరుసగా విరోచనాలు వేధిస్తే, ఇంకొన్ని రోజులు మలబద్ధకం వేధిస్తుంది. ఇలా ప్రస్తుతం 20% నుంచి 30% పట్టణ జనాభా ఐబిఎస్‌తో బాధపడుతోంది.

నిర్ధారణ ఇలా...

ఆరోగ్యపరంగా ఎలాంటి సమస్యలూ లేవని నిర్ధారించుకున్న తర్వాతే లక్షణాలను బట్టి ఐబిఎస్‌ను నిర్ధారించాలి. కానీ ఐబిఎస్‌తో సంబంధం లేని జీర్ణవ్యవస్థ సమస్యలను ఇదే కోవలోకి తోసేస్తున్న పరిస్థితులు తాజాగా పెరుగుతున్నాయి. మన ఆహారపుటలవాట్ల వల్ల కూడా విరోచనాలు, మలబద్ధకం సమస్యల వేధించవచ్చు. మరీ ముఖ్యంగా నేటి యువతలో బయటి ఆహారం ఎక్కువగా తినడం, తీసుకునే ఆహారంలో మార్పుల వల్ల, సరిపడా పీచు లోపించడంవల్ల మల విసర్జన అసంపూర్తిగా జరుగుతూ పదే పదే కాలకృత్యాలు తీర్చుకునే అవసరం పడుతూ ఉండవచ్చు. లేదా రోజుల తరబడి మలబద్ధకం కూడా వేధిస్తూ ఉండవచ్చు. కొందరికి పొట్టలో ఇన్‌ఫెక్షన్స్ వల్ల విరోచనాలు వేధించవచ్చు. కానీ ఇవేవీ ఐబిఎస్ కోవలోకి రావు. అలాంటప్పుడు ఐబిఎస్‌ను నిర్ధారించడానికి వైద్యులు కొన్ని నియమాలు పాటిస్తారు. అవేంటంటే...

- **45 ఏళ్లు పైబడిన వాళ్లలో:** వీరిలో మొదటిసారి ఈ లక్షణాలు కనిపిస్తే, ఆ సమస్యను ఐబిఎస్‌గా నిర్ధారించడం సరి కాదు. వారంలో మూడు రోజుల పాటు కడుపు నొప్పితో పాటు, వరుసగా విరోచనాలు లేదా మలబద్ధకం వేధించడం లేదా రెండూ కలిసి ఉండడం (కొన్ని రోజులు విరోచనాలు, కొన్ని రోజులు మలబద్ధకం) ఉంటే ఐబిఎస్‌గా అనుమానించాలి. అలాగే మలంలో రక్తం ఉందా? బరువు తగ్గుతున్నారా? థైరాయిడ్, మధుమేహం అదుపు తప్పాయా? అన్నది కూడా గమనించాలి. అన్నీ సరిగానే ఉన్నట్లయితే, 'కొలనోస్కోపీ' ద్వారా పెద్దపేగులో పాలిప్స్, క్యాన్సర్లు కూడా లేవని నిర్ధారించుకుని, ఆ తర్వాతే ఐబిఎస్ ఉన్నట్టు నిర్ధారించాల్సి ఉంటుంది.
- **45 ఏళ్ల లోపు వారిలో:** మధుమేహం, థైరాయిడ్ సమస్యలు లేవని నిర్ధారించుకోవాలి. లక్షణాలు తీవ్రంగా ఉండి, రక్తహీనత, బలహీనతలు వేధిస్తుంటే ఐబిఎస్‌గా నిర్ధారించుకోవచ్చు. వీరికి కొలనోస్కోపీ అవసరం ఉండదు. అయితే ఇప్పటి యువతలో అస్తవ్యస్త ఆహారపుటలవాట్ల మూలంగా 'ఇన్‌ఫ్లమేటరీ బోవెల్ డిసీజ్' పెరుగుతోంది. పేగులో వాపు లేదా పూత ఉన్నప్పుడు ఫీకల్ కాల్‌ప్రొటెక్టిన్ అనే ప్రొటీన్ మలంలో ఎక్కువగా కనిపిస్తుంది. కాబట్టి ఈ పరిస్థితిని నిర్ధారించుకోవడం కోసం మలపరీక్ష చేయవలసి ఉంటుంది. ఈ పరీక్షలో ప్రొటీన్ కనిపించినప్పుడు కొలనోస్కోపీ చేయక తప్పదు. ఇలా ఇతరత్రా కారణాలన్నిటినీ పరిశీలించిన తర్వాతే అంతిమంగా ఐబిఎస్‌గా నిర్ధారించుకోవాలి.



లక్షణాల ఆధారంగానే చికిత్స

ఐబిఎస్‌లో విరోచనాలు, మలబద్ధకం ప్రధాన లక్షణాలు కాబట్టి వాటి మీదే చికిత్సా విధానం ఆధారపడి ఉంటుంది. మానసిక ఒత్తిడి, ఆందోళన, కుంగుబాటు లాంటి మనసుతో ముడిపడిన సమస్యలకు చికిత్స తీసుకుంటూనే, అదనంగా ఐబిఎస్‌కు మందులు వాడుకోవాల్సి ఉంటుంది. మలబద్ధకం ఉన్న వారు ఆహారంలో పీచు పెంచుకోవడం కోసం తాజా పండ్లు, కూరగాయల మోతాదును పెంచాలి. అలాగే అదే తరహా సప్లిమెంట్లు కూడా వాడుకోవాల్సి ఉంటుంది. అలాగే కొందరి పేగులు కొన్ని పిండిపదార్థాలను శోషించుకోలేవు. దాంతో ఆ పదార్థాలు పేగుల్లో కుళ్లిపోతూ కడుపుబ్బరం, ఇతరత్రా జీర్ణసమస్యలను పెంచుతాయి. కాబట్టి ఆ పిండిపదార్థాలు కలిగిన పదార్థాలను మానుకుని, అవి లేని ఆహారాన్ని ఎంచుకోవలసిన అవసరం ఉంటుంది. ఇంకొందరికి లాక్టోజ్ ఇంటాలరెన్స్ వల్ల జీర్ణ సమస్యలు వేధిస్తాయి. కాబట్టి పాల ఉత్పత్తులను మానుకోవడం ద్వారా ఐబిఎస్ లక్షణాలను అదుపు చేసుకోవచ్చు. అలాగే ఒత్తిడి, మానసిక కుంగుబాట్లను తగ్గించుకోవడం కోసం క్రమం తప్పకుండా వ్యాయామం చేస్తూ ఉండాలి. అలాగే కడుపు నొప్పి ఉన్నవారికి కొన్ని మందులను కూడా వైద్యులు సూచిస్తారు. అలాగే డయేరియాకు కూడా మందులు వాడుకోవలసి ఉంటుంది. మానసిక సమస్యలు తీవ్రతను బట్టి మానసిక నిపుణులను కూడా సంప్రదించాల్సి ఉంటుంది.

"ఐబిఎస్‌కు, ఇన్‌ఫ్లమేటరీ ప్రక్రియ కూడా కారణమేనని తాజా పరిశోధనల్లో నిర్ధారించారు. పేగుల్లో ఉండే మంచి, చెడు బ్యాక్టీరియాల మధ్య సంతులనం దెబ్బతిన్నప్పుడు ఇన్‌ఫ్లమేషన్ పెరిగి, ఐబిఎస్‌కు దారి తీస్తుంది కాబట్టి మంచి బ్యాక్టీరియాను పెంచే పదార్థాలను తీసుకోవడం ద్వారా ఐబిఎస్‌ను అరికట్టవచ్చని పరిశోధకులు సూచిస్తున్నారు."

ఐబిఎస్‌ను నిర్ధారించే... 'రోమ్ 4 ప్రమాణాలు'

ఇరిటబుల్ బోవెల్ సిండ్రోమ్ జీర్ణాశయ సమస్యను కచ్చితంగా నిర్ధారించడం కోసం, యునైటెడ్ స్టేట్స్, నార్త్ కరలైనా, రాలీలో ఉన్న రోమ్ ఫౌండేషన్ అనే సంస్థ, 'రోమ్ 4 ప్రమాణాలను' నిర్దేశించింది. వీటినే ప్రపంచవ్యాప్త వైద్యులందరూ అనుసరిస్తూ ఉంటారు. ఈ సంస్థ సూచించిన మార్గదర్శకాలు ఏవంటే...

పెద్దల్లో...

ఆరు నెలల పాటు పొట్టలో నొప్పితో పాటు, కనీసం మూడు నెలలుగా వారంలో కనీసం ఒక రోజు ఈ క్రింది వాటిలో ఒకటి లేదా రెండు లక్షణాలతో ఆ నొప్పి ముడిపడి ఉండాలి.

- మలవిసర్జన
- మలవిసర్జన ఎక్కువ/తక్కువ
- మలం రూపం మారుతూ ఉండడం

పిల్లల్లో...

నెలలో కనీసం నాలుగు రోజులు కడుపు నొప్పి వేధిస్తూ, ఈ పరిస్థితి రెండు నెలలుగా కొనసాగుతూ, ఈ కింది లక్షణాలతో ముడిపడి ఉండాలి.

- మలవిసర్జన
- మలవిసర్జన ఎక్కువ/తక్కువ
- మలం రూపం మారుతూ ఉండడం.


డాక్టర్ కె. సోమశేఖర రావు
సీనియర్ కన్సల్టెంట్,
గ్యాస్ట్రోఎంటరాలజిస్ట్ అండ్ హెపటాలజిస్ట్,
యశోద హాస్పిటల్స్, హైటెక్ సిటీ,
హైదరాబాద్

వేసవి ఆహారం

ఎండ నుంచి అండ

ఎండ తీవ్రత రోజు రోజుకూ పెరిగిపోతోంది. ఇలాంటి వేడి వాతావరణంలో ఎవరు ఎలాంటి ఆహారం తీసుకోవాలో, ఎండదెబ్బకూ, డీహైడ్రేషన్‌కూ గురి కాకుండా ఉండడం కోసం ఎలాంటి ఆహారనియమాలు పాటించాలో వైద్యులు వివరిస్తున్నారు.

వేసవిలో ఎండ వేడి నుంచి ఉపశమనాన్ని అందించే చల్లని పదార్థాల కోసం గాలిస్తూ ఉంటాం. కానీ ఐస్‌క్రీమ్ ఇష్టంగా తింటాం తప్ప అంతకంటే మెరుగ్గా శరీరాన్ని చల్లబరిచే కీరా జోలికి వెళ్లం. దాహార్తిని తీర్చడంతో పాటు లవణాలను భర్తీ చేసే కొబ్బరినీళ్లకు బదులుగా ఫ్రీజర్‌లో చల్లబరిచిన శీతల పానీయాలను ఆబగా తాగేస్తూ ఉంటాం. నిజానికి శరీరంలో నీటి శాతాన్ని భర్తీ చేసి, డీహైడ్రేషన్ నుంచి రక్షణనిచ్చే ఆరోగ్యకరమైన ప్రత్యామ్నాయాలు కూడా మన చుట్టూరా ఎన్నో ఉన్నాయి. దాహార్తిని తీర్చే మజ్జిగ, రాగి జావ, పండ్ల రసాలు, కొబ్బరినీళ్లతో పాటు చలువ చేసే పెరుగు, కూరగాయలు, ఆకుకూరలు కూడా మనకు అందుబాటులో ఉంటున్నాయి. అయితే వేసవి ఎండకూ, వేడికీ బహిర్గతమయ్యే తీవ్రతలు పరిస్థితులను బట్టి మారుతూ ఉంటాయి. ఇంటిపట్టున ఉండే వారు, బడికెళ్లే పిల్లలు, ఎక్కువగా ప్రయాణాలు చేసేవారు ఈ కాలంలో భిన్నమైన ఆహార నియమాలను పాటించాల్సి ఉంటుంది.

ఎండదెబ్బ నుంచి రక్షణ కోసం ఆమ్ పన్నా తాగుతూ ఉండాలి. తయారీ కోసం...

పచ్చి మామిడి కాయ: 1
పుదీనా ఆకులు: 3 టేబుల్‌స్పూన్లు
యాలకుల పొడి: అర టీస్పూను
మిరియాల పొడి: అర టీస్పూను
చక్కెర: పావు టీస్పూను
జీలకర్ర పొడి: అర టీస్పూను
ఉప్పు: రుచికి సరిపడా
తయారీ ఇలా: మామిడి కాయకు నీళ్లు జోడించి కాయ మెత్తబడేవరకూ ఉడికించాలి. తర్వాత నీళ్లను తొలగించి, తొక్కు, విత్తనం వేరు చేసి, గుజ్జును మెత్తగా రుబ్బుకోవాలి. ఈ గుజ్జుకు పైన చెప్పిన దినుసులన్నీ కలిపి ఆమ్ పన్నాను సిద్ధం చేసుకోవాలి. ఈ మిశ్రమానికి నీళ్లు కలిపి, ఫ్రిజ్‌లో ఒక గంట పాటు చల్లబరుచుకుని తాగితే, వేసవి నుంచి ఉపశమనం, ఎండ వేడి నుంచి రక్షణ దక్కుతుంది.

ఇంటిపట్టున ఉంటే...

ఇంటిపట్టున ఉన్నంత మాత్రాన ఎండ ప్రభావం నుంచి తప్పించుకున్నాం అనుకోడానికి వీల్లేదు. ఇంట్లో ఉన్నప్పటికీ సాయంత్రానికి నీరసించిపోతుంటే, నీరు ఎక్కువగా ఉండే పుచ్చ, దోస, తర్బూజ లాంటి పండ్లు తింటూ ఉండాలి. తరచూ నీళ్లు తాగుతూ డీహైడ్రేషన్‌కు గురి కాకుండా చూసుకోవాలి. వంటల్లో కారం, ఉప్పు, మసాలాలు బాగా తగ్గించాలి. సలాడ్స్, కూరగాయలు, ఆకుకూరలు, పెరుగు, తేలికగా అరిగే వీలున్న పదార్థాలు తీసుకోవాలి. మాంసాహారం తగ్గించాలి. నీరు ఎక్కువగా ఉండే బీరకాయలు, సొరకాయలు, పొట్లకాయలు లాంటివి ఎక్కువగా తీసుకుంటూ ఉండాలి. కీరా, క్యారట్, లెట్యూస్‌లతో సలాడ్స్ చేసుకుని తింటూ ఉండాలి. అలాగే కొబ్బరినీళ్లు, పండ్లరసాలు, మజ్జిగ తరచూ తీసుకోవచ్చు. టీ, కాఫీలు తగ్గించి, హెర్బల్ టీ తీసుకోవాలి. ఉదయం అల్పాహారంలో కూడా నూనెలో వేయించిన పూరీలు, వడలకు బదులుగా ఇడ్లీలు, ఓట్స్ పోరిడ్జ్ లాంటివి తీసుకోవాలి. చికెన్, చేపలు తక్కువ మసాలాలతో వండుకుని తీసుకోవచ్చు.

బడికెళ్లే పిల్లల కోసం...

ఈ కాలంలో పిల్లలు కూల్‌డ్రింక్స్, ఐస్‌క్రీమ్స్ తినడానికి ఎక్కువగా ఇష్టపడుతూ ఉంటారు. కానీ వీటి తయారీలో ఉపయోగించే కలుషిత నీళ్లు, పాలపదార్థాలు, కృత్రిమ రంగుల వల్ల పిల్లల్లో టాన్సిల్స్, గొంతు ఇన్‌ఫెక్షన్లు వచ్చే అవకాశాలుంటాయి. కాబట్టి ఇంట్లో తయారుచేసి ఫ్రూట్ సలాడ్స్, కస్టర్డ్, పాయసం లాంటివి ఇవ్వాలి. చక్కెర కలపని పండ్ల రసాలు ఇవ్వాలి. సాధారణంగా పిల్లలు దాహాన్ని నిర్లక్ష్యం చేస్తూ ఉంటారు. డీహైడ్రేషన్‌కు గురైనా దాని గురించి పిల్లలకు అవగాహన లేక నీరసించిపోతూ ఉంటారు. కాబట్టి పెద్దలు అప్రమత్తంగా వ్యవహరిస్తూ, పిల్లలు సరిపడా నీళ్లు తాగేలా చూసుకోవాలి. అలాగే లంచ్ బాక్సుల్లో తప్పనిసరిగా సలాడ్స్, పండ్ల ముక్కలు, పెరుగు పెడుతూ ఉండాలి. ఇంట్లో రస్నా, కృత్రిమ పండ్లరసాలకు బదులుగా నిమ్మరసం, కొబ్బరినీళ్లు, మజ్జిగ, సబ్జా లాంటివి పిల్లలకు అలవాటు చేయాలి. పిల్లలు తరచూ స్నాక్స్‌లో భాగంగా ఉప్పని చిప్స్ తింటూ ఉంటారు. ఇలాంటి వాటి వల్ల శరీరం డీహైడ్రేషన్‌కు గురవుతుంది. కాబట్టి పిల్లలకు వీటిని అందుబాటులో ఉంచకూడదు. ఈ కాలంలో పిల్లలకు జీర్ణసమస్యలు రాకుండా, ఎలక్ట్రొలైట్స్ సంతులనం కోసం మామిడి, పుచ్చ, తర్బూజా లాంటి తాజా పండ్లు, సలాడ్స్ తినిపించాలి.



ఎండకు ఎక్కువగా బహిర్గతమయ్యేవారు...

మార్కెటింగ్ వృత్తిలో ఉన్నవారు, ఎక్కువగా ప్రయాణాలు చేసే వారు తప్పనిసరిగా నీళ్లు, మజ్జిగ, నిమ్మరసం వెంట తీసుకువెళ్లాలి. ఇంటిపట్టున ఉండే వారు రోజుకు 8 నుంచి 10 గ్లాసుల నీళ్లు తీసుకుంటే సరిపోతుంది. కానీ ఎక్కువగా బయట తిరిగేవాళ్లు అంతకంటే ఎక్కువ నీళ్లు తాగాలి. బయటి ఆహారం బాగా తగ్గించి, ఇంటి ఆహారానికే ప్రాధాన్యం ఇవ్వాలి. బయట తిరిగేవాళ్లు ఎప్పుడు డీహైడ్రేషన్‌కు గురవుతారో, ఎప్పుడు ఎండదెబ్బ బారిన పడతారో చెప్పలేం. కాబట్టి బయటకు వెళ్లే ముందు, బయటకు వెళ్లిన ప్రతి గంటకూ నీళ్లు తాగుతూనే ఉండాలి.

ఈ జాగ్రత్తలు తప్పనిసరి

- కూల్ డ్రింక్స్ మానేయాలి
- కారం, మసాలాలతో తయారైన పదార్థాలు మానేయాలి
- చక్కెర డీహైడ్రేషన్‌కు గురి చేస్తుంది కాబట్టి తీయగా ఉండే పానీయాలు మానేయాలి
- ఉప్పు ఎక్కువగా ఉండే చిప్స్, ఊరగాయలు, వడియాలు లాంటివి మానేయాలి
- మాంసాహారం తగ్గించి, కూరగాయలు, ఆకుకూరలు ఎక్కువగా తీసుకోవాలి
- తక్షణ శక్తి కోసం బత్తాయి రసం, నిమ్మరసం తాగాలి

ఫ్రిజ్‌లో చల్లబరిచిన గడ్డ కట్టేంత చల్లని నీళ్లు తాగడం సరి కాదు. బయటి వాతావరణం వేడిగా ఉన్నప్పుడు అత్యంత చల్లని నీళ్లు తాగడం శరీరానికి హానికరం. కాబట్టి ఫ్రిజ్ నీళ్లు సాధారణ గది ఉష్ణోగ్రతకు చేరుకున్న తర్వాత తాగాలి. చల్లదనం కోసం కుండలో నీళ్లు తాగొచ్చు.


డాక్టర్ సుజాత స్టీఫెన్
క్లినికల్ న్యూట్రిషనిస్ట్,
యశోద హాస్పిటల్స్,
మలక్ పేట, హైదరాబాద్

పీచుతోనే పక్కా ఆరోగ్యం

పీచు ఎక్కువగా ఉండే ఆహారంతో పలు తీవ్రమైన జబ్బుల నుంచి తప్పించుకోవచ్చని పలు అధ్యయనాలు సూచిస్తున్నాయి. కానీ శుద్ధి చేసిన పదార్థాలు, పిండిపదార్థాలతో నిండిన ఆధునిక ఆహారాల్లో పీచు కొరవడుతోంది. ఈ సమస్యను ఎలా పరిష్కరించుకోవచ్చో తెలుసుకుందాం!

ఆహారం ఆరోగ్యం



పేగుల ఆరోగ్యం పెరగడానికీ, రక్తంలో చక్కెర మోతాదులు స్థిరంగా ఉండడానికీ, గుండె పనితీరు మెరుగ్గా ఉండడానికీ పీచు తోడ్పడుతుంది. ఓట్స్, బీన్స్, అవిసె గింజల్లోని నీటిలో కరిగే పీచు కొలెస్ట్రాల్‌ను తగ్గిస్తుంది. తృణధాన్యాలు, విత్తనాలు, కూరగాయల్లోని నీటిలో కరగని పీచు జీర్ణ శక్తిని పెంచుతుంది. ఇన్ని ప్రయోజనాలున్నప్పటికీ ఆధునిక ఆహారంలో పీచు పాత్ర అంతంతమాత్రంగానే ఉంటోంది. అయితే పీచుతో ఒరిగే ప్రయోజనాలను సొంతం చేసుకోవాలంటే, తీసుకునే ఆహారంలో స్వల్ప మార్పులు చేసుకోవాలి. తెల్ల బ్రెడ్‌కు బదులుగా పొట్టు తీయని గోధుమలతో తయారైన బ్రెడ్ తినొచ్చు. తెల్ల బియ్యానికి బదులుగా దంపుడు బియ్యం ఎంచుకోవచ్చు. అలాగే శుద్ధి చేసిన, ఉప్పు జోడించిన స్నాక్స్‌కు బదులుగా నట్స్, సీడ్స్ తినొచ్చు. వంటకాల్లో అవిసెగింజల పొడిని చల్లుకుని తినడం ద్వారా సరిపడా పీచును భోజనంతో పాటు పొందవచ్చు. అంతే కాకుండా...

- సలాడ్స్‌లో, భోజనంలో తప్పనిసరిగా అరకప్పు బీన్స్ ఉండేలా చూసుకోవాలి
- పండ్లు, కూరగాయలు తొక్క తీయకుండా వాడుకోవాలి. బంగాళాదుంపలు, యాపిల్స్, క్యారట్‌లను తొక్కతీయకుండా తినొచ్చు
- వేయించిన వేరుశెనగలు, మఖనా, తాజా పండ్లను స్నాక్స్‌గా తినొచ్చు.

బిజినెస్

కెనరాబ్యాంకు ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్‌గా ఎస్‌కె మజుందార్



బెంగళూరు (ఆంధ్రజ్యోతి): కెనరా బ్యాంకు ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్‌గా ఎస్‌కె మజుందార్ (56) సోమవారం బాధ్యతలు చేపట్టారు. మజుందార్ చార్టెర్డ్ అకౌంటెంట్, కాస్ట్ అకౌంటెంట్స్ విభాగంలో ప్రత్యేక అర్హతలు కలిగి ఉన్నారు. బ్యాంకింగ్ రంగంలోనూ సుదీర్ఘకాలం సేవలందించారు. 2000 నుంచి కెనరాబ్యాంకుతో సంబంధాలు కలిగి ఉన్నారు. సుదీర్ఘమైన కెరీర్‌లో వివిధ హోదాలలో ఆయన సేవలందించారు. ఆయన నాయకత్వంలో కెనరాబ్యాంకు మరిన్ని రంగాలలో రాణించనుందని బ్యాంకు ఒక ప్రకటనలో పేర్కొంది.

జీఎస్‌ఎంఏ బోర్డు కొత్త చైర్మన్‌గా గోపాల్ విట్టల్



న్యూఢిల్లీ: భారతి ఎయిర్‌టెల్ మేనేజింగ్ డైరెక్టర్, వైస్ చైర్మన్ గోపాల్ విట్టల్ జీఎస్ఎంఏ డైరెక్టర్ల బోర్డు కొత్త చైర్మన్‌గా ఎన్నికయ్యారు. ఆయన ప్రస్తుతం ఈ బోర్డు తాత్కాలిక చైర్మన్‌గా ఉన్నారు. పరిశ్రమ సంఘం వ్యూహాత్మక దశను ఆయన పర్యవేక్షిస్తారు. సునీల్ భారతి విట్టల్ తర్వాత ఈ బోర్డు చైర్మన్‌గా ఎన్నికైన రెండో భారతీయుడు ఈయన. ప్రపంచంలోని వెయ్యి టెలికాం కంపెనీలకు ఈ ప్రతిష్ఠాత్మక సంఘంలో సభ్యత్వం ఉంది.

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)

24వ తేదీ			
హైదరాబాద్	395	విజయవాడ	400
వరంగల్	397	గోదావరి	392
చిత్తూరు	470	విశాఖపట్నం	400
		డజను గుడ్లు రూ.	60

ఫామ్‌గేట్ ధర — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్

హైదరాబాద్	94	విజయవాడ	95
వరంగల్	94	గుంటూరు	100
కరీంనగర్	94	ఒంగోలు	100
మహబూబ్‌నగర్	94	చిత్తూరు	89
కర్నూలు	94	నెల్లూరు	94
విశాఖపట్నం	89	అనంతపురం	94
గోదావరి	95		

బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)

	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	89,620 ▼	82,150 ▼	1,10,000 ▼
విజయవాడ	90,600 ▼	85,000 ▼	1,00,000 ▼
విశాఖపట్నం	88,090 ▼	80,750 ▼	98,300 ▲
రాజమండ్రి	89,620 ▼	82,150 ▼	1,00,600 ▲
ప్రొద్దుటూరు	90,000 ▲	83,340 ▲	99,600 ▲
ముంబై	87,720 ▼	80,350 ▼	97,410 ▼

బుల్ మార్చ్



23,600 ఎగువ స్థాయికి నిఫ్టీ

6 వారాల గరిష్ఠానికి సెన్సెక్స్

ఇంట్రాడేలో 78,000 పైకి..

6 రోజుల్లో రూ.27 లక్షల కోట్ల సంపద వృద్ధి ● 7 రోజుల్లో 160 పైసలు పెరిగిన రూపాయి విలువ

ముంబై: భారత స్టాక్ మార్కెట్లో వరుసగా ఆరో రోజూ బుల్ ర్యాలీ కొనసాగింది. సోమవారం ట్రేడింగ్‌లో సెన్సెక్స్ మరో 1,078.87 పాయింట్ల వృద్ధితో 77,984.38 వద్ద స్థిరపడింది. ఫిబ్రవరి 6 తర్వాత (6 వారాల) నమోదైన గరిష్ఠ ముగింపు స్థాయి ఇదే. ఒక దశలో సూచీ 1,201.72 పాయింట్ల లాభంతో 78,107.23 వద్ద ఇంట్రాడే గరిష్ఠాన్ని నమోదు చేసింది. నిఫ్టీ సైతం ఒక దశలో 358.35 పాయింట్లు ఎగబాకి 23,708.75 వద్ద ఇంట్రాడే గరిష్ఠాన్ని నమోదు చేసినప్పటికీ, చివరికి 307.95 పాయింట్ల లాభంతో 23,658.35 వద్ద ముగిసింది. అమెరికా, ఐరోపా మార్కెట్ల సానుకూల సంకేతాలు, విదేశీ పోర్ట్‌ఫోలియో ఇన్వెస్టర్ల పెట్టుబడులతోపాటు బ్యాంకింగ్, ఆయిల్ అండ్ గ్యాస్ రంగాల షేర్లలో జోరుగా కొనుగోళ్లు మార్కెట్‌ను మరింత ముందుకు నడిపించాయి. రూపాయి పుంజుకోవడమూ ట్రేడింగ్ సెంటిమెంట్‌ను మెరుగుపరిచిందని మార్కెట్ విశ్లేషకులు పేర్కొన్నారు. గడిచిన ఆరు రోజుల్లో సెన్సెక్స్ 4,155.47 పాయింట్లు (5.62 శాతం), నిఫ్టీ 1,260 పాయింట్లు (5.5 శాతం) పుంజుకోగా.. బీఎస్ఈ లిస్టెడ్ కంపెనీల మొత్తం మార్కెట్ విలువ రూ.27.10 లక్షల కోట్లు పెరిగి రూ.418.29 లక్షల కోట్లకు (4.87 లక్షల కోట్ల డాలర్లు) చేరుకుంది. ఈ ఒక్క రోజే మార్కెట్ సంపద రూ.5 లక్షల కోట్ల మేర పెరిగింది.

- సెన్సెక్స్‌లోని 30 లిస్టెడ్ కంపెనీల్లో 23 రాణించాయి. ఎన్‌టీపీసీ షేరు 4.61 శాతం వృద్ధితో సూచీ టాప్ గెయినర్‌గా నిలిచింది. కోటక్ బ్యాంక్ 4.51 శాతం ఎగబాకింది. ఎస్‌బీఐ, టెక్ మహీంద్రా, పవర్‌గ్రిడ్ స్టాక్స్ 3 శాతానికి పైగా పెరిగాయి. మార్కెట్ దిగ్గజాలైన రిలయన్స్ ఇండస్ట్రీస్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ 1.95 శాతం వరకు బలపడ్డాయి. ఇండస్‌ఇండ్ బ్యాంక్, టైటాన్, జొమాటో షేర్లు మాత్రం 2 శాతానికి పైగా క్షీణించాయి.
- ప్రధాన కంపెనీలతోపాటు చిన్న, మధ్య స్థాయి షేర్లలోనూ ట్రేడర్లు కొనుగోళ్లు పెంచారు. దాంతో బీఎస్ఈ మిడ్‌క్యాప్ సూచీ 1.32 శాతం, స్మాల్‌క్యాప్ ఇండెక్స్ 1.17 శాతం వృద్ధి చెందాయి.
- బీఎస్ఈలోని రంగాలవారీ సూచీలన్నీ రాణించాయి. బ్యాంకెక్స్, యుటిలిటీస్, పవర్, ఇండస్ట్రియల్స్ ఇండెక్స్‌లు రెండు శాతానికి పైగా పెరిగాయి. బీఎస్ఈలో 4,298 కంపెనీల షేర్లు ట్రేడవగా.. 2,458 లాభపడ్డాయి. 1,689 నష్టపోగా.. 151 యథాతథంగా ముగిశాయి. 102 కంపెనీల షేర్లు సరికొత్త ఏడాది గరిష్ఠానికి ఎగబాకాయి.
- అంతర్జాతీయ మార్కెట్లో బ్రెంట్ రకం ముడిచమురు బ్యారెల్ ధర ఒకదశలో 0.83 శాతం పెరుగుదలతో 72.76 డాలర్ల స్థాయిలో ట్రేడైంది.
- ఢిల్లీ మార్కెట్లో 99.9 శాతం స్వచ్ఛత బంగారం 10 గ్రాముల ధర రూ.700 తగ్గి రూ.90,550కి దిగివచ్చింది. కిలో వెండి మాత్రం రూ.200 పెరుగుదలతో రూ.1,00,500 ధర పలికింది. అంతర్జాతీయ మార్కెట్లో ఔన్స్ (31.10 గ్రాములు) బంగారం రేటు ఒకదశలో 0.22 శాతం పెరిగి 3,029 డాలర్ల స్థాయిలో ట్రేడైంది.

37 పైసలు పెరిగిన రూపాయి

ఫారెక్స్ మార్కెట్లో డాలర్‌తో రూపాయి మారకం విలువ ఏకంగా 37 పైసలు పెరిగి రూ.85.61 వద్ద ముగిసింది. ఈక్విటీ మార్కెట్ల ర్యాలీతోపాటు విదేశీ పోర్ట్‌ఫోలియో ఇన్వెస్టర్ల కొత్త పెట్టుబడులు ఇందుకు దోహదపడ్డాయి. రూపాయి బలపడటం వరుసగా ఇది ఏడో రోజు. ఈ 7 రోజుల్లో మన కరెన్సీ విలువ 160 పైసలు పెరిగింది.

ఈ ఏడాది నష్టాలు భర్తీ

స్టాక్ మార్కెట్ సూచీలతో పాటు ఫారెక్స్ మార్కెట్లో రూపాయి కూడా ఈ ఏడాది ఏర్పడిన నష్టాల నుంచి పూర్తిగా తేరుకున్నాయి. ఈ ఫిబ్రవరిలో 4,302.47 పాయింట్లు (5.55 శాతం), జనవరిలో 638.44 పాయింట్లు (0.81 శాతం) నష్టపోయిన సెన్సెక్స్.. ఈ నెలలో ఇప్పటివరకు 4,786.28 పాయింట్లు (6.53 శాతం) పుంజుకుంది. గత కొన్ని నెలలుగా భారీగా అమ్మకాలకు పాల్పడుతూ వచ్చిన విదేశీ పోర్ట్‌ఫోలియో ఇన్వెస్టర్లు (ఎఫ్‌పీఐ).. గడిచిన కొన్ని రోజుల్లో మళ్లీ కొనుగోళ్లు పెంచడం, పలు కంపెనీల షేర్లు ఆకర్షణీయ ధరలకు లభిస్తుండటంతో మదుపరులు వేల్యూ బైయింగ్‌కు పాల్పడడం, ఈ ఏడాదిలో మరో రెండు సార్లు వడ్డీ రేట్లు తగ్గించనున్నట్లు అమెరికా ఫెడరల్ రిజర్వ్ సంకేతాలివ్వడం, ట్రంప్ సుంకాల అమలు విషయంలో కాస్త మెత్తబడవచ్చన్న ఆశలు, రూపాయి బలోపేతం వంటి అంశాలు ఈక్విటీల ర్యాలీకి దోహదపడ్డాయని మార్కెట్ వర్గాలు పేర్కొన్నాయి. మన కరెన్సీ విషయానికొస్తే.. 2024 డిసెంబరు 31న రూ.85.64 వద్ద ముగిసిన డాలర్-రూపాయి మారకం విలువ.. గత నెలాఖరులో ఆల్‌టైం రికార్డు కనిష్ఠ స్థాయి రూ.87.59 స్థాయికి బలహీనపడింది. ఆ తర్వాత కాస్త తేరుకున్న రూపాయి.. గడిచిన వారం రోజుల్లో శరవేగంగా పుంజుకుంది. 160 పైసలు లాభంతో ఎక్స్ఛేంజ్ రేటు మళ్లీ రూ.85.61 వద్దకు చేరుకుంది. అంతర్జాతీయ మార్కెట్లో డాలర్ బలహీనపడటం, ఈక్విటీ మార్కెట్లో ర్యాలీ, విదేశీ ఇన్వెస్టర్ల కొత్త పెట్టుబడులు, ఆర్థిక సంవత్సరాంతం కావడంతో ఎగుమతిదారులు డాలర్లను విక్రయిస్తుండటం ఇందుకు దోహదపడిందని ఫారెక్స్ వర్గాలు పేర్కొన్నాయి.

ఎఫ్‌పీఐలకు సెబీ ఊరట

- వివరాల వెల్లడి పరిమితి రెట్టింపు
- రూ.50,000 కోట్లు మించితే మరిన్ని వివరాలు

ముంబై: సెబీ కొత్త చీఫ్ తుహిన్ కాంత పాండే కార్యాచరణకు దిగారు. సోమవారం ఆయన అధ్యక్షతన జరిగిన తొలి సమావేశంలోనే సెబీ డైరెక్టర్ల బోర్డు పలు కీలక నిర్ణయాలు తీసుకుంది. ముఖ్యంగా ఎఫ్‌పీఐల పెట్టుబడుల వెల్లడి పరిమితిని రూ.25,000 కోట్ల నుంచి రూ.50,000 కోట్లకు పెంచింది. ఇంకా ఇన్వెస్ట్‌మెంట్ అడ్వైజర్లు, రీసెర్చ్ అనలిస్టుల ముందస్తు ఫీజు వసూలు కాలపరిమితిని విస్తరించింది. మారుతున్న మార్కెట్ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని ఈ నిర్ణయాలు తీసుకున్నట్టు సెబీ చీఫ్ చెప్పారు.

సెబీ బోర్డు తీసుకున్న కీలక నిర్ణయాలు.

- ఈక్విటీ మార్కెట్‌లో రూ.50,000 కోట్లకు మించిన పెట్టుబడులున్న ఎఫ్‌పీఐ, తమ అసలు మదుపరులకు సంబంధించి మరిన్ని వివరాలు వెల్లడించాలి. ఇంతకు ముందు ఈ పరిమితి రూ.25,000 కోట్లు.
- ఏదైనా ఒక ఎఫ్‌పీఐ తన నిర్వహణలోని ఆస్తుల విలువలో (ఏయూఎం) సగానికి మించి, ఏదైనా ఒక కంపెనీ లేదా పారిశ్రామిక గ్రూపు నిర్వహణలోని కంపెనీల షేర్లలో మదుపు చేసినా మరిన్ని వివరాలు వెల్లడించాలి.
- ఇన్వెస్ట్‌మెంట్ అడ్వైజర్లు మదుపరుల నుంచి వసూలు చేసే ముందస్తు ఫీజు కాల పరిమితిని ప్రస్తుత ఆరు నెలల నుంచి ఏడాదికి పెంచారు.
- రెసెర్చ్ అనలిస్టులు వసూలు చేసే ముందస్తు ఫీజు కాల పరిమితి కూడా ప్రస్తుత మూడు నెలల నుంచి ఏడాదికి పెంచారు.
- ఫీజుల పరిమితి, చెల్లింపుల విధానం, రిఫండ్స్, బ్రేకేజి ఫీజులు వ్యక్తిగత మదుపరులు, అవిభక్త హిందూ కుటుంబాలకు మాత్రమే వర్తిస్తాయి.
- కేటగిరి 2కు చెందిన ఆల్టర్‌నేటివ్ ఇన్వెస్ట్‌మెంట్ ఫండ్స్ (ఏఐఎఫ్) 'ఏ' లేదా అంతకంటే తక్కువ రేటింగ్ ఉన్న లిస్టెడ్ రుణ పత్రాల్లో మదుపు చేసినా ఇక ఆ పెట్టుబడులను అనలిస్టెడ్ సెక్యూరిటీలుగానే పరిగణిస్తారు.
- సెబీ బోర్డు సభ్యుల పరస్పర విరుద్ధ ప్రయోజనాల అంశాల వెల్లడిని సమగ్రంగా సమీక్షించేందుకు ఒక ఉన్నతాధికార కమిటీ ఏర్పాటు చేశారు.

సెబీ వద్ద నమోదైన ఫిన్‌ఫ్లుయెన్సర్లు 2 శాతమే: సీఎఫ్‌ఏ

న్యూఢిల్లీ: ఆన్‌లైన్‌లో స్టాక్ రికమెండేషన్స్‌తోపాటు ఇతర ఆర్థిక సలహాలిచ్చే ఫైనాన్షియల్ ఇన్‌ఫ్లుయెన్సర్లలో (ఫిన్‌ఫ్లుయెన్సర్లు) 2 శాతం మంది మాత్రమే సెబీ వద్ద రిజిస్టర్ చేసుకున్నారని సీఎఫ్‌ఏ ఇన్‌స్టిట్యూట్ తాజా అధ్యయన నివేదిక వెల్లడించింది. కానీ, ఫిన్‌ఫ్లుయెన్సర్లలో 33 శాతం మంది ప్రత్యక్షంగా ఆయా కంపెనీల షేర్లను సిఫారసు చేస్తున్నారని తెలిపింది. వ్యక్తుల పెట్టుబడి నిర్ణయాలపై ఫిన్‌ఫ్లుయెన్సర్ల ప్రభావం పెరుగుతుండటంపై ఆ నివేదికలో ఆందోళన వ్యక్తం చేశారు. ఫిన్‌ఫ్లుయెన్సర్లపై నియంత్రణ కొరవడిందని, వారిలో జవాబుదారీతనం లోపించిందని పేర్కొన్నారు. 63 శాతం మంది ఫిన్‌ఫ్లుయెన్సర్లు తమ స్పాన్సర్ల వివరాలను, వారితో తమకున్న ఆర్థిక అనుబంధాన్ని పూర్తిగా బహిర్గతం చేయడం లేదని సీఎఫ్‌ఏ అధ్యయనంలో తేలింది. ఇది ఫిన్‌ఫ్లుయెన్సర్లు-స్పాన్సర్ల మధ్య పరస్పర ప్రయోజనాలున్నాయన్న సందేహాలకు తావివ్వడంతో పాటు ఇన్వెస్టర్లను ఉద్దేశపూర్వకంగా తప్పుదోవ పట్టిస్తున్నారనే అనుమానాలు రేకెత్తిస్తోందని సీఎఫ్‌ఏ అభిప్రాయపడింది.

టాటా ఆటోకాంప్ గూటికి స్వీడన్ కంపెనీ

న్యూఢిల్లీ: ఇంటర్నేషనల్ ఆటోమోటివ్ కాంపొనెంట్స్ గ్రూప్ స్వీడన్ ఏబీని (ఐఏసీ స్వీడన్) కొనుగోలు చేస్తున్నట్లు టాటా ఆటోకాంప్ సిస్టమ్స్ లిమిటెడ్ సోమవారం ప్రకటించింది. ఎంతకు కొనుగోలు చేయనున్న విషయాన్ని మాత్రం వెల్లడించలేదు. టాటా ఆటోకాంప్ ఐరోపా ఆటోమోటివ్ రంగంలో బలపడేందుకు ఈ డీల్ దోహదపడనుంది. 80 కోట్ల డాలర్ల టర్నోవర్ కలిగిన ఐఏసీ స్వీడన్.. వాహన రంగానికి అవసరమైన ఇంటీరియర్ సిస్టమ్స్, విడిభాగాలను తయారు చేస్తుంది.

ఆర్థిక కార్యదర్శిగా అజయ్ సేథ్

న్యూఢిల్లీ: ఆర్థిక శాఖ కార్యదర్శిగా సీనియర్ అధికారి అజయ్ సేథ్‌ను నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. అజయ్ సేథ్ 1987 బ్యాచ్, కర్ణాటకకు చెందిన ఐఏఎస్ అధికారి. ఆయన ప్రస్తుతం ఆర్థిక వ్యవహారాల శాఖలో కార్యదర్శిగా పనిచేస్తున్నారు. ఇదివరకు ఆర్థిక కార్యదర్శిగా ఉన్న తుహిన్‌కాంత్ పాండేను ఇటీవల సెబీ చైర్మన్‌గా నియమించడంతో ఏర్పడిన ఖాళీని ప్రభుత్వం అజయ్ సేథ్ నియామకంతో భర్తీ చేసింది.

అరుంధతికి వార్షిక కాంట్రాక్ట్

'ఎ'లోనే హర్మన్, మంధాన, దీప్తి



న్యూఢిల్లీ: భారత మహిళల క్రికెట్‌కు సంబంధించి ఈ ఏడాది సెంట్రల్ కాంట్రాక్ట్ జాబితాను బీసీసీఐ సోమవారం వెల్లడించింది. మూడు గ్రూపుల్లో మొత్తం గా 16 మందికి చోటు దక్కగా, ఆరుగురిపై వేటు పడింది. కొత్తగా ఐదుగురికి అవకాశం కల్పించారు. 2022-23 తర్వాత బోర్డు వార్షిక కాంట్రాక్టులను ప్రకటించడం మళ్లీ ఇప్పుడే. వీరిలో గ్రేడ్ ఎ ప్లేయర్లకు మ్యాచ్ ఫీజులు కాకుండా రూ. 50 లక్షలు, బి గ్రేడ్ వారికి రూ. 30 లక్షలు, సి గ్రేడ్‌కు రూ 10 లక్షలు లభిస్తాయి. ఇందులో తెలుగు పేసర్ అరుంధతి రెడ్డికి గ్రేడ్ 'సి'లో చోటు దక్కింది. మరోవైపు గ్రేడ్ 'ఎ'లో కెప్టెన్ హర్మన్‌ప్రీత్, స్మృతి మంధాన, దీప్తి శర్మ స్థానాల్లో మార్పు లేదు. గ్రేడ్ 'బి'లో రాజేశ్వరి గైక్వాడ్ చోటు కోల్పోగా.. రేణుకా సింగ్, జెమీమా, షఫాలీ, రిచా ఘోష్ కొనసాగుతున్నారు. ఇక గ్రేడ్ 'సి'లో అరుంధతి, శ్రేయాంక పాటిల్, టిటాస్ సాధు, అమన్‌జోత్ కౌర్, ఉమా ఛెత్రిలకు తొలిసారి అవకాశం ఇవ్వగా.. యాస్తిక భాటియా, రాధా యాదవ్, పూజా వస్త్రాకర్, స్నేహ్ రాణా తమ చోటును కాపాడుకున్నారు. అయితే ఈ గ్రేడ్ నుంచి ఆంధ్ర క్రికెటర్ సబ్బినేని మేఘన, హర్లీన్ డియోల్, దేవికా వైద్య, అంజలి శర్వాణి, మేఘనా సింగ్‌లకు ఉద్వాసన పలికారు.

షట్లర్ సుమీత్ రిటైర్



న్యూఢిల్లీ: బ్యాడ్మింటన్ డబుల్స్ క్రీడాకారుడు బి. సుమీత్ రెడ్డి ఆటకు వీడ్కోలు పలికాడు. ఇకనుంచి పూర్తిగా కోచింగ్‌పైనే దృష్టి సారించాలనుకుంటున్నానని హైదరాబాద్‌కు చెందిన 33 ఏళ్ల సుమీత్ సోషల్ మీడియాలో ప్రకటించాడు. 2022 కామన్వెల్త్ క్రీడల మిక్స్‌డ్ టీమ్ రజత పతక విజేత అయిన సుమీత్.. డబుల్స్ షట్లర్ సిక్కిరెడ్డి భర్త. సిక్కితో పాటు అశ్వినీ పొన్నప్పలాంటి స్టార్ షట్లర్లతో కలిసి ఎన్నో మిక్స్‌డ్ మ్యాచ్‌లు ఆడిన సుమీత్.. పురుషుల డబుల్స్‌లో మను అత్రి జతగా అంతర్జాతీయస్థాయిలో రాణించాడు. 2015లో మెక్సికో సిటీ గ్రాండ్ ప్రీ, 2016లో కెనడా ఓపెన్ డబుల్స్ టైటిళ్లు నెగ్గిన సుమీత్.. 2015లో యూఎస్, డచ్ ఓపెన్ టోర్నీల్లో రన్నరప్‌గా నిలిచాడు. 2016 రియో ఒలింపిక్స్‌లోనూ పాల్గొన్న సుమీత్.. కెరీర్‌లో అత్యుత్తమంగా 17వ ర్యాంక్ అందుకున్నాడు. 2021లో భార్య సిక్కిరెడ్డితో కలిసి హైదరాబాద్‌లో బ్యాడ్మింటన్ అకాడమీ ఏర్పాటు చేసిన సుమీత్.. చిన్నారులకు శిక్షణ ఇస్తున్నాడు.

ధోనీ.. 0.12 సెకన్లలోనే



చెన్నై: వికెట్ల వెనకాల ఎంఎస్ ధోనీ ఉంటే క్రీజులో బ్యాటర్లు ఎంత జాగ్రత్తగా ఉండాలో మరోసారి తెలిసొచ్చింది. ఆదివారం ముంబైతో మ్యాచ్‌లో 43 ఏళ్ల ఎంఎస్ మెరుపు స్టంపింగ్ చూసి క్రికెట్ ప్రేమికులు మంత్రముగ్ధులయ్యారు. 11వ ఓవర్‌లో స్పిన్నర్ నూర్ అహ్మద్ వేసిన బంతిని సూర్యకుమార్ షాట్ ఆడాలని చూసినా విఫలమయ్యాడు. అటు ధోనీ కేవలం 0.12 సెకన్లలోనే ఆ బాల్‌ను అందుకుని బెయిల్స్ గిరాటేశాడు.

తమీమ్‌కు గుండెపోటు



ఢాకా: బంగ్లాదేశ్ మాజీ కెప్టెన్ తమీమ్ ఇక్బాల్ (36) తీవ్ర అస్వస్థతకు గురయ్యాడు. ఢాకా ప్రీమియర్ డివిజన్ క్రికెట్ లీగ్‌లో ఆడుతుండగా అతడికి గుండెపోటు రావడంతో హుటాహుటిన ఆసుపత్రికి తరలించారు. వైద్యులు తమీమ్‌కు స్టెంట్ వేసి రక్తనాళాల్లో ఉన్న అడ్డంకిని తొలగించారు. ప్రస్తుతం అతని పరిస్థితి నిలకడగా ఉందని వైద్యులు చెప్పారు. షైన్‌పుకార్ క్రికెట్ క్లబ్‌తో మ్యాచ్‌లో మహ్మడెన్ స్పోర్ట్స్ క్లబ్‌కు సారథ్యం వహిస్తున్న తమీమ్ ఫీల్డింగ్ చేస్తుండగా ఛాతీలో అసౌకర్యంగా ఉండడంతో మ్యాచ్ మధ్యలోనే ఆసుపత్రికి తీసుకెళ్లి పరీక్షలు నిర్వహించారు. ఎయిర్ అంబులెన్స్‌లో మరో ఆసుపత్రికి తరలించాలనుకొనేలోపు మరోసారి తీవ్రమైన గుండెపోటు రావడంతో విపత్కర పరిస్థితుల్లో అక్కడే ఉంచి సర్జరీ చేయించారు. తమీమ్ స్పృహలోకి వచ్చాడని బీసీబీ చీఫ్ ఫిజీషియన్ దేబాశిష్ చౌదరి తెలిపాడు. బంగ్లా తరఫున తమీమ్ 70 టెస్టులు, 243 వన్డేలు, 78 టీ20లు ఆడాడు.

ఢిల్లీ కమాల్

అశుతోష్, విప్రజ్ మెరుపు ఇన్నింగ్స్

లఖ్‌నవూపై అద్భుత విజయం ● పూరన్, మార్ష్ అర్ధ సెంచరీలు

స్పోర్ట్స్

నేటి మ్యాచ్ — వేదిక అహ్మదాబాద్

గుజరాత్ x పంజాబ్ రా.7.30 నుంచి

ఢిల్లీ ముందు 210 పరుగుల లక్ష్యం.. తొలి ఓవర్‌లోనే రెండు వికెట్లు ఫట్.. ఓ దశలో స్కోరు 65/5. ఇంకేం.. లఖ్‌నవూ విజయం నల్లేరుపై నడకే అనుకున్నారంతా. కానీ మిడిలార్డర్ పట్టు వదల్లేదు. ఆశలు లేని స్థితిలో అరంగేట్ర బ్యాటర్ విప్రజ్ నిగమ్ అనూహ్య ఆటతీరుతో ఢిల్లీ అనూహ్యంగా పోటీలోకొచ్చింది. కీలక దశలో అతను నిష్క్రమించినా చివర్లో అశుతోష్ విధ్వంసానికి విశాఖ స్టేడియం హోరెత్తింది. దీంతో ఆఖరి ఓవర్‌లో మరో మూడు బంతులుండగానే మ్యాచ్‌కు ఢిల్లీ అద్భుతమైన ముగింపునిచ్చింది. అటు లఖ్‌నవూకు మాత్రం నిరాశే మిగిలింది.



అశుతోష్ (31 బంతుల్లో 5 ఫోర్లు, 5 సిక్సర్లతో 66 నాటౌట్)

విశాఖపట్నం: ఐపీఎల్-18లో ఢిల్లీ క్యాపిటల్స్ అదిరే బోణీ చేసింది. సోమవారం సాగర తీరాన అత్యంత ఉత్కంఠభరితంగా సాగిన ఈ మ్యాచ్‌లో లఖ్‌నవూ సూపర్ జెయింట్స్‌పై వికెట్ తేడాతో ఢిల్లీ నెగ్గింది. చివర్లో ఇరు జట్ల మధ్య విజయం దోబూచులాడినా అశుతోష్ శర్మ (31 బంతుల్లో 5 ఫోర్లు, 5 సిక్సర్లతో 66 నాటౌట్) తుదికంటా నిలిచి ఢిల్లీని గట్టెక్కించాడు. అతడికి విప్రజ్ నిగమ్ (15 బంతుల్లో 5 ఫోర్లు, 2 సిక్సర్లతో 39), స్టబ్స్ (22 బంతుల్లో 1 ఫోర్, 3 సిక్సర్లతో 34) సహకరించారు. ముందుగా బ్యాటింగ్‌కు దిగిన లఖ్‌నవూ 20 ఓవర్లలో 8 వికెట్లకు 209 పరుగులు చేసింది. నికోలస్ పూరన్ (30 బంతుల్లో 6 ఫోర్లు, 7 సిక్సర్లతో 75), మిచెల్ మార్ష్ (36 బంతుల్లో 6 ఫోర్లు, 6 సిక్సర్లతో 72) తుఫాన్ ఇన్నింగ్స్‌తో ఆకట్టుకున్నారు. స్టార్క్‌కు మూడు, కుల్దీప్‌నకు రెండు వికెట్లు దక్కాయి. ఆ తర్వాత ఛేదనలో ఢిల్లీ 19.3 ఓవర్లలో 9 వికెట్లకు 211 పరుగులు చేసి నెగ్గింది. శార్దూల్, సిద్దార్థ్, దిగ్వేష్, బిష్ణోయ్‌లకు రెండేసి వికెట్లు దక్కాయి. ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్‌గా అశుతోష్ నిలిచాడు. కాగా, ఐపీఎల్‌లో ఢిల్లీకిదే అత్యధిక ఛేదన కావడం విశేషం.

దంచేసిన 'మిడిల్': భారీ ఛేదనలో ఢిల్లీని ఓటమి అంచుల నుంచి మిడిలార్డర్ బ్యాటర్లు విజయతీరాలకు చేర్చారు. విప్రజ్, అశుతోష్ అదుర్స్ ఆటతీరుతో ఎల్ఎస్‌జీ బౌలర్లను ఆడేసుకున్నారు. అయితే తొలి ఓవర్‌లోనే ఓపెనర్ మెక్‌గుర్క్ (1), అభిషేక్ పోరెల్ (0)లను పేసర్ శార్దూల్ పెవిలియన్‌కు చేర్చాడు. తర్వాతి ఓవర్‌లోనే సమీర్ రిజ్వీ (4)ని స్పిన్నర్ సిద్దార్థ్ అవుట్ చేయడంతో 7 పరుగులకు డీసీ మూడు వికెట్లు కోల్పోయింది. ఈ దశలో అక్షర్ (22), డుప్లెసి (29) నాలుగో వికెట్‌కు 43 పరుగులు జత చేశారు. స్వల్ప వ్యవధిలోనే ఈ ఇద్దరూ పెవిలియన్‌కు చేరడంతో 65/5 స్కోరుతో ఢిల్లీ మరింత ఇబ్బందుల్లో పడింది. కానీ ఆ తర్వాత బ్యాటర్లు ఎదురుదాడికి దిగి లఖ్‌నవూకు ఓటమి భయాన్ని రుచి చూపించారు. ముందుగా స్టబ్స్ భారీ షాట్లతో చెలరేగి ఆరో వికెట్‌కు అశుతోష్‌తో కలిసి 48 పరుగులు జత చేశాడు. 13వ ఓవర్‌లో స్టబ్స్ రెండు సిక్సర్లు బాది వెంటనే అవుటయ్యాడు. అనంతరం అశుతోష్‌కు జత కలిసిన విప్రజ్ అనూహ్య రీతిలో చెలరేగాడు. ప్రతీ బంతిని బాదేస్తూ వేగంగా పరుగులు రాబట్టాడు. 14వ ఓవర్‌లో 4,4,6తో 17 రన్స్ అందించాడు. 16వ ఓవర్‌లో అశుతోష్ 6,4.. విప్రజ్ 4,4తో 20 రన్స్ వచ్చాయి. దీంతో ఒక్కసారిగా లఖ్‌నవూ శిబిరంలో ఆందోళన నెలకొంది. అయితే 4 ఓవర్లలో 42 పరుగులు కావాల్సి ఉన్న దశలో విప్రజ్ వెనుదిరగడంతో లఖ్‌నవూ పోటీలోకొచ్చింది. కానీ అశుతోష్ 18వ ఓవర్‌లో 6,4,6తో 17 రన్స్ అందించడంతో మళ్లీ సీన్ మారింది. 19వ ఓవర్‌లో కుల్దీప్ (5) రనౌటైనా అశుతోష్ 6,4తో 16 రన్స్ వచ్చాయి. ఇక ఆరు బంతుల్లో ఆరు పరుగులు కావాల్సిన వేళ అశుతోష్ సిక్సర్‌తో మ్యాచ్‌ను ముగించాడు.

ఆరంభం బాగున్నా..: టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన లఖ్‌నవూ ఆరంభంలో మెరుపు బ్యాటింగ్ కనబర్చగా.. డెత్ ఓవర్లలో తడబడింది. ఓపెనర్ మిచెల్ మార్ష్, నికోలస్ పూరన్‌ల విధ్వంసానికి 250+ స్కోరు ఖాయమనుకున్న చోట అతికష్టంగా 200 రన్స్ చేరగలిగింది. మూడో ఓవర్‌లోనే మార్ష్ 6,4,6,4తో పేసర్ స్టార్క్‌కు చుక్కలు చూపించాడు. మరో ఓపెనర్ మార్‌క్రమ్ (15) ఐదో ఓవర్‌లో వెనుదిరిగినా.. పవర్‌ప్లేలో జట్టు 64/1 స్కోరుతో నిలిచింది. అటు 21 బంతుల్లోనే మార్ష్ హాఫ్ సెంచరీ పూర్తయ్యింది. ఇక వన్‌డౌన్‌లో బరిలోకి దిగిన పూరన్ సైతం ఎదురుదాడికి దిగి ఏడో ఓవర్‌లో మూడు సిక్సర్లతో చెలరేగాడు. అయితే అతడి సులువైన క్యాచ్‌ను రిజ్వీ వదిలేశాడు. ఈ ఓవర్‌లో 25 పరుగులు రావడం విశేషం. ఈ ఇద్దరి దూకుడుతో లఖ్‌నవూ జట్టు పదో ఓవర్‌లోనే 108 రన్స్ సాధించింది. అయితే 12వ ఓవర్‌లో మార్ష్ క్యాచ్‌ను లాంగాన్‌లో స్టబ్స్ పట్టేయడంతో రెండో వికెట్‌కు 87 పరుగుల భాగస్వామ్యం ముగిసింది. అటు పూరన్ మాత్రం తర్వాతి ఓవర్‌లోనే వరుసగా 6,6,6,6,4తో ఏకంగా 28 పరుగులు రాబట్టాడు. అలాగే 24 బంతుల్లోనే అతడి హాఫ్ సెంచరీ పూర్తయ్యింది. అయితే పంత్ లఖ్‌నవూ అరంగేట్రం డకౌట్‌తో ముగిసింది. లీగ్‌లోనే అత్యంత ఖరీదైన ఈ ఆటగాడిని 14వ ఓవర్‌లో కుల్దీప్ దెబ్బతీశాడు. ఆ వెంటనే ప్రమాదకర పూరన్‌ను స్టార్క్ బౌల్డ్ చేయడంతో లఖ్‌నవూ బ్యాటింగ్ లయ తప్పింది. చివరి ఐదు ఓవర్లలో 39 పరుగులే చేసి నాలుగు వికెట్లు కోల్పోయింది. ఇందులో ఆఖరి ఓవర్‌లోనే మిల్లర్ (27 నాటౌట్) రెండు సిక్సర్లతో 15 రన్స్ ఉండడం గమనార్హం.



పూరన్ (75) మార్ష్ (72)

స్కోరుబోర్డు

లఖ్‌నవూ: మార్‌క్రమ్ (సి) స్టార్క్ (బి) విప్రజ్ 15, మిచెల్ మార్ష్ (సి) స్టబ్స్ (బి) ముకేశ్ 72, పూరన్ (బి) స్టార్క్ 75, పంత్ (సి) డుప్లెసి (బి) కుల్దీప్ 0, మిల్లర్ (నాటౌట్) 27, బదోని (సి) స్టబ్స్ (బి) కుల్దీప్ 4, శార్దూల్ (రనౌట్) 0, షాబాజ్ (సి/సబ్) విజయ్ (బి) స్టార్క్ 9, బిష్ణోయ్ (బి) స్టార్క్ 0, దిగ్వేశ్ రాఠి (నాటౌట్) 0, **ఎక్స్‌ట్రాలు: 7; మొత్తం: 20 ఓవర్లలో 209/8; వికెట్ల పతనం:** 1-46, 2-133, 3-161, 4-169, 5-177, 6-177, 7-194, 8-194; **బౌలింగ్:** స్టార్క్ 4-0-42-3, అక్షర్ 3-0-18-0, విప్రజ్ నిగమ్ 2-0-35-1, ముకేశ్ 2-0-22-1, కుల్దీప్ యాదవ్ 4-0-20-2, మోహిత్ శర్మ 4-0-42-0, స్టబ్స్ 1-0-28-0.

ఢిల్లీ: మెక్‌గుర్క్ (సి) బదోని (బి) శార్దూల్ 1, డుప్లెసి (సి) మిల్లర్ (బి) బిష్ణోయ్ 29, అభిషేక్ పోరెల్ (సి) పూరన్ (బి) శార్దూల్ 0, సమీర్ రిజ్వీ (సి) పంత్ (బి) సిద్దార్థ్ 4, అక్షర్ (సి) పూరన్ (బి) రాఠి 22, స్టబ్స్ (బి) సిద్దార్థ్ 34, అశుతోష్ శర్మ (నాటౌట్) 66, విప్రజ్ నిగమ్ (సి) సిద్దార్థ్ (బి) రాఠి 39, స్టార్క్ (సి) పంత్ (బి) బిష్ణోయ్ 2, కుల్దీప్ (రనౌట్) 5, మోహిత్ (నాటౌట్) 1, **ఎక్స్‌ట్రాలు: 8; మొత్తం: 19.3 ఓవర్లలో 211/9; వికెట్ల పతనం:** 1-2, 2-2, 3-7, 4-50, 5-65, 6-113, 7-168, 8-171, 9-192; **బౌలింగ్:** శార్దూల్ ఠాకూర్ 2-0-19-2, సిద్దార్థ్ 4-0-39-2, దిగ్వేశ్ రాఠి 4-0-31-2, రవి బిష్ణోయ్ 4-0-53-2, ప్రిన్స్ యాదవ్ 4-0-47-0, షాబాజ్ 1.3-0-22-0.

స్వర్ణాంధ్ర లక్ష్యంగా కార్యాచరణ

నేడు, రేపు కలెక్టర్ల సదస్సు

- సచివాలయ ఐదో బ్లాక్‌లో నిర్వహణ
- ఈ సారి కలెక్టర్ల ప్రజంటేషన్లకే ప్రాధాన్యం
- పేపర్ నివేదికలుండవ్.. అంతా డిజిటల్‌గానే
- రెవెన్యూ కార్యదర్శి ప్రజంటేషన్ లేకుండా చేసిన సీఎంవో

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

స్వర్ణాంధ్ర సాధనే లక్ష్యంగా విజన్-2047 అమలు, దిశాదశపై చర్చించేందుకు మంగళ, బుధ వారాల్లో జిల్లా కలెక్టర్ల సమావేశాలు నిర్వహించేందుకు ప్రభుత్వం సర్వం సిద్ధం చేసింది. రాష్ట్ర సచివాలయ ఐదో బ్లాక్‌లోని సమావేశం మందిరంలో ఈ సమావేశాలు జరగనున్నాయి. ప్రభుత్వం వచ్చిన కొత్తలో తొలిసారిగా కలెక్టర్ల సమావేశాన్ని గతేడాది ఆగస్టులో ఒక్క రోజే నిర్వహించింది. రెండోదఫా డిసెంబరులో సమావేశాలు జరిగాయి. అప్పటికి రాష్ట్రంలో పరిస్థితిపై ప్రభుత్వానికి ఓ స్పష్టత వచ్చింది. జగన్ ప్రభుత్వంలో జరిగిన అక్రమాలను నిగ్గుతేల్చడం, కొత్తగా ప్రజాసంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాల అమలుపై ముఖ్యమంత్రి చంద్రబాబు కలెక్టర్లకు దిశానిర్దేశం చేశారు. ఇప్పుడు మూడో సమావేశాలకు సచివాలయం వేదిక కానుంది. విజన్-2047 స్వర్ణాంధ్ర లక్ష్యాలు, పీ4 అమలు, డిజిటల్ అడ్మినిస్ట్రేషన్, వాట్సాప్ గవర్నెన్స్, సంక్షేమ పథకాల అమలు, వచ్చే విద్యాసంవత్సరం నుంచి అమల్లోకి వచ్చే కొత్త పథకాలపై ఈ సమావేశంలో చర్చించనున్నారు. ఇప్పటికే విజన్-2047 డాక్యుమెంట్‌ను ప్రభుత్వం ప్రకటించింది. దానిపై కూలంకశంగా ఈ సమావేశంలో చర్చించే అవకాశం ఉంది.

ఇదీ అజెండా

మంగళవారం ఉదయం 10గంటలకు సమావేశాన్ని సీసీఎల్‌ఏ జయలక్ష్మి ప్రారంభిస్తారు. ఆ తర్వాత ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజయానంద్ ఐదు నిమిషాలు ప్రసంగిస్తారు. అనంతరం రెవెన్యూ, ఆర్థికశాఖల మంత్రులు అనగాని సత్యప్రసాద్, పయ్యావుల కేశవ్ మాట్లాడతారు. ముఖ్యమంత్రి చంద్రబాబు 40 నిమిషాలపాటు కలెక్టర్లను ఉద్దేశించి కీలక అంశాలపై మాట్లాడనున్నారు. ఆ తర్వాత ఆర్థికాభివృద్ధిపై ఆ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి 30 నిమిషాల ప్రజంటేషన్ ఇవ్వనున్నారు. అనంతరం వాట్సాప్ గవర్నెన్స్, ఆర్‌టీజీఎస్ అంశాలపై ఐటీశాఖ కార్యదర్శి ప్రజంటేషన్ ఉంటుంది. ప్రజా ఫిర్యాదుల పరిష్కారంపై ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, భూమి, రీ సర్వే సమస్యలపై సీసీఎల్‌ఏ ప్రజంటేషన్లు ఇవ్వనున్నారు. మధ్యాహ్నం సెషన్‌లో వాతావరణ పరిస్థితులు, వేసవి సన్నద్ధత, తాగునీటి సమస్య, వేసవి కార్యాచరణ ప్రణాళికలపై ఆయా శాఖల అధికారులు చర్చించనున్నారు. తొలి రోజే శాంతిభద్రతలు, రెవెన్యూ, ఇతర కీలక అంశాలపై చర్చించాలని నిర్ణయించారు.

కలెక్టర్లు చెప్పేది వినాలని..

గతానికి భిన్నంగా ఈ సారి జిల్లా కలెక్టర్లు చెప్పేది వినాలని ప్రభుత్వం నిర్ణయించింది. జిల్లాల్లో ఆర్థికాభివృద్ధి, ప్రణాళికల అమలు, ఇతర ప్రత్యేక అంశాలపై కలెక్టర్లతో ప్రజంటేషన్లు ఇప్పించనున్నారు. తమకు జిల్లా పరిధిలో ప్రభుత్వం నుంచి ఎలాంటి సహకారం కావాలి? కొత్తగా ప్రభుత్వం ఏ నిర్ణయాలు తీసుకోవాలి? తదితర అంశాలపై కలెక్టర్లు సగటున 8 పీపీటీ స్లైడ్స్‌తో 15 నిమిషాల పాటు ప్రజంటేషన్ ఇచ్చేలా కార్యక్రమం ఖరారు చేశారు.

రెవెన్యూకు చోటేది?

జిల్లా కలెక్టర్ల సమావేశం అంటే రెవెన్యూశాఖ పాత్రే కీలకం. ఆ శాఖ కార్యదర్శి, సీసీఎల్‌ఏలే కీలక పాత్రధారులు. గతంలో ప్రతి సమావేశంలోనూ రెవెన్యూ కార్యదర్శి ప్రజంటేషన్ విధిగా ఉండేది. అయితే, ఈ సమావేశంలో ఫార్మాట్‌నే మార్చేశారు. రెవెన్యూశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ప్రజంటేషన్ లేకుండా సీఎంవో అధికారులు అజెండాను రూపొందించారు. ఇది ఐఏఎస్‌ల్లో కొత్త చర్చను లేవనెత్తింది. దీని వెనక కారణాలు ఏమిటన్న చర్చలు సాగుతున్నాయి.

పేపర్ లెస్ మీటింగ్

ఈ సారి కలెక్టర్ల సమావేశాలను పేపర్లు, పుస్తకాల పంపిణీతో సంబంధం లేకుండా నిర్వహించాలని రెవెన్యూశాఖ ఏర్పాట్లు చేసింది. పూర్తిగా డిజిటల్ ఫార్మాట్‌లోనే అజెండా, ఆయా శాఖల కంటెంట్ అందించేలా సాఫ్ట్ కాపీలను ఇప్పటికే కలెక్టర్లు, అధికారులకు పంపించింది. కోట్లు ఖర్చుపెట్టి పుస్తకాలను ముద్రించకుండా పేపర్ లెస్ విధానంలో సమావేశాలను నిర్వహించాలని అధికారులు నిర్ణయించారు. దీని వల్ల భారీ సైజు పుస్తకాలు, పీపీటీల ముద్రణ ఉండదని, ఖర్చు కూడా ఆదా అవుతుందని చెబుతున్నారు. కలెక్టర్లు జిల్లాల ప్రజంటేషన్లను కూడా డిజిటల్ ఫార్మాట్‌లోనే పంపించేలా ఏర్పాట్లు చేశారు. కలెక్టర్లు, ఆయా శాఖల అధికారులు ల్యాప్‌టాప్ లేదా టాబ్‌లు తెచ్చుకోవాలని ఇప్పటికే సూచనలు ఇచ్చారు.


బీచ్‌లో 'నేహారెడ్డి నిర్మాణాల' తొలగింపు ఖర్చు కోటి..!

- సీఆర్‌జడ్ నిబంధనల ఉల్లంఘనపై పోలీసులకు ఫిర్యాదు?

విశాఖపట్నం, మార్చి 24(ఆంధ్రజ్యోతి): భీమిలి బీచ్‌లోని కోస్తా నియంత్రణ మండలి పరిధిలో నేహారెడ్డి (మాజీ ఎంపీ విజయసాయిరెడ్డి కుమార్తె) కంపెనీ నిర్మించిన ప్రహరీ, వాటి పునాదుల తొలగింపునకు జీవీఎంసీ సుమారు రూ.కోటి వెచ్చిస్తోంది. నిబంధనలకు విరుద్ధంగా నిర్మించిన వాటిని తొలగించి ఈ నెల 26 కల్లా నివేదిక ఇవ్వాలని హైకోర్టు ఆదేశించడంతో జీవీఎంసీ అధికారులు విరామం లేకుండా యంత్రాలతో పనిచేయిస్తున్నారు. విజయసాయిరెడ్డి విశాఖపట్నం జిల్లా వైసీపీ ఇన్‌చార్జిగా ఉన్నప్పుడు భీమిలిలో పెద్ద స్టార్‌హోటల్ నిర్మించే ఉద్దేశంతో సుమారు నాలుగు ఎకరాల భూమిని వివిధ వ్యక్తులు, సంస్థల నుంచి కొనుగోలు చేశారు. ఈ నాలుగు ఎకరాల చుట్టూ ప్రహరీ నిర్మించారు. పది అడుగుల లోతులో భారీగా వేసిన వీటిని తొలగించడానికి అధికారులు భారీ యంత్రాలను ఉపయోగిస్తున్నారు. తొలగింపు వ్యయం కూడా నేహారెడ్డి కంపెనీ నుంచే వసూలు చేయాలని హైకోర్టు ఆదేశించింది. ప్రహరీ తొలగింపు, పునాదుల పెకిలింపు పనులకు రూ.73 లక్షల వ్యయం అవుతుందని అధికారులు అంచనా వేశారు. ఈ అక్రమ నిర్మాణాలపై సముద్ర అధ్యయన సంస్థ (ఎన్‌ఐఓ) అధ్యయనం చేసింది. వారికి రూ.15 లక్షలు చెల్లించారు. మొత్తంగా పని పూర్తయ్యేసరికి రూ.కోటి అవుతుందని అధికారులు చెబుతున్నారు. ఇదిలావుండగా కోస్తా నియంత్రణ మండలిలో నిర్మాణాలు చేపట్టినందున పోలీసులకు ఫిర్యాదు చేయాలని హైకోర్టు ఆదేశించింది. కాలుష్య నియంత్రణ మండలి అధికారులు ఆ పని కూడా పూర్తిచేసి బుధవారం కోర్టుకు నివేదిక అందించాలని యత్నిస్తున్నారు.







చిత్రజ్యోతి

SINCE 1965

ఇండో-కొరియన్ హారర్- కామెడీ



వరుణ్ తేజ్ హీరోగా మేర్లపాక గాంధీ దర్శకత్వంలో తెరకెక్కుతోన్న చిత్రం 'వీటీ15(వర్కింగ్ టైటిల్)'. యూవీ క్రియేషన్స్, ఫస్ట్ ఫ్రేమ్ ఎంటర్‌టైన్‌మెంట్ సంస్థలు నిర్మిస్తున్నాయి. హైదరాబాద్‌లో సోమవారం నిర్వహించిన పూజా కార్యక్రమాలతో ఈ చిత్రం ఘనంగా ప్రారంభమైంది. ఈ కార్యక్రమంలో వరుణ్ తేజ్‌తో పాటు కథానాయిక రితిక నాయక్ పాల్గొన్నారు. ఇండో-కొరియన్ హారర్- కామెడీగా రూపొందుతున్న ఈ చిత్రం రెగ్యులర్ షూటింగ్ కూడా నేటి నుంచే ప్రారంభిస్తున్నామని చిత్రబృందం తెలిపింది. కాగా, వరుణ్ తేజ్ చివరి సినిమా 'మట్కా' ఆశించిన విజయాన్ని అందుకోలేకపోయింది. 'ఎఫ్-3' తర్వాత సరైన హిట్ కోసం ఎదురుచూస్తున్న వరుణ్ తేజ్ ఈ సినిమాపై భారీ ఆశలు పెట్టుకున్నారు. మేర్లపాక గాంధీ 'వెంకటాద్రి ఎక్స్‌ప్రెస్', 'ఎక్స్‌ప్రెస్ రాజా', 'ఏక్ మినీ కథ' లాంటి హిట్ సినిమాలతో టాలీవుడ్‌లో మంచి గుర్తింపు సంపాదించుకున్న విషయం తెలిసిందే. దాంతో 'వరుణ్ తేజ్- మేర్లపాక' కాంబినేషన్‌పై భారీ అంచనాలు నెలకొన్నాయి.

విజయ్ ఆఖరి చిత్రం అప్పుడే!



ఎప్పుడెప్పుడా అని అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్న తమిళ నటుడు విజయ్ చిత్రం 'జన నాయగన్' విడుదల తేదీ వచ్చేసింది. హెచ్.వినోద్ దర్శకత్వంలో వస్తున్న ఈ సినిమాలో పూజా హెగ్డే కథానాయిక. కేవీఎన్ సంస్థ నిర్మిస్తోంది. మమితా బైజు, బాబీ డియోల్, ప్రియమణి తదితరులు కీలక పాత్రలు పోషించారు. ఈ సినిమా విడుదల తేదీని చిత్రబృందం తాజాగా ప్రకటించింది. వచ్చే ఏడాది జనవరి 9న ప్రేక్షకుల ముందుకు తీసుకురానున్నట్లు సోషల్ మీడియా వేదికగా తెలిపింది. రాజకీయాల్లోకి వెళ్లిన విజయ్ ఆఖరి చిత్రం ఇదేనంటూ కోలీవుడ్‌లో కొంత కాలంగా ప్రచారం జరుగుతున్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో విజయ్‌కు ఘనంగా వీడ్కోలు పలుకుతూ ఒక పాటను సినిమాలో రూపొందించినట్లు సమాచారం. దర్శకులు లోకేశ్ కనగరాజ్, అట్లీ, నెల్సన్ దిలీప్‌తో పాటు ఓ హీరో అతిథి పాత్రలో సందడి చేయనున్నారని కోలీవుడ్‌లో టాక్ వినిపిస్తోంది.

'కన్నప్ప' ను ట్రోల్ చేస్తే శివుడి శాపం తప్పదు



'నేను మాములుగా ఆంజనేయ స్వామి భక్తుడిని. కానీ 'కన్నప్ప'తో ప్రయాణం మొదలయ్యాక శివ భక్తుడిగా మారిపోయా. ఈ ప్రయాణంలో చాలా నేర్చుకున్నా. కన్నప్ప చిత్రం అందరినీ ఆకట్టుకుంటుంది. ప్రభాస్ పాత్రను ఎంత ఊహించుకున్నా అంతకు మించి అనేలా ఉంటుంది' అని చెప్పారు మంచు విష్ణు. ఆయన నటిస్తున్న 'కన్నప్ప' చిత్రం వచ్చే నెల 25న విడుదలవుతోంది. ఈ సందర్భంగా రెడ్ లారీ ఫిల్మ్ ఫెస్టివల్‌లో 'కన్నప్ప' టీమ్ పాల్గొని, మీడియాతో ముచ్చటించింది. ఈ కార్యక్రమంలో మీడియా ప్రతినిధులు అడిగిన ప్రశ్నకు విష్ణు సమాధానం ఇస్తూ 'నేను మాట్లాడిన మాటల్లో ఏదన్నా వాక్యం కట్ చేసి వైరల్ చేసి వివాదం సృష్టించాలనుకుంటే పట్టించుకోవాల్సిన అవసరం లేదు. ప్రజలు చాలా స్మార్ట్.. కొంచెం వివాదమైనా పూర్తి వీడియో చూసి నిజానిజాలు తెలుసుకుంటున్నారు' అన్నారు. పక్కనే ఉన్న రఘుబాబు మైక్ అందుకుని 'ఈ సినిమా గురించి ఎవరైనా ట్రోల్ చేస్తే శివుడి ఆగ్రహానికి, శాపానికి గురవుతారు. వంద శాతం కచ్చితంగా చెబుతున్నా. ట్రోల్ చేస్తే ఇక ఫినిష్షే' అన్నారు. 'దర్శకుడు ముఖేశ్‌కుమార్ సింగ్ మాట్లాడుతూ 'ఆ శివుడే నన్ను ఈ ప్రాజెక్ట్‌లోకి పంపించాడు. 'మహాభారత్' సీరియల్‌ను అందరూ ప్రేమించారు. అలాగే అదే స్థాయిలో కన్నప్పను ఆరాధిస్తారు, గౌరవిస్తారు' అని చెప్పారు.

థ్రిల్లింగ్ అంశాలతో...



నవీన్ చంద్ర, షాలినీ వడ్నికట్టి జంటగా నటించిన చిత్రం '28 డిగ్రీల సెల్సియస్'. 'పొలిమేర' ఫేమ్ డా.అనిల్ విశ్వనాథ్ తెరకెక్కించారు. సాయి అభిషేక్ నిర్మించిన ఈ చిత్రం ఏప్రిల్ 4న విడుదలవుతోంది. తాజాగా, సినిమా ట్రైలర్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా చిత్రదర్శకుడు డా.అనిల్ విశ్వనాథ్ మాట్లాడుతూ "ఇదో అందమైన ప్రేమకథ. థ్రిల్లింగ్ అంశాలు పుష్కలంగా ఉంటాయి" అని చెప్పారు. "నిజాయితీతో తీసిన చిత్రమిది. ప్రేక్షకులు తప్పక ఆదరిస్తారనే నమ్మకం ఉంది" అని హీరో నవీన్ చంద్ర చెప్పారు. "ఈ సినిమా మా చిత్రబృందానికి ఓ భావోద్వేగ ప్రయాణం" అని చిత్రనిర్మాత సాయి అభిషేక్ తెలిపారు.

డ్రగ్స్ రహిత సమాజం కోసం..



'ఆదిత్య', 'విక్కీస్ డ్రీమ్', 'డాక్టర్ గౌతమ్' వంటి బాలల చిత్రాలు నిర్మించి జాతీయ, అంతర్జాతీయ అవార్డులు పొందిన దర్శకనిర్మాత భీమగాని సుధాకర్ గౌడ్ రూపొందించిన మరో బాలల చిత్రం 'అభినవ్'. బాలల దినోత్సవం సందర్భంగా నవంబర్ 14న ఈ చిత్రాన్ని విడుదల చేయనున్నారు. ఈ సందర్భంగా సుధాకర్ గౌడ్ మాట్లాడుతూ 'డ్రగ్ మాఫియా విద్యార్థులను లక్ష్యంగా చేసుకుని మన దేశాన్ని నిర్వీర్యం చేయాలని చూస్తోంది. స్వాతంత్ర్య సమరయోధుడైన తన తాతయ్య స్ఫూర్తితో అభినవ్ అనే బాలుడు ఈ గంజాయి మాఫియా ఆట ఎలా కట్టించాడన్నది ఈ చిత్ర కథ.' అన్నారు. తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి డగ్స్ రహిత సమాజం కోసం సినిమా వాళ్లు ఓ చిన్న వీడియో చేయాలని కోరారనీ, తన వంతుగా ఈ సినిమాను తీశాననీ ఆయన తెలిపారు. సమ్మెట గాంధీ, సత్య ఎర్ర, మాస్టర్ గగన్,గీతా గోవింద్, అభినవ్, చరణ్, బేబి అక్షర తదితరులు ఈ చిత్రంలో నటిస్తున్నారు.

మా కెరీర్‌లోనే ఉత్తమ చిత్రమవుతుంది

- వెంకీ కుడుముల



'ఛలో', 'భీష్మ' చిత్రాల ఫేమ్ వెంకీ కుడుముల తెరకెక్కించిన చిత్రం 'రాబిన్‌హుడ్'. నితిన్, శ్రీలీల జంటగా మైత్రీమూవీ మేకర్స్ పతాకంపై యలమంచలి రవిశంకర్, నవీన్ యెర్నేని నిర్మించారు. రాజేంద్రప్రసాద్, ఆస్ట్రేలియా క్రికెటర్ డేవిడ్ వార్నర్ కీలక పాత్రలు పోషించారు. ఈ నెల 28న సినిమా విడుదలవుతోన్న సందర్భంగా మీడియాతో ముచ్చటించారు దర్శకుడు వెంకీ కుడుముల. "భీష్మ' తర్వాత మెగాస్టార్ చిరంజీవితో ఓ సినిమా చేయాలనుకున్నాను. కానీ అది కార్యరూపం దాల్చలేదు. ఆ తర్వాత నితిన్‌తో కలసి ఈ సినిమాను మొదలుపెట్టాను. ఇందులో హీరో పాత్ర చాలా విభిన్నంగా ఉంటుంది. మాటలతో సునాయసంగా మనుషుల్ని గారడీ చేసే రకం. ఈ సినిమాకు మొదటి 20 నిమిషాలు చాలా ముఖ్యం. సినిమా అద్భుతంగా వచ్చింది. నితిన్‌కూ, నాకూ కెరీర్ బెస్ట్ చిత్రం అవుతుంది. నితిన్, రాజేంద్రప్రసాద్, శ్రీలీల పాత్రల మధ్య వచ్చే సన్నివేశాలు చాలా ఆసక్తికరంగా ఉంటాయి. డేవిడ్ వార్నర్ పాత్ర చాలా కీలకంగా ఉంటుంది. అవసరం ఉన్న వారి పక్షాన నిలబడే వాడే 'రాబిన్‌హుడ్'. ఇదే ఈ సినిమా టైటిల్ ప్రధాన ఉద్దేశం. జి.వి ప్రకాశ్ సంగీతం ప్రధానాకర్షణ. ఈ పూర్తి స్థాయి వినోదాత్మక చిత్రం అందరినీ ఆకట్టుకుంటుంది" అని చెప్పారు.

ఈ సారి రెండింతల వినోదం



యువతరాన్ని ఆకట్టుకున్న 'మ్యాడ్' చిత్రానికి సీక్వెల్‌గా తెరకెక్కింది 'మ్యాడ్ స్క్వేర్'. నార్నె నితిన్, సంగీత్ శోభన్, రామ్ నితిన్ ప్రధాన పాత్రలు పోషించారు. కల్యాణ్ శంకర్ దర్శకత్వం వహించారు. సూర్యదేవర నాగవంశీ సమర్పణలో హారికా సూర్యదేవర, సాయిసౌజన్య నిర్మించారు. ఈనెల 28న సినిమా విడుదలవుతోన్న సందర్భంగా మీడియాతో ముచ్చటించారు కథానాయకులు నితిన్, సంగీత్, రామ్. నార్నె నితిన్ మాట్లాడుతూ "మొదటి భాగంతో పోలిస్తే ఈసారి రెండింతల వినోదంతో వస్తున్నాం. ప్రేక్షకులకు మేము చేసే వినోదం విపరీతంగా నచ్చుతుందనే నమ్మకం ఉంది. మొదటి భాగమంతా కాలేజీలో సాగితే.. ఈ సినిమా ఒక పెళ్లి చుట్టూ సాగుతుంది. దర్శకుడు కల్యాణ్ శంకర్ ప్రతీ సన్నివేశాన్ని కడుపుబ్బా నవ్వుకునేలా తెరకెక్కించారు" అని చెప్పారు. సంగీత్ శోభన్ మాట్లాడుతూ "వినోదమే ఈ సినిమాకు హీరో. ఇందులోని పాత్రలకున్న ప్రధాన ఉద్దేశం నవ్వించడమే. ప్రతీ సన్నివేశం కొత్తగా ఉంటుంది" అని చెప్పారు. రామ్ నితిన్ మాట్లాడుతూ "ఇదో క్లీన్ కామెడీ. యువతరంతో పాటు కుటుంబ ప్రేక్షకులనూ అలరిస్తుంది. 'మ్యాడ్' సిరీస్‌ను కొనసాగించే ఆలోచన ఉంది" అని తెలిపారు.

అందమైన ప్రేమకథ



సుహాస్ కథానాయకుడిగా రామ్ గోదాల దర్శకత్వంలో తెరకెక్కుతోన్న రొమాంటిక్ కామెడీ 'ఓ భామ అయ్యో రామ'. 'జో' ఫేమ్ మాళవిక మనోజ్ హీరోయిన్‌గా హరీష్ నల్ల నిర్మిస్తున్నారు. రానా దగ్గుబాటి నిర్మాణ సంస్థ స్పిరిట్ మీడియా చిత్రాన్ని విడుదల చేయనుంది. తాజాగా, ఈ సినిమా టీజర్‌ను రిలీజ్ చేశారు మేకర్స్. ఈ సందర్భంగా హీరో సుహాస్ మాట్లాడుతూ "ప్రతీ సన్నివేశం కొత్తగా ఉండే అందమైన ప్రేమకథ ఈ చిత్రం. సినిమా అందరికీ నచ్చుతుంది" అని చెప్పారు. "సుహాస్, మాళవిక కెమిస్ట్రీ, పాటలు, విజువల్స్ సినిమాకు ప్రధానాకర్షణ" అని దర్శకుడు రామ్ గోదాల చెప్పారు. "ఈ సినిమా మీ అందరి హృదయాలను దోచుకుంటుంది" అని నిర్మాత హరీష్ నల్ల తెలిపారు.

గ్రూప్-1 మెయిన్స్ ఐచ్ఛిక మార్పునకు మరో చాన్స్

విజయవాడ(బెంజిసర్కిల్), మార్చి 24(ఆంధ్రజ్యోతి): గ్రూప్-1 మెయిన్స్ పరీక్షలకు సంబంధించిన ఐచ్ఛిక మార్పులకు ఏపీపీఎస్సీ మరోసారి అవకాశం కల్పించింది. ఈ నెల 26(బుధవారం) నుంచి ఏప్రిల్ 2వ తేదీ వరకు ఈ అవకాశం ఉంటుందని ఏపీపీఎస్సీ తెలిపింది. పరీక్షలు రాసే అభ్యర్థులు తమ మాధ్యమం, పోస్టులు, జోనల్ ప్రాధాన్యం, పరీక్షా కేంద్రాల మార్పు, చేర్పులు చేసుకోవచ్చు. అదే విధంగా గ్రూప్-1 మెయిన్స్ పరీక్షల షెడ్యూల్‌ను కూడా ఏపీపీఎస్సీ విడుదల చేసింది. దీని ప్రకారం మెయిన్స్‌ను మే 3 నుంచి 9వ తేదీ వరకు నిర్వహించనున్నారు. మొత్తం ఏడు పేపర్లకు మెయిన్స్ జరగనుంది.

బిల్లు, సినిమా టికెట్ ఉంటే.. పార్కింగ్ ఫ్రీ

» మాల్స్, మల్టీప్లెక్స్‌ల వద్ద వసూళ్లపై క్రమబద్ధీకరణ: మున్సిపల్ శాఖ

అమరావతి, మార్చి 24(ఆంధ్రజ్యోతి): పట్టణాల్లో వాణిజ్య సముదాయాలు, మాల్స్, మల్టీప్లెక్స్‌ల వద్ద పార్కింగ్ ఫీజు వసూలు చేయడాన్ని క్రమబద్ధీకరిస్తూ మున్సిపల్, పట్టణాభివృద్ధిశాఖ ఉత్తర్వులు జారీచేసింది. పార్కింగ్ స్థలాలను ఇతరులు దుర్వినియోగం చేయకుండా చర్యలు చేపట్టింది. వాణిజ్య సముదాయాలు, మాల్స్, మల్టీప్లెక్స్‌లు పార్కింగ్ స్థలాల్లో అర్ధగంట వరకు ఎలాంటి ఫీజులు వసూలు చేయరాదని సోమవారం స్పష్టం చేసింది. అలాగే, ఆయా వాణిజ్య సముదాయాల్లో ఏవైనా వస్తువులు కొన్నట్టు బిల్లులు చూపిస్తే 30 నిమిషాల నుంచి గంట లోపు వరకు పార్కింగ్ ఫీజు వసూలు చేయకూడదని పేర్కొంది. సినిమా టికెట్ లేదా ఆ సముదాయంలో పార్కింగ్ ఫీజు కంటే ఎక్కువ విలువైన వస్తువులు కొన్నట్టు బిల్లులు చూపిస్తే గంట కంటే ఎక్కువ సమయం వాహనాన్ని పార్కింగ్‌లో ఉంచినా పార్కింగ్ ఫీజు మినహాయిస్తారు. ఈ ఆదేశాలు ఏప్రిల్ 1 నుంచి అమల్లోకి వస్తాయని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

ఐటీ ప్రమోషన్ బాధ్యత ఈడీబీదే

అమరావతి, మార్చి 24(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఇన్ఫర్మేషన్ టెక్నాలజీలో పెట్టుబడులు పెట్టేందుకు అనువైన వాతావరణం ఉందంటూ ప్రమోషన్ చేసే బాధ్యతను ఎకనామిక్ డెవలప్‌మెంట్ బోర్డు(ఈడీబీ)కు అప్పగిస్తూ ఐటీ శాఖ నిర్ణయం తీసుకుంది. ఈడీబీ ఆకర్షించి తెచ్చిన పెట్టుబడులు కార్యరూపం దాల్చేలా భూములు, ఇతర మౌలిక సదుపాయాలు సమకూర్చే బాధ్యతను ఏపీఐఐసీ తీసుకోవాలని ఆదేశాలిచ్చింది. ప్రభుత్వ శాఖల మధ్య 'వర్క్ డివిజన్'ను స్పష్టం చేస్తూ సోమవారం ఐటీ శాఖ కార్యదర్శి కాటంనేని భాస్కర్ ఉత్తర్వులిచ్చారు. ఇక, అనంతపురం నుంచి విశాఖపట్నం దాకా స్టార్టప్ కంపెనీలకు ప్రోత్సాహకాలు ఇచ్చేలా 'ఇన్నోవేషన్-స్టార్టప్ 2024-29' పాలసీని రాష్ట్ర ఐటీ శాఖ సిద్ధం చేసింది. ఈ మేరకు కాటంనేని భాస్కర్ పాలసీ వివరాలతో ఉత్తర్వులు విడుదల చేశారు. ఈ పాలసీలో విశాఖ ఆంధ్రా వర్సిటీలో ఐఓటీ అండ్ ఏఐ, అనంతపురం శ్రీకృష్ణదేవరాయ వర్సిటీలో రూరల్ ఇన్నోవేషన్ సెంటర్, కాకినాడ కేంద్ర ప్రభుత్వ మినిస్ట్రీ ఆఫ్ పోర్టుల్లో మారిటైం అండ్ షిప్పింగ్, విశాఖపట్నం కల్పలేరు, ఎస్టీపీఐలో ఇండస్ట్రీ 4.ఓ, విశాఖపట్నం ఎయిమ్స్‌లో మెడికల్ డివైజెస్ స్టార్టప్ సెంటర్ల ఏర్పాటుకు నిర్ణయించారు.

ఐపీఎస్ అభిషేక్ మహంతికి టీ హైకోర్టులో ఊరట

హైదరాబాద్, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): ఏపీ, తెలంగాణ మధ్య అఖిలభారత అధికారుల క్యాడర్ వివాదంలో ఉన్న ఐపీఎస్ అభిషేక్ మహంతికి సోమవారం తెలంగాణ హైకోర్టులో ఊరట లభించింది. క్యాట్‌లో తుది తీర్పు వెలువడే వరకు ఆయన తెలంగాణ సర్వీసుల్లోనే కొనసాగవచ్చని ఆదేశాలిచ్చింది.

ఇంటర్‌లో వంద మార్కులకు గణితం పరీక్ష

అమరావతి, మార్చి 24(ఆంధ్రజ్యోతి): ఇంటర్మీడియట్ విద్యలో సంస్కరణలు కొనసాగుతున్నాయి. ఇటీవల సబ్జెక్టులు విలీనం చేస్తూ తీర్మానం చేసిన ఇంటర్ బోర్డు.. ఇప్పుడు మార్కుల విధానాన్ని కూడా మార్చింది. 2025-26 విద్యా సంవత్సరానికి కొత్త మార్కుల విధానాన్ని విడుదల చేసింది. ఇందులో ఒక మార్కు ప్రశ్నలను ప్రవేశపెట్టింది. గణితంలో 12, ఫిజిక్స్‌లో 9, కెమిస్ట్రీలో 9, బోటనీలో 5, జువాలజీలో 4, సివిక్స్, హిస్టరీ, ఎకనామిక్స్‌లో 10 చొప్పున, కామర్స్‌లో 4, అకౌంటెన్సీలో 4, ఇంగ్లిష్‌లో 10 ఒక మార్కు ప్రశ్నలు ఉంటాయి. దీనివల్ల ఉత్తీర్ణత శాతం పెరిగే అవకాశం ఉంటుంది. అలాగే గణితం-ఏ, బీలను విలీనం చేయడం వల్ల ఇకపై ఏటా 100 మార్కులకు గణితం పరీక్షలు జరుగుతాయి. ఫిజిక్స్, కెమిస్ట్రీ రాత పరీక్ష 85 మార్కులకు జరుగుతుంది. 15 మార్కులకు ప్రాక్టికల్స్ ఉంటాయి. బోటనీ, జువాలజీని కలిపి బయాలజీ చేసినా.. మార్కుల వెయిటేజీలో వేర్వేరుగా ప్రశ్నలు ఇవ్వనున్నారు. బోటనీ 43 మార్కులకు, జువాలజీ 42 మార్కులకు రాత పరీక్ష ఉంటుంది. మిగిలిన 15 మార్కులకు ప్రాక్టికల్స్ ఉంటాయి.

ఏపీఈఏపీసెట్‌కు 1,12,606 దరఖాస్తులు

జేఎన్టీయూకే, మార్చి 24(ఆంధ్రజ్యోతి): కాకినాడ జేఎన్టీయూకే ఆధ్వర్యంలో నిర్వహించనున్న ఏపీఈఏపీసెట్-2025కు ఇప్పటివరకూ 1,12,606 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకున్నట్లు కన్వీనర్ ప్రొఫెసర్ వి.వి. సుబ్బారావు తెలిపారు. అపరాధ రుసుము లేకుండా దరఖాస్తులకు ఏప్రిల్ 24 వరకూ గడువుందని, మే 19 నుంచి 27వ తేదీ వరకు ఆన్‌లైన్ విధానంలో పరీక్షలు నిర్వహించనున్నామని తెలిపారు.

జీఎస్టీ స్పెషల్ కమిషనర్‌గా సౌమ్య

అమరావతి, మార్చి 24(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ స్టేట్ ట్యాక్స్(జీఎస్టీ) స్పెషల్ కమిషనర్‌గా ఐఆర్ఎస్ అధికారి సౌమ్య నూతలపాటి డిప్యుటేషన్‌పై నియమితులయ్యారు. ఈ మేరకు సీఎస్ కె.విజయనంద్ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. కేంద్ర సర్వీసెస్‌లో 2011 బ్యాచ్‌కు చెందిన సౌమ్య కస్టమ్స్ ప్రివెంటివ్ కమిషనరేట్‌లో అదనపు కమిషనర్‌గా పనిచేస్తున్నారు.

ఏపీఎంసీకి తాత్కాలిక సభ్యుల నియామకం

అమరావతి, మార్చి 24(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ వైద్య మండలికి ప్రభుత్వం తాత్కాలిక కౌన్సిల్‌ను నియమించింది. ఇందులో ఇద్దరు బోధనా సిబ్బందిని, నలుగురు మెడికల్ ప్రాక్టీషనర్స్‌ను నియమిస్తూ ఆరోగ్యశాఖ స్పెషల్ సీఎస్ ఎం.టి.కృష్ణబాబు సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. మెడికల్ కాలేజీల్లోని బోధనా సిబ్బంది కింద పిన్నమనేని సిద్ధార్థ మెడికల్ కాలేజీ ప్రొఫెసర్ డాక్టర్ గోగినేని సుజాత, ఒంగోలు మెడికల్ కాలేజీ ప్రొఫెసర్ డాక్టర్ కె.వెంకట సుబ్బనాయుడును ప్రభుత్వం నియమించింది. అలానే రిజిస్టర్డ్ మెడికల్ ప్రాక్టీషనర్స్‌గా ఉన్న డాక్టర్ డి.శ్రీహరిరావు, డాక్టర్ స్వర్ణగీత, డాక్టర్ ఎస్.కేశవ రావు బాబు, డాక్టర్ సీహెచ్.మల్లీశ్వరీలను నియమించారు.

ఉత్తరాంధ్రలో అంతర్జాతీయ విశ్వవిద్యాలయం

ఏర్పాటుకు ముందుకొచ్చిన జార్జియా నేషనల్ యూనివర్సిటీ

లోకేశ్ సమక్షంలో ప్రభుత్వంతో ఒప్పందం

అమరావతి, మార్చి 24(ఆంధ్రజ్యోతి): ఉత్తరాంధ్రలో అంతర్జాతీయ విశ్వవిద్యాలయం ఏర్పాటుకు జార్జియా నేషనల్ యూనివర్సిటీ(జీఎన్‌యు) ముందుకొచ్చింది. ఈమేరకు మానవ వనరుల అభివృద్ధి శాఖ మంత్రి నారా లోకేశ్ సమక్షంలో రాష్ట్ర ఉన్నత విద్యాశాఖతో సోమవారం జీఎన్‌యూ ఒప్పందం చేసుకుంది. అంతర్జాతీయ విశ్వవిద్యాలయం స్థాపనకు జీఎన్‌యు రూ.1300 కోట్ల పెట్టుబడులు పెడుతుందని, 500 మందికి ఉపాధి అవకాశాలు లభిస్తాయని మంత్రి కార్యాలయం తెలిపింది. ఈ సందర్భంగా మంత్రి లోకేశ్ మాట్లాడుతూ... రాష్ట్ర విద్యార్థులకు ప్రపంచ స్థాయి విద్యను అందించేందుకు ఈ ఒప్పందం దోహదం చేస్తుందన్నారు. రాష్ట్రంలో విద్యా ప్రమాణాలు మెరుగుపడతాయన్నారు. రాష్ట్ర విద్యార్థులను గ్లోబల్ లీడర్లుగా తీర్చిదిద్దాలన్న ప్రభుత్వ నిబద్ధతకు ఈ ఒప్పందం ఒక నిదర్శనమన్నారు. కాగా, రాష్ట్రంలో ఉన్నత విద్యా ప్రమాణాలు మెరుగుపర్చడం, నూతన ఆవిష్కరణలను ప్రోత్సహించడం ఈ ఒప్పందం లక్ష్యం. జార్జియా యూనివర్సిటీ టెక్నాలజీ, బిజినెస్, హెల్త్‌కేర్ రంగాల్లో నైపుణ్య శిక్షణ ఇస్తుంది. ప్రపంచ స్థాయి విద్యా వ్యవస్థలపై విద్యార్థులకు అవగాహన కల్పిస్తుంది. 2002లో స్థాపించిన జార్జియా యూనివర్సిటీ ఆ దేశంలో అతిపెద్ద వర్సిటీగా ఎదిగింది. ప్రపంచవ్యాప్తంగా నాలుగు ఇంటర్నేషనల్ అక్రెడిడేటెడ్ ఫ్యాకల్టీ ప్రోగ్రామ్స్‌లో గ్లోబల్ కంపెనీలతో కొలాబ్రేషన్‌లో ఉంది. కార్యక్రమంలో జీఎన్‌యు వ్యవస్థాపకుడు గియా కావ్టెలిష్విలి, వైస్ రెక్టార్ జార్జ్ గవ్రాడ్జే, రాష్ట్ర అధికారులు కోన శశిధర్, భరత్‌గుప్తా పాల్గొన్నారు.



అమరావతిలో ఏర్పాటు చేయనున్న అంతర్జాతీయ యూనివర్సిటీకి సంబంధించి మంత్రి లోకేశ్ సమక్షంలో చేసుకున్న ఒప్పంద పత్రాలతో జార్జియా నేషనల్ వర్సిటీ, విద్యాశాఖ అధికారులు

బనకచర్ల.. సీమ గేట్‌వే!

పూర్తయితే రాష్ట్రం సస్యశ్యామలమే: చంద్రబాబు

9.14 లక్షల హెక్టార్ల కొత్త ఆయకట్టుకు నీరు

» మరో 3 లక్షల హెక్టార్లకు స్థిరీకరణ

» 80 లక్షల మందికి తాగునీరు

» పారిశ్రామికావసరాలకు 20 టీఎంసీలు

» 200 మెగావాట్ల విద్యుదుత్పత్తి

» ప్రాథమిక అంచనా రూ.81,900 కోట్లు

» జాతీయ నదుల అనుసంధానంలో చేర్చండి

» కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలకు సీఎం లేఖ

అమరావతి, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): పోలవరం-బనకచర్ల అనుసంధాన పథకానికి రాయలసీమకు గేట్‌వేలాంటిదని ముఖ్యమంత్రి చంద్రబాబు తెలిపారు. జాతీయ నదుల అనుసంధానంలోనూ కీలక భూమిక వహించే ఈ ప్రాజెక్టుకు ఆర్థికంగా చేయూతనివ్వాలని కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌ను కోరారు. ప్రస్తుతం ఈ ప్రాజెక్టు అధ్యయన దశలో ఉందన్నారు. రూ.81,900 కోట్ల వ్యయమవుతుందన్నది ప్రాథమిక అంచనాగా పేర్కొన్నారు. ఈ పథకాన్ని హైబ్రిడ్ యాన్యుటీ మోడల్ (హెచ్‌ఏఎం).. అంటే పబ్లిక్ ప్రైవేట్ పార్టనర్‌షిప్ (పీపీపీ) విధానంలో నిర్మించతలపెట్టామని తెలిపారు. 3 లక్షల హెక్టార్ల ఆయకట్టు స్థిరీకరణ, కొత్తగా 9.14 లక్షల హెక్టార్ల ఆయకట్టుకు సాగునీరు, 80 లక్షల మందికి తాగునీరు, పారిశ్రామికావసరాలకు 20 టీఎంసీలు, 200 మెగావాట్ల విద్యుదుత్పత్తి లక్ష్యమన్నారు. ఇందుకోసం రోజుకు రెండు టీఎంసీల చొప్పున 100 రోజుల పాటు 200 టీఎంసీల గోదావరి వరద జలాలను ఈ ప్రాజెక్టుకు తరలిస్తామని వివరించారు. ఇప్పటికే లైడార్, డ్రోన్ సర్వేలు చేపడుతున్నామని తెలిపారు. కరువు సీమ రాయలసీమతో పాటు.. పల్నాడునూ సస్యశ్యామలం చేసే ఈ పథకాన్ని జాతీయ నదుల అనుసంధాన పథకంలో చేర్చాలని విజ్ఞప్తి చేశారు. రాష్ట్ర విభజన చట్టం ప్రకారం వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధి కింద దీనికి ఆర్థికంగా సాయం అందించి కేంద్రమే పూర్తి చేయాలని కోరారు. ఇటీవలి ఢిల్లీ పర్యటనలో నిర్మలా సీతారామన్‌కు ఈ మేరకు మూడు పేజీల లేఖ అందజేశారు. ఈ పథకాన్ని మూడు దశల్లో చేపట్టేలా కార్యాచరణ ప్రణాళికలను రూపొందించినట్లు తెలిపారు. దశలవారీగా వివరాలివీ..

తొలి దశ: ప్రకాశం బ్యారేజీలోకి ఎత్తిపోత

పోలవరం-బనకచర్ల మొదటి దశ కింద గోదావరి జలాలను పోలవరం డ్యాం నుంచి కుడి ప్రధాన కాలువ ద్వారా ప్రకాశం బ్యారేజీకి మళ్లిస్తారు. ఇప్పటికే ఈ కుడి కాలువ ద్వారా పట్టిసీమ నుంచి 80 టీఎంసీలను కృష్ణా డెల్టాకు మళ్లిస్తున్నాం. ఈ కాలువ సామర్థ్యం పెంచి.. రోజుకు 18,000 క్యూసెక్కుల నుంచి 35,000 క్యూసెక్కుల చొప్పున రెండు టీఎంసీల చొప్పున 100 రోజులు ఎత్తిపోస్తాం. ఇందుకు 290 మెగావాట్ల విద్యుత్ అవసరం. కుడి కాలువ విస్తరణకు 9,000 ఎకరాల భూమి సేకరించాలి. అలాగే దీనికి సమాంతరంగా 40 కిలోమీటర్ల మేర కొత్త కాలువ నిర్మించాల్సి ఉంటుంది. ఈ దశకు రూ.13,800 కోట్లు వ్యయమవుతుందని అంచనా.

2వ దశ: బొల్లాపల్లి రిజర్వాయర్‌లోకి ఎత్తిపోత

పోలవరం-బనకచర్ల ప్రాజెక్టుకు వెన్నెముక బొల్లాపల్లి రిజర్వాయరు. దీని సామర్థ్యం 173 టీఎంసీలు. రెండో దశలో ప్రకాశం బ్యారేజీ ఫోర్‌షోర్ నుంచి ఆరు దశల్లో ఈ రిజర్వాయరులోకి నీటిని ఎత్తిపోస్తాం. దీనికి మరో ప్రత్యామ్నాయం 1.2 కిలోమీటర్ల పొడవున టన్నెల్‌ను నిర్మించడం. అయితే మొదటి ప్రణాళికతోనే సాంకేతికంగా, ఆర్థికంగా లబ్ధి చేకూరుతుంది. దీని అమలుకు కేవలం 15 గ్రామాలకు సహాయ, పునరావాసం కల్పిస్తే సరిపోతుంది. పైగా జాతీయ స్థాయిలో నిర్మించే రిజర్వాయర్లకు ఒక టీఎంసీకి సగటున రూ.100 కోట్ల నుంచి 200 కోట్లు వ్యయమవుతుంటే.. బొల్లాపల్లి రిజర్వాయరుకు టీఎంసీకి సగటున రూ.30 కోట్లు మాత్రమే ఖర్చవుతుంది. పైగా దీని ద్వారా 230 మెగావాట్ల జలవిద్యుదుత్పత్తి కూడా జరుగుతుంది. ఈ రిజర్వాయరు నిర్మాణానికి రూ.35,760 కోట్ల వ్యయమవుతుందని అంచనా.

మూడో దశ: 3 ఎత్తిపోతలతో..



మూడో దశలో బొల్లాపల్లి నుంచి రోజుకు రెండు టీఎంసీలను బనకచర్ల హెడ్‌రెగ్యులేటర్‌కు తరలించేందుకు 3 ఎత్తిపోతల పథకాలను నిర్మించాల్సి ఉంటుంది. ఆ రిజర్వాయరు నుంచి సిద్ధాపురం చెరువుకు నీటిని తీసుకెళ్లి.. అక్కడి నుంచి 11 కిలోమీటర్ల టన్నెల్ మార్గం గుండా బనకచర్ల హెడ్‌రెగ్యులేటర్‌లోకి తరలించాలి. సిద్ధాపురం నుంచి నీటిని తోడిన తర్వాత.. కాలువ ద్వారా 200 మెగావాట్ల జల విద్యుత్‌ను ఉత్పత్తి చేసే వీలుంది. అలాగే నల్లమల సాగర్ నుంచి వెలిగొండ ప్రాజెక్టుకు కూడా 0.5 టీఎంసీని తరలించాలి. మూడో దశ పూర్తి చేసేందుకు రూ.32,350 కోట్ల ఖర్చవుతుందని అంచనా. మొత్తంగా మూడు దశల్లో ప్రాజెక్టు నిర్మాణానికి రూ.81,900 కోట్లు వ్యయమవుతాయి.

బహుళార్థ సాధకంగా బనకచర్ల

» ఆదాయార్జన ప్రాజెక్టుగా రూపుదిద్దాలి

» జూన్ 12కల్లా టెండర్లు ఖరారు: సీఎం

అమరావతి, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): పోలవరం-బనకచర్ల అనుసంధాన పథకాన్ని కేవలం సాగు, తాగునీటిని అందించే ప్రాజెక్టుగానే కాకుండా.. విద్యుత్, మత్స్య సంపద వంటి వాటి ద్వారా ఆదాయాన్ని సమకూర్చే 'మోడల్ ప్రాజెక్టు'గా రూపకల్పన చేయాలని సీఎం చంద్రబాబు ఆదేశించారు. సోమవారం సచివాలయంలో జల వనరుల శాఖ అధికారులతో ప్రాజెక్టు కార్యాచరణపై ఆయన సమీక్షించారు. రూ.81,900 కోట్ల అంచనా వ్యయంతో కూడిన ఈ భారీ ప్రాజెక్టుకు ఆర్థిక సాయం కోసం కేంద్రంతో సంప్రదింపులు జరుపుతున్నామన్నారు. జూన్ 12కల్లా టెండర్లు ఖరారు చేయాలన్నారు. 'ఈ ప్రాజెక్టుకు ఏటా 3,340 మెగావాట్ల విద్యుత్ అవసరం. ప్రాజెక్టు కాలువ గట్ల మీద.. నీటిలో తేలియాడే సోలార్ ప్యానెళ్ల బిగింపు.. జల విద్యుత్కేంద్రాలు, పంప్డ్ స్టోరేజీ విద్యుత్కేంద్రాల ఏర్పాటు ద్వారా 5 వేల మెగావాట్లు ఉత్పత్తి చేయాలి. తద్వారా బహుళార్థ సాధక ప్రాజెక్టుగా మార్చాలి. అవసరమైన డిజైన్ల అనుమతులన్నీ నవంబరుకల్లా సాధించాలి. పర్యావరణ అటవీ అనుమతుల టెర్మ్స్ ఆఫ్ రిఫరెన్స్ (టీఓఆర్)ను పరివేశ్ పోర్టల్‌లో నెలాఖరులోగా అప్‌లోడ్ చేయాలి. ప్రజాభిప్రాయ సేకరణను డిసెంబరులో ప్రారంభించి వచ్చే జనవరి కి పూర్తి చేయాలి. స్టేజ్-1 క్లియరెన్సులను ఆగస్టునాటికి, స్టేజ్-2 క్లియరెన్సులను నవంబరు నాటికి పొందాలి. అన్ని రకాల అనుమతులూ వచ్చే మార్చినాటికి సాధించాల్సిందే' అని తేల్చిచెప్పారు. నిర్మాణానికి 'జలహారతి' కార్పొరేషన్ పేరుతో ఎస్పీవీని ఏర్పాటు చేయాలని ఆదేశించారు. కాగా ఈ పథకంతో ఏటా రూ.12,294 కోట్ల దాకా రాబడి వస్తుందని జల వనరుల శాఖ అంచనా వేసింది.

తులసిబాబు బెయిల్ పిటిషన్‌పై ముగిసిన వాదనలు

» 27న నిర్ణయం వెల్లడిస్తామన్న హైకోర్టు

అమరావతి, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): శాసనసభ డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణరాజును సీఐడీ కస్టడీలో చిత్రహింసలకు గురిచేసిన కేసులో నిందితుడు కామేపల్లి తులసిబాబుకు దాఖలు చేసిన బెయిల్ పిటిషన్‌పై సోమవారం హైకోర్టులో వాదనలు ముగిశాయి. ఇరువైపుల వాదనలు విన్న న్యాయస్థానం.. ఈ నెల 27న నిర్ణయం వెల్లడిస్తామని పేర్కొంది. ఈ మేరకు న్యాయమూర్తి జస్టిస్ టి.మల్లికార్జునరావు ఉత్తర్వులు ఇచ్చారు. గుంటూరు నగరంపాలెం పోలీసులు నమోదు చేసిన కేసులో ప్రస్తుతం జ్యుడీషియల్ కస్టడీలో ఉన్న తులసిబాబు.. బెయిల్ కోసం హైకోర్టును ఆశ్రయించిన విషయం తెలిసిందే. పిటిషనర్ తరఫు న్యాయవాది అశ్వినీ కుమార్ వాదనలు వినిపిస్తూ.. పిటిషనర్ అరెస్టై 74 రోజులు గడిచాయని, కస్టడీలో పోలీసులు రెండుసార్లు విచారించారని తెలిపారు. తనను సీఐడీ పోలీసులు చిత్రహింసలకు గురిచేశారని రఘురామ తన ఫిర్యాదులో పేర్కొన్నారని, అందులో తులసిబాబు గురించి ప్రస్తావించలేదన్నారు. రఘురామ అరెస్ట్‌లో కీలకపాత్ర పోషించిన అప్పటి దర్యాప్తు అధికారి సీఐడీ అదనపు ఎస్పీ విజయ్‌పాల్ బెయిల్‌పై విడుదలయ్యారన్నారు. కోర్టు షరతులకు కట్టుబడి ఉంటామని, బెయిల్ మంజూరు చేయాలని కోరారు. పోలీసుల తరఫున సీనియర్ న్యాయవాది పోసాని వెంకటేశ్వర్లు వాదనలు వినిపించారు. రఘురామరాజును చిత్రహింసలకు గురిచేసిన వ్యవహారంలో తులసిబాబు పాత్ర ఉందని అతని స్నేహితులే వాంగ్మూలం ఇచ్చారని, బెయిలిస్తే సాక్షులను ప్రభావితం చేస్తారని, ఆయన పిటిషన్‌ను కొట్టివేయాలని కోరారు.

బోరుగడ్డపై కోర్టు ధిక్కరణ కేసు!

» తప్పుడు మెడికల్ సర్టిఫికెట్ సమర్పణ వ్యవహారంలో హైకోర్టు తీవ్ర ఆగ్రహం

అమరావతి, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): తప్పుడు మెడికల్ సర్టిఫికెట్‌తో కోర్టును మోసం చేసి, మధ్యంతర బెయిల్ పొడిగించుకున్న వ్యవహారంలో రౌడీషీటర్ బోరుగడ్డ అనిల్‌కుమార్‌పై హైకోర్టు సోమవారం తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. మరోసారి బెయిల్ పొడిగింపు కోసం ప్రయత్నించడంపై మండిపడింది. 'కళ్లు మూసుకుంటే బెయిల్ పొడిగించాలని ఎన్నిసార్లైనా కోరతారు' అంటూ ఘాటు వ్యాఖ్యలు చేసింది. కోర్టు నిర్దేశించిన గడువు అయిన ఈనెల 11న సాయంత్రం 5 గంటలలోగా రాజమండ్రి కేంద్ర కారాగారం అధికారులు ముందు ఎందుకు లొంగిపోలేదో వివరణ ఇవ్వాలని ఆదేశించింది. 'ఇష్టమైనప్పుడు వచ్చి లొంగిపోతామంటే కుదరదు' అని స్పష్టం చేసింది. తల్లి ఆరోగ్యంపై తప్పుడు మెడికల్ సర్టిఫికెట్ సమర్పించి.. మధ్యంతర బెయిల్ పొందారని ఓవైపు వివాదం జరుగుతున్నా, మరోసారి బెయిల్ పొడిగింపు కోసం ప్రయత్నించడంపై న్యాయస్థానం మండిపడింది. తప్పుడు మెడికల్ సర్టిఫికెట్ సమర్పించడంపై క్రిమినల్ కోర్టు ధిక్కరణ కేసు నమోదు చేసి, విచారణ జరుపుతామని పేర్కొంది. ఈ వ్యవహారంపై ప్రాథమిక దర్యాప్తు ద్వారా సేకరించిన వివరాలను సీల్డ్ కవర్‌లో కోర్టు ముందు ఉంచాలని పోలీసులను ఆదేశించింది. ఈ మొత్తం వ్యవహారంపై లోతైన విచారణ జరుపుతామని, సంబంధిత డాక్టర్‌ను కూడా కోర్టుకు పిలిచి విచారిస్తామని తెలిపింది. బోరుగడ్డ మధ్యంతర బెయిల్‌పై విడుదలయ్యేందుకు వీలుగా పూచీకత్తులు సమర్పించిన వారి వివరాలు తమ ముందుంచాలని జైలు సూపరింటెండెంట్‌ను ఆదేశించింది. తదుపరి విచారణను వారం రోజులకు వాయిదా వేసింది. ఈ మేరకు న్యాయమూర్తి జస్టిస్ టి.మల్లికార్జునరావు ఉత్తర్వులు ఇచ్చారు.



సర్టిఫికెట్ ఇవ్వలేదని ఆ డాక్టర్ చెప్పారు..

అనంతపురం 4వ పట్టణ పోలీసులు నమోదు చేసిన కేసులో రాజమహేంద్రవరం సెంట్రల్ జైల్లో రిమాండ్ ఖైదీగా ఉన్న బోరుగడ్డ.. తన తల్లి బి.పద్మావతి గుండె సంబంధిత వ్యాధితో బాధపడుతూ చెన్నై అపోలో ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారని, తన సహాయం ఆమెకు అవసరమని నకిలీ మెడికల్ సర్టిఫికెట్‌తో ఈ నెల 11 వరకు మధ్యంతర బెయిల్ పొడిగించుకున్న విషయం తెలిసిందే. అయితే ఈ మధ్యంతర బెయిల్‌ను మరికొంత కాలం పొడిగించాలని ఈ నెల 11న మరోసారి అభ్యర్థించగా.. న్యాయమూర్తి తిరస్కరించారు. పిటిషన్ సోమవారం మరోసారి విచారణకు వచ్చింది. పబ్లిక్ ప్రాసిక్యూటర్ మెండ లక్ష్మీనారాయణ స్పందిస్తూ.. అనిల్ తల్లి ఆరోగ్యంపై ఈ ఏడాది ఫిబ్రవరి 28న తాను ఎలాంటి సర్టిఫికెట్ ఇవ్వలేదని గుంటూరు లలిత సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి వైద్యులు పీవీ రాఘవశర్మ చెప్పారన్నారు. కోర్టు నిర్దేశించిన గడువులోగా అనిల్ జైలు అధికారుల ముందు లొంగిపోలేదని, మధ్యంతర బెయిల్ పొడిగింపునకు ఈనెల 11న మరోసారి లంచ్‌మోషన్ పిటిషన్ వేశారన్నారు. ప్రాసిక్యూట్ చేసేందుకు అనుమతించాలని కోరుతూ అనుబంధ పిటిషన్ దాఖలు చేశామన్నారు. అనిల్ తరఫు న్యాయవాది వాదనలు వినిపిస్తూ.. దర్యాప్తు వివరాలను తమకు అందించేలా పోలీసులను ఆదేశించాలని కోరారు. 'ఎందుకు? అందజేస్తే వాటిని కూడా తారుమారు చేస్తారా?' అని న్యాయమూర్తి వ్యాఖ్యానించారు.

మరో కేసులో బోరుగడ్డకు 4 వరకు రిమాండ్

నరసరావుపేట లీగల్, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): బోరుగడ్డ అనిల్‌కు మరో షాక్ తగిలింది. గుంటూరు జిల్లా ఫిరంగిపురం పోలీస్‌స్టేషన్‌లో ఈ నెల 3న నమోదైన కేసులో నరసరావుపేట రెండవ అదనపు జూనియర్ సివిల్ కోర్టు న్యాయాధికారి సోమవారం ఆయనకు ఏప్రిల్ 4 వరకు రిమాండ్ విధించారు. ప్రస్తుతం రాజమండ్రి జైల్లో రిమాండ్ ఖైదీగా ఉన్న బోరుగడ్డను పోలీసులు పీటీ వారెంట్‌పై నరసరావుపేట తీసుకువచ్చారు.

డబ్బులు తీసుకుని ఎగ్గొట్టారు

» విడదల రజనీపై ఆగ్రహం వ్యక్తం చేసిన బాధితులు


చిలకలూరిపేట, మార్చి 24(ఆంధ్రజ్యోతి): వైసీపీ నాయకురాలు, మాజీ మంత్రి విడదల రజనీ తమను ఘోరంగా మోసం చేశారని పలువురు బాధితులు తమ గోడు వెళ్లబోసుకున్నారు. సోమవారం పల్నాడు జిల్లా చిలకలూరిపేటలోని టీడీపీ కార్యాలయంలో రజనీ బాధితులు మీడియాతో మాట్లాడారు. 'నేను వైసీపీలో ఉన్నప్పుడు రజనీ రూ.6.50 కోట్లు మూడు విడతలుగా తీసుకున్నారు. నేను ఆమెకు డబ్బిచ్చిన విషయం ఆధారాలతో సహా రుజువుచేస్తా.' అని టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి మల్లెల రాజేశ్ నాయుడు అన్నారు. మున్సిపల్ వైస్ చైర్మన్ గోల్డ్ శ్రీను మాట్లాడుతూ.. 'రజని, ఆమె పీఏలు నాకు మున్సిపల్ చైర్మన్ పదవి ఆశచూపి రూ.7 కోట్లు కాజేశారు. రూ.7 కోట్లలో రూ.3.50 కోట్లు నగదు రూపంలో ఆమె తీసుకోగా, రూ.2.50 కోట్లు ఎన్నికల ప్రచారంలో నాతో ఖర్చు పెట్టించారు. ఆమె పీఏలు శ్రీకాంత్ రెడ్డి, దొడ్డా రామకృష్ణ అదనంగా మరో రూ.40 లక్షలు తీసుకున్నారు. ఆమెను డబ్బులు అడిగానని ఆమె అనుచరుడు ఫణి నన్ను కొట్టేందుకు ప్రయత్నించాడు' అని వాపోయారు. వైసీపీ నుంచి టీడీపీలో చేరిన మున్నంగి వెంకటరత్నారెడ్డి మాట్లాడుతూ.. 'రజనీ పీఏ మానుకొండ శ్రీకాంత్‌రెడ్డి.. అంగన్‌వాడీ కేంద్రాలకు గుడ్లు సరఫరా చేసే కాంట్రాక్ట్ ఇప్పిస్తానని చెప్పి రూ.25 లక్షలు తీసుకున్నాడు. కాంట్రాక్ట్ ఇవ్వలేదు. డబ్బులు ఇవ్వలేదు. పైగా డబ్బులు అడిగానని అప్పటి వైస్ చైర్మన్ ద్వారా నన్ను బెదిరించారు." అని వాపోయారు. యడ్లపాడు మండల టీడీపీ అధ్యక్షుడు కామినేని సాయిబాబు మాట్లాడుతూ.. వంకాయలపాడు పంచాయతీ పరిధిలో స్టోన్ క్రషర్ల యజమానులను బెదిరించి ఒక్కొక్క క్రషర్ నుంచి రూ.5 లక్షలు వసూలు చేశారని చెప్పారు. "ఐ-టీడీపీలో పనిచేస్తున్నానన్న అక్కసుతో నాపై తప్పుడు కేసులు పెట్టించారు. పోలీసులు నన్ను కొడుతుంటే రజనీ లైవ్‌లో చూశారు" అని పిల్లి కోటి పేర్కొన్నారు. గాంధీపార్క్ వద్ద చిరువ్యాపారం చేసుకునే దుకాణదారుల నుంచి రూ.5 నుంచి రూ.7 లక్షల వరకు వసూలు చేశారని కౌన్సిలర్ బేరింగ్ మౌలాలి చెప్పారు.

రజనీ ఫిర్యాదుతోనే తనిఖీ!


» లక్ష్మీ బాలాజీ స్టోన్ క్రషర్‌పై కేసులు పెట్టాలని ఒత్తిడి చేశారు

» విజిలెన్స్ అధికారులకు ఐపీఎస్ జాషువా రాత పూర్వక వివరణ

» గత అక్టోబరులోనే వాంగ్మూలం..



అమరావతి, మార్చి 24(ఆంధ్రజ్యోతి): చిలకలూరిపేట మాజీ ఎమ్మెల్యే విడదల రజనీ లిఖిత పూర్వక ఫిర్యాదుతోనే లక్ష్మీ బాలాజీ స్టోన్ క్రషర్‌లో తనిఖీలు చేపట్టామని ఐపీఎస్ అధికారి పల్లె జాషువా విజిలెన్స్ అధికారులకు వివరించారు. గుంటూరు జిల్లా ఆర్‌వీఈవోగా తాను పనిచేస్తున్న సమయంలో ఆమె స్వయంగా విజిలెన్స్ కార్యాలయానికి వచ్చి ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. యడ్లపాడు మండలంలోని లక్ష్మీ బాలాజీ స్టోన్ క్రషర్ యాజమాన్యం మైనింగ్ తవ్వకాల్లో రాయల్టీ, కంకర విక్రయాల్లో ప్రభుత్వానికి పన్ను ఎగ్గొడుతోందని ఆమె రాసిచ్చినట్లు పేర్కొన్నారు. అయితే, తనపై ఫిర్యాదు అందిన తర్వాత గుంటూరు విజిలెన్స్ కార్యాలయంలో ఆ ఫిర్యాదు కాపీ మాయమైందని తెలిపారు. వైసీపీ హయాంలో జరిగిన అక్రమాల్లో ఒకటైన లక్ష్మీ బాలాజీ స్టోన్ క్రషర్ యజమానిపై వేధింపుల వ్యవహారం కూటమి ప్రభుత్వంలో విజిలెన్స్ విచారణను దాటి ఏసీబీలో కేసు నమోదు వరకు చేరింది. ఈ కేసులో రెండో నిందితుడైన ఐపీఎస్ అధికారి జాషువా గత ఏడాది అక్టోబరు చివరి వారంలో విజిలెన్స్‌కు ఇచ్చిన వాంగ్మూలం సోమవారం వెలుగు చూసింది. రజనీ ఈ కేసులో అసలు సూత్రధారి అని ఆయన పేర్కొన్నారు. లక్ష్మీ బాలాజీ స్టోన్ క్రషర్‌లో అక్రమాలు వెలికి తీయాలని ఆమె చేసిన ఫిర్యాదుపై రహస్య విచారణ చేయగా ఆ వ్యక్తులు టీడీపీకి చెందిన వారిగా తేలిందన్నారు. చిలకలూరిపేట సెంటర్లో మాజీ స్పీకర్ కోడెల శివప్రసాదరావు విగ్రహం ఏర్పాటుకు స్టోన్ క్రషర్ భాగస్వామి కట్టా శ్రీనివాస్ చేసిన ప్రయత్నాన్ని రజనీ అడ్డుకోవడంతో రాజకీయ వైరం మరింత ఎక్కువైందన్నారు. అందుకే ఆమె ఫిర్యాదు చేసినట్లు గ్రహించానని వివరించారు. మైనింగ్ వ్యవహారంలో గుంటూరు మైన్స్ అండ్ జియాలజీ ఏడీ, సర్వేయర్‌తో సర్వే చేయించి పదిన్నర కోట్లు ప్రభుత్వానికి నష్టం వాటిల్లినట్లుగా తేల్చినట్లు పేర్కొన్నారు. ఆ అంచనాలు కూడా పారదర్శకంగా లేవని తాను గుర్తించినట్లు చెప్పారు. అయినా ఆ మొత్తాన్ని భారీగా పెంచాలంటూ రజనీ ఒత్తిడి చేశారని, తనిఖీలకు వెళ్లిన వారిపైనా ఒత్తిడి తెచ్చారని వివరించారు. మైనింగ్ అధికారులు ప్రైవేటు వ్యక్తులతో సర్వే చేయించినట్లు తన దృష్టికి వచ్చిందని చెప్పారు.



కేసు వెనక్కి తీసుకోవాలని మధ్యవర్తిని పంపారు

తప్పుల మీద తప్పులు చేసి 'రెడ్‌బుక్' అంటే ఎలా?

విడదల రజనీపై నరసరావుపేట ఎంపీ లావు ధ్వజం

న్యూఢిల్లీ, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): "మాజీ మంత్రి విడదల రజనీ తనపై నమోదైన కేసును వెనక్కి తీసుకోవాలని 10 రోజుల క్రితం ఒక మధ్యవర్తిని నా దగ్గరకు పంపారు" అని టీడీపీ నేత లావు శ్రీకృష్ణదేవరాయలు ఆరోపించారు. లక్ష్మీ బాలాజీ స్టోన్ క్రషర్స్ వాళ్లకు డబ్బులు తిరిగిస్తామని, గుంటూరుకు చెందిన కౌన్సిలర్ దుర్గారావు వద్ద ఆ సొమ్ము ఉంచుతామని, కేసు వెనక్కి తీసుకోవాలని మధ్యవర్తితో చెప్పించారని తెలిపారు. "తప్పుల మీద తప్పులు చేసిన రజనీ 'రెడ్‌బుక్' రాజ్యాంగం నడుస్తోందని విమర్శలు చేస్తే ఎలా" అని ఆగ్రహం వ్యక్తం చేశారు. సోమవారం ఢిల్లీలో లావు మీడియాతో మాట్లాడారు. తప్పు చేయనప్పుడు తన వద్దకు మనిషిని ఎందుకు పంపారని రజనీని ప్రశ్నించారు. కాల్‌డేటా ఆరోపణలపై స్పందించిన ఆయన.. తన ఇంట్లోనూ ఆడవాళ్లు ఉన్నారని, బయటివాళ్లను ఒకలా, ఇంట్లో వాళ్లను మరోలా భావించే వ్యక్తిని కాదన్నారు. ఆమెపై నమోదైన కేసును పక్కదారి పట్టించేందుకే ఈ ఆరోపణలు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. లక్ష్మీ బాలాజీ స్టోన్ క్రషర్స్ యాజమాన్యానికి, తనకు బంధుత్వం లేదని చెప్పారు. వ్యాపార లావాదేవీలు కూడా లేవన్నారు. 2021లో లక్ష్మీ బాలాజీ స్టోన్ క్రషర్స్‌లో చాలా అక్రమాలు జరుగుతున్నాయని రజనీ ఫిర్యాదు చేశారని, ఐపీఎస్ అధికారి జాషువా చర్యలు తీసుకోకపోవడంతో జగన్ మీడియా రిపోర్టర్‌ను తీసుకుని నాడు బాలినేని శ్రీనివాస్‌రెడ్డి దగ్గరకు వెళ్లి ఒత్తిడి తెచ్చారని తెలిపారు. జాషువా గనుల శాఖకు సమాచారం ఇచ్చారని, ఆ విభాగం క్రషర్ యజమానిపై భారీ ఫైన్ విధించిందన్నారు. దీనిని అడ్డం పెట్టుకుని క్రషర్ సంస్థ కప్పం కడితే వదిలేస్తానని రజనీ డబ్బులు తీసుకున్నారని ఎంపీ వివరించారు. వేధింపులు ఎదుర్కొన్న క్రషర్స్ సంస్థ కేసు పెడితే తనపై ఆరోపణలు ఎందుకు చేస్తున్నారని ప్రశ్నించారు. చాలా మంది దగ్గర రజనీ డబ్బులు తీసుకుని ఎగవేశారని, అడిగితే బెదిరించారని ఆరోపించారు. వీరిలో పోతారం భాషా, ఎంపీపీ శంకర్‌రావు, ముత్తా వాసు, గోల్డ్ శ్రీను, మున్నంగి, అబ్బాస్ ఖాన్, నాగయ్య వంటి చాలా మంది ఉన్నారని తెలిపారు.



ఇప్పటికి ఇవే..!

- ఆస్తులూ వేలం వేస్తాం!.. రైతులపై 'సహకార' జులుం
- అప్పు కట్టలేదని టీవీలు, బైక్‌లు స్వాధీనం
- కర్నూలు జిల్లా సహకార బ్యాంకు అధికారుల తీరిది!

ఆ నలుగురూ చిన్నపాటి రైతులు. కర్నూలు జిల్లా చిప్పగిరి మండలం బెల్డోన గ్రామానికి చెందిన వీరు.. జిల్లా కేంద్ర సహకార బ్యాంకులో ఐదేసి లక్షల చొప్పున అప్పు తీసుకున్నారు. ఆ డబ్బుతో పంటలు సాగు చేశారు. నీటి కొరత కారణంగా పంటలు పండక పెట్టుబడులు కూడా చేతికి రాలేదు. దీంతో తీసుకున్న అప్పులకు వడ్డీలు కూడా కట్టలేని దుస్థితి. ఈ పరిస్థితుల్లో జిల్లా సహకార కేంద్ర బ్యాంకుకు చెందిన పది మంది అధికారులు సోమవారం బెల్డోన గ్రామానికి వెళ్లారు. ఆ నలుగురు రైతుల ఇళ్లలో ఉన్న టీవీలు, బైక్‌లు స్వాధీనం చేసుకున్నారు. 'ఇప్పటికి చరాస్తులే సీజ్ చేస్తున్నాం, రుణాలు చెల్లించకపోతే స్థిరాస్తులూ సీజ్ చేస్తాం' అని హెచ్చరించి వెళ్లారు. - కర్నూలు అగ్రికల్చర్, ఆంధ్రజ్యోతి



కర్నూలు జిల్లా చిప్పగిరి మండలం బెల్డోన గ్రామంలో రైతుల టీవీలు, బైక్‌లు తీసుకెళ్తున్న సహకార బ్యాంకు అధికారులు

బెల్టుతో కొట్టి, కాళ్లతో తన్ని...!

- జూనియర్లపై సీనియర్ విద్యార్థి విచక్షణారహిత దాడి
- కర్నూలు జిల్లా కోడుమూరు ప్రభుత్వ హాస్టల్‌లో ఘటన

కోడుమూరు, మార్చి 24(ఆంధ్రజ్యోతి): జూనియర్లపై ఓ సీనియర్ విద్యార్థి.. విచక్షణా రహితంగా దాడి చేసిన ఘటన.. కర్నూలు జిల్లా కోడుమూరు ప్రభుత్వ ఎస్సీ హాస్టల్‌లో జరిగింది. ఆలస్యంగా వెలుగుచూసిన ఈ ఘటనకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. ఓర్వకల్లు మండలం తడకనపల్లె, గోనెగండ్ల మండలం హెచ్‌కైరవాడికి చెందిన ఇద్దరు విద్యార్థులు హాస్టల్‌లో ఉంటూ స్థానిక జడ్పీ హైస్కూల్‌లో 7,8 తరగతులు చదువుతున్నారు. కర్నూలు షరీఫ్‌నగర్‌కు చెందిన ఓ విద్యార్థి హాస్టల్‌లో అడ్మిషన్ లేకున్నా.. వార్డెన్ అండదండలతో అక్కడ ఉంటూ 10వ తరగతి చదువుతున్నాడు. ఈ సీనియర్ విద్యార్థి ఈనెల 11న రాత్రి హాస్టల్లో నిద్రిస్తున్న బాధిత ఇద్దరు విద్యార్థులను గదిలోకి పిలిచి, తన మాట వినడం లేదంటూ వారిపై దాడి చేశాడు. బెల్టుతో కొడుతూ, కాళ్లతో తన్నుతూ విచక్షణా రహితంగా దాడి చేశాడు. పిల్లలిద్దరూ కాళ్లు పట్టుకుని వేడుకున్నా వదల్లేదు. పైగా వారిని కొడుతూ ట్యాబ్‌లో వీడియో తీశాడు. అది సోమవారం స్నేహితుల ద్వారా సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. దీంతో డీఈవో శామ్యూల్ పాల్, సోషల్ వెల్ఫేర్ జేడీ రంగలక్ష్మి, చైల్డ్ వెల్ఫేర్ ప్రొటెక్షన్ ఆఫీసర్ శారద, కోడుమూరు సీఐ తబ్రేజ్ హాస్టల్ వద్దకు వెళ్లి విచారణ జరిపారు. బాధిత విద్యార్థుల తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. దాడి చేసిన విద్యార్థికి హాస్టల్‌లో సీటు లేకపోయినా ఉంచినందుకు వార్డెన్‌ను సస్పెండ్ చేశారు.



విచక్షణా రహితంగా దాడి చేస్తున్న సీనియర్ విద్యార్థి

అంబేడ్కర్‌ను మళ్లీ కించపరిచారు: పురందేశ్వరి



న్యూఢిల్లీ, మార్చి 24(ఆంధ్రజ్యోతి): 'రాజ్యాంగాన్ని మార్చేసైనా సరే కర్ణాటకలో ముస్లిం మైనారిటీలకు 4% రిజర్వేషన్లు కల్పిస్తామని ప్రకటించి, గ్రాండ్ ఓల్డ్ కాంగ్రెస్ పార్టీ మరోసారి రాజ్యాంగ నిర్మాత బాబా సాహెబ్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌ను కించపరిచింది' అని బీజేపీ ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి ఎక్స్ వేదికగా విమర్శించారు. హార్టికల్చర్ ఉత్పత్తులు, ఆహారం, ఔషధాలు, వస్త్రాల ప్రధాన ఎగుమతిదారు అయినప్పటికీ, ఆంధ్రప్రదేశ్‌లో ఉష్ణోగ్రత-నియంత్రిత నిల్వతో కూడిన ఆధునిక ఎయిర్ కార్గో వేర్‌హౌసింగ్ ఒక్క విమానాశ్రయంలో కూడా లేదని పురందేశ్వరి సోమవారం లోక్‌సభలో ప్రస్తావించారు. ఆంధ్రప్రదేశ్‌లో ప్రపంచ స్థాయి ఎయిర్ కార్గో సౌకర్యాలను నెలకొల్పేందుకు తక్షణ చర్యలు తీసుకోవాలని ఎంపీ పురందేశ్వరి కోరారు.

కూటమిపై వైసీపీ నేతల దుష్ప్రచారం: పల్లా



అమరావతి, మార్చి 24(ఆంధ్రజ్యోతి): ఆర్థిక ఇబ్బందులున్నప్పటికీ ప్రభుత్వ ఉద్యోగుల సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకుని కూటమి ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలపై వైసీపీ నేతలు తప్పుడు ప్రచారాన్ని చేస్తున్నారని టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు మండిపడ్డారు. 'వైసీపీ హయాంలో ఆ పార్టీ నేతల అవినీతికి ప్రభుత్వ ఉద్యోగులు సహకరించలేదన్న ఉద్దేశంతో న్యాయబద్ధంగా చెల్లించాల్సిన నిధులు కూడా ఇవ్వకుండా వేధించారు' అని పల్లా ధ్వజమెత్తారు.

ఏపీ అప్పులు రూ.5.62 లక్షల కోట్లు

న్యూఢిల్లీ, మార్చి 24(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్‌లు అప్పులు 2025 మార్చి 31 నాటికి రూ.5,62,557 కోట్లు అని కేంద్ర ఆర్థిక సహాయ మంత్రి పంకజ్ చౌదరి తెలిపారు. ఏపీ అప్పులు స్థూల దేశీయోత్పత్తి (జీఎస్‌డీపీ)లో 34.7 శాతం కాగా, తెలంగాణ అప్పులు రూ.4,42,298 కోట్లతో జీఎస్‌డీపీలో 26.2శాతం అని ఆయన సోమవారం లోక్‌సభలో తెలిపారు. కాంగ్రెస్ ఎంపీ మనీష్ తివారీ అడిగిన ప్రశ్నకు ఆయన సమాధానం ఇచ్చారు. కాగా, విశాఖ ఉక్కు కర్మాగారానికి ఈక్విటీ పెట్టుబడి కల్పనలో భాగంగా ఎలాంటి ప్రైవేటురంగ భాగస్వామ్యాన్ని తీసుకోవడం లేదని కేంద్రం తెలిపింది. ఈ కర్మాగారానికి రూ.11,440 కోట్ల మేరకు కేంద్రం ఈక్విటీ మూలధనాన్ని సమకూర్చినట్లు కేంద్ర ఉక్కుశాఖ సహాయ మంత్రి శ్రీనివాసవర్మ తెలిపారు.

అక్రమ కట్టడాలను వారంలోగా తొలగించండి

- శారదా పీఠానికి జీవీఎంసీ నోటీస్

విశాఖపట్నం, మార్చి 24(ఆంధ్రజ్యోతి): 'ఆక్రమించిన భూమిలో ఉన్న శాశ్వత నిర్మాణాలను వారంలోగా తొలగించాలి. లేనిపక్షంలో మేమే స్వయంగా తొలగిస్తాం. అందుకైన ఖర్చును శారదా పీఠం చెల్లించాల్సి ఉంటుంది' అని చినముషిడివాడలోని శారదా పీఠానికి జీవీఎంసీ అధికారులు నోటీసులు జారీ చేశారు. శారదా పీఠం నిర్వాహకులు చినముషిడివాడ సర్వే నంబరు 90లో సుమారు 22 సెంట్ల ప్రభుత్వ భూమిని ఆక్రమించి శాశ్వత కట్టడాలు నిర్మించినట్టు రెవెన్యూ అధికారులు నిర్ధారించిన విషయం తెలిసిందే.

సీమలో ఎండలు.. కోస్తాలో వానలు

అమరావతి, విశాఖపట్నం, మార్చి 24(ఆంధ్రజ్యోతి): బంగాళాఖాతం నుంచి తేమగాలులు వీస్తుండటంతో సోమవారం కోస్తాలోని అనేకచోట్ల ఎండ తీవ్రత తగ్గింది. మధ్యాహ్నం అనేక ప్రాంతాల్లో మేఘాలు ఆవరించాయి. ప్రకాశం, తూర్పు గోదావరి, అనకాపల్లి, అల్లూరి జిల్లాల్లో పలుచోట్ల ఈదురుగాలులతో వర్షాలు కురిశాయి. అనకాపల్లి జిల్లా చోడవరంలో వడగళ్లు పడ్డాయి. ఇక, రాయలసీమలో సోమవారం ఎండలు మండిపోయాయి. పలు మండలాల్లో వడగాడ్పులు వీచాయి. అనంతపురం జిల్లా నాగసముద్రంలో 39.9, కడప జిల్లా అట్లూరులో 39.8, చిత్తూరు జిల్లా నింద్రలో 39.7, నంద్యాల జిల్లా దొర్నిపాడులో 39.6, ప్రకాశం జిల్లా గుంటుపల్లిలో 39.2 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.

బలభద్రపురంలో క్యాన్సర్‌పై ఆందోళన వద్దు

- ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్

అమరావతి, మార్చి 24(ఆంధ్రజ్యోతి): తూర్పుగోదావరి జిల్లా బలభద్రపురం గ్రామంలో క్యాన్సర్ కేసులు.. జాతీయ, రాష్ట్ర స్థాయితో పోల్చితే సాధారణ స్థాయిలోనే ఉన్నాయని, ఈ విషయంలో ఆందోళన అక్కర్లేదని రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్‌యాదవ్ అన్నారు. అక్కడ పరిస్థితులు అదుపులోనే ఉన్నాయని స్పష్టం చేశారు. సోమవారం అమరావతి సచివాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. ఇటీవల అసెంబ్లీ సమావేశాల్లో అనపర్తి శాసనసభ్యులు బలభద్రపురంలో క్యాన్సర్ కేసులు అధికంగా నమోదవడంతోపాటు మరణాలు కూడా సంభవిస్తున్నాయని సభ దృష్టికి తెచ్చారని మంత్రి పేర్కొన్నారు. ఈ క్రమంలో వైద్యారోగ్యశాఖ ఆధ్వర్యంలో గ్రామంలో సమగ్ర క్యాన్సర్ సర్వేను ప్రారంభించామని తెలిపారు. సేకరించిన వివరాల ప్రకారం ఈ గ్రామంలో పూర్వం ఉన్న కేసులు, ప్రస్తుత అనుమానిత కేసులు మొత్తం కలిపి 38 దాటకపోవచ్చని తెలిపారు. సర్వేలో అనుమానిత కేసులుగా 38 మందిని గుర్తించగా.. వాటిలో 10-15 శాతమే పాజిటివ్‌గా తేలే అవకాశం ఉందన్నారు. గ్రామంలో 31 వైద్య బృందాలతో సార్వత్రిక క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహిస్తున్నామని మంత్రి సత్యకుమార్ యాదవ్ వెల్లడించారు. కాగా, డీలిమిటేషన్ ప్రక్రియకు ఓ ప్రత్యేక విధానం ఉంటుందని మంత్రి సత్యకుమార్ అన్నారు. జనాభా ప్రాతిపదికన మాత్రమే నియోజకవర్గాల పునర్విభజన జరుగుతుందని ఎవరూ నిర్ధారించలేదన్నారు. తెలంగాణ, తమిళనాడు రాష్ట్రాల్లోని కుటుంబ పార్టీలే ఈ తరహా వాదన తెస్తున్నాయన్నారు.

ఆయుష్ సేవలను విస్తరించాలి: సత్యకుమార్

ఆయుష్ సేవలకు రాష్ట్రంలో పెరుగుతున్న ఆదరణ దృష్ట్యా ఈ సేవలను మరింత విస్తరించేలా ప్రణాళికలు చేపట్టాలని మంత్రి సత్యకుమార్ అధికారులను ఆదేశించారు. సచివాయంలో ఆయుష్ సేవలపై ఆయన అధికారులతో సోమవారం సమీక్ష నిర్వహించారు. రాష్ట్రంలోని 1,188 ఆయుష్ డిస్పెన్సరీల్లో డాక్టర్ల కొరత 50 శాతం ఉన్నట్లు సమీక్షలో వెల్లడికాగా.. ఈ ఖాళీల భర్తీకి చర్యలు చేపట్టాలని సూచించారు.

మద్యం స్కాంపై దర్యాప్తు చేయించండి: లావు

న్యూఢిల్లీ, మార్చి 25(ఆంధ్రజ్యోతి): గత వైసీపీ ప్రభుత్వ హయాంలో ఆంధ్రప్రదేశ్‌లో జరిగిన మద్యం కుంభకోణం దేశంలోనే అతి పెద్దదని, ఇది ఢిల్లీ లిక్కర్ స్కామ్‌కు మించినదని టీడీపీపీ నేత లావు శ్రీకృష్ణదేవరాయలు ఆరోపించారు. దీనిపై దర్యాప్తు చేయించాలన్నారు. సోమవారం లోక్‌సభలో 2025-26 ఆర్థిక బిల్లుపై ఆయన మాట్లాడుతూ నాటి వైసీపీ ప్రభుత్వం.. తమ ఆధీనంలోని సంస్థల ద్వారా మద్యం వ్యాపారాన్ని పూర్తిగా నియంత్రించి ప్రజలను మోసగించిందన్నారు. నంద్యాలలోని ఎస్పీవై ఆగ్రో ఇండస్ట్రీస్ లాంటి ప్రముఖ డిస్టిలరీలను బలవంతంగా తీసుకుని.. కొత్త బినామీ డిస్టిలరీలను ఏర్పాటు చేశారని తెలిపారు. తక్కువ నాణ్యత కలిగిన మద్యాన్ని ఉత్పత్తి చేయించి, వేల కోట్ల రూపాయలు వైసీపీ అనుకూల వ్యాపారుల చేతికి వెళ్లేలా చేశారని ఆరోపించారు. మద్యం కుంభకోణంతో 2019-2024 మధ్య రాష్ట్ర ఖజానాకు 18,860.52కోట్ల నష్టం వాటిల్లిందన్నారు.

ఉగాది నాడు మూడో కోటా!



(మొదటి పేజీ తరువాయి)

దరిమిలా రెండు నెలల్లోనే వారి ఆశలు నెరవేరే అవకాశాలు ఉన్నాయని టీడీపీ వర్గాలు అంటున్నాయి. కూటమి అధికారంలోకి వచ్చాక.. గత ఏడాది సెప్టెంబరులో నామినేటెడ్ పోస్టుల భర్తీకి శ్రీకారం చుట్టింది. 20 కార్పొరేషన్ల చైర్మన్లతోపాటు మొత్తం 99 మందితో తొలి జాబితాను అప్పట్లో విడుదల చేశారు. రెండో విడత భర్తీ ప్రక్రియ నవంబరులో జరిగింది. 59 మందితో రెండో జాబితా విడుదలైంది. తొలి, రెండో విడతల్లో సుమారు 150 మంది నేతలకు న్యాయం చేశారు. మూడో విడత నామినేటెడ్ పోస్టుల భర్తీపై నాలుగు నెలలుగా కసరత్తు జరుగుతున్నా సామాజిక సమీకరణలు.. కూటమి పార్టీల డిమాండ్ల నేపథ్యంలో ఓ కొలిక్కి రావడం లేదు. ఎట్టకేలకు ఏఎంసీ చైర్మన్లతో మూడో విడత జాబితాకు తుదిరూపు ఇస్తున్నారు. రాష్ట్రంలో 218 మార్కెట్ కమిటీలు ఉండగా ఈ విడతలో 50 నుంచి 60 స్థానాలే భర్తీ చేయనున్నారు. మిగిలినవాటిని మే నెలలో భర్తీ చేయాలనుకుంటున్నారు.

వాటిపైనే నేతల ఆశలు..

ఇంకా భర్తీ చేయాల్సిన నామినేటెడ్ పోస్టుల్లో కీలకమైన కార్పొరేషన్లు ఉన్నాయి. గత ఎన్నికల్లో సీట్ల సర్దుబాటులో భాగంగా ఎమ్మెల్యేగా పోటీ చేసే అవకాశం కోల్పోయిన నేతలు.. పార్టీ కోసం గత ఐదేళ్లు కేసులను ఎదుర్కొని కష్టపడిన నాయకులు వీటిపై ఆశలు పెట్టుకున్నారు. ఏఎంసీలతోపాటు ప్రణాళికా సంఘం, స్టేట్ ఫైనాన్స్ కార్పొరేషన్, నెడ్‌క్యాప్, ఏపీ డెయిరీ డెవలప్‌మెంట్ కార్పొరేషన్, డ్రైనేజీ బోర్డు, ఆప్కాబ్, మినరల్ డెవలప్‌మెంట్, బేవరేజెస్ తదితర కీలకమైన కార్పొరేషన్ల చైర్మన్ పదవులను మూడో విడతలో భర్తీ చేస్తారని అంతా భావించారు. అధికార భాషా సంఘం, సాహిత్య అకాడమీ, తెలుగు అకాడమీ సహా మొత్తం 60 ముఖ్యమైన కార్పొరేషన్లతోపాటు ప్రధానమైన 21 ఆలయాల చైర్మన్లు, కమిటీలను కూడా నియమించాల్సి ఉంది. ఈ ఏడాది సంక్రాంతికే వీటన్నిటినీ భర్తీ చేస్తారని ఆశావహులు భావించినా కార్యరూపం దాల్చలేదు. ఊరించి ఊరించి ఉగాదికి భర్తీ చేస్తామని సాక్షాత్తూ చంద్రబాబే ప్రకటించారు. కొద్ది రోజుల క్రితం అసెంబ్లీలో ఎమ్మెల్యేలు, ఎంపీలతో జరిగిన సమావేశంలో మార్చి నెలాఖరుకు భర్తీ చేస్తామని, మేలో జరిగే మహానాడు నాటికి పార్టీ కమిటీలు పూర్తి చేస్తామన్నారు. ప్రస్తుతం అది కూడా కార్యరూపం దాల్చే పరిస్థితి కనిపించడం లేదు. ఇది టీడీపీలోనే కాకుండా జనసేన, బీజేపీ నాయకుల్లోనూ ఒకింత అసంతృప్తికి కారణమవుతోంది.

అటూ ఇటూ.. డిమాండ్లు ఎక్కువే

నామినేటెడ్ పదవుల కోసం టీడీపీలో ఆశావహుల జాబితా భారీగా ఉండడం.. జనసేన, బీజేపీ నుంచి కూడా ఎక్కువగానే డిమాండ్లు వస్తుండడం పోస్టుల భర్తీ ఆలస్యానికి కారణమవుతోంది. జనసేన తాము గెలిచినచోట్ల తమ విజయానికి కృషి చేసిన వారికి పోస్టులు ఇవ్వాలని కోరుతున్నట్లు సమాచారం. బీజేపీ తాము గెలిచిన నియోజకవర్గాల్లోనే కాకుండా ఇతర నియోజకవర్గాల్లోని వారికీ పోస్టుల కోసం పట్టుబడుతోంది. వీటితోపాటు సామాజిక, ప్రాంతీయ సమీకరణలు కూడా పరిగణనలోకి తీసుకుని భర్తీకి కసరత్తు చేస్తున్నారు.

60 వేల పైచిలుకు దరఖాస్తులు

నామినేటెడ్ పోస్టుల భర్తీకి ఒక్క టీడీపీ నుంచే 60వేల పైచిలుకు దరఖాస్తులు అందాయి. పార్టీలో ఏ స్థాయిలో ఉన్నవారైనా కుటుంబ సాధికార సారథి(కేఎస్ఎస్) బాధ్యత చేపట్టాల్సిందేనని చంద్రబాబు స్పష్టం చేశారు. దీంతో ఆశావహులు చాలామంది ఇప్పటికే ఆ బాధ్యతలు చేపట్టారు. నామినేటెడ్ పోస్టులు ఆశిస్తున్న వారిలో మాజీ ఎమ్మెల్యేలు ప్రభాకర్ చౌదరి, గన్ని వీరాంజనేయులు, పరసా రత్నం, దారపనేని నరేంద్ర, కనపర్తి శ్రీనివాసరావు, నాదెండ్ల బ్రహ్మం, గొట్టిపాటి రామకృష్ణ ప్రసాద్ తదితరులు ఉన్నారు. ప్రభాకర్ చౌదరి, గన్ని వీరాంజనేయులు సీట్ల సర్దుబాటులో టికెట్లు కోల్పోయారు. దారపనేని నరేంద్ర వైసీపీ హయాంలో అక్రమ కేసుల బాధితుడు. వీరితోపాటు ఇటీవల ఎమ్మెల్సీ ఆశించి నిరాశపడిన వారు కూడా కీలకమైన నామినేటెడ్ పోస్టులు అడుగుతున్నారు.

నీటి ఎద్దడిని ఎదుర్కొందాం!

- పక్కా ప్రణాళికతో ముందుకెళ్దాం.. అధికారులకు సీఎం దిశానిర్దేశం

అమరావతి, మార్చి 24(ఆంధ్రజ్యోతి): వేసవి ఉష్ణోగ్రతలు పెరుగుతున్న నేపథ్యంలో రాష్ట్రంలో ఏ ప్రాంతంలోనూ తాగునీటి ఎద్దడి తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని సీఎం చంద్రబాబు అధికారులకు సూచించారు. 'వేసవి ప్రణాళిక'పై సోమవారం సచివాలయంలో ఆయన సమీక్షించారు. వేసవిని దృష్టిలో ఉంచుకుని తాగునీటి సమస్య రాకుండా.. పక్కా ప్రణాళికతో వ్యవహరించాలని దిశానిర్దేశం చేశారు. ఉష్ణోగ్రతల సమాచారాన్ని మొబైల్ అలెర్టుల ద్వారా ప్రజలకు తెలియజేయాలన్నారు. జన సమూహం ఉండే ప్రాంతాల్లో చలివేంద్రాలు, మజ్జిగ కేంద్రాలు ఏర్పాటు చేయాలని అధికారులకు సూచించారు. స్వచ్ఛందంగా చలివేంద్రాలు ఏర్పాటు చేసేవారికి ప్రభుత్వపరంగా సహకరించాలన్నారు. రాయలసీమతోపాటు ప్రకాశం జిల్లాలో పశుగ్రాసం కొరతతోపాటు పశువులకు తాగునీరు లభించని పరిస్థితి ఉంటుందని, ఇలాంటి ప్రాంతాల్లో ప్రత్యేక చర్యలు తీసుకోవాలని సీఎం సూచించారు. పశువుల కోసం రూ.35 కోట్లతో 12,138 నీటి తొట్ల నిర్మాణం చేపట్టాలని చెప్పారు. ఇక, పాఠశాలల్లో విద్యార్థులకు 'వాటర్ బెల్' విధానం అమలు చేయాలని సీఎం చంద్రబాబు ఆదేశించారు. అదేవిధంగా ఆయా స్కూళ్లలో తప్పనిసరిగా తాగునీరు అందుబాటులో ఉంచాలన్నారు. అగ్ని ప్రమాదాలు జరిగే ఆస్కారం ఉండే పరిశ్రమల్లో మరింత అప్రమత్తంగా ఉండాలని సీఎం సూచించారు. మునిసిపాలిటీల్లో నీటి సమస్య పరిష్కారానికి రూ.39 కోట్లు విడుదల చేసేందుకు సీఎం చంద్రబాబు అంగీకరించారు. గ్రామాల్లో ఉపాధి పథకం కింద నీటి కుంటల నిర్మాణం, చెరువుల్లో పూడికతీత పనులు చేపట్టాలన్నారు. ఉపాధి కూలీలకు అదనపు పనిదినాలు కల్పించి, వారికి పని ప్రాంతాల్లో నీళ్లు, ఇతర సౌకర్యాలు కల్పించాలన్నారు. ఉదయం 6 నుంచి 11 గంటలలోపు కూలీలు పనులు ముగించుకుని ఇంటికి చేరేలా చూడాలన్నారు. మున్సిపల్ కార్మికులకు మధ్యాహ్నం 12 నుంచి సాయంత్రం 4 గంటలలోపు బహిరంగ ప్రాంతాల్లో పనులు అప్పగించొద్దన్నారు.

ఐదేళ్లలో 20 లక్షల ఉద్యోగాలు: లోకేశ్

అమరావతి, మార్చి 24(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో 2029 నాటికి 20 లక్షల ఉద్యోగాలు కల్పిస్తామని మానవ వనరుల అభివృద్ధి శాఖ మంత్రి లోకేశ్ పునరుద్ఘాటించారు. 20 లక్షల ఉద్యోగాల కల్పనపై ఏర్పాటుచేసిన మంత్రుల ఉపసంఘం రెండో సమావేశం సోమవారం ఉండవల్లిలోని సీఎం నివాసంలో జరిగింది. మంత్రులు టీజీ భరత్, గొట్టిపాటి రవికుమార్, పి.నారాయణ, కొండపల్లి శ్రీనివాస్ పాల్గొన్నారు. పెట్టుబడుల ట్రాకర్ పోర్టల్‌ను సమర్థవంతంగా తీర్చిదిద్దాలని ఈ సందర్భంగా అధికారులను లోకేశ్ ఆదేశించారు. పెట్టుబడులు పెట్టేవారికి ప్రతిబంధకంగా ఉన్న విధానాలను సంస్కరిస్తామన్నారు. అంతర్జాతీయ, జాతీయ స్థాయిల్లోని అన్ని పెద్ద కంపెనీలను రాష్ట్రానికి ఆహ్వానించాలన్నారు. కంపెనీలకిచ్చే రాయితీలు, ప్రోత్సాహకాలు తగిన సమయంలో ఇవ్వాలన్నారు. భూ కేటాయింపులు, అనుమతులను వేగంగా పరిష్కరించాలన్నారు. ఎంఎస్ఎంఈలను పెద్దఎత్తున ప్రోత్సహిస్తామన్నారు. కాగా, ఇప్పటివరకూ కుదుర్చుకున్న ఒప్పందాల ద్వారా రూ. 8,73,220 కోట్ల పెట్టుబడులు వచ్చే అవకాశం ఉందని, తద్వారా 5,27,824 మందికి ఉద్యోగాలు లభిస్తాయని అధికారులు వివరించారు.

కాకాణిపై కేసు!

- రూ.250 కోట్ల క్వార్ట్జ్ దోపిడీలో ఆయనతో పాటు ఏడుగురిపై ఎఫ్ఐఆర్
- ఇద్దరు అరెస్టు.. 14 రోజుల రిమాండ్
- ఏ4గా మాజీ మంత్రి.. అరెస్ట్ చేసే చాన్స్
- నెల్లూరు జిల్లా రుస్తుం మైన్స్‌లో దోపిడీ



నెల్లూరు, మార్చి 24(ఆంధ్రజ్యోతి): నెల్లూరు జిల్లా పొదలకూరు మండలంలోని రుస్తుం మైన్స్‌లో అక్రమంగా క్వార్ట్జ్ ఖనిజం కొల్లగొట్టిన కేసులో మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డిపై కేసు నమోదు చేశారు. ఈ కేసులో కాకాణిని ఏ4గా చేర్చినట్టు విశ్వసనీయ సమాచారం. ఇదివరకే ముగ్గురిపై కేసు పెట్టగా, తాజాగా సోమవారం కాకాణితో సహా మరో ఏడుగురిపై ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. ఏ6, ఏ8గా ఉన్న ఇద్దరిని అరెస్టు చేసి గూడూరు కోర్టులో హాజరు పరిచారు. కోర్టు వారికి 14 రోజుల పాటు రిమాండ్ విధించింది. ఈ కేసులో మిగిలిన కాకాణితో పాటు మరో నలుగురిని అరెస్టు చేసే సూచనలు కనిపిస్తున్నాయి. వైసీపీ పాలనలో నెల్లూరు జిల్లాలోని క్వార్ట్జ్ నిక్షేపాలన్నింటినీ నెల్లూరుకు చెందిన ఒక మాజీ మంత్రికి అప్పగించారు. ఈ క్రమంలో అందుకు సమాంతరంగా సర్వేపల్లి నియోజకవర్గంలో అక్రమ క్వార్ట్జ్ తవ్వకాలు జరిగాయి. రుస్తుం మైన్స్ నుంచి కోట్ల రూపాయల విలువైన ప్రభుత్వ సంపద కొల్లగొట్టారు. రుస్తుం మైన్స్‌ను గతంలో ఒకరికి లీజుకు ఇచ్చారు. ఆ లీజు గడువు ముగిసిపోవడంతో సర్వేపల్లికి చెందిన వైసీపీ నాయకులు ఈ మైన్‌పై కన్నేశారు. పెద్దఎత్తున అక్రమ మైనింగ్ చేశారు. ఈ ముఠా వెనుక అప్పటి మంత్రి కాకాణి హస్తం ఉందని పెద్ద ఎత్తున ఆరోపణలు వెల్లువెత్తాయి. అక్రమ మైనింగ్‌ను అడ్డుకోవడానికి టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి మూడు రోజుల పాటు క్వారీ వద్ద సత్యాగ్రహ దీక్ష చేశారు. మైనింగ్ లోడ్లతో రవాణాకు సిద్ధంగా ఉన్న 40 లారీలను టీడీపీ కార్యకర్తలు అడ్డుకున్నారు. వైసీపీ ప్రభుత్వంలో న్యాయం జరగదని భావించిన సోమిరెడ్డి కేంద్ర మైనింగ్ శాఖకు ఫిర్యాదు చేశారు. కేంద్రం ఆదేశాలకు తోడు రాష్ట్రంలో ప్రభుత్వం మారడంతో ఈ కేసుకు ప్రాణం వచ్చింది. అప్పటి వరకు ఆ క్వారీ వైపు కన్నెత్తి కూడా చూడని మైనింగ్ శాఖ అధికారులు అక్కడికి వెళ్లి దోచుకుపోయిన క్వార్ట్జ్ విలువ రూ.250 కోట్లకు పైగా ఉంటుందని లెక్కలు కట్టారు. పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ కేసులో మొదట ముగ్గురిపై కేసు కట్టారు. వీరిలో కాకాణికి కుడిభుజమైన 'పేర్నాటి శ్యాంప్రసాద్‌రెడ్డి, వాకాటి శివారెడ్డి, వాకాటి శ్రీనివాసులు రెడ్డి పేర్లతో తొలుత ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. అయితే ఈ ముగ్గురు పోలీసులు తమ వద్దకు రాకముందే హైకోర్టును ఆశ్రయించి ముందస్తు బెయిల్ తెచ్చుకున్నారు. తాజాగా మరో ఏడుగురిని ఈ కేసులో చేర్చారు.

కాకాణి చుట్టూ బిగుస్తున్న ఉచ్చు

ప్రస్తుత పరిణామాలను గమనిస్తే మాజీ మంత్రి కాకాణి చుట్టూ ఉచ్చు బిగుస్తున్నట్లు స్పష్టమైన సంకేతాలు కనిపిస్తున్నాయి. మరోవైపు ఒంగోలు పార్లమెంట్ సభ్యుడు మాగుంట శ్రీనివాసులురెడ్డి సంతకాలను ఫోర్జరీ చేసిన కేసులో ప్రభుత్వం సిట్‌ను నియమించింది. ఎంపీ సంతకాల ఫోర్జరీ కేసులో సైతం కాకాణిని నిందితుడిగా చేర్చే సూచనలు కనిపిస్తున్నాయి. సర్వేపల్లి రిజర్వాయర్‌లో గ్రావెల్ కుంభకోణం వెనుక కూడా కాకాణి హస్తం ఉన్నట్లు అప్పట్లో పెద్ద ఎత్తున ప్రచారం జరిగింది. ఈ పరిణామాలన్నీ గమనిస్తే గత ప్రభుత్వంలో మంత్రిగా నెల్లూరు జిల్లాలో చక్రం తిప్పిన కాకాణికి కష్టకాలం ఎదురయ్యే సూచనలు కనిపిస్తున్నాయి.


పేదరికంపై పీ4 అస్త్రం

(మొదటి పేజీ తరువాయి)

కుటుంబాలకు ఈ కార్యక్రమం ద్వారా లబ్ధి కలుగుతుందని పేర్కొన్నారు. 2029 కల్లా పేదరిక నిర్మూలనే లక్ష్యంగా పెట్టుకున్నామని చెప్పారు. పీ4 కార్యక్రమాన్ని ఉగాది రోజున ప్రారంభిస్తున్న నేపథ్యంలో, సోమవారం సచివాలయంలో ఆ కార్యక్రమం నిర్మాణంపై సీఎం సమీక్ష నిర్వహించి ఆమోదం తెలిపారు. ఎన్నారైలు సహా పేదలకు మద్దతుగా నిలిచేందుకు స్వచ్ఛందంగా ముందుకొచ్చే ఎవరైనా ఈ వేదికను వినియోగించుకోవచ్చని ఈ సందర్భంగా చెప్పారు. కార్యక్రమంలో భాగస్వాములు కావాలని ఎవరిపైనా ఒత్తిడి చేయవద్దని అధికారులకు సూచించారు. దాతలను, లబ్ధిదారులను ఓ వేదికపైకి తీసుకురావడం వరకే ప్రభుత్వ పాత్ర పరిమితం అని స్పష్టం చేశారు. ప్రభుత్వం తరపున ఎవరికీ అదనంగా ఆర్థిక సాయం అందబోదని వెల్లడించారు.

పారదర్శకంగా లబ్ధిదారుల ఎంపిక

లబ్ధిపొందే పేద కుటుంబాలను "బంగారు కుటుంబం"గా, సాయం చేసే సంపన్న కుటుంబాలను "మార్గదర్శి"గా పిలవాలని సీఎం సూచించారు. లబ్ధిదారుల ఎంపికలో తప్పులు లేకుండా చూడాలని, తద్వారా సహాయం చేయడానికి ముందుకొచ్చేవారిలో స్ఫూర్తిని నింపాలని సూచించారు. వివాదాలకు తావులేకుండా, పారదర్శకంగా గ్రామ, వార్డు సభల ద్వారా లబ్ధిదారుల తుదిజాబితాను రూపొందించాలన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలకు, పీ4 పథకానికి ఎలాంటి సంబంధం ఉండదని, సమాజంలో అట్టడుగున ఉన్న వారికి చేయూత అందించడమే పీ4 ముఖ్య ఉద్దేశమని తెలిపారు. కార్యక్రమంపై ప్రజలు గందరగోళానికి గురికాకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. ఉగాది రోజున అమరావతిలో జరిగే ప్రారంభోత్సవ కార్యక్రమానికి ప్రతిగ్రామం నుంచి ఒక్కరైనా హాజరయ్యేలా చూడాలని, ప్రతి నియోజకవర్గం నుంచి ఒక బస్సు ఏర్పాటు చేయాలని అన్నారు. రాష్ట్రంలో పేదరిక నిర్మూలన జరిగేంతవరకు ఈ కార్యక్రమం కొనసాగుతుందని సీఎం తెలిపారు.



సచివాలయ ఉద్యోగులకు సీఎం అభినందనలు

అమరావతి, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): ఇటీవల ఢిల్లీలో జరిగిన ఆల్ ఇండియా సివిల్ సర్వీసెస్ టేబుల్ టెన్నిస్ టోర్నమెంట్లో ఆంధ్రప్రదేశ్ నుంచి పాల్గొన్న రాష్ట్ర సచివాలయం ఉద్యోగులు కాంస్య పతకాలు సాధించడం పట్ల సీఎం చంద్రబాబు హర్షం వ్యక్తం చేశారు. సోమవారం సచివాలయంలో తనను కలిసిన మహిళా ఉద్యోగులకు ఆయన అభినందనలు తెలిపారు. క్యాంస పతకాలు సాధించిన మైనార్టీ సంక్షేమ శాఖలో సహాయ కార్యదర్శిగా పని చేస్తున్న మద్దా బేబి సరోజిని, జీఏడీలో సెక్షన్ అధికారిగా పని చేస్తున్న సహదేవ, సత్యవతిలను సీఎం అభినందించారు.


మద్యం అమ్మకాల్లో దోచేస్తున్నారు!

- ఒక్కో బాటిల్‌పై రూ.10-30 వరకూ వసూలు
- విచ్చలవిడిగా బెల్టులకు మద్యం సరఫరా
- అమ్మకాలపై టార్గెట్లతో పట్టించుకోని ఎక్సైజ్ శాఖ
- ఆర్టీజీఎస్ సర్వేలో.. ఎమ్మార్పీ ఉల్లంఘనలు ఉన్నాయన్న 87.21శాతం మంది

అమరావతి, మార్చి 24(ఆంధ్రజ్యోతి): మద్యం అమ్మకాల్లో ఎమ్మార్పీని పాటించడం లేదు. ఒక్కో సీసాపై రూ.10 నుంచి రూ.30 అదనంగా వసూలు చేస్తూ.. వినియోగదారులను దోచేస్తున్నారు. ప్రభుత్వం నిర్వహించిన ఆర్టీజీఎస్ సర్వేలో ఈ విషయం బహిర్గతమైంది. వాట్సాప్, ఐవీఆర్ఎస్, ఇతర మార్గాల్లో ప్రభుత్వం ప్రజల నుంచి అభిప్రాయాలు స్వీకరించింది. 'మీ ప్రాంతంలో రిటైల్ మద్యం దుకాణాల్లో ఎమ్మార్పీ ఉల్లంఘనలు జరుగుతున్నాయా?' అని అడిగిన ప్రశ్నకు 11,635 మంది (87.21శాతం) అవును అని సమాధానం ఇచ్చారు. కేవలం 1,707 మంది (12.79శాతం) మాత్రమే ఉల్లంఘనలు లేవని చెప్పారు. ఆర్టీజీఎస్‌పై సోమవారం చీఫ్ సెక్రటరీ సమీక్షలో ఈ విషయం వెలుగు చూసింది. మద్యం వినియోగంపై ప్రజల నుంచి అభిప్రాయాలు తీసుకోవాలని గతంలో సీఎం చంద్రబాబు చేసిన సూచన మేరకు ఈ అభిప్రాయ సేకరణ జరిగింది. సర్వే వివరాలను ఆర్టీజీఎస్ బయటపెట్టింది. 'మద్యం నాణ్యత పెరిగిందా?' అనే ప్రశ్నకు 98.12 శాతం మంది అవును అని, 1.88 శాతం మంది లేదు అని సమాధానం ఇచ్చారు. 'పాపులర్ మద్యం బ్రాండ్లు అందుబాటులో ఉన్నాయా?' అనే ప్రశ్నకు 98.77శాతం మంది అవును అని, 1.23 శాతం మంది లేవు అని చెప్పారు. 'మద్యం ధరలు తగ్గాయా?' అనే ప్రశ్నకు 95.67 శాతం మంది అవును అని, 4.33 శాతం మంది లేదు అని సమాధానమిచ్చారు. కాగా ఎక్సైజ్ శాఖలో అంతా బాగుందని, ఎక్కడా ఉల్లంఘనలు లేవని ఆ శాఖ అధికారులు చెబుతూ వస్తున్నారు. ఇప్పుడు మరో శాఖ సర్వే చేస్తే అసలు విషయం బయటపడింది.

అమ్మకాలకు టార్గెట్లతోనే సమస్య

రోజూ రూ.80కోట్ల మేర అమ్మకాలు ఉండాలని ఎక్సైజ్ ఉన్నతాధికారులు టార్గెట్లు విధించినట్లు తెలిసింది. దీంతో మద్యం షాపుల్లో అమ్మకాలు విచ్చలవిడిగా జరుగుతున్నాయి. ఒక వ్యక్తికి మూడు కంటే ఎక్కువ సీసాలు అమ్మకూడదనే నిబంధన ఉన్నప్పటికీ బెల్టులకు ఇష్టానుసారంగా కేసుల చొప్పున అమ్ముతున్నారు. వీటికి ఒక్కో సీసాపై రూ.10 వసూలు చేస్తున్నారు. వాటిని బెల్టుల్లో విక్రయించేవారు సీసాపై రూ.30 వరకు అదనంగా వసూలు చేస్తున్నారు. అమ్మకాలపై టార్గెట్లు విధించడంతో బెల్టులకు మద్యం విక్రయిస్తున్నా స్థానిక ఎక్సైజ్ అధికారులు చూసీచూడనట్లు వదిలేస్తున్నారు. బెల్టు షాపులపై కఠిన చర్యలు తీసుకోలేని పరిస్థితి ఏర్పడింది.



పని వేళలు పాటించని బార్లు

నిబంధనల ప్రకారం ఉదయం 11 నుంచి రాత్రి 11 గంటల వరకే బార్లు పని చేయాలి. కానీ చాలా బార్లు 24గంటలూ మద్యం విక్రయాలు చేస్తున్నాయి. అధికారిక సమయంలో బహిరంగంగా, ఆతర్వాత చాటుమాటుగా అమ్ముతున్నాయి. పైగా షాపుల నుంచి మద్యం తీసుకొచ్చి బార్లలో విక్రయిస్తున్నారు. ప్రభుత్వం నుంచి మద్యం కొనుగోలు చేయాలంటే షాపులతో పోలిస్తే 10 శాతం అదనంగా చెల్లించాలి. దీంతో బెల్టుల తరహాలో షాపుల్లో మద్యం కొని, దానిని అర్ధరాత్రి, ఉదయం వేళల్లో బార్లలో విక్రయిస్తున్నారు.

బీచ్‌లలో గడ్డి పాకలు.. బీర్, వైన్ విక్రయాలు

- రుషికొండ బీచ్‌లో బ్లూ ఫ్లాగ్ ఇక అజరామరం
- పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేశ్

విశాఖపట్నం, మార్చి 24(ఆంధ్రజ్యోతి): విదేశీ పర్యాటకుల సంఖ్య పెరిగేందుకు రాష్ట్రంలోని బీచ్‌లలో శాక్స్(రెల్లి గడ్డితో వేసిన పాకలు) ఏర్పాటు చేస్తామని, అక్కడ బీర్, వైన్ వంటి విక్రయాలు చేపడతామని పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేశ్ తెలిపారు. రుషికొండ బీచ్‌కు నెదర్లాండ్స్ బృందం ఇచ్చిన బ్లూ ఫ్లాగ్‌ను ఆయన సోమవారం బీచ్‌లో ఎగురవేశారు. మంత్రి మాట్లాడుతూ పర్యాటక అభివృద్ధికి ప్రభుత్వం చాలా కృషిచేస్తోందని, ఇటీవలే పరిశ్రమ హోదా కూడా ఇచ్చామన్నారు. గత ప్రభుత్వం చేసిన తప్పిదాల వల్ల నిర్వహణ కొరవడడంతో రుషికొండ బీచ్‌కు బ్లూ ఫ్లాగ్‌ను తాత్కాలికంగా ఉపసంహరించుకున్నారని వివరించారు. బీచ్‌ను మరింత అభివృద్ధి చేసి, పర్యాటకులను ఆకర్షించేలా నిర్వహిస్తూ ఆ నీలి జెండా నిరంతరం ఎగిరేలా చేస్తామన్నారు. ఏపీటీడీసీ ఛైర్మన్ నూకసాని బాలాజీ మాట్లాడుతూ, బ్లూ ఫ్లాగ్ గుర్తింపు మరోసారి పోకుండా ఉండాలంటే స్థానికుల సహకారం ఎంతో అవసరమని చెప్పారు. ఏపీటీడీసీ ఎండీ ఆమ్రపాలి మాట్లాడుతూ, బీచ్‌ల నిర్వహణలో ప్రమాణాలు పాటిస్తేనే బ్లూ ఫ్లాగ్ గుర్తింపు వస్తుందన్నారు. రుషికొండ బీచ్‌లో గత 3 వారాల్లో అనేక మౌలిక వసతులు అభివృద్ధి చేశామని తెలిపారు. రాష్ట్రంలో మరో పది బీచ్‌లలో మౌలిక వసతులు కల్పించనున్నామన్నారు. కార్యక్రమంలో భీమిలి టీడీపీ ఇన్‌చార్జి గంటా రవితేజ, స్థానిక నాయకులు, పర్యాటక శాఖ అధికారులు పాల్గొన్నారు.



రుషికొండ బీచ్‌లో బ్లూ ఫ్లాగ్ జెండాను ఎగురవేస్తున్న మంత్రి కందుల దుర్గేశ్. పక్కన ఏపీటీడీసీ ఛైర్మన్ బాలాజీ, ఎండీ ఆమ్రపాలి

బెట్టింగ్ రాజాలు!

(మొదటి పేజీ తరువాయి)

రావద్దంటూ హుకుం జారీ చేస్తున్నారు. దొరికినా కేసులు పెట్టవద్దని, పెద్దవాళ్ల జోలికి అసలే రావొద్దంటూ పోలీసుల ముందరి కాళ్లకు బ్రేకులు వేస్తున్నారు. ముఖ్యనేత సన్నిహితుడికి క్రికెట్ అన్నా, పందేలన్నా మహా ఇష్టం. ఆయన వెంటే ఉండే మరో వ్యక్తి ఈ వ్యవహారాలను చూసుకునేవారు. గతంలో ఐపీఎల్ మ్యాచ్‌లు, ఇతర టోర్నమెంట్ల సందర్భంగా ఉభయ గోదావరి జిల్లాలు, విశాఖ, రాయలసీమ, విజయవాడతో పాటు ప్రధాన నగరాల్లో దర్జాగా బెట్టింగ్‌లు నిర్వహించారు. రాజకీయ అండ ఉండటంతో గత ఐదేళ్లలో రాష్ట్రంలో బెట్టింగ్ ముఠాలను పట్టుకున్న సందర్భాలు లేవు. ఒకవేళ పోలీసులకు ఎక్కడైనా దొరికినా ఎఫ్ఐఆర్‌ల దాకా వెళ్లకుండానే తొక్కిపడేసేవారు. ప్రభుత్వం మారినా సదరు వ్యక్తి అడ్డూఅదుపూ లేకుండా బెట్టింగ్ జోరు పెంచారు. గతంలో మాదిరిగానే కర్ణాటకకు చెందిన ముఠాలను రంగంలోకి దించి కోట్లాది రూపాయల బెట్టింగ్ దందా నడిపిస్తున్నారు. రాయలసీమకు చెందిన ఒకరిని, గోదావరి జిల్లాలోని మరో వ్యక్తిని ముందు ఉంచి దందా నడిపిస్తున్నారు. చాంపియన్స్ ట్రోఫీ సందర్భంగా ఈ ముఠా రెచ్చిపోయింది. ఈ ఇద్దరూ ఉభయ గోదావరి జిల్లాల పరిధిలో మకాం వేసి వేలాది మందితో బెట్టింగ్ నిర్వహించారు. దీనిపై కీలక సమాచారం అందుకున్న పోలీసులు రాజానగరం, మండపేట ప్రాంతాల్లో ప్రత్యేక ఆపరేషన్ నిర్వహించి పంటర్స్(జూద నిర్వాహకులు)ను పట్టుకున్నారు. వారిని విచారించగా కర్ణాటక ముఠాగా తేలింది. వీరి వెనక సదరు వ్యక్తి, ఆయన వెంటే ఉండే సహాయకుడి పాత్ర ఉన్నట్టు బయటపడింది. ఆయన ఇద్దరు అనుచరుల్లో పేరు మోసిన ఓ బెట్టింగ్ రాయుడు పోలీసుల కళ్లు గప్పి పరారయ్యాడు. పోలీసులు విచారించగా ఇద్దరి మధ్య సంబంధాలు వెల్లడయ్యాయి. గతంలో ఈ బెట్టింగ్ రాయుడు హైదరాబాద్‌లోనూ భారీగా బెట్టింగ్‌లు నిర్వహించారు. పలు కేసుల్లో సైబరాబాద్, హైదరాబాద్ పోలీసులకు మోస్ట్ వాంటెడ్‌గా ఉన్నాడు. అయితే నాడు ముఖ్యనేత అండతో పోలీసులకు చిక్కలేదు. ప్రభుత్వం మారినా ఇప్పుడు అదే ధైర్యంతో బెంగళూరు, రాయలసీమతో పాటు ఉభయ గోదావరి, విశాఖ జిల్లాల కేంద్రంగా క్రికెట్ బెట్టింగ్ నిర్వహిస్తున్నాడని పోలీసుల విచారణలో తేలింది. బెట్టింగ్ దందాలో రెండు పార్టీలకు చెందిన ముగ్గురు కీలక నేతల పాత్ర ఉన్నట్లు తెలిసింది. అందులో ఓ నేత గోదావరి జిల్లాలకే చెందిన వారు. ఆయన తమ్ముడి పాత్ర కూడా ఉన్నట్లు వెలుగులోకి వచ్చింది.



నిందితులకు నేతల అండ!

బెట్టింగ్ కేసుల్లో సదరు వ్యక్తి అనుచరులు అరెస్ట్ కాకుండా, కేసుల విచారణ ముందుకు సాగకుండా రెండు పార్టీల్లోని ముగ్గురు నేతలు రక్షణ కవచంలా నిలిచారని తెలుస్తోంది. రాజకీయాలు వేరైనా, పార్టీలు వేరైనా వారి మధ్య బెట్టింగ్ బంధం బలంగా ఉన్నట్లు ఉంది. పోలీసులు నమోదు చేసిన కేసులను నీరుగార్చేలా, నిందితులను విడిచిపెట్టేలా ఆ నేతలు తెరవెనక భారీ వ్యవహారమే నడిపారని తెలిసింది. పోలీసులు బెట్టింగ్ రాయుళ్ల విషయంలో సీరియస్‌గా ఉండటంతో వారిపై రాజకీయ ఒత్తిళ్లు తీసుకొచ్చి ముందడుగు వేయకుండా అడ్డుకున్నారని సమాచారం. నిజానికి మండపేట, రాజానగరం కేసుల్లో ఓ గోదావరి జిల్లా స్థాయి ప్రతినిధి, ఆయన సోదరుడి పాత్ర స్పష్టంగా బయటపడింది. ఆధారాలు కూడా ఉన్నాయి. అయినా ఆ దిశగా పోలీసు విచారణ సాగకుండా తీవ్రస్థాయిలో నేతలు ప్రయత్నాలు చేసినట్లు తెలిసింది. కేసుల విచారణ సాగకుండా, అరెస్టులు జరగకుండా చేశారు. దీంతో చాంపియన్స్ ట్రోఫీ సందర్భంగా పంటర్స్ వందల కోట్లు వెనకేసుకున్నారు. ఇప్పుడు ఐపీఎల్ మ్యాచ్‌లు దాదాపు రెండు నెలల పాటు ఉంటాయి. రాష్ట్రంలోని ప్రధాన నగరాలు, పట్టణాలు, మున్సిపాలిటీల స్థాయిలోనూ భారీగా బెట్టింగ్ కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేసుకున్నారని తెలిసింది. పోలీసుల చర్యలు తగ్గించేలా ఈ నేతలు ప్రయత్నిస్తున్నట్లు తెలిసింది.

పార్టీలు వేరయినా...

బెట్టింగ్‌కు కొమ్ముకాస్తున్న ముగ్గురు నాయకులు గతంలో ఆ ముఖ్యనేత వద్ద రాజకీయ శిష్యరికం చేసినవారే. ఆయన అనుచరులుగా ఎదిగిన వారే. మారిన రాజకీయ పరిస్థితుల నేపథ్యంలో పార్టీలు మారారు. రెండు పార్టీల తరఫున ఎన్నికల్లో గెలిచారు. కానీ పాత స్నేహాలు, చీకటిదందాలు మాత్రం మానలేదు. ముఖ్యనేత సన్నిహితుడితో అంటకాగుతున్నారు. ఇప్పుడు పార్టీలు వేరయినా బెట్టింగ్ బంధం వారిని ముందుకు నడిపిస్తోంది. పొరుగు రాష్ట్రం తెలంగాణలో బెట్టింగ్ రాయుళ్లు, వాటిని ప్రోత్సహించే వారిపై అక్కడి పోలీసులు ఉక్కుపాదం మోపుతున్నారు. చిన్నా, పెద్దా తేడా లేకుండా కేసులు పెడుతున్నారు. ఈ నేతలేమో జూదగాళ్ల అవతారమెత్తి చట్టంతో చెలగాటమాడుతున్నారు.

బెట్టింగ్ నిర్వహించే తీరిదీ..

బెట్టింగ్ ముఠాలు ముందుగానే ఆయా ప్రాంతాల్లో నేతలు ఇచ్చిన వ్యక్తుల ఫోన్ నంబర్లతో వాట్సాప్ గ్రూప్ ఏర్పాటు చేస్తారు. వారి ఫోన్లకు లేదా ల్యాప్‌టాప్‌లకు ఆన్‌లైన్ లింకులు పంపిస్తారు. ఆండ్రాయిడ్ ఫోన్స్ అయితే ఏపీకే లింకులు పంపిస్తారు. వాటిని ఓపెన్ చేసి ఫోన్‌లో ఇన్‌స్టాల్ చేసుకుంటే ఓ యాప్‌గా ఉంటుంది. అది ప్రైవేటు సర్వర్లతో లింక్ అయి ఉంటుంది. ల్యాప్‌టాప్ లేదా డెస్క్‌టాప్‌లు అయితే ఎనీ డెస్క్ అనే యాప్ లింకును పంపించి ఇన్‌స్టాల్ చేయిస్తారు. ఆ తర్వాత వీరు ఇచ్చే లాగిన్ ఐడీ, పాస్‌వర్డ్‌లతో బెట్టింగ్ యాప్‌లో ఎంటర్ అయ్యేలా గైడ్ చేస్తారు. ఇలా ఆన్‌లైన్‌లో ఒక సీక్రెట్ ప్లాట్‌ఫామ్ కింద కనెక్ట్ అయిన వారిని కొందరు పర్యవేక్షిస్తుంటారు. బెట్టింగ్ యాప్‌లలో లాగిన్ అయ్యే వారి నుంచి తొలుత కొంత డబ్బును డిపాజిట్‌గా తీసుకుంటారు. ఆ తర్వాత ఫోర్, సిక్సర్, వికెట్ అవుట్, వైడ్, నోబాల్, క్లీన్‌బౌల్డ్, రనౌట్, క్యాచ్‌మిస్, వైడ్‌బాల్ తదితర వాటికి పదివేల నుంచి లక్ష రూపాయల వరకు బెట్టింగ్ ఉంటుంది. ఇందులో పదివేలు బెట్టింగ్‌లో పెడితే అందులో 2,500 పంటర్స్‌కి ఇచ్చి తీరాలి. కాసిన పందెం నెగ్గితే 7,500 ఆ వ్యక్తికి వస్తాయి. ఓడిపోతే మొత్తం 10 వేలు పోతాయి. ఇలా 20, 30, 50 వేలు, లక్ష రూపాయల వరకు ఫీజులు ఉంటాయి. ఈ షరతులకు అంగీకరించిన వారికే లాగిన్ ఐడీలు ఇస్తారు.

ఎవరి సొమ్మని కోట్లు కుమ్మరింత?

- సీసీఎస్ నిధుల బాగోతంపై ఆర్టీసీ సిబ్బంది ఆగ్రహం
- 'ఆంధ్రజ్యోతి' కథనంపై డిపోల్లో దుమారం

అమరావతి, మార్చి 24(ఆంధ్రజ్యోతి): 'ఎవరి సొమ్మని కోట్లు కుమ్మరిస్తున్నారు.. రహస్యంగా ఒప్పందాలు చేసుకోవాల్సిన అవసరమేంటి.. రూపాయి ఖర్చులేదు.. 70 వేల మంది సభ్యులకు అనుకూలం.. బస్టాండుకు దూరంగా ఫ్లాట్లు కొంటామంటే ఊరుకోం..' అంటూ ఏపీఎస్ఆర్టీసీలోని క్రెడిట్ కో-ఆపరేటివ్ సొసైటీ(సీసీఎస్) సభ్యులు ఆగ్రహావేశాలు వ్యక్తం చేస్తున్నారు. సీసీఎస్ కార్యాలయం పేరుతో బస్టాండుకు దూరంగా రూ.4 కోట్లతో పాలకమండలి అపార్ట్‌మెంట్లో ఒక ఫ్లోర్ కొంటున్నట్లు 'ఆంధ్రజ్యోతి'లో సోమవారం ప్రచురితమైన కథనం రాష్ట్రంలోని అన్ని బస్ డిపోల్లో తీవ్ర దుమారం రేపింది. దీంతో ఉలిక్కిపడిన పాలకమండలి.. ఆ వార్తను ఖండిస్తూ ప్రకటన విడుదల చేసింది. అయితే అందులో ఎవరి సంతకమూ లేదు. సీసీఎస్‌కు స్థిరాస్తి ఉండాలనే ఫ్లాట్ కొంటున్నామని.. హైదరాబాద్‌లో ఉమ్మడి భవనం ద్వారా వచ్చిన వాటా సొమ్ములో నుంచి మూడున్నర కోట్లు ఖర్చు చేస్తున్నట్లు వివరణ ఇచ్చింది. చదరపు అడుగు రూ.6,100 చొప్పున 5,500 చ.అడుగుల ఫ్లోర్‌ను కొనుగోలు చేస్తున్నట్లు తెలిపింది. ఎలాంటి విచారణకైనా సిద్ధమంటూ ఎండీ ద్వారకా తిరుమలరావుకు లేఖ రాస్తామన్న పాలకమండలి.. వార్తలో వచ్చిన పలు అంశాలకు వివరణ ఇవ్వలేదు. ఇంకోవైపు.. ఎంప్లాయీస్ యూనియన్(ఈయూ) రాష్ట్ర కమిటీ ఈ కొనుగోలును వ్యతిరేకిస్తూ ఎండీకి లేఖ రాసింది. సీసీఎస్ ఛైర్మన్ హోదాలో ఈ నిర్ణయాన్ని ఎండీ అడ్డుకోకపోతే రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమిస్తామని ఈయూ రాష్ట్ర అధ్యక్షుడు పలిశెట్టి దామోదర్‌రావు ప్రకటించారు. ఎండీ చొరవ తీసుకుని మంచి నిర్ణయం తీసుకుంటారని ఆశిస్తున్నట్లు ఏపీపీటీడీ కార్మిక పరిషత్ రాష్ట్ర అధ్యక్షుడు ఎస్వీ శేషగిరిరావు, ప్రధాన కార్యదర్శి వి.శ్రీనివాసరావు పేర్కొన్నారు. కాగా, సీసీఎస్ సభ్యులు 'ఆంధ్రజ్యోతి'కి కృతజ్ఞతలు తెలిపారు.



వీధి వీధికి స్కూటర్‌పై ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి!

చేపట్టిన అభివృద్ధి పనులు వేగవంతంగా జరిగేలా చూసేందుకు ఎమ్మెల్యే శ్రీధర్ రెడ్డి స్వయంగా రంగంలోకి దిగారు. స్కూటర్ ఎక్కి పనుల పరిశీలన చేపట్టారు. నెల్లూరు రూరల్ నియోజకవర్గంలో 609 పనులు ఏకకాలంలో ప్రారంభించిన ఎమ్మెల్యే.. వాటిని మే 20 నాటికి పూర్తి చేసి టీడీపీ కార్యకర్తలతో ప్రారంభోత్సవాలు చేయించాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. వివిధ దశల్లో ఉన్న ఈ పనుల పురోగతిని శ్రీధర్‌రెడ్డి ఏరోజుకారోజు పరిశీలిస్తున్నారు. హంగు ఆర్భాటాలకు దూరంగా స్కూటర్‌పై ప్రయాణిస్తూ ఆకస్మిక పరిశీలన చేస్తున్నారు. హెల్మెట్ ధరించి.. స్కూటర్ వెనుక కూర్చుని వెళ్తూ సోమవారం 'ఆంధ్రజ్యోతి' కెమెరాకు చిక్కారు. **- నెల్లూరు రూరల్, ఆంధ్రజ్యోతి**

దివ్యాంగ విద్యార్థుల ఖాతాలకే పింఛను

- త్వరలో వయోవృద్ధులకు డిజిటల్ గుర్తింపు కార్డులు
- అన్ని జిల్లాల్లో వృద్ధాశ్రమాల ఏర్పాటుకు కృషి: డోలా

అమరావతి, మార్చి 24(ఆంధ్రజ్యోతి): దివ్యాంగ విద్యార్థులు ఇంటికి దూరంగా ఉంటూ ఏ ప్రాంతంలో చదువుతున్నా పింఛన్ మొత్తాలను నేరుగా వారి ఖాతాల్లోకే జమ చేస్తామని రాష్ట్ర వయోవృద్ధులు, దివ్యాంగుల సంక్షేమశాఖ మంత్రి డోలా బాల వీరాంజనేయ స్వామి తెలిపారు. వయోవృద్ధులు, విభిన్న ప్రతిభావంతుల సంక్షేమంలో దేశానికే మన రాష్ట్రం ఆదర్శంగా ఉండాలన్నదే సీఎం చంద్రబాబు లక్ష్యమని మంత్రి చెప్పారు. సోమవారం అమరావతి సచివాలయంలో సీనియర్ సిటిజన్స్ స్టేట్ కౌన్సిల్ 2వ సమావేశం, స్టేట్ అడ్వైజరీ బోర్డు ఆన్ డిజాబిలిటీ సమావేశం నిర్వహించారు. వివిధ పథయాల అమలుపై మంత్రి డోలా సమీక్షించారు. 'అర్హత కలిగిన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ పథకాలు అందాలన్నదే మా ప్రభుత్వం లక్ష్యం. నిజమైన లబ్ధిదారులకు పింఛను అందించడమే ధ్యేయంగా పరిశీలన జరుగుతోంది. అర్హత కలిగిన ఏ ఒక్కరి పింఛనూ తొలగించబోం. దివ్యాంగులకు 5 శాతం రిజర్వేషన్లు అమలయ్యేలా చర్యలు తీసుకుంటాం. రాష్ట్రంలో 5 ప్రధానమంత్రి దివ్యాష కేంద్రాల ఏర్పాటుకు కేంద్ర ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపాం. వీటిని విజయవాడ, విశాఖ, ఒంగోలు, తిరుపతి, కర్నూలులో ఏర్పాటు చేయనున్నాం. అంధ విద్యార్థులకు వచ్చే విద్యా సంవత్సరం మొదట్లోనే బ్రెయిలీ లిపి పుస్తకాలు అందిస్తాం. కేంద్ర సహకారంతో రాష్ట్రంలో కొత్తగా 12 వృద్ధాశ్రమాలు నిర్మిస్తున్నాం. అన్ని జిల్లాల్లో వృద్ధాశ్రమాల ఏర్పాటుకు ప్రభుత్వం కృషి చేస్తోంది. వయోవృద్ధులందరికీ డిజిటల్ గుర్తింపు కార్డులు ఇవ్వనున్నాం' అని మంత్రి తెలిపారు.



SHOWROOMS: ANDHRA PRADESH: RENAULT VIJAYAWADA Ph: 8860638606. RENAULT RAJAHMUNDRY Ph: 8860294871. RENAULT BHIMAVARAM Ph: 8448389650.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda Press, Andhra Jyothi Buildings, Survey No: 70/1 & 2, Vedurupavuluru Village, Mustabad Gramapanchayathi, Gannavaram Mandal, Krishna District, PIN : 521 107, Editor : N.Rahul Kumar, RNI No:3470/1960, Managing Director : Vemuri Radha Krishna, Founder : K.L.N. Prasad.